ఈనాడు

విజయవాడ 24-1-2026 శనివారం సిటీ సంపుటి 52 . సంచిక 164
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 18
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

పాలే లేని.. పాపాల నెయ్యి

అక్షరాలా 60 లక్షల కిలోల సరఫరా

- 2019-24 మధ్య దానితోనే 20 కోట్ల శ్రీవారి లడ్డూల తయారీ
- వైకాపా పాలనలో కుంభకోణం
- రూ.235 కోట్లు దుర్వినియోగం
- డెయిరీలతో చేతులు కలిపిన తితిదే ఇంటిదొంగలు
- వైవీ సుబ్బారెడ్డి పీఏ చిన్న అప్పన్న డెయిరీల ప్రతినిధులతో బేరసారాలు
- హవాలా మార్గాల్లో లంచాల స్వీకరణ
- తేల్చిచెప్పిన సిట్
- 600 పేజీలతో తుది అభియోగపత్రం దాఖలు



ఈనాడు - అమరావతి, తిరుపతి; న్యూస్‌టుడే- తిరుపతి (నేర విభాగం): వైకాపా హయాంలో 2019-24 మధ్య తిరుమల తిరుపతి దేవస్థానానికి అసలు నెయ్యే కాని దాన్ని నెయ్యి పేరిట సరఫరా చేశారని సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన సిట్ నిగ్గు తేల్చింది. పాలే లేకుండా పామాయిల్, పామ్ కర్నెల్ ఆయిల్‌తో సిద్ధం చేసిన పదార్థాన్నే నెయ్యి ముసుగులో సరఫరా చేశారని పేర్కొంది. దానికి నెయ్యి సువాసనలు వచ్చేలా చేసేందుకు బీటాకెరోటిన్ లాంటి రసాయనాలను కలిపారని తేల్చింది. ఇలా ఐదేళ్ల వ్యవధిలో ఏకంగా 60 లక్షల కిలోల కల్తీ నెయ్యి సరఫరా జరిగిందని వెల్లడించింది. దీంతోనే 20.01 కోట్ల శ్రీవారి లడ్డూలు, ఇతర ప్రసాదాలు తయారుచేశారని తెలిపింది. ఈ కుంభకోణంలో రూ.235 కోట్ల తితిదే నిధుల దుర్వినియోగానికి పాల్పడటమే కాకుండా, కోట్ల మంది భక్తుల మనోభావాలను దెబ్బతీశారని వివరించింది. కొంతమంది తితిదే ఉద్యోగులు, అధికారులు, డెయిరీ సంస్థల ప్రతినిధులతో కుమ్మక్కై ఈ కల్తీ నెయ్యి సరఫరాలో భాగస్వాములయ్యారని పేర్కొంది. తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరా చేసిన కేసులో సిట్ అధికారులు నెల్లూరు ఏసీబీ కోర్టులో శుక్రవారం తుది అభియోగపత్రం (ఛార్జ్‌షీట్) దాఖలు చేశారు. 600 పేజీలకు పైగా ఉన్న ఈ అభియోగపత్రంలో (మిగతా 2లో)

27న దేశవ్యాప్త సమ్మె

బ్యాంకు ఉద్యోగ సంఘాల ప్రకటన

దిల్లీ: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఐదు రోజుల పనిదినాల డిమాండ్‌పై ఈ నెల 27న దేశవ్యాప్త సమ్మె చేయాలని బ్యాంకు ఉద్యోగుల సంఘాలు నిర్ణయించాయి. ఈ విషయాన్ని 9 ఉద్యోగ సంఘాల సమాఖ్య యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్(యూఎఫ్‌బీయూ) ఓ ప్రకటనలో వెల్లడించింది. 27న సమ్మె కొనసాగినట్లయితే బ్యాంకు కార్యకలాపాలకు వరుసగా 4 రోజుల పాటు అంతరాయం కలుగుతుంది. ఎందుకంటే జనవరి 24(శనివారం) 25(ఆదివారం), 26(రిపబ్లిక్‌డే) సెలవు దినాలు. బ్యాంకు కార్యకలాపాలకు అంతరాయం కలిగే విషయాన్ని ఇప్పటికే చాలా బ్యాంకులు తమ ఖాతాదారులకు తెలియజేశాయి. ప్రస్తుతం నెలలో రెండో, నాలుగో శనివారాల్లో బ్యాంకులు పనిచేయవు. ప్రతి శనివారమూ సెలవు ఇవ్వాలని వేతన సవరణ ఒప్పందంలోనే అంగీకరించిన విషయాన్ని యూనియన్లు గుర్తుచేస్తున్నాయి.

రాష్ట్రంలో ప్రపంచ ఆర్థిక వేదిక కేంద్రం

భవిష్యత్తు సాంకేతికతపై దృష్టి

ఈనాడు, అమరావతి: నాలుగో పారిశ్రామిక విప్లవంలో భాగంగా ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) ఐదు కొత్త కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. వాటిలో ఒకదాన్ని ఆంధ్రప్రదేశ్‌లో పెట్టనున్నట్లు ప్రకటించింది. ఈ తరహా కేంద్రాలు ప్రస్తుతం ముంబయి, హైదరాబాద్‌ల్లో మాత్రమే ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వ (మిగతా 2లో)

అక్రమాల లేఔట్లు.. క్రమబద్ధీకరణకు నోట్లు


- గత పాలనలో ప్రభుత్వ భూముల్లో వైకాపా నేతల లేఔట్లు
- ఇప్పుడు ఎల్‌ఆర్‌ఎస్‌లో క్రమబద్ధీకరణకు ఒత్తిళ్లు
- కొన్ని జిల్లాల్లో బేరసారాలతో మెత్తబడుతున్న అధికారులు

➤ విజయనగరం జిల్లాలో వైకాపా మాజీ ఎమ్మెల్యే ఒకరు చెరువు ఆక్రమించి గత ప్రభుత్వంలో వేసిన లేఔట్‌లో ప్లాట్ల క్రమబద్ధీకరణకు పలువురు కొనుగోలుదారులతో దరఖాస్తులు చేయించారు. ఆక్రమణ విషయం సిబ్బంది పరిశీలనలో వెల్లడైంది. ప్లాట్లు ఎలాగైనా క్రమబద్ధీకరించాలని అధికారులపై మాజీ ఎమ్మెల్యే ఒత్తిడి చేస్తున్నారు.


ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వంలో సర్కారు భూములు, చెరువులు, గెడ్డలు ఆక్రమించి లేఔట్లు వేసిన కొందరు మాజీ ఎమ్మెల్యేలు, వైకాపా నేతలు వాటిలో ప్లాట్లను లేఔట్ క్రమబద్ధీకరణ పథకం (ఎల్‌ఆర్‌ఎస్)లో క్రమబద్ధీకరించుకునేందుకు యత్నిస్తున్నారు. లేఔట్‌లో ప్రభుత్వ భూమి కలిసి ఉన్నట్లు సిబ్బంది క్షేత్రస్థాయి పరిశీలనలో వెల్లడైనా ప్లాట్లు క్రమబద్ధీకరించాలని అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. ఇందుకోసం రాయ'బేరాలు' కూడా సాగిస్తున్నారు. వివిధ జిల్లాల్లో ప్రస్తుత పట్టణ ప్రణాళిక అధికారుల్లో పలువురు (మిగతా 2లో)

డబ్ల్యూహెచ్‌వో నుంచి వైదొలిగిన అమెరికా

రూ.2వేల కోట్లు బకాయిపడిన అగ్రరాజ్యం



న్యూయార్క్: ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) నుంచి తమ దేశం వైదొలిగే ప్రక్రియ పూర్తయిందని అమెరికా ప్రభుత్వం ప్రకటించింది. కొవిడ్ మహమ్మారిని అదుపు చేయడంలో, సంస్కరణలను అమలుచేయడంలో డబ్ల్యూహెచ్‌వో విఫలమైందని అమెరికా ఆరోగ్య, మానవ సేవల విభాగం తెలిపింది. ఇకపై డబ్ల్యూహెచ్‌వోకు అమెరికా నుంచి వచ్చే అన్నిరకాల నిధులు (మిగతా 2లో)



ఆహారం+మంచి ఆలోచనలు=ఆరోగ్యం
సమయపాలన+చక్కటి అభిరుచి=ఆనందం
ఆత్మవిశ్వాసం+సేవచేసే మనసు=తరగని తృప్తి
ఇవన్నీ కలిస్తే ఆయుష్షు
ఈ పెద్దామె జీవితాన్ని డీకోడ్ చేస్తే వచ్చే జీవన సూత్రాలు

బామ్‌జీ మాట... బంగారు బాట!

బామ్‌జీ...
వయసు 91.. రిటైరై 32 ఏళ్లు...
పొద్దు పొడవకముందే వ్యాయామానికి రెడీ అంటారు. పొద్దు వాలాక కూడా ఏదో ఒక పని చేస్తూనే ఉంటారు.
కాఫీ కలపడం నుంచి కారు నడపడం దాకా తన పని తానే చేసుకుంటారు.
ఈమె మనసును చూసి వయసు వెనకడుగు వేస్తే... ఉత్సాహానికి ఆరోగ్యం పాదాక్రాంతమైంది.

30 దాటగానే బీపీ...
40 దగ్గరపడగానే షుగర్...
50 నిండకుండానే గుండె జబ్బులు దండెత్తుతున్న కాలంలో
ఆమె జీవితం ఓ మంచి పాఠం

సమతుల ఆహారం తినడం, పనిలో నిమగ్నమై బుర్రకు పదును పెట్టడం ఆరోగ్యానికి చోదకశక్తులు. పనిపై ధ్యాస ఉన్నప్పుడు... వేరే ఆలోచనలు చుట్టుముట్టి శక్తి హీనం చేయనప్పుడు మనకే ఢోకా ఉండదు.

హైదరాబాద్‌లోని జాతీయ పోషకాహార పరిశోధన సంస్థ (ఎన్ఐఎన్)లో డైరెక్టర్ హోదాలో పనిచేసి పదవీ విరమణ చేసిన మహతాబ్ ఎస్. బామ్‌జీ వయసు ఓ సంఖ్య... అది సంకల్పానికి అడ్డు కాదని పదేపదే నిరూపిస్తున్నారు. ఇప్పటివరకు తన రంగంలో 26 జాతీయ అంతర్జాతీయ పురస్కారాలు పొందిన ఆమె ఇప్పటికీ ఏదో ఒక సేవా కార్యక్రమంలో భాగస్వామి అవుతుంటారు. ఉద్యోగానికి ఫుల్‌స్టాప్ పెట్టి మూడు దశాబ్దాలైనా పోషకాహారం విలువను తెలిపే కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తూనే ఉన్నారు. ఇటీవల 'హ్యూమన్ న్యూట్రిషియన్' పుస్తకం 5వ పునర్ముద్రణకు సంపాదకురాలిగా వ్యవహరించారు. ఎలా ఈ విజయాలు..? అసలేంటీ మీ ఆరోగ్య రహస్యం అంటే...అందరూ ఆలోచించాల్సిన, పాటించాల్సిన విషయాలు పంచుకున్నారు. అవి...

అలవాట్లు: ఉదయం 5.30కు నిద్రలేస్తా. అరగంట వ్యాయామాలు చేస్తా. ఉదయం ఏడింటికి అల్పాహారం సగం తిన్న తర్వాత 20 నిమిషాల పాటు (మిగతా 2లో)

ఛాంపియన్

న్యూజిలాండ్‌తో రెండో టీ20.. భారత్ లక్ష్యం 209.. రెండు ఓవర్లకు స్కోరు 2/6. సంజు శాంసన్ తొలి ఓవర్లోనే ఔట్ కాగా.. గత మ్యాచ్‌లో మెరిసిన అభిషేక్ శర్మ డకౌట్ అయ్యాడు. ఈ స్థితిలో ఉన్న జట్టు 16వ ఓవర్లోనే లక్ష్యాన్ని అందుకుంటుందని ఎవరైనా అనుకుంటారా? కానీ రాయ్‌పుర్‌లో టీమ్ ఇండియా ఆ అద్భుతమే చేసింది. కెప్టెన్ సూర్యకుమార్, ఇషాన్ కిషన్, శివమ్ దూబె సిక్సర్ పిడుగులా చెలరేగడంతో భారీ లక్ష్యాన్ని ఊదేసింది. అయిదు టీ20ల సిరీస్‌లో 2-0తో ఆధిక్యంలో నిలిచింది.

సూర్య, ఇషాన్ మెరుపులు

ఛేదంచేశారు

భారత్‌దే రెండో టీ20


సూర్య కుమార్ 82 నాటౌట్


ఇషాన్ కిషన్ 76

రాయ్‌పుర్

న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌లో భారత్ చెలరేగిపోతోంది. బ్యాట్‌తో మెరిసిన సూర్యసేన రెండో టీ20లో 7 వికెట్ల తేడాతో కివీస్‌ను చిత్తు చేసింది. శుక్రవారం మొదట కివీస్ 6 వికెట్లకు 208 పరుగుల భారీ స్కోరు చేసింది. శాంట్నర్ (47 నాటౌట్; 27 బంతుల్లో 6×4, 1×6), రచిన్ రవీంద్ర (44; 26 బంతుల్లో 2×4, 4×6) సత్తా చాటారు. కుల్‌దీప్ 2 వికెట్లు తీశాడు. సూర్యకుమార్ (82 నాటౌట్; 37 బంతుల్లో 9×4, 4×6), ఇషాన్ కిషన్ (76; 32 బంతుల్లో 11×4, 4×6), శివమ్ దూబె (36 నాటౌట్; 18 బంతుల్లో 1×4, 3×6) చెలరేగడంతో భారత్ 15.2 ఓవర్లలో 3 వికెట్లే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. మూడో టీ20 ఆదివారం జరగనుంది.

ఇషాన్ మొదలెడితే.. సూర్య అందుకున్నాడు: రెండేళ్ల విరామం తర్వాత భారత జట్టులోకి వచ్చి, తొలి టీ20లో విఫలమైన ఇషాన్ కిషన్.. రెండో టీ20లో అదరగొట్టాడు. భారీ ఛేదనలో భారత్ ఆరంభంలోనే సంజు శాంసన్ (6), అభిషేక్ శర్మ (0) వికెట్లు కోల్పోయినా.. ఇషాన్ తగ్గలేదు. ఫౌక్స్ వేసిన మూడో ఓవర్లో అతడు చెలరేగిపోయాడు. ఇషాన్ 3 ఫోర్లు, ఓ సిక్స్ కొట్టడంతో ఆ ఓవర్లో 24 పరుగులు వచ్చాయి. శాంట్నర్ ఓవర్లో హ్యాట్రిక్ ఫోర్లు కొట్టిన ఇషాన్.. 21 బంతుల్లోనే అర్ధసెంచరీ అందుకున్నాడు. అర్ధసెంచరీ తర్వాతా అతడి బాదుడు కొనసాగింది. మరోవైపు గత మ్యాచ్‌లో ఓ మోస్తరు ఇన్నింగ్స్‌తో ఫామ్ అందుకున్న సూర్యకుమార్ కూడా మెరుపులు మెరిపించాడు. ఫౌక్స్ వేసిన తొమ్మిదో ఓవర్లో అతడు 4 ఫోర్లు, ఓ సిక్స్ బాదడంతో ఏకంగా 25 పరుగులు వచ్చాయి. ఈ స్థితిలో ఇషాన్‌ను సోధి ఔట్ చేసి కివీస్‌కు బ్రేక్ ఇచ్చాడు. అయినా ఆ జట్టుకు ఉపశమనం లేకుండాపోయింది. సూర్యతో పాటు శివమ్ దూబె సైతం భారీ షాట్లకు దిగడంతో భారత్ 13 ఓవర్లకు 178/3తో లక్ష్యం దిశగా దూసుకెళ్లింది. సూర్య-దూబె మెరుపులతో సమీకరణం (42 బంతుల్లో 31) అందుబాటులోకి వచ్చింది. భారత్ 28 బంతులు మిగిలుండగానే విజయాన్ని అందుకుంది. న్యూజిలాండ్ ఫీల్డర్ల వైఫల్యం కూడా టీమ్‌ఇండియాకు కలిసొచ్చింది.

శాంట్నర్, రచిన్ మెరుపులు: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కివీస్.. ఆరంభం నుంచే ఎదురుదాడికి దిగింది. అర్ష్‌దీప్‌ను లక్ష్యంగా చేసుకున్న కివీస్ ఓపెనర్లు అతడు వేసిన తొలి రెండు ఓవర్లలో 18 పరుగుల చొప్పున ఏకంగా 36 పరుగులు రాబట్టారు. 3 ఓవర్లకు కివీస్ 43/0తో నిలిచింది. ఈ స్థితిలో నాలుగో ఓవర్లో అద్భుతంగా బౌలింగ్ చేసిన హర్షిత్ రాణా.. డెవాన్ కాన్వే (19; 9 బంతుల్లో 3×4, 1×6)ను ఓ స్లో బంతితో పెవిలియన్ చేర్చాడు. ఈ ఓవర్ మెయిడెన్ కూడా కావడం విశేషం. తర్వాతి ఓవర్లోనే మరో ఓపెనర్ టిమ్ సీఫర్ట్ (24; 13 బంతుల్లో 5×4)ను వరుణ్ బుట్టలో వేయడంతో కివీస్‌కు మరోఎదురుదెబ్బ తగిలింది. వికెట్లు పడినా రచిన్ రవీంద్ర దూకుడుగా ఆడాడు. హర్షిత్ వేసిన ఆరో ఓవర్లో అతడు రెండు సిక్స్‌లు, ఓ ఫోర్ కొట్టాడు. ఆ తర్వాతా రచిన్ జోరు కొనసాగింది. దీంతో 8 ఓవర్లకు 84/2తో కివీస్ బలమైన స్థితిలో నిలిచింది. కుల్‌దీప్ ఓవర్లో సిక్స్, రెండు ఫోర్లు కొట్టి జోరు మీద కనిపించిన ఫిలిప్స్ (19; 13 బంతుల్లో 2×4, 1×6).. అదే ఓవర్లో ఔటయ్యాడు. మిచెల్ (18; 11 బంతుల్లో 3×4), రచిన్ ఓవర్ తేడాతో పెవిలియన్ చేరడంతో 13 ఓవర్లకు కివీస్ 132/5తో నిలిచింది. భారత బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో పరుగుల వేగం తగ్గింది. ఆ జట్టు 17 ఓవర్లకు 161/6తో నిలిచింది. ఈ స్థితిలో 18వ ఓవర్లో శాంట్నర్ సిక్స్, రెండు ఫోర్లు బాది స్కోరు పెంచాడు. అతడితో పాటు ఫౌక్స్ (15 నాటౌట్; 8 బంతుల్లో 2×4, 1×6) దూకుడుగా ఆడడంతో కివీస్ భారీ స్కోరు చేసింది. ఆఖరి ఓవర్ చివరి రెండు బంతులను ఫౌక్స్ 6, 4 బాది స్కోరును 200 దాటించాడు. అర్ష్‌దీప్ (0/53) భారీగా పరుగులు ఇచ్చుకున్నాడు. భారత్ ఈ మ్యాచ్‌లో బుమ్రాకు విశ్రాంతినిచ్చి హర్షిత్ రాణాను ఆడించింది. గాయపడ్డ అక్షర్ స్థానంలో కుల్‌దీప్ జట్టులోకి వచ్చాడు.


న్యూజిలాండ్ ఇన్నింగ్స్: కాన్వే (సి) హార్దిక్ (బి) హర్షిత్ 19; సీఫర్ట్ (సి) కిషన్ (బి) వరుణ్ 24; రచిన్ (సి) అర్ష్‌దీప్ (బి) కుల్‌దీప్ 44; ఫిలిప్స్ (సి) హార్దిక్ (బి) కుల్‌దీప్ 19; మిచెల్ (సి) హార్దిక్ (బి) దూబె 18; చాప్‌మన్ (సి) అభిషేక్ (బి) హార్దిక్ 10; శాంట్నర్ నాటౌట్ 47; ఫౌక్స్ నాటౌట్ 15; ఎక్స్‌ట్రాలు 12 మొత్తం: (20 ఓవర్లలో 6 వికెట్లకు) 208; వికెట్ల పతనం: 1-43, 2-43, 3-98, 4-125, 5-129, 6-161; బౌలింగ్: అర్ష్‌దీప్ 4-0-53-0; హార్దిక్ 3-0-25-1; హర్షిత్ 3-1-35-1; వరుణ్ 4-0-35-1; కుల్‌దీప్ 4-0-35-2; అభిషేక్ 1-0-12-0; దూబె 1-0-7-1

భారత్ ఇన్నింగ్స్: శాంసన్ (సి) రచిన్ (బి) హెన్రీ 6; అభిషేక్ (సి) కాన్వే (బి) డఫీ 0; కిషన్ (సి) హెన్రీ (బి) సోధి 76; సూర్య 82 నాటౌట్; శివమ్ దూబె నాటౌట్ 36; ఎక్స్‌ట్రాలు 9; మొత్తం: (15.2 ఓవర్లలో 3 వికెట్లకు) 209; వికెట్ల పతనం: 1-6, 2-6, 3-128; బౌలింగ్: హెన్రీ 3-0-41-1; డఫీ 4-0-38-1; ఫౌక్స్ 3-0-67-0; శాంట్నర్ 2-0-27-0; ఇష్ సోధి 3-0-34-1; మిచెల్ 0.2-0-2-0

వేగవంతమైన ఛేదన

209 పరుగుల లక్ష్యాన్ని భారత్ 15.2 ఓవర్లలోనే అందుకుంది. టీ20 చరిత్రలో 200 పైచిలుకు లక్ష్యాల్లో ఇదే వేగవంతమైన ఛేదన. గత ఏడాది న్యూజిలాండ్‌పై పాకిస్థాన్ 205 పరుగులను 16 ఓవర్లలో ఛేదించిన రికార్డు బద్దలైంది.

ఫౌక్స్.. కోరుకోని రికార్డు


జాక్ ఫౌక్స్

న్యూజిలాండ్ పేసర్ జాక్ ఫౌక్స్ పేలవ రికార్డు మూటగట్టుకున్నాడు. అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌లో 3 ఓవర్లలో అత్యధిక ఎకానమీ నమోదు చేసిన బౌలర్‌గా నిలిచాడు. సెర్బియా స్పిన్నర్ డిజిజా (బల్గేరియాపై 3 ఓవర్లలో 63 పరుగులు, 21 ఎకానమీ) పేరిట ఉన్న రికార్డును ఫౌక్స్ బద్దలు కొట్టాడు. ఈ మ్యాచ్‌లో అతడు 3 ఓవర్లలో ఏకంగా 67 పరుగులు (22.3 ఎకానమీ) సమర్పించుకున్నాడు. వరుసగా మూడు ఓవర్లలో అతను 24, 25, 18 పరుగులు ఇచ్చుకున్నాడు.

భళా కెప్టెన్.. భలే ఇషాన్!

ఈనాడు క్రీడావిభాగం

టీ20ల్లో భారత జట్టు నిలకడగా విజయాలు సాధిస్తోంది. అయినా సరే కెప్టెన్ వరుసగా విఫలమవుతుండడంతో అభిమానుల్లో ఆందోళన! మరోవైపు టీ20 ప్రపంచకప్ ఆరంభం కాబోతుండగా తిలక్ వర్మకు శస్త్ర చికిత్స జరిగి టోర్నీకి అనుమానంగా మారడంతో అతడి స్థానం భర్తీ చేసేదెవరన్న సందేహం! కివీస్‌తో రెండో టీ20లో కెప్టెన్ ఫామ్ విషయమై ఆందోళనకు తెరపడింది. తిలక్‌కు ప్రత్యామ్నాయం ఎవరనే ప్రశ్నకూ సమాధానం దొరికింది.

2024 టీ20 ప్రపంచకప్ గెలిచాక రోహిత్ శర్మ పొట్టి క్రికెట్‌కు గుడ్‌బై చెప్పేయడంతో తన స్థానంలో కెప్టెన్ అయ్యాడు సూర్యకుమార్ యాదవ్. సారథ్యం చేపట్టాక ఆరంభంలో తన బ్యాటింగ్ బాగానే సాగింది. శ్రీలంకలో అర్ధశతకం (58) సాధించాడు. స్వదేశంలో బంగ్లాదేశ్‌పైనా అర్ధసెంచరీ (75) కొట్టాడు. కానీ తన జోరుకు అంతటితో బ్రేక్ పడింది. ఆపై భారత జట్టు దక్షిణాఫ్రికా పర్యటనకు వెళ్లింది. స్వదేశంలో ఇంగ్లాండ్‌తో తలపడింది. తర్వాత ఆసియా కప్.. ఆస్ట్రేలియా పర్యటన.. దక్షిణాఫ్రికాతో సొంతగడ్డపై పోరు.. ఇలా ఎన్నో సిరీస్‌లు. ఒక్కదాంట్లోనూ అర్ధశతకం సాధించలేకపోయాడు సూర్య. ఏబీ డివిలియర్స్ శైలిలో 360 డిగ్రీల కోణంలో మైదానం నలుమూలలా షాట్లు ఆడే ఈ ముంబయి బ్యాటర్‌కు ఏమైందో అర్థం కాలేదు. టీ20ల్లో భారత జట్టు నిలకడగా రాణిస్తున్నా.. వరుసగా సిరీస్‌లు సాధిస్తున్నా.. కెప్టెన్ వైఫల్యం జట్టుకు ఆందోళనగా మారింది. తనను తప్పించాలనే డిమాండ్లు కూడా వినిపించాయి. అయితే ప్రపంచకప్ ముంగిట కెప్టెన్ మార్పు సరికాదనో, సూర్య ఫామ్ అందుకుంటాడనే నమ్మకంతోనో అతణ్ని కొనసాగించారు సెలక్టర్లు. అయితే ప్రపంచకప్ ముంగిట చివరి సిరీస్‌లో సూర్య లయ అందుకుని అభిమానుల్లో జోష్ తీసుకొచ్చాడు. కివీస్‌తో తొలి టీ20లో ధాటిగా ఆడి 32 పరుగులు చేసిన అతను.. రెండో మ్యాచ్‌లో అర్ధశతకంతో కరవు తీర్చుకున్నాడు. అంతర్జాతీయ క్రికెట్లో సూర్య బ్యాటుతో అభివాదం చేయడం 27 మ్యాచ్‌ల తర్వాత ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఈ మ్యాచ్‌లో సూర్య తన ట్రేడ్ మార్క్ షాట్లతో చెలరేగాడు. వికెట్ల వెనుక స్కూప్, అప్పర్ కట్ షాట్లు అయితే కనువిందు చేశాయి. 23 బంతుల్లోనే అర్ధశతకం సాధించిన సూర్య.. చివరి వరకు అజేయంగా నిలిచి జట్టును గెలిపించాడు. కెప్టెన్ ఇదే ఊపును ప్రపంచకప్‌లోనూ కొనసాగించాలన్నది అభిమానుల ఆకాంక్ష.

మరోవైపు రెండేళ్లకు పైగా విరామం తర్వాత భారత జట్టులోకి వచ్చిన ఇషాన్ కిషన్ కూడా సుడిగాలి ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. ముస్తాక్ అలీ ట్రోఫీలో మెరుపులు మెరిపించడం ద్వారా అనూహ్యంగా ప్రపంచకప్ జట్టులో చోటు దక్కించుకున్న ఇషాన్.. తిలక్ వర్మకు శస్త్రచికిత్స జరగడంతో కివీస్‌తో సిరీస్‌లో తుది జట్టులోకి వచ్చాడు. శ్రేయస్ అయ్యర్‌ను కాదని ఇషాన్‌ను ఆడించడం సరైన నిర్ణయమేనా అన్న ప్రశ్నలు తలెత్తాయి. తొలి టీ20లో 8 పరుగులకే ఇషాన్ వెనుదిరగడంతో ఈ ప్రశ్నలు మరింత ఊపందుకున్నాయి. కానీ రెండో మ్యాచ్‌లో ఇషాన్ చెలరేగి ఆడి తనపై నెలకొన్న సందేహాలకు తెరదించాడు. 209 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో పేలవంగా ఇన్నింగ్స్‌ను ఆరంభించిన జట్టును.. మెరుపు ఇన్నింగ్స్‌తో గెలుపు బాట పట్టించింది అతనే. జట్టు ఇబ్బందుల్లో ఉండగా, గత మ్యాచ్ వైఫల్యం వెంటాడుతుండగా వచ్చి ఇలాంటి విధ్వంసక ఇన్నింగ్స్ ఆడడం సామాన్యమైన విషయం కాదు. కానీ ఇషాన్ మాత్రం అలవోకగా భారీ షాట్లు ఆడాడు. పేసర్లు, స్పిన్నర్లు అని తేడా లేకుండా అందరి బౌలింగ్‌నూ తుత్తునియలు చేశాడు. ఈ ఇన్నింగ్స్‌లో అతను స్విచ్ షాట్ కూడా ఆడడం విశేషం. ఇషాన్ ఇన్నింగ్స్‌తో మ్యాచ్ స్వరూపమే మారిపోయింది. చాలా ముందే జట్టు విజయం ఖాయమైపోయింది. 8వ ఓవర్లోనే ఇషాన్ 70ల్లోకి వచ్చేయడంతో ఇషాన్ సెంచరీ చేస్తాడనిపించింది. కానీ ఆ మార్క్ అందుకోకపోయినా.. పునరాగమనంలో ఇషాన్ కెరీర్‌కు ఈ ఇన్నింగ్స్ గొప్ప ఊపునిచ్చేదే. సిరీస్‌లో ఇంకో మెరుపు ఇన్నింగ్స్ ఆడాడంటే ప్రపంచకప్‌నకు తిలక్ అందుబాటులోకి వచ్చినా.. ఇషాన్‌ను తుది జట్టులో ఆడించక తప్పని పరిస్థితి తలెత్తవచ్చు.

బంగ్లాకు ఐసీసీ మరో షాక్

- బీసీబీ అప్పీల్ తిరస్కరణ
- ప్రత్యామ్నాయ జట్టుగా స్కాట్లాండ్‌ను ప్రకటించే అవకాశం

దిల్లీ: టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌ల వేదిక మార్పు విషయంలో ఐసీసీతో తలపడిన బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ)కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. బీసీబీ విజ్ఞప్తిని ఇప్పటికే తిరస్కరించిన ఐసీసీ ఆ దేశానికి మరోసారి షాకిచ్చింది. భారత్‌లోనే తమ మ్యాచ్‌లను నిర్వహించాలన్న ఐసీసీ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ బీసీబీ దాఖలు చేసిన అప్పీల్‌ను ఐసీసీ వివాద పరిష్కార కమిటీ (డీఆర్‌సీ) తోసిపుచ్చింది. తమ పరిధిలోకి రాని అంశంపై విచారణ జరపలేమని డీఆర్‌సీ కమిటీ స్పష్టం చేసింది. అంతర్జాతీయ క్రికెట్ మండలి నియమావళి, డీఆర్‌సీ నిబంధనల ప్రకారం ఐసీసీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ తీసుకున్న నిర్ణయాలపై అప్పీల్‌ను విచారించే అధికారం కమిటీకి లేదు. అంతకుముందు జరిగిన ఓటింగ్‌లో ఐసీసీ బోర్డు సభ్యులు 14-2 మెజారిటీతో భారత్‌లోనే బంగ్లా మ్యాచ్‌లు నిర్వహించాలని తీర్మానించారు. డీఆర్‌సీ నిర్ణయం నేపథ్యంలో చివరి అస్త్రంగా స్విట్జర్లాండ్‌లోని కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ (సీఏఎస్)ను ఆశ్రయించాలని బీసీబీ భావిస్తోంది. బీసీబీ తీరు మారకపోవడం, టోర్నీకి సమయం దగ్గరపడడంతో బంగ్లా జట్టు స్థానంలో స్కాట్లాండ్‌ను ఆడించాలని ఐసీసీ దాదాపుగా ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. దీనిపై శనివారం అధికారికంగా ప్రకటన వెలువడే అవకాశముంది.

సింధు, లక్ష్యసేన్ పరాజయం


సింధు

జకార్తా: ఇండోనేసియా మాస్టర్స్ ప్రపంచ టూర్ సూపర్ 500 టోర్నీలో భారత్ పోరాటం ముగిసింది. స్టార్ షట్లర్లు పి.వి.సింధు, లక్ష్యసేన్‌లకు క్వార్టర్‌ఫైనల్లో చుక్కెదురైంది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ పోరులో సింధు 13-21, 17-21తో చెన్ యుఫెయ్ (చైనా) చేతిలో పరాజయం పాలైంది. 42 నిమిషాల పాటు సాగిన మ్యాచ్‌లో సింధుపై పైచేయి సాధించిన చెన్.. భారత క్రీడాకారిణిపై తన గెలుపోటముల రికార్డును 8-6తో మరింత మెరుగుపరుచుకుంది. చివరిసారి 2019లో చెన్‌పై సింధు గెలిచింది. పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో లక్ష్యసేన్ 18-21, 20-22తో పనిచాఫాన్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడాడు. 21 ఏళ్ల పనిచాఫాన్ ప్రిక్వార్టర్స్‌లో పారిస్ ఒలింపిక్ కాంస్య పతక విజేత లీ జియా (మలేసియా)ను చిత్తుచేశాడు.

డబ్ల్యూపీఎల్‌లో ఈనాడు
బెంగళూరు × దిల్లీ
వేదిక: వడోదర, రా॥ 7.30

అస్ట్రేలియన్ ఓపెన్‌లో అగ్రశ్రేణి ఆటగాడు కార్లోస్ అల్కరాస్ జోరు కొనసాగుతోంది. అతను అలవోకగా ప్రిక్వార్టర్స్‌కు దూసుకెళ్లాడు. జ్వెరెవ్, మెద్వెదెవ్ సైతం ముందంజ వేశారు. మహిళల్లో సబలెంకా ప్రిక్వార్టర్స్ చేరడానికి చెమటోడ్చగా.. కొకో గాఫ్ సైతం మూడో రౌండ్ దాటింది.

ప్రిక్వార్టర్స్‌లో అల్కరాస్


అల్కరాస్

సబలెంకా, జ్వెరెవ్ కూడా

మెల్‌బోర్న్

కెరీర్ గ్రాండ్‌స్లామ్‌పై గురిపెట్టిన స్పెయిన్ స్టార్ కార్లోస్ అల్కరాస్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ప్రిక్వార్టర్స్‌కు దూసుకెళ్లాడు. పురుషుల సింగిల్స్ మూడో రౌండ్లో ఈ టాప్ సీడ్ ఆటగాడు 6-2, 6-4, 6-1తో కొరెంటిన్ మౌటెట్ (ఫ్రాన్స్)ను ఓడించాడు. ఈ మ్యాచ్‌లో ఆరంభం నుంచే అల్కరాస్ జోరు సాగింది. రెండో గేమ్‌లోనే మౌటెట్ సర్వీస్ బ్రేక్ అయింది. 5-1తో ఆధిక్యంలో నిలిచిన అల్కరాస్ తేలిగ్గా తొలి సెట్ గెలిచాడు. రెండో సెట్ ఆట కూడా ఆరంభంలో మొదటి సెట్‌నే తలపించినా.. తర్వాత మౌటెట్ పుంజుకున్నాడు. తెలివైన నెట్ గేమ్‌తో అదరగొట్టిన ఈ ఫ్రాన్స్ కుర్రాడు.. 1-3తో వెనుకబడ్డ దశ నుంచి 3-3తో స్కోరు సమం చేశాడు. కానీ తొమ్మిదో గేమ్‌లో బ్రేక్ సాధించిన అల్కరాస్.. ఆపై సెట్ నెగ్గి ఆధిక్యాన్ని రెట్టింపు చేసుకున్నాడు. మూడో సెట్లో అల్కరాస్ జోరు ముందు మౌటెట్ ఏమాత్రం నిలవలేకపోయాడు. 4-0తో నిలిచిన అల్కరాస్.. అదే ఊపులో సెట్‌తో పాటు మ్యాచ్‌ను కైవసం చేసుకున్నాడు. మ్యాచ్‌లో అల్కరాస్ 3 ఏస్‌లు, 30 విన్నర్లు కొట్టాడు. మూడో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ), ఆరో సీడ్ డిమెనార్ (ఆస్ట్రేలియా), పదకొండో సీడ్ మెద్వెదెవ్ (రష్యా) కూడా ప్రిక్వార్టర్స్‌లో అడుగు పెట్టారు. మూడో రౌండ్లో జ్వెరెవ్ 7-5, 4-6, 6-3, 6-1తో నోరి (బ్రిటన్)పై, మెద్వెదెవ్ 6-7 (5-7), 4-6, 7-5, 6-0, 6-3తో మెరోజ్‌సన్ (హంగేరి)పై గెలిచారు. డిమెనార్ 6-3, 6-4, 7-5తో తియాఫో (అమెరికా) పోరాటానికి తెరదించాడు. బబ్లిక్ (కజకిస్థాన్) 7-6 (7-4), 7-6 (7-5), 6-4తో ఎచెవెరీ (అర్జెంటీనా)పై, తియాన్ (అమెరికా) 7-6 (11-9), 6-4, 6-2తో బోర్జెస్ (పోర్చుగీస్)పై గెలిచి ప్రిక్వార్టర్స్‌లోకి అడుగుపెట్టారు. 13వ సీడ్ రుబ్లెవ్ (రష్యా) 3-6, 6-7 (4-7), 3-6తో సెరుండోలో (అర్జెంటీనా) చేతిలో కంగుతిన్నాడు. టామీ పాల్ (అమెరికా) 6-1, 6-1తో ఆధిక్యంలో ఉన్న సమయంలో ప్రత్యర్థి దేవిడోవిచ్ (స్పెయిన్) గాయంతో తప్పుకొన్నాడు.

సబలెంకా కాస్త కష్టంగా..: మహిళల సింగిల్స్‌లో టైటిల్ ఫేవరెట్ అర్యానా సబలెంకా (బెలారస్) ప్రిక్వార్టర్స్‌లోకి ప్రవేశించింది. ఈ టాప్ సీడ్ క్రీడాకారిణి కాస్త కష్టంగా మూడో రౌండ్‌ను అధిగమించింది. సబలెంకా 7-6 (7-4), 7-6 (9-7)తో పొటపోవా (ఆస్ట్రియా)ను ఓడించింది. రెండు సెట్లు టైబ్రేకర్‌లోనే ఫలితం తేలిన ఈ మ్యాచ్.. రెండు గంటలకు పైగా సాగింది. తొలి సెట్లో ఆరంభంలో సబలెంకానే ఆధిపత్యం ప్రదర్శించింది. 2-0తో ఆధిక్యంలో నిలిచింది. కానీ పొటపోవా వెంటనే పుంజుకుంది. మూడో గేమ్‌లో సబలెంకా సర్వీస్ బ్రేక్ చేసి.. ఆపై 2-2తో స్కోరు సమం చేసింది. ఇద్దరూ తగ్గకపోవడంతో సెట్ టైబ్రేకర్‌కు మళ్లింది. టైబ్రేకర్‌లో 3-0తో ఆధిక్యంలో నిలిచిన సబలెంకా.. అదే జోరుతో సెట్ గెలిచింది. రెండో సెట్లో సబలెంకా దూకుడుగా ఆడింది. 4-0తో నిలిచిన ఆమె.. తేలిగ్గా సెట్‌తో పాటు మ్యాచ్‌ను గెలిచేలా కనిపించింది. అయితే పొటపోవా మళ్లీ పుంజుకుంది. 6, 8 గేమ్‌లలో బ్రేక్‌లు సాధించి 4-4తో స్కోరు సమం చేసింది. ఇద్దరూ జోరు కొనసాగించడంతో టైబ్రేకర్ తప్పలేదు. టైబ్రేకర్‌లోనూ ఆట హోరాహోరీగా సాగింది. స్కోరు 7-7తో సమంగా ఉన్నప్పుడు రెండు వరస పాయింట్లు సాధించిన సబలెంకా.. మ్యాచ్‌ను గెలుచుకుంది. సబలెంకా 3 ఏస్‌లతో పాటు 34 విన్నర్లు కొట్టింది. నాలుగుసార్లు ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేసింది.


ఆంద్రీవా

గాఫ్ ముందుకు: మూడో సీడ్ కొకో గాఫ్ (అమెరికా), ఎనిమిదో సీడ్ ఆంద్రీవా (రష్యా), పన్నెండో సీడ్ స్వితోలినా (ఉక్రెయిన్) ముందంజ వేశారు. గాఫ్ 3-6, 6-0, 6-3తో బాప్టిస్ట్ (అమెరికా)పై, ఆంద్రీవా 6-3, 6-4తో రూజ్ (రొమేనియా)పై గెలవగా.. స్వితోలినా 7-6 (7-4), 6-3తో ష్నైడర్ (రష్యా)ను ఓడించింది. ఏడో సీడ్ పావోలిని (ఇటలీ), 14వ సీడ్ టౌసన్ (డెన్మార్క్) ఇంటిముఖం పట్టారు. పావోలిని 2-6, 6-7 (3-7)తో జోవిచ్ (అమెరికా) చేతిలో ఓడగా.. టౌసన్ 6-7 (5-7), 7-5, 3-6తో ఎంబాకో (కెనడా)కు తలొంచింది. పుటింట్సెవా (కజకిస్థాన్) 6-3, 6-7 (3-7), 6-3తో సోన్మెజ్ (తుర్కియే)ను ఓడించగా.. ముచోవా 6-1, 6-1తో లినెట్ (పోలెండ్)ను చిత్తు చేసింది.


అభిషేక్ శర్మ

రోహిత్ శైలిని అనుసరిస్తున్నా

దిల్లీ: పవర్‌ప్లేలో దూకుడుగా ఆడటంలో రోహిత్ శర్మ శైలిని అనుసరిస్తున్నానని భారత టీ20 జట్టు ఓపెనర్ అభిషేక్ శర్మ చెప్పాడు. అదే పద్ధతిని కొనసాగించాలంటూ.. ప్రధాన కోచ్ గంభీర్, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తనను ప్రోత్సహించారన్నాడు. 2024 జులైలో పొట్టి ఫార్మాట్‌లో అరంగేట్రం చేసిన అతడు.. తన విధ్వంసక ఆట తీరుతో తక్కువ సమయంలోనే టీ20ల్లో నంబర్‌వన్ ర్యాంకును దక్కించుకున్నాడు. అభిషేక్ మాట్లాడుతూ.. "రోహిత్ ఎన్నోసార్లు జట్టుకు గొప్ప ఆరంభాన్నందించాడు. అలాంటి ఆటగాడి స్థానంలో బ్యాటింగ్‌కు దిగినప్పుడు ఒత్తిడి ఉంటుంది. మొదటి బంతి నుంచే చెలరేగి ఆడటం నాకు ఇష్టం. కోచ్, కెప్టెన్ కూడా అదే కోరుకుంటున్నారు. పూర్తి పరిణతి చెందిన ఆటగాడిగా నన్ను నేను భావించడం లేదు. ఇంకా నేర్చుకోవాల్సి ఉంది. నాకో వారం పది రోజులు ఖాళీ దొరికితే.. తర్వాతి సిరీస్, మ్యాచ్‌ల్లో ఎదుర్కోబోయే బౌలర్లను దృష్టిలో ఉంచుకుని సాధన చేస్తా. ఆ బౌలర్లు ఎదురైనపుడు నా ప్రణాళికలను అమలు చేస్తా" అన్నాడు.

సర్ఫరాజ్ డబుల్ సెంచరీ

ముంబయి 560


సర్ఫరాజ్

ఈనాడు, హైదరాబాద్: ముంబయి బ్యాటర్ సర్ఫరాజ్‌ఖాన్ (227; 219 బంతుల్లో 19×4, 9×6) అదరగొట్టాడు. బౌండరీలు, సిక్సర్లతో విరుచుకుపడిన సర్ఫరాజ్ డబుల్ సెంచరీతో సత్తాచాటాడు. దీంతో ఉప్పల్ స్టేడియంలో హైదరాబాద్‌తో జరుగుతున్న రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూపు-డి మ్యాచ్‌లో ముంబయి భారీ స్కోరు సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 332/4తో శుక్రవారం ఉదయం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ముంబయి 123.2 ఓవర్లలో 560 పరుగులకు ఆలౌటైంది. సర్ఫరాజ్, సువేద్ పార్కర్ (75; 98 బంతుల్లో 11×4, 1×6) ఆరో వికెట్‌కు 154 పరుగులు జోడించారు. హైదరాబాద్ బౌలర్ రక్షణ్‌రెడ్డి (4/107) మెరిశాడు. అనంతరం రెండో రోజు ఆట ముగిసే సమయానికి హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 41 ఓవర్లలో 2 వికెట్లకు 138 పరుగులు రాబట్టింది. 38 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయిన హైదరాబాద్‌ను రాహుల్‌సింగ్ (82 బ్యాటింగ్; 129 బంతుల్లో 11×4, 1×6), కొడిమెల హిమతేజ (40 బ్యాటింగ్; 84 బంతుల్లో 6×4) ఆదుకున్నారు.

ఆంధ్రపై విదర్భకు ఆధిక్యం

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: ఆంధ్రతో జరుగుతున్న రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూపు-ఎ మ్యాచ్‌లో విదర్భ పైచేయి సాధించింది. ఆతిథ్య జట్టుపై 67 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సంపాదించింది. ఓవర్‌నైట్ స్కోరు 267/7తో రెండో రోజు ఉదయం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన విదర్భ 89.3 ఓవర్లలో 295 పరుగులకు ఆలౌటైంది. ఆంధ్ర బౌలర్లు కలిదిండి రాజు (5/62), కాపూరి సాయితేజ (3/46) రాణించారు. అనంతరం ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 65.3 ఓవర్లలో 228 పరుగులకు ఆలౌటైంది. అభిషేక్‌రెడ్డి (73; 91 బంతుల్లో 12×4), సౌరభ్‌కుమార్ (62; 87 బంతుల్లో 8×4), నితీశ్‌కుమార్ రెడ్డి (35; 48 బంతుల్లో 4×4) పోరాడినా.. ప్రత్యర్థి ఆధిక్యాన్ని అడ్డుకోలేకపోయారు. శుక్రవారం ఆట ముగిసే సమయానికి విదర్భ రెండో ఇన్నింగ్స్‌లో 2 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 4 పరుగులు సాధించింది.

ఆ భయం వల్లే టైటిల్ రాలేదేమో



రోహిత్

దిల్లీ: 2011 తర్వాత 2024 వరకు భారత జట్టు ప్రపంచకప్ గెలవకపోవడానికి ఆటగాళ్లలో నెలకొన్న వైఫల్య భయం ప్రధాన కారణం కావొచ్చని మాజీ కెప్టెన్ రోహిత్‌శర్మ అన్నాడు. మహేంద్రసింగ్ ధోని సారథ్యంలో 2011లో వన్డే ప్రపంచకప్ గెలిచిన భారత్.. ఆ తర్వాత సాధించిన టైటిల్ 2024లో రోహిత్ సారథ్యంలో సాధించిన టీ20 ప్రపంచకప్పే. "కెరటం ఎప్పుడూ కిందకే ఉండదు. ఏదో ఒక సమయంలో పైకి లేస్తుంది. కానీ అందుకు 13 ఏళ్లు పడుతుందని అస్సలు ఊహించలేదు. 2011లో కప్ గెలిచాం. 2024లో మళ్లీ నెగ్గాం. మొత్తం 13 ఏళ్లు పట్టింది. 2013లో ఛాంపియన్స్ ట్రోఫీ సాధించాం. సాంకేతికంగా ఐసీసీ ట్రోఫీ గెలవడానికి 11 ఏళ్లు పట్టినట్లు. అయినా 11 ఏళ్లు చాలా సుదీర్ఘ సమయమే. మేమెప్పుడు సరైన దిశలోనే ప్రయాణిస్తున్నామని నమ్మాం. కానీ దురదృష్టవశాత్తు ఏదో లోపించింది. బహుశా మా అందరిలోకి వైఫల్యం గురించిన భయం చొరబడిందేమో అనిపించింది. అది నిజం కావొచ్చు.. కాకపోవచ్చు. కానీ అదే నా భావన" అని రోహిత్ వివరించాడు.

కివీస్ టీ20 ప్రపంచకప్ జట్టులో జేమీసన్


జేమీసన్

క్రైస్ట్‌చర్చ్: టీ20 ప్రపంచకప్‌లో తలపడబోయే న్యూజిలాండ్ జట్టులోకి పేసర్ జేమీసన్ వచ్చాడు. తొడ కండరాల గాయం కారణంగా టోర్నీకి దూరమైన ఆడమ్ మిల్నే స్థానాన్ని అతడు భర్తీ చేశాడు. దక్షిణాఫ్రికా 20 లీగ్‌లో గాయపడ్డ మిల్నే మ్యాచ్ మధ్యలో బయటికి వెళ్లాడు. స్కానింగ్‌లో గాయం తీవ్రమైందని తేలడంతో అతడి స్థానంలో జేమీసన్‌ను ఎంపిక చేసినట్లు న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు తెలిపింది. జేమీసన్ మొదట రిజర్వ్ ఆటగాడిగా ఎంపికయ్యాడు.



ఈనాడు



విజయవాడ 24-1-2026 శనివారం సిటీ సంపుటి 52 . సంచిక 164

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 18 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

సీమ వరదాయినిగా.. అనంత వాహినిగా

- హంద్రీ-నీవాలో రికార్డు స్థాయిలో నీటి తరలింపు
- 191 రోజుల్లో 40.31 టీఎంసీల కృష్ణా జలాల ఎత్తిపోత

లోపలి పేజీలో

పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల్లో దేశంలో 3వ స్థానంలో ఆంధ్రప్రదేశ్

- దక్షిణాదిలో తొలి స్థానం

ఈనాడు, దిల్లీ: పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలో మూడో స్థానంలో ఉన్నట్లు కేంద్ర విద్యుత్తు శాఖ శుక్రవారం విడుదల చేసిన 'రోడ్‌మ్యాప్ టు 100 గి.వా. హైడ్రో పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్స్ బై 2035-36' నివేదిక వెల్లడించింది. 56,335 మెగావాట్ల సామర్థ్యంతో మహారాష్ట్ర, 41,525 మెగావాట్ల సామర్థ్యంతో ఒడిశా, 32,750 మెగావాట్ల సామర్థ్యంతో ఏపీ మొదటి మూడు స్థానాల్లో నిలిచినట్లు పేర్కొంది. ఈ విషయంలో ఏపీ దక్షిణాదిలో తొలి స్థానంలో ఉంది. ఏపీలో ఇప్పటికే 1,680 మెగావాట్ల సామర్థ్యం గల ప్రాజెక్టులు అమల్లో ఉన్నాయి. మరో 2,850 మెగావాట్ల ప్రాజెక్టులు నిర్మాణంలో 12,050 మెగావాట్ల ప్రాజెక్టులు సర్వే, డీపీఆర్ దశలో ఉన్నాయి. 2034-35 నాటికి ఏపీలో విద్యుత్తు స్టోరేజీ సామర్థ్యం 6,570 మెగావాట్లకు చేరుతుందని నివేదిక అంచనా వేసింది. ప్రస్తుతం ఏపీ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కర్ణాటక, ఒడిశా, ఉత్తర్‌ప్రదేశ్‌లలో పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల కోసం మంచి స్థలాలు ఉన్నాయని, ఇక్కడ అభివృద్ధి చేసే ప్రాజెక్టుల కారణంగా గ్రిడ్ విశ్వసనీయత మెరుగుపడుతుందని పేర్కొంది. దీనివల్ల గరిష్ఠ డిమాండ్ ఉన్న సమయంలోనూ నిరంతరాయంగా విద్యుత్తు సరఫరా చేయడానికి వీలవుతుందని తెలిపింది. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 2,66,845 మెగావాట్ల సామర్థ్యం ఉన్న పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులు కార్యరూపంలో ఉన్నట్లు వెల్లడించింది.

డీఎంకే కౌంట్‌డౌన్ మొదలైంది

అక్రమార్కులు, మహిళల్ని వేధించిన వారికే ఆ పార్టీలో చోటు

తమిళనాడు సంస్కృతికి వీళ్లే పెద్ద శత్రువులు

- వచ్చే ఎన్నికల్లో గెలుపుతో డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మారుస్తాం
- ఎన్డీయే సభలో ప్రధాని నరేంద్ర మోదీ



వేదికపై నుంచి అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ, చిత్రంలో అన్బుమణి(పీఎంకే), ఎడప్పాడి పళనిసామి (అన్నాడీఎంకే), కేంద్ర సహాయ మంత్రి మురుగన్, టీటీవీ దినకరన్ (ఏఎంఎంకే)

ఈనాడు, చెన్నై: 'తమిళనాడులో కీలక నేతలంతా ఎన్డీయేకు మద్దతుగా ఉన్నారు. డీఎంకే అవినీతి నుంచి రాష్ట్రాన్ని విముక్తి చేయడానికి వారంతా గట్టి సంకల్పం తీసుకున్నారు. ఇక డీఎంకే ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ మొదలైంది' అని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. చెన్నై సమీపంలోని మధురాంతకంలో శుక్రవారం ఏర్పాటుచేసిన ఎన్డీయే బహిరంగ సభలో ప్రధాని ప్రసంగించారు. భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణుల సమక్షంలో డీఎంకే ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఈ సభ నుంచి తాను తమిళనాడులో ఎన్నికల ప్రచారాన్ని మొదలుపెట్టినట్లు ప్రకటించారు. డీఎంకేకు ఇక్కడి ప్రజలు అధికారమిచ్చినా ప్రజల విశ్వాసాన్ని తుంచేశారని, హామీలు ఎక్కువ.. పని తక్కువ అన్నట్లుగా వారి పాలన సాగుతోందని విమర్శించారు. అవినీతి(కరప్షన్), మాఫియా, నేరాల (క్రైం)ను పెంచుతూ.. 'సీఎంసీ' సర్కారుగా మారిందని వ్యాఖ్యానించారు. అటు డీఎం కేను, ఇటు సీఎంసీ చర్యలను రెండింటినీ తీసి పడేసేందుకు ప్రజలు నిర్ణయం తీసుకున్నారని, వచ్చే ఎన్నికల్లో గెలిచేది డబుల్ ఇంజిన్ సర్కారేనని మోదీ జోస్యం చెప్పారు.

కోర్టు పరువునూ తీశారు

మదురై జిల్లా తిరుప్పరంకుండ్రం దీపం వివాదంపై మోదీ మాట్లాడుతూ.. 'కొద్దిరోజుల క్రితం భగవాన్ మురుగన్ దీపంపై వివాదం తలెత్తింది. భక్తుల హక్కుల రక్షణ కోసం మా నేతలు అండగా ఉన్నారు. డీఎంకే, మిత్రపక్షాలు మాత్రం ఓటు బ్యాంకు కోసం కోర్టునూ వదలకుండా పరువు తీశాయి. తమిళనాడు సంస్కృతికి పెద్ద శత్రువులు ఎవరైనా ఉన్నారంటే అది డీఎంకే నేతలే' అని ఆరోపించారు.

జయలలిత నేరాల్ని తగ్గిస్తే.. వీరు వేధిస్తున్నారు

డీఎంకే ప్రభుత్వానికి ప్రజాస్వామ్యం, బాధ్యత రెండూ లేవని, అది కుటుంబ బానిస ప్రభుత్వంగా మారిందని ప్రధాని విమర్శించారు. 'డీఎంకేలో ఓ వ్యక్తి నాయకుడిగా ఎదగాలంటే అతనికి అవినీతి, మహిళలను వేధించడం, సంస్కృతిని అపహాస్యం చేసే అర్హతలు ఉండాలి. అది వారి పార్టీకి అవసరమేమో కానీ, తమిళనాడు రాష్ట్రానికి మంచిది కాదు' అని వ్యాఖ్యానించారు. 'మాజీ ముఖ్యమంత్రి జయలలిత రాష్ట్రంలో నేరాల్ని తగ్గించగా, ఇప్పుడు అరాచకాలు పెచ్చరిల్లుతున్నాయి. రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయింది' అని ప్రధాని పేర్కొన్నారు.

కేరళలోనూ అధికార మార్పు తప్పదు: మోదీ

తిరువనంతపురం: కేరళ ప్రజలు భాజపాపై విశ్వాసంతో ఉన్నారని, రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఈ రాష్ట్రంలో ప్రభుత్వ మార్పు తప్పదని ప్రధాని మోదీ పేర్కొన్నారు. శుక్రవారం తిరువనంతపురంలో పలు అభివృద్ధి ప్రాజెక్టులతో పాటు నాలుగు రైళ్లను ప్రారంభించిన అనంతరం బహిరంగ సభలో ప్రధాని ప్రసంగించారు. 'ఈ రోజు ఇక్కడ నేను ఓ కొత్త ఆశను చూస్తున్నాను. 1987కి ముందు గుజరాత్‌లో భాజపా ఒక సాధారణ పార్టీ. అదే ఏడాది మొట్టమొదటిసారి అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను గెలుచుకుంది. సరిగ్గా ఈ రోజు మీరు తిరువనంతపురంలో గెలిపించినట్లే. అక్కడి నుంచి గుజరాత్‌లో ప్రారంభమైన పరంపరలో ప్రజలు మా పనిని చూశారు. దశాబ్దాలుగా అక్కడి ప్రజలు మాకు అవకాశాలు ఇస్తూనే ఉన్నారు. కేరళలో కూడా భాజపా విజయ ప్రస్థానం ఒక నగరంతోనే ప్రారంభమైంది' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

నాలుగు రైళ్లు ప్రారంభం

కేరళ, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంతీయ రైలు కనెక్టివిటీని మెరుగుపరచడానికి సహాయపడే మూడు అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను, త్రిస్సూర్-గురువాయూర్ ప్యాసింజర్ రైలును, పూజప్పుర హెడ్ పోస్ట్ ఆఫీస్‌ను మోదీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేరళ సీఎం పినరయి విజయన్, గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్ పాల్గొన్నారు.

సాయిరెడ్డిని రూ.100 కోట్లు ఎందుకడిగారు?

వాటిని రాజ్ కెసిరెడ్డికి ఎందుకు ఇప్పించారు?

వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డిని ప్రశ్నించిన ఈడీ

ఏపీ మద్యం కుంభకోణం కేసులో విచారణ



ఈనాడు – హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో నిందితుడు, వైకాపా ఎంపీ పీవీ మిథున్‌రెడ్డిని దాదాపు ఏడు గంటలపాటు విచారించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) పలు వివరాలు రాబట్టింది. ఇప్పటికే ఏపీ ప్రభుత్వం నియమించిన సిట్‌తో పాటు తమ దర్యాప్తులోనూ వెల్లడైన అంశాలను దగ్గర పెట్టుకొని ప్రశ్నించినట్లు తెలిసింది. ఇదే కేసులో గురువారం జరిగిన విచారణలో విజయసాయిరెడ్డి చెప్పిన విషయాలు కూడా మిథున్‌రెడ్డి ఎదుట ఈడీ అధికారులు ప్రస్తావించారు. ముఖ్యంగా ఏ-1 రాజ్ కెసిరెడ్డికి రూ.వంద కోట్లు ఎందుకివ్వాల్సి వచ్చిందని ప్రశ్నించినట్లు సమాచారం. మద్యం విధానం రూపకల్పనలో మిథున్‌రెడ్డి పోషించిన పాత్ర, ఆయన భాగస్వామిగా ఉన్న ఇతర వ్యాపార సంస్థల లావాదేవీల వివరాలను అడిగారని తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం..

వైకాపా హయాంలో ఏపీలో జరిగిన మద్యం కుంభకోణంలో నిధుల మళ్లింపునకు సంబంధించి ఈడీ అధికారులు దర్యాప్తు జరుపుతున్న సంగతి తెలిసిందే. ఈ కేసులో నిందితునిగా ఉన్న విజయసాయిరెడ్డిని గురువారం ప్రశ్నించిన అధికారులు.. కీలక నిందితుడైన మిథున్‌రెడ్డిని శుక్రవారం హైదరాబాద్‌లో విచారణకు పిలిచారు. ఉదయం 11 గంటలకు ఈడీ కార్యాలయానికి వచ్చిన మిథున్‌రెడ్డి సాయంత్రం 6 గంటలకు తిరిగి వెళ్లిపోయారు. మధ్యలో భోజన విరామం మినహా దాదాపు ఏడు గంటలపాటు ఆయన్ను ప్రశ్నించారు. మద్యం డిస్టిలరీలను తమ అదుపాజ్ఞల్లో పెట్టుకొని, సొంత మద్యం బ్రాండ్లు తయారు చేయించి, బ్రూవరేజస్ ద్వారా అమ్మించి భారీగా లాభాలు కూడగట్టుకున్నారని, ఈ లాభాలను ఇతర సంస్థల్లోకి మళ్లించారన్నది ప్రధాన అభియోగం. ఇందులో మిథున్‌రెడ్డి పాత్ర ఉందని భావిస్తున్న ఈడీ. . పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్, హుడ్‌వింక్స్ తదితర సంస్థల లావాదేవీలు, వాటిలోకి వచ్చిన నిధుల గురించి బ్యాంక్ స్టేట్‌మెంట్స్ ఆధారాలను ముందుపెట్టి ప్రశ్నించినట్లు తెలుస్తోంది. అదాన్ డిస్టిలరీస్, పీఎల్ఆర్ ఇండస్ట్రీస్‌ల మధ్య నగదు బదిలీ జరిగినట్లు ఈడీ అధికారులు గుర్తించారు. వాటి గురించి ప్రశ్నించగా, అదంతా వ్యాపార లావాదేవీల్లో భాగంగానే జరిగిందని ఆయన జవాబిచ్చినట్లు సమాచారం. 'ఈ కేసులో ఏ-1 రాజ్ కెసిరెడ్డికి రూ.వంద కోట్లు సమకూర్చాలని నాటి వైకాపా నేత విజయసాయిరెడ్డిని కోరాల్సిన అవసరం ఏమొచ్చింది? మద్యం వ్యాపారంలో పెట్టుబడి కోసమే ఈ డబ్బు సర్దుబాటు చేశారా? ఆ అప్పు తిరిగి ఎలా చెల్లించారు?' అని ప్రశ్నించగా, మిథున్‌రెడ్డి సూటిగా సమాధానాలివ్వలేదని తెలిసింది. చాలా ప్రశ్నలకు సమాధానాలు దాటవేశారని, ఈ కేసుతో తనకు సంబంధమే లేదని చెప్పినట్లు సమాచారం.

అవసరమైతే మళ్లీ పిలుస్తామని చెప్పి ఈడీ అధికారులు మిథున్‌రెడ్డిని సాయంత్రం ఆరు గంటలకు పంపించారు. అతని వెంట పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్‌కు చెందిన చంద్రశేఖర్‌రెడ్డి, శర్వాణి ఇండస్ట్రీస్ ప్రతినిధులు కూడా ఈడీ కార్యాలయానికి వచ్చారు. విచారణ జరుగుతున్నంత సేపు వారు కార్యాలయ ఆవరణలోనే ఉన్నారు.

కుంభమేళాలా గోదావరి పుష్కరాలు

10 కోట్ల మంది వచ్చే అవకాశం

18 నెలలే ఉంది.. వెంటనే పనులు ఆరంభించండి: సీఎం

ఈనాడు, అమరావతి: వచ్చే ఏడాది జూన్ 26 నుంచి జులై 7 వరకు గోదావరి పుష్కరాలను కుంభమేళాను తలపించేలా నిర్వహించాలని, యంత్రాంగం సన్నద్ధం కావాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఇంకా 18 నెలల సమయం మాత్రమే ఉన్నందున, వెంటనే అన్ని శాఖలు పనులు ప్రారంభించాలని నిర్దేశించారు. దేశ, విదేశాల నుంచి 10 కోట్ల మంది పుష్కర స్నానాలకు వచ్చే అవకాశం ఉన్నందున, అందుకు తగినట్లు వసతులు కల్పించాలని ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో గోదావరి పుష్కరాలపై సీఎం చంద్రబాబు తొలిసారి అత్యున్నత సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని పోలవరం, ఏలూరు, తూర్పు గోదావరి, పశ్చిమగోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాల్లో 212 కి.మీ. మేర గోదావరి ప్రవహిస్తున్నందున.. పెద్దఎత్తున పుష్కరస్నానాలకు ఏర్పాట్లు ఉండాలని సీఎం పేర్కొన్నారు. ఆ ఆరు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతోనూ వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ప్రస్తుతమున్న 234 ఘాట్లతోపాటు, కొత్తగా మరో 139 ఘాట్లు కలిపి మొత్తం 373 ఘాట్లను 9,918 మీటర్ల పొడవునా అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందించాలి. రాజమహేంద్రవరంలో మోడల్ ఘాట్ నిర్మించాలి. దాని డిజైన్ల ఆధారంగా మిగిలిన ఘాట్లు నిర్మించాలి అని సీఎం చెప్పారు.

హోంస్టేలు, టెంట్ సిటీల్లో ఆతిథ్యం

ముఖ్యమంత్రిగా మూడోసారి గోదావరి పుష్కరాలు నిర్వహిస్తుండటం తనకు దక్కిన అదృష్టమని సీఎం పేర్కొన్నారు. 'పుష్కరాలకు నిధుల కోసం ఇప్పటి నుంచే కేంద్రంతో సంప్రదింపులు జరపాలి. పుష్కర స్నానాలకు తరలివచ్చే వారికి వసతి సమస్య లేకుండా టెంట్ సిటీలు, హోంస్టేలను పెద్దఎత్తున అందుబాటులోకి తేవాలి. పుష్కరాలకు ముందే పోలవరం పూర్తికావాలి. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఆతిథ్యం ఇచ్చేలా స్థానికుల సహకారం తీసుకోవాల'ని సూచించారు.



గోదావరి పుష్కర పనులపై సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రులు రామనారాయణరెడ్డి, పయ్యావుల, అనగాని, అనిత, దుర్గేష్, నారాయణ, బీసీ జనార్దన్‌రెడ్డి, వాసంశెట్టి సుభాష్, నిమ్మల రామానాయుడు, అధికారులు

ఏప్రిల్, మే నెలల్లో టీచర్లకు పదోన్నతులు, బదిలీలు

ఈనాడు, అమరావతి: ఉపాధ్యాయులకు ఏప్రిల్, మే నెలల్లో బదిలీలు, పదోన్నతులు చేపట్టనున్నట్లు పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. ఉపాధ్యాయ సంఘాల నేతలతో నిర్వహించిన సమావేశంలో అధికారులు పలు అంశాలను వెల్లడించారు. హైస్కూల్ ప్లస్‌లో ఖాళీల భర్తీకి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, వేసవి సెలవుల్లో పని చేసిన టీచర్లకు ఆర్జిత సెలవులు ఇవ్వనున్నామని తెలిపారు. వీటికి సంబంధించిన ఉత్తర్వులు వారం రోజుల్లో ఇవ్వనున్నట్లు వెల్లడించారు. రెగ్యులర్ ఖాళీలు భర్తీ అయ్యే వరకు క్లస్టర్ టీచర్స్ పాఠశాలలు మారుతూ ఉండాల్సి ఉంటుందని, బదిలీల కౌన్సెలింగ్‌లో పాత పాయింట్లు పరిగణనలోకి తీసుకుంటామని పేర్కొన్నారు. ఉపాధ్యాయ సంఘాలతో ఇక నుంచి ప్రతి వారం సమావేశాలు నిర్వహిస్తామని, జీతాల సమస్య ఉంటే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజెస్ పదోన్నతులు ఎస్జీటీలకు 30:70 నిష్పత్తిలో చేపడతామని అధికారులు తెలపగా.. 70:30 నిష్పత్తి ప్రకారం కల్పించాలని సంఘాల నేతలు కోరారు.

రాజధానికి త్రివర్ణ శోభ



ఈ నెల 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాజధాని గ్రామం రాయపూడి సమీపంలో 22 ఎకరాల్లో ప్రభుత్వం వేదికను సిద్ధం చేసింది. గవర్నర్, ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, వీఐపీలు, ప్రముఖులు, ఉన్నతాధికారులు హాజరు కానున్న ఈ కార్యక్రమంలో మొత్తం 13 వేల మంది పాల్గొనేలా ప్రాంగణాన్ని సిద్ధం చేస్తున్నారు. రైతులకు ప్రత్యేక గ్యాలరీ కేటాయించారు. - న్యూస్‌టుడే, తుళ్లూరు

తారుకు బదులు బయో-బిటుమిన్

- మెటీరియల్ పునర్వినియోగంతో రోడ్ల నాణ్యత.. మన్నిక
- కర్బన ఉద్గారాలు, మౌలిక సదుపాయాల ఖర్చును తగ్గించడమే లక్ష్యం
- సీఆర్ఆర్ఐ శాస్త్రవేత్త భరత్



గువాహటిలో బయో-బిటుమిన్‌తో నిర్మిస్తున్న రహదారి



డాక్టర్ గొట్టుముక్కల భరత్

ఈనాడు డిజిటల్, భీమవరం, రేలంగి, న్యూస్‌టుడే: కర్బన ఉద్గారాలు, మౌలిక సదుపాయాల ఖర్చు తగ్గించడమే లక్ష్యంగా శాస్త్ర, పారిశ్రామిక పరిశోధన మండలి (సీఎస్ఐఆర్)- కేంద్ర రహదారి పరిశోధన సంస్థ (సీఆర్ఆర్ఐ) పని చేస్తున్నాయని, అందులో భాగంగానే తారుకు ప్రత్యామ్నాయంగా బయో-బిటుమిన్ అభివృద్ధి చేస్తోందని సీఎస్ఐఆర్-సీఆర్ఆర్ఐ ముఖ్య శాస్త్రవేత్త డాక్టర్ గొట్టుముక్కల భరత్ తెలిపారు. వ్యవసాయ వ్యర్థాలతో బయో-బిటుమిన్ ఉత్పత్తి ద్వారా పంటదహనం కాలుష్యాన్ని తగ్గించవచ్చని, రైతులకు ఆర్థిక మద్దతుతో పాటు గ్రామాల్లో జీవనోపాధి సృష్టిస్తుందన్నారు. రహదారుల పరిశోధనలో చేసిన కృషికి విశ్వకర్మ జాతీయ పురస్కారాన్ని భరత్ అందుకున్నారు. పశ్చిమగోదావరి జిల్లా చినఅమిరానికి చెందిన ఆయన సంక్రాంతికి జిల్లాకు వచ్చిన సందర్భంగా 'ఈనాడు'తో మాట్లాడారు. వివరాలివీ..

పునర్వినియోగంపై దృష్టి

పాడైన రహదారులను అభివృద్ధి చేసే క్రమంలో వెలువడే పాత సామగ్రిని పునర్వినియోగం చేసుకోవచ్చు. మూడేళ్ల క్రితం కొవ్వూరు దగ్గర పది కిలోమీటర్లు ప్రయోగాత్మకంగా పరిశీలించాం. మంచి ఫలితాలొచ్చాయి. దేశవ్యాప్తంగా అమలు చేసేందుకు మార్గదర్శకాలు రూపొందించి, కేంద్రానికి నివేదించాం.

నిశిత పరిశీలన అవసరం

రహదారులు ఎక్కడ పాడవుతున్నాయో పరిశీలించి పరిష్కారం చూపాలి. రహదారుల నిర్మాణంలో మూణ్నాలుగు పొరలుంటాయి. ఏ పొరలో లోపం ఉందో గుర్తించాలి. ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి, గుంటూరు, కృష్ణా జిల్లాల్లో అమలు చేసేందుకు వెయ్యి కిలోమీటర్ల మేర రహదారులు వేసేందుకు బయో-బిటుమిన్ నమూనా ఇచ్చాం.

ఎసెట్ మేనేజ్‌మెంట్ ఉండాలి

చాలా రాష్ట్రాలు రహదారులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయిస్తున్నాయి. ఆ నిధులు ఎలా ఉపయోగించాలో ఎసెట్ మేనేజ్‌మెంట్ అనుసరిస్తున్నారు. ఉదాహరణకు 200 రహదారులను మరమ్మతు చేయాలా... రెండు కొత్త రహదారులు వేయాలా అని ఆలోచించి, దానిప్రకారం నిర్ణయం తీసుకుంటారు. ఒడిశా, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్‌లో ఈ విధానం పక్కాగా అమలవుతోంది.

ఫోరెన్సిక్ ఇన్వెస్టిగేషన్

ప్రతినెలా రెండు మూడు జాతీయ రహదారులపై ఫోరెన్సిక్ ఇన్వెస్టిగేషన్ చేస్తాం. రహదారులు ఎందుకు పాడవుతున్నాయో గుర్తించి కేంద్రానికి నివేదిస్తాం. అమరావతిలో రహదారుల కింది పొరను తీసేసి కొత్తగా వేస్తున్నారు. దీనివల్ల వాటి జీవిత కాలం ఎక్కువగా ఉంటుంది.

వ్యర్థాల ఆధారంగా

వరి వ్యర్థాల నుంచి బయో-బిటుమిన్ వచ్చింది. వివిధ ప్రాంతాల్లో పండించే పంటలు, లభ్యమయ్యే వ్యర్థాల ఆధారంగా బయో-బిటుమిన్ ప్రణాళిక చేస్తున్నాం. బయోమాస్ నుంచి పైరలాసిస్ ప్రాసెజర్ ద్వారా ఆయిల్, చార్, గ్యాస్ వస్తాయి. అవి రైతులకు ఆర్థికంగా మద్దతిస్తాయి. ప్రస్తుతం పత్తి, జీడిమామిడి, తుమ్మచెట్లపై పరీక్షలు చేస్తున్నాం.

నాణ్యత ఎక్కువ, ఖర్చు తక్కువ

ఛిద్రమైన రహదారులను తవ్వగా వచ్చిన మెటీరియల్‌కు కొంత సిమెంటు కలిపి లేయర్ వేసిన తర్వాత సన్నని బిటుమిన్ లేయర్ వేస్తే సరిపోతుంది. దానివల్ల ఖర్చు తక్కువ, నాణ్యత ఎక్కువ. పని కూడా వేగంగా అవుతుంది. పదేళ్ల జీవితకాలం ఉంటుంది. నాలుగేళ్లలో ఉత్తర్‌ప్రదేశ్‌లో పది వేల కిలోమీటర్ల రహదారులు వేశాం.



బామ్మజీ మాట... బంగారు బాట!



(మొదటి పేజీ తరువాయి)

నడుస్తా. వాకింగ్ అయ్యాక మితంగా సగం టిఫిన్ తీసుకుంటా. రోజూ కనీసం రెండు గంటలు దినపత్రికలు చదువుతా. మధ్యాహ్నం భోజనం అయ్యాక కంప్యూటర్‌పై నా పరిశోధనల కోసం పనిచేస్తా. ఎట్టిపరిస్థితుల్లోనూ సమయపాలన తప్పను.

అభిరుచులు: శాస్త్రీయ సంగీతం అంటే చెవి కోసుకుంటా. నేను ఇంట్లో ఒక్కదాన్నే ఉంటా. అలెక్సా నా నేస్తం. అందులో ఇష్టమైన పాటలు వింటా. పుస్తకాలు చదవడంతో కాలక్షేపం అవుతుంది. ఇక రాత్రి తొమ్మిదింటికి నిద్రలోకి జారుకుంటా. వారానికోసారైనా ఊరికి వెళ్లి ప్రజల మధ్య గడపాల్సిందే.

ఆహారం: నేను ఆహార ప్రియురాలిని. అన్నీ తింటాను కానీ మితంగా. ఎవరైనా అడిగితే ఇలాగే చేయమని చెబుతాను. ఇడ్లీ, దోసె, పెరుగు లాంటి ఆహారాల్లో మంచి బ్యాక్టీరియా ఉంటుంది. శరీరానికి చాలా మేలు చేస్తుంది. పెసలు, శనగల లాంటి మొలకెత్తే దాన్యాలు ఎంతో ఆరోగ్యకరం. నేను రోజూ భోజనంలో ఒక పచ్చడి, కూరగాయలు, సోయా చంక్స్ లేదా పనీర్ లేదా పప్పులు తీసుకుంటాను. ప్రొటీన్ ఉన్న ఆహారానికి ప్రాధాన్యం ఇస్తాను. ఇక వారంలో కనీసం మూడు సార్లు కోడిగుడ్డు, అప్పుడప్పుడు చేపలు కూడా తింటా. ప్రతి ఆదివారం వరి అన్నం ఉంటుంది. రోజూ ఉదయం ఒక అరటి పండు చాలా మంచిది. ఇందులో పొటాషియం అధికంగా ఉంటుంది. గుడ్డులోని పచ్చ సొన తినకూడదని చెబుతున్నారు. కానీ రోజూ ఒక గుడ్డు పచ్చసొనతోపాటు ఉడికించుకొని తినడం ఆరోగ్యానికి మంచిదే.

నా మాట:
- ప్రాసెస్ చేసిన ఆహారం తీసుకోవద్దని ప్రచారం చేయడం సరికాదు. ఉప్పు, చక్కెర శాతం తక్కువ చేసి ఆరోగ్యకరమైన పదార్థాలతో ప్రాసెస్ చేసిన ఆహారాన్ని హాయిగా తీసుకోవచ్చు.
- శాకాహారుల్లో చాలామంది బీ12 విటమిన్ లోపంతో బాధపడుతున్నారు. వాళ్లు పుష్కలంగా కూరగాయలు తీసుకుంటే అందులో ఉండే మంచి బ్యాక్టీరియా బీ12ను ఉత్పత్తి చేస్తుంది.
- ఆకుకూరలతోపాటు, పప్పులు ఆహారంలో భాగం కావాలి. మన రేషన్ దుకాణాల్లో పేదలకోసం బియ్యంతో పాటు పప్పు దినుసులు, చిరు ధాన్యాలు ఇవ్వాలి.
- స్వచ్ఛమైన నీరు, కలుషితం కాని వాతావరణం ఆయుష్షుకు, ఆరోగ్యానికి చాలా అవసరం. పోషకాహారం పరమ ఔషధం. .. ఇదే నా నినాదం.

వయసుతోపాటు నాకూ కొన్ని అనారోగ్య సమస్యలు వచ్చాయి. కానీ మానసికంగా దృఢంగా ఉండడంతో ఇప్పటికీ నగరంలో కారు నడిపించగల సత్తా ఉంది. 'ఒంటరితనంతో కుంగిపోరా?' అని నన్ను కొందరు అడుగుతుంటారు. 'ఒంటరిగా ఉన్నానన్న ఆలోచన చేసేందుకు నాకు సమయం ఎక్కడుంది (నవ్వుతూ)?' ఇదీ వాళ్లకు నా సమాధానం.

ఆనందం: నేను నా పనిని ప్రేమిస్తాను. ఇది నాకు అంతులేని ఆనందాన్నిస్తుంది. ఆయుష్షును పెంచుతుంది. గ్రామాలన్నీ తిరిగి పోషకాహారంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగిస్తున్నాను. పల్లెల్లోని మహిళల్లో రక్తహీనత సమస్య ఎక్కువగా ఉంటోంది. వారికి సాయం చేస్తున్నాం. మంచి ఆహారంతో ఆ సమస్యను ఎలా అధిగమించవచ్చో వివరిస్తున్నాం. 'డంగోరియా' స్వచ్ఛంద సంస్థ ద్వారా మెదక్ జిల్లాలోని అనేక గ్రామాల్లో ప్రజలకు పౌష్టికాహారం, ఆరోగ్యం తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నాం. మా సంస్థలో 'పోషణ' బ్రాండ్‌తో మల్టీగ్రెయిన్ రవ్వ, పప్పులు తయారుచేస్తూ ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలను ప్రజలకు పరిచయం చేస్తున్నాం.

చాలామంది పదవీ విరమణ తర్వాత మానసికంగా అశక్తులవుతారు. నేను హైదరాబాద్‌లోని ఎన్ఐఎన్‌లో డైరెక్టర్ స్థాయిలో 1994లోనే ఉద్యోగ విరమణ చేశా. ఆ తర్వాత నా వ్యాపకాలు మరింత పెరిగాయి. కంప్యూటర్ నేర్చుకున్నా. నిత్యం ఏదో కొత్త విషయం తెలుసుకుంటూనే ఉన్నా.

పని... పురస్కారాలు:
- మహతాబ్ ఎస్. బామ్జీ 1934 అక్టోబరులో జన్మించారు. తండ్రి స్వస్థలం గుజరాత్.
- బాంబే విశ్వవిద్యాలయంలో ఎమ్మెస్సీ బయోకెమిస్ట్రీ పూర్తి చేసుకుని 1962లో యూకేలోని టఫ్ట్స్ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ పూర్తి చేశారు.
- 1965లో ఎన్ఐఎన్‌లో చేరి వివిధ హోదాల్లో పనిచేసి సంచాలకురాలిగా రిటైర్ అయ్యారు.
- విటమిన్ బీ, బీ1, బీ2లో లోపాల అధ్యయనాలు చేసి అనేక అంతర్జాతీయ జర్నల్లో పరిశోధన పత్రాలు రాశారు.
- కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని డీఎస్టీ ఆధ్వర్యంలో మహిళల కోసం ఏర్పాటుచేసిన నేషనల్ టాస్క్‌ఫోర్స్ సైన్స్ విభాగానికి సహ చైర్‌పర్సన్‌గా పనిచేశారు.
- కెనడా కేంద్రంగా పనిచేసే ఇంటర్నేషనల్ యూనియన్ ఆఫ్ న్యూట్రిషన్ సైన్సెస్ 2017లో జీవిత సాఫల్య పురస్కారాన్ని అందించింది.
- కేంద్ర బయోటెక్నాలజీ విభాగం నుంచి అత్యుత్తమ మహిళా శాస్త్రవేత్తగా గుర్తింపు పొందారు.

– ఈనాడు, హైదరాబాద్

బాలిక ప్రాణం తీసిన సిమెంట్ జింక బొమ్మ

- ఆడుకుంటుండగా మీద పడిన వైనం
- జి.పెదపూడి ప్రాథమిక పాఠశాలలో ఘటన



దివి జాహ్నవి



చిన్నారి మృతికి కారణమైన జింక బొమ్మ

పి.గన్నవరం, న్యూస్‌టుడే: పాఠశాల ప్రాంగణంలోని జింక బొమ్మ (సిమెంట్‌తో తయారు చేసినది) రెండో తరగతి విద్యార్థినిని బలితీసుకుంది. ఈ విషాద ఘటన డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పి.గన్నవరం మండలం జి.పెదపూడిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(మెయిన్)లో దివి జాహ్నవి(7) రెండో తరగతి చదువుతోంది. శుక్రవారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో పాఠశాల ప్రాంగణంలో ఆడుకుంటుండగా అక్కడ ఉన్న జింక బొమ్మ బాలికపై పడటంతో అపస్మారక స్థితికి వెళ్లింది. చిన్నారిని కొత్తపేట సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. జింక బొమ్మపై నుంచి కిందకు దిగుతుండగా అది మీదపడిపోయిందని అదే పాఠశాలలో ఐదోతరగతి చదువుతున్న జాహ్నవి అక్క తేజశ్రీ భోరున విలపించింది. పిల్లలంతా టిఫిన్ తర్వాత తాను ఇంటికి వెళ్తున్న సమయంలో ప్రమాదం జరిగిందని.. అమ్మమ్మ అంటూ వీడ్కోలు చెప్పిందని ఆ పాఠశాలలో మధ్యాహ్న భోజనం తయారు చేసే చిన్నారి అమ్మమ్మ సత్యవతి కన్నీరుమున్నీరయ్యారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రభుత్వం తరపున రూ.5 లక్షల పరిహారం అందజేస్తామని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ హామీ ఇచ్చారు.

పర్యవేక్షణ ఉంటే ప్రమాదం జరిగేది కాదు..

వైకాపా హయాంలో రూ.15.46 లక్షలతో ఈ పాఠశాలలో నాడు-నేడు కింద మౌలిక వసతుల పనులు చేపట్టారు. పంచాయతీరాజ్‌శాఖ స్థానిక ఇంజినీరింగ్ అధికారులకు ఈ పనులు అప్పగించారు. అదే సమయంలో బడి ప్రాంగణంలో గ్రామ దాతలు ఇచ్చిన రూ.1.10 లక్షల విరాళాలతో విద్యార్థులు ఆడుకునేందుకు వీలుగా క్రీడాసామగ్రితో పాటు సరస్వతి విగ్రహం, సిమెంటుతో తయారుచేసిన రెండు జింక బొమ్మలు ఏర్పాటుచేశారని పి.గన్నవరం ఎంఈవో-1 కోన హెలీనా చెప్పారు. జింక బొమ్మలను బయట కొనుగోలు చేసి తెచ్చి పునాది ఏర్పాటుచేయకుండానే నేలమీద పెట్టడం ప్రస్తుత ప్రమాదానికి కారణమైంది. అధికారులు తగిన పర్యవేక్షణ చేసి జాగ్రత్తలు తీసుకుని ఉంటే ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదు.

పాలే లేని.. పాపాల నెయ్యి

(మొదటి పేజీ తరువాయి)

36 మంది నిందితుల ప్రమేయాన్ని స్పష్టంగా వివరించారు. ఈ జాబితాలో తితిదే ఉద్యోగులు, అధికారులతో పాటు పలువురు డెయిరీ సంస్థల ప్రతినిధులున్నారు.

కిలోకు రూ.25 చొప్పున లంచం డిమాండ్

తితిదే అప్పటి ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పీఏ కె.చిన్న అప్పన్న డెయిరీ సంస్థల ప్రతినిధుల నుంచి బేరసారాలు జరిపి, హవాలా మార్గాల్లో లంచాలు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయని సిట్ అభియోగపత్రంలో పొందుపరిచినట్లు సమాచారం. చిన్న అప్పన్న బ్యాంకు ఖాతాల్లో 2019 నుంచి 2024 మధ్య ఐదేళ్లలో రూ.4.69 కోట్లు జమ కాగా అందులో రూ.4.64 కోట్లు వివిధ ఖాతాలకు మళ్లించారు. కల్తీ నెయ్యి సరఫరా చేసిన సంస్థల నుంచి చిన్న అప్పన్న కిలోకు రూ.25 చొప్పున లంచం డిమాండ్ చేసి అందుకున్నట్లు అభియోగాలున్నాయి. సిట్ ఈ వివరాలన్నీ అభియోగపత్రంలో పేర్కొన్నట్లు తెలిసింది. ఏఆర్ డెయిరీ, వైష్ణవి డెయిరీ, భోలేబాబా తదితర సంస్థలతో పాటు వాటి ప్రతినిధులు కల్తీ నెయ్యి సరఫరాలో ఎలా భాగస్వాములయ్యారో సిట్ ఛార్జిషీట్‌లో అభియోగపత్రంలో వివరించింది.

టెండర్ల నిబంధనల సడలింపుతో కల్తీకి రాచబాట

తిరుమలకు నెయ్యి సరఫరా చేసే టెండర్లలో పాల్గొనేందుకు కఠిన నిబంధనలు ఉండేవి. 2019లో వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ నిబంధనల్ని పూర్తిగా సడలించేశారు. టెండర్లలో పాల్గొనే డెయిరీ పాలు సేకరించాల్సిన పనిలేదని, వెన్న సేకరణ, నెయ్యి ఉత్పత్తి సామర్థ్యంతో సంబంధం లేదని, డెయిరీ మూడేళ్ల కార్యకలాపాలు చేయక్కర్లేదని, ఏడాది చాలని, రూ.250 కోట్ల టర్నోవర్ అవసరం లేదని, రూ.150 కోట్లు ఉంటే చాలని నిబంధనలు మార్చేసింది. వైవీ సుబ్బారెడ్డి తితిదే పాలకమండలి ఛైర్మన్‌గా ఉన్నప్పుడు ఇదంతా జరిగింది. ఈ నిబంధనల సడలింపు వల్లే కల్తీ నెయ్యి సరఫరా సంస్థలకు అవకాశమిచ్చినట్లయ్యిందని సిట్ అభియోగపత్రంలో పొందుపరిచినట్లు తెలిసింది.

సుబ్బారెడ్డి, భూమన, చెవిరెడ్డిల విచారణ

ఈ కేసు దర్యాప్తులో భాగంగా అప్పటి తితిదే ఛైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకరరెడ్డిలతో పాటు తితిదే అప్పటి ఈవో ధర్మారెడ్డిని సిట్ అధికారులు విచారించారు. తితిదే పాలకమండలిలో ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ఉన్న చెవిరెడ్డి భాస్కరరెడ్డి, అప్పట్లో కొనుగోలు కమిటీలో సభ్యులుగా ఉన్న ప్రస్తుత మంత్రి కొలుసు పార్థసారథి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలనూ ప్రశ్నించారు. ఆ విచారణ అంశాలనూ అభియోగపత్రంలో పొందుపరిచినట్లు తెలిసింది.

14 నెలల పాటు 12 రాష్ట్రాల్లో దర్యాప్తు

- సిట్ అధికారులు మొత్తం 14 నెలలపాటు ఈ కేసు దర్యాప్తు చేశారు. 12 రాష్ట్రాల్లో సోదాలు చేశారు. గతేడాది మే నెలలో తొలి ఛార్జ్‌షీట్ దాఖలు చేసినప్పుడు 24 మందిని నిందితులుగా చేర్చారు. నవంబరు 23న కోర్టుకు సమర్పించిన మెమోలో తితిదే ఉద్యోగులు, డెయిరీ నిపుణులు కలిపి మరో 12 మందిని నిందితులుగా పేర్కొన్నారు. ఈ 36 మంది నిందితుల ప్రమేయంపైనా తాజా అభియోగపత్రంలో స్పష్టంగా వివరించారు.
- తమిళనాడు దిండిగల్‌లోని ఏఆర్ డెయిరీ నుంచి దర్యాప్తు మొదలైంది. ఆ తర్వాత ఈ వ్యవహారంలో కీలక సూత్రధారులుగా భోలేబాబా ఓరోగానిక్ డెయిరీ డైరెక్టర్లు పొమిల్ జైన్, విపిన్ జైన్ ఉన్నారని తేలింది. వీరు దిల్లీ, హరియాణా, రాజస్థాన్‌ల నుంచి రసాయనాలు తెప్పించి, ఉత్తరాఖండ్‌లోనే కల్తీ నెయ్యి తయారు చేసి పంపారని విచారణలో వెల్లడైంది. అనంతరం మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, ఉత్తర్‌ప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో నిందితులను గుర్తించారు.
- ఈ కేసులో తొలుత గతేడాది ఫిబ్రవరి 9న ఏఆర్ డెయిరీ ఎండీ రాజురాజశేఖరన్, పొమిల్ జైన్, విపిన్ జైన్, అపూర్వ వినయ్‌కాంత్ చావ్డాలను.. అనంతరం అజయ్‌కుమార్ సుగంధ్, ఆశిష్ అగర్వాల్, హరిమోహన్‌రాణాలను అరెస్ట్ చేశారు.
- కల్తీ నెయ్యి సరఫరా చేసిన ఏఆర్, వైష్ణవి, మాల్‌గంగ, భోలేబాబా డెయిరీలకు రూ.251 కోట్లు తితిదే సొమ్మును చెల్లించారు. ఈ వివరాలన్నీ అభియోగపత్రంలో పొందుపరిచినట్లు సమాచారం.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు గడువు పొడిగింపు

ఈనాడు, అమరావతి: అనుమతులు తీసుకోని లేఔట్లలో ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు ఎల్ఆర్ఎస్‌లో దరఖాస్తులు చేసుకోవడానికి ఇచ్చిన గడువును ప్రభుత్వం మరో మూడు నెలలు పొడిగించింది. మొదట నిర్ణయించిన ప్రకారం శుక్రవారంతో గడువు ముగిసింది. వివిధ పట్టణాభివృద్ధి సంస్థలు, ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులపై ఏప్రిల్ 23 వరకు గడువు పొడిగిస్తున్నట్లు పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఫీజు కింద ప్రాథమికంగా రూ.10 వేలు చెల్లించి ప్లాట్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు.

రాష్ట్రంలో ప్రపంచ ఆర్థిక వేదిక కేంద్రం

(మొదటి పేజీ తరువాయి)

భాగస్వామ్యంతో ప్రపంచ ఆర్థిక వేదిక ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయనుందని ఒక వార్తా సంస్థ పేర్కొంది. ప్రభుత్వాలు, పరిశ్రమలతో కలిసి ఆచరణాత్మక విధానాలు రూపొందించడం, పైలట్ ప్రాజెక్టులు, ఆయా ప్రాంతాల ప్రాధాన్యతలను గుర్తించడంలో ఈ కేంద్రం కీలకంగా వ్యవహరిస్తుంది. రాష్ట్రంలో ఏర్పాటు చేసే కేంద్రం ఏఐ, ఇంధన రంగంలో మార్పులు, సైబర్, భవిష్యత్తు సాంకేతికతలపై ప్రధానంగా దృష్టి సారిస్తుంది. నాలుగో పారిశ్రామిక విప్లవంలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాలను ఒకచోట చేర్చి.. అభివృద్ధి చెందుతున్న సాంకేతికతను అందించడంలో కేంద్రం దోహదం చేస్తుంది.

డబ్ల్యూహెచ్‌వో నుంచి వైదొలిగిన అమెరికా

(మొదటి పేజీ తరువాయి)

నిలిపివేస్తున్నామని.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న దాని అన్ని కార్యాలయాల నుంచి యూఎస్ సిబ్బందిని వెనక్కి పిలిపించినట్లు వెల్లడించింది. ఈ సంస్థకు సంబంధించిన సాంకేతిక కమిటీలు, వర్కింగ్ గ్రూపుల నుంచి కూడా తప్పుకొంటున్నట్లు తెలిపింది. ఇకనుంచి పరిమిత పరిధి మేరకు డబ్ల్యూహెచ్‌వోతో కలిసి పనిచేయనున్నట్లు యూఎస్ ఆరోగ్యశాఖ అధికారులు వెల్లడించారు. రెండోసారి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పలు సందర్భాల్లో ఆ సంస్థ నుంచి వైదొలుగుతామని హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా అగ్రరాజ్యం తన నిర్ణయాన్ని ప్రకటించడం గమనార్హం. అయితే డబ్ల్యూహెచ్‌వో నుంచి అగ్రరాజ్యం వైదొలిగే సమయానికి అమెరికా దానికి 260 మిలియన్ డాలర్ల (రూ.2,382 కోట్లు) బకాయిలను చెల్లించాల్సి ఉందని బ్లూమ్‌బెర్గ్ నివేదికలు వెల్లడించాయి.

వైదొలుగుతున్నట్లు వెల్లడిస్తే సరిపోదు'

ఈ విషయంపై డబ్ల్యూహెచ్‌వో అధికారులు మాట్లాడుతూ.. సంస్థ నుంచి వైదొలుగుతున్నట్లు అమెరికా వెల్లడించగానే సరిపోదని.. సంస్థకు బకాయిపడిన 260 మిలియన్ డాలర్లను చెల్లించేవరకు డబ్ల్యూహెచ్‌వో నుంచి యూఎస్ ఉపసంహరణ పూర్తి కాదన్నారు. అయితే ప్రపంచ ఆరోగ్య సంస్థకు చెల్లించాల్సిన బకాయిలపై అమెరికా అధికారిక వర్గాలు స్పందిస్తూ.. సంస్థ నుంచి వైదొలగడానికి ముందు బకాయిలను పూర్తిగా చెల్లించాలనే చట్టబద్ధమైన నియమమేమీ లేదన్నారు.

చేపలు, మాంసం దుకాణాలకు ఈ-వేలమా?

- ఏసీ రూముల్లో కూర్చొని అధికారులు నిర్ణయం తీసుకుంటున్నారు
- హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు.. వేలం నోటిఫికేషన్ నిలుపుదల


ఈనాడు, అమరావతి: చేపలు, మాంసం విక్రయించే దుకాణాల కేటాయింపునకు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఈ-వేలం విధానాన్ని అనుసరించడాన్ని హైకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. కంప్యూటర్ పరిజ్ఞానం లేని చిరువ్యాపారులు ఈ-వేలంలో ఎలా పాల్గొంటారని, దస్త్రాలను ఎలా అప్‌లోడ్ చేస్తారని ప్రశ్నించింది. క్షేత్రస్థాయిలో ఇబ్బందులను పరిగణనలోకి తీసుకోకుండా ఏసీ రూముల్లో కూర్చొని అధికారులు నిర్ణయాలు తీసుకుంటున్నారని ఘాటుగా వ్యాఖ్యానించింది. ఈ-వేలం టెండర్ గురించి తెలుగు పత్రికల్లో సైతం ఆంగ్లంలో ప్రకటన ఇవ్వడంపై విస్మయం వ్యక్తం చేసింది. చిరు వ్యాపారులతో ముడిపడి ఉన్న వ్యవహారంలో 'బహిరంగ వేలం' నిర్వహించడమే ఉత్తమమని వ్యాఖ్యానించింది. విజయవాడలోని మహంతి మార్కెట్‌లో మాంసం, చేపల దుకాణాల కేటాయింపు కోసం ఈ నెల 6న అధికారులు జారీ చేసిన నోటిఫికేషన్‌ను తదుపరి విచారణ వరకు నిలుపుదల (సస్పెండ్) చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని విజయవాడ కార్పొరేషన్ అధికారులను ఆదేశించింది. విచారణను మార్చి 3కి వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ శుక్రవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. మహంతి మార్కెట్‌లో దుకాణాల కేటాయింపునకు ఈ-వేలం నోటిఫికేషన్ ఇవ్వడాన్ని సవాలు చేస్తూ చేపల వ్యాపారి హరిమాణిక్యం శంకరరావు హైకోర్టులో పిటిషన్ వేశారు. అధికారుల తీరుతో తమకు వేలంలో పాల్గొనే అవకాశం లేకుండా పోయిందన్నారు.

అక్రమాల లేఔట్లు.. క్రమబద్ధీకరణకు నోట్లు

(మొదటి పేజీ తరువాయి)

గత ప్రభుత్వంలోనూ అదే ప్రాంతంలో పనిచేసినవారు కావడంతో మాజీ ఎమ్మెల్యేలు చక్రం తిప్పే ప్రయత్నం చేస్తున్నారు. గుంటూరు, కృష్ణా, నెల్లూరు, విశాఖపట్నం, కాకినాడ, కడప జిల్లాల్లో ఎక్కువగా ఇలాంటి దరఖాస్తులొచ్చాయి.

> కృష్ణా జిల్లాలో వైకాపా నేత ఒకరు ప్రభుత్వ భూమి ఆక్రమించి, మూడున్నరేళ్ల క్రితం లేఔట్ వేశారు. ఇందులో విక్రయించగా మిగిలిన 20% ప్లాట్ల క్రమబద్ధీకరణకు పలువురి పేర్లతో దరఖాస్తులు చేయించారు. పరిశీలించిన సిబ్బంది వాటిలో ప్రభుత్వ భూమి కలిసి ఉందని అధికారులకు నివేదించారు.



ఐదేళ్లలో 10 వేల అక్రమ లేఔట్లు

గత ప్రభుత్వంలో ఐదేళ్లలో 20 వేలకు పైగా లేఔట్లు వెలిశాయి. వీటిలో 50 శాతానికి పైగా అనుమతుల్లేవు. అప్పటి ఎమ్మెల్యేలు కొందరు, వారి అనుచరులు ప్రభుత్వ భూములు, చెరువులు, పంట కాలువలు, గెడ్డలు ఆక్రమించి లేఔట్లు వేసేశారు. అధికారులు ప్రేక్షకపాత్ర వహించడంతో నెల్లూరు, కృష్ణా, కాకినాడ, విశాఖపట్నం, ఎన్టీఆర్, కర్నూలు, వైఎస్ఆర్ కడప, గుంటూరు తదితర జిల్లాల్లో వీటిలో పెద్దఎత్తున ప్లాట్లు విక్రయించేసి, రిజిస్ట్రేషన్లు కూడా చేయించేశారు. ఎల్ఆర్ఎస్‌లో ప్లాట్లు క్రమబద్ధీకరించుకునేందుకు సహకరిస్తామని కొనుగోలుదారులకు భరోసా కూడా ఇచ్చారు. అక్రమ లేఔట్లలో ప్లాట్లు కొని 2025 జూన్ 30లోపు రిజిస్ట్రేషన్ చేసుకున్నవి ఎల్ఆర్ఎస్‌లో క్రమబద్ధీకరించుకునేందుకు కూటమి ప్రభుత్వం అవకాశం కల్పించడంతో ఇప్పుడు ఆ మాజీ ఎమ్మెల్యేలు, వైకాపా నేతలు రంగంలో దిగారు. ప్లాట్ల కొనుగోలుదారులతో దరఖాస్తులు చేయించారు.

పట్టణ ప్రణాళిక అధికారుల పక్కదారి

ప్రభుత్వ భూములు, స్థలాలు, చెరువులు, గెడ్డలు, యూఎల్‌సీ భూములు ఆక్రమించి వేసిన లేఔట్లలో ప్లాట్లను క్రమబద్ధీరించేందుకు వీల్లేదు. గుంటూరు, ప్రకాశం, కృష్ణా, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం, ఏలూరు, తిరుపతి, అనంతపురం, విజయనగరం జిల్లాల్లో పట్టణ ప్రణాళిక అధికారులు కొందరు మాజీ ఎమ్మెల్యేలు, వైకాపా నేతలతో కలిసి అడ్డగోలు పనులకు సిద్ధమైపోతున్నారు. ప్లాట్లలో ప్రభుత్వ భూమి కలిసి ఉందని ప్రాథమిక విచారణలో వెల్లడైనా అలాంటి దరఖాస్తులు తిరస్కరించకుండా అనుమతిస్తున్నారు. ఎల్ఆర్ఎస్‌లో వచ్చిన దరఖాస్తుల్లో ఇప్పటి వరకు దాదాపు 7 వేలు తిరస్కరించారు. ఆమోదించిన దరఖాస్తులపై ఉన్నతాధికారులు విచారణ చేయిస్తే జిల్లాల్లో కొందరు పట్టణ ప్రణాళిక అధికారుల బాగోతం వెలుగు చూడనుంది.

భవిష్యత్తులో మహిళల్ని కించపరిచేలా ఎలాంటి వ్యాఖ్యలూ చేయను

- మహిళా కమిషన్‌కు క్షమాపణ పత్రాన్ని అందించిన భూపతిరాజు

ఈనాడు, అమరావతి: డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం గోగన్న గ్రామంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల సందర్భంగా నృత్యం చేస్తున్న మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన భూపతిరాజు వెంకట సత్యనారాయణ శుక్రవారం మహిళా కమిషన్ ఎదుట హాజరై క్షమాపణ పత్రాన్ని అందించారు. తాను చేసిన వ్యాఖ్యలు తప్పేనని అంగీకరిస్తూ మహిళల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరించినందుకు క్షమాపణలు కోరుతున్నట్లు వెల్లడించారు. భవిష్యత్తులో మహిళల్ని కించపరిచేలా ఎలాంటి వ్యాఖ్యలూ చేయబోనని తెలిపారు. భూపతిరాజు అనుచిత వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేసిన మహిళా కమిషన్ ఈ నెల 18న ఆయనకు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఆయన కమిషన్ ఎదుట హాజరై వివరణ ఇచ్చారు. మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ మాట్లాడుతూ.. మహిళలపై చౌకబారు, అవమానకర వ్యాఖ్యలు చేసే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.

అన్నవరం నమూనాలయం వద్ద
ప్రసాదం బుట్టల్లో ఎలుకలు


- సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్.. సిబ్బందిపై భక్తుల ఆగ్రహం
- నివారణకు చర్యలు.. ఇద్దరు సిబ్బందిపై తాత్కాలికంగా వేటు

అన్నవరం, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా అన్నవరం జాతీయరహదారిపై సత్యదేవుని నమూనాలయం (కొండ దిగువన) వద్ద ప్రసాదం నిల్వ ఉంచే బుట్టల్లో ఎలుకలు తిరిగిన వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. ఇది తెలియగానే అధికారులు దిద్దుబాటు చర్యలు తీసుకున్నారు. ఇద్దరు సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. జాతీయ రహదారిపై నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే భక్తులు నమూనాలయం వద్ద ప్రసాదం కొనుక్కుంటారు. బుధవారం రాత్రి 10.30-11 గంటల మధ్య వచ్చిన కొందరు భక్తులు ప్రసాదం ప్యాకెట్లు నిల్వ ఉంచిన ప్లాస్టిక్ బుట్టల్లోంచి ఎలుకలు తిరగడం గమనించి.. సెల్‌ఫోన్లలో చిత్రీకరించారు. సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈవో త్రినాథరావు దృష్టికి ఈ విషయం వెళ్లడంతో ప్రసాదం నిల్వ ఉంచే క్యాబిన్ వద్ద పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎలుకలు లోపలికి ప్రవేశించకుండా క్యాబిన్‌కు మరమ్మతులు చేయించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బంది త్రిమూర్తులు, భద్రతా సిబ్బంది రాజులను తాత్కాలికంగా విధుల నుంచి తప్పించారు.



అన్నవరం హైవే నమూనాలయం వద్ద ప్రసాదం ప్యాకెట్ల బుట్టల్లోంచి వస్తున్న ఎలుకలు

ఇదీ సంగతి!



నేను చెప్పేది కూడా అదే.. సరిహద్దులేం వద్దని. గ్రీన్‌లాండ్ మాకు ఇమ్మని!!

గ్రహం అనుగ్రహం
24-1-2026 శనివారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం;
శిశిర రుతువు, మాఘ మాసం, శుక్ల పక్షం

షష్ఠి: రా.11-00 తదుపరి సప్తమి; ఉత్తరాభాద్ర: మ.1-19 తదుపరి రేవతి
వర్జ్యం: రా.12-47 నుంచి 2-19 వరకు; **అమృత ఘడియలు:** ఉ.8-39 నుంచి 10-12 వరకు; **దుర్ముహూర్తం:** ఉ.6-37 నుంచి 8-07 వరకు
రాహుకాలం: ఉ.9-00 నుంచి 10-30 వరకు
సూర్యోదయం: ఉ.6.38; **సూర్యాస్తమయం:** సా.5.47

చలి-పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ	ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
రాజమహేంద్రవరం	16.5	33.0	హైదరాబాద్	18.6	28.6
విజయనగరం	17.0	29.0	శ్రీకాకుళం	19.0	29.0
కర్నూలు	17.2	31.5	గుంటూరు	19.0	31.0
తిరుపతి	17.4	29.7	విశాఖపట్నం	19.4	28.4
కడప	18.0	30.0	విజయవాడ	19.4	29.4
అనంతపురం	18.2	32.0	నరసాపురం	19.8	30.0
			తాడేపల్లిగూడెం	20.0	31.0
			ఒంగోలు	20.1	30.9
			నెల్లూరు	20.7	29.3




ఈనాడు

రహదారి భద్రత... అందరి బాధ్యత!

వాహనాలు నడిపేవారు ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా వారితో పాటు ఎదుటి వ్యక్తులకూ ప్రాణాపాయం తప్పదు. ఈ విషయం తెలిసీ ఎంతోమంది పూటుగా మద్యం సేవించి స్టీరింగ్ పట్టుకుంటున్నారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించకుండా, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ రోడ్లపై రయ్యిన దూసుకుపోతున్నారు. పౌరస్పృహకు అర్థం తెలియని ఇలాంటి వారి మూలాంగా దేశీయ రహదారులపై నిత్యం నెత్తుటేళ్లు పారుతున్నాయి. ఎన్నో కుటుంబాలు అనాథలుగా మిగులుతున్నాయి. సర్కారీ లెక్కల ప్రకారం 2023లో దేశవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలు దాదాపు 1.74 లక్షల మందిని బలిగొన్నాయి. ఈ దుర్ఘటనల్లో మూడొంతులకు పైగా మరణాలకు అతి వేగం, అలక్ష్య డ్రైవింగ్‌లే కారణం. రహదారులపై ఈ రక్తపాతాన్ని తగ్గించేందుకు కేంద్ర రోడ్డు రవాణా శాఖ మోటర్ వాహనాల నిబంధనల్లో తాజాగా మార్పులు చేసింది. ఇకపై ఏడాదిలో ఐదుసార్లు ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించిన వారి లైసెన్సులను రద్దుచేసే అధికారాన్ని సంబంధిత విభాగాలకు కల్పించింది. బాధ్యత లేకుండా బండ్లు తోలేవారిని నియంత్రించడానికి ఇది అవసరమే. దీంతోపాటు రహదారి భద్రతను బలహీనం చేస్తున్న ఇతర లోపాలనూ సరిదిద్దాలి!

పీకల్దాకా తప్పతాగి ఓ యువకుడు బైక్ నడిపిన పాపానికి ఇటీవల కర్నూలు శివారులో ఓ బస్సు మంటల్లో చిక్కి 19 మంది సజీవ దహనమయ్యారు. సర్కారీ సమాచారం ప్రకారం, మద్యం మత్తులో రోడ్డెక్కుతున్న వారి వల్ల ఏపీలో ఏటా 110కి పైగా ప్రమాదాలు నమోదవుతున్నాయి. వెలుగులోకి రానివి అంతకు ఎన్నో రెట్లు ఎక్కువగా ఉంటాయి. హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ వంటి చోట్ల డ్రంకెన్ డ్రైవ్ కేసులు ఏటేటా పెరుగుతున్నాయి. తెలంగాణలో గంటకు సగటున 1,300 ట్రాఫిక్ ఉల్లంఘనలు చోటుచేసుకుంటున్నాయి. ఇవన్నీ ప్రయాణికులకు ప్రాణాంతకమవుతున్నాయి. ట్రాఫిక్ రూల్స్‌ను అతిక్రమించడం పెద్ద తప్పు ఏమీ కాదని 40శాతం భారతీయులు భావిస్తున్నారని ఓ పరిశీలనలో తేలింది. అసలు 95శాతం వాహన చోదకులకు రహదారి నియమాలు పూర్తిగా తెలియవు. అయినప్పటికీ దిల్లీ, ముంబయిలలో డ్రైవింగ్ లైసెన్స్ టెస్టుల్లో 90శాతం దాకా ఉత్తీర్ణులవుతుంటే, హైదరాబాద్‌లో 98శాతం మేర గట్టెక్కుతున్నారు. నిరుడు భాగ్యనగరంలో పదివేలకు పైగా లైసెన్సులను తాత్కాలికంగా నిలిపేయడం, వాటి జారీలో జరుగుతున్న అక్రమాలను కళ్లకుకట్టింది. విదేశాల్లో మాదిరిగా డ్రైవింగ్ లైసెన్సుల జారీలో కఠినంగా ఉంటేనే నడిరోడ్లపై నరమేధం తగ్గుతుంది.

రోడ్ల విస్తరణ, సమగ్ర వేగ నియంత్రణ, చట్టాల పటిష్ఠ అమలు ద్వారా జర్మనీ, జపాన్, రష్యా, నార్వే వంటి దేశాలు రహదారి దుర్ఘటనలను చాలావరకు నివారిస్తున్నాయి. ఆస్ట్రేలియా, ఈయూ దేశాలు నిర్దేశిత కాల వ్యవధిలో డ్రైవర్ల ఆరోగ్య స్థితిగతులను పర్యవేక్షిస్తూ ప్రమాదాలకు ఆస్కారం లేకుండా చూస్తున్నాయి. ఇండియాలోనేమో అందుకు భిన్న పరిస్థితులు నెలకొన్నాయి. వాహనాలను ఇష్టారీతిగా పరుగులు తీయించేవారిని అరకొర జరిమానాలూ శిక్షలు కట్టడి చేయలేక పోతున్నాయి. రోడ్ల డిజైన్లు, నిర్మాణంలో లోపాలు సైతం ప్రాణాలను గాల్లో దీపాలుగా మార్చుతున్నాయి. రహదారులపై మృత్యుదేవత స్వైరవిహారాన్ని ఆపాలంటే- రోడ్లు, బ్లాక్‌స్పాట్ల బాగుసేతకు యంత్రాంగం ప్రాధాన్యమివ్వాలి. రహదారి నిబంధనలను తరచూ తుంగలో తొక్కేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. డ్రైవర్లకు నిర్ణీత పనిగంటలు అమలు చేయాలి. పద్ధతిగా బండ్లు నడపడం మనతో పాటు ఇతరులకూ క్షేమదాయకమని అందరూ అర్థం చేసుకోవాలి. ఆ మేరకు ప్రభుత్వాలే పూనుకుని ప్రజావగాహనను పెంచే స్ఫూర్తిదాయక ప్రచారాన్ని ఇంటింటికీ చేర్చాలి!



ఏ వ్యక్తి అయినా తనకు అత్యంత ఇష్టమైన పనిలోనే ఉత్తమ ఫలితాలు సాధించగలడు. అందులో అయితేనే సాధించగలనన్న నమ్మకం, కష్టపడటానికి ఆసక్తి ఉంటాయి. ఎవరి స్వభావానికి తగిన కెరీర్‌ని వారు ఎంచుకుంటే అద్భుతంగా రాణిస్తారు.

– హోమీ జె భాభా

నేనే భయం-భయమే 'నేను'

భవిష్యత్తులో ఏమవుతుందో అన్న అనిశ్చితి నుంచి మరణభయం వరకూ- మనిషికి అనేక భయాలుంటాయి. ప్రతి సమస్యకీ సులభమైన పరిష్కారం, దగ్గర దారి వెతకడం మనసు సహజ లక్షణం. అందుకే భయాన్ని అవగాహన చేసుకోవడానికి బదులు 'నమ్మకం' అనే షార్ట్‌కట్‌ను ఆశ్రయిస్తుంది. చుట్టూ సమాజంలో కూడా దాదాపు అందరూ అదే దారిలో నడుస్తుంటారు. అలా నమ్మకం చాలా సహజమైన విషయంగా, అలవాటుగా మారిపోతుంది.

మనిషి లోపలి భయాలూ కోరికల బయటి రూపమే నమ్మకం. అది ఇచ్చే భరోసాతోనో, ఆచారాలూ ప్రార్థనలతోనో, నిర్ణయాలు వాయిదా వేసో, వినోద కాలక్షేపాలతోనో మన భయాలను దారి మళ్లించాలని చూస్తాంటాం. నమ్మకం ఉన్నప్పటికీ ఆశించినట్లుగా అన్నీ జరగవు. అనిశ్చితి వెంటాడుతూనే ఉంటుంది. ఏదీ మన చేతుల్లో లేదన్న అశక్తత ఒకవైపు, నమ్మకం లాంటిదేదో ఊతంగా ఉంటే బాగుంటుందన్న ఆశ మరోవైపు - ఇలా జీవితం పరాధీనంగా, సంఘర్షణామయంగా అయిపోతుంది.



భయం నుంచి పారిపోవడమో, దానితో పోరాడటమో భయానికి పరిష్కారం కాదంటారు జిడ్డు కృష్ణమూర్తి లాంటి తాత్వికులు. భయం వెనక కారణాలను మేధోపరంగా విశ్లేషించి తెల్చుకోవడం ఒక స్థాయి. ధ్యానం లాంటి పద్ధతులతో మానసిక ఆందోళనలను ఒకింత నియంత్రించవచ్చు. అయితే ఈ ఉపశమనాలు తాత్కాలికమైనవి. మరోవైపు, ధైర్యం అనే సుగుణం అలవరచుకుంటేనో, నేను ధైర్యశాలినని పదే పదే మనసుకు చెప్పుకొంటేనో భయం పోదు. మరేం చేయాలి?

అంతర్యామి

భవిష్యత్తులో ఏం జరగనుందో అని వర్తమానంలో కలత చెందడమే 'భయం'. అంటే ప్రస్తుత క్షణంలో ఉండకపోవడం వల్ల కలిగే అనేక అనర్థాల్లో భయం కూడా ఒకటన్నమాట. గత జ్ఞాపకాన్ని, అభద్రతనూ భవిష్యత్తులోకి చొప్పించే ఆలోచనే 'మానసిక' కాలాన్నీ, భయాన్నీ సృష్టిస్తుంది. భయం పుడుతున్నప్పుడే దాని తీరును ఎరుకతో గమనించాలి. ఏ పేరూ పెట్టకుండా, ఏ నిరోధం, అణచివేతా లేకుండా దానికి ముఖాముఖీ నిలబడాలి. అలాంటి జాగరూక పరిశీలనలో ఆ మానసిక కదలిక తన స్వరూపాన్ని ప్రకటిస్తుంది. అదే ఎరుకలో భయానికి మూలమైన ఆలోచన తన శక్తినీ, పట్టునూ కోల్పోతుంది. ఇది ఏ పద్ధతీ, సాధన ద్వారా కాదు; తర్కం, విశ్లేషణ ద్వారా కాదు; వర్తమాన క్షణంపై ఎరుక వల్ల వచ్చే సహజ పరిణామం.

'నేను' వేరు, 'ఇతరం' వేరు అన్న 'ద్వైత' భావనే భయానికి మూలం అంటుంది బృహదారణ్యక ఉపనిషత్తు. బాహ్యప్రపంచం దృష్ట్యానే కాకుండా ఈ విభజన అంతర్గతంగానూ పనిచేస్తుంది. భయపడే 'నేను', భయం వేరు వేరని మన భావన. నిజానికి రెండూ ఒకటే. భయపడేవాడే భయం! నిరంతర భద్రత, స్వీయ కొనసాగింపు కోసం పాకులాడే 'నేను' అన్న ఆలోచనలో భాగమే భయం కూడా. ఆ విభజనే లేదని, అది మనసు కల్పించే భ్రాంతి అన్న అవగాహనతోనే సంఘర్షణకు తెర పడుతుంది. భయం అంతమవుతుంది.

– ఈదర రవికిరణ్

మనసు... తెలుసుకుంటున్నారా?

అనుమానంతో భార్య హత్య
పిల్లల్ని చంపి ఉరేసుకున్న తల్లి
అయిదో కాన్పులో కొడుకు: అమ్మానాన్నల హర్షం
పరీక్షల ఒత్తిడితో విద్యార్థిని ఆత్మహత్య...

ఇలాంటివన్నీ చదివి పేజీ తిప్పేసే వార్తలుగానే మనం చూస్తున్నట్లయితే రేపటి సమాజానికి తీరని ద్రోహం చేస్తున్నట్లే. ఎందుకంటే అవి శిక్షార్హమైన నేరాలు మాత్రమే కావు, పిల్లల కళ్లెదురుగా జరుగుతున్న హారర్ వాస్తవాలు. ఎందుకంటే అనుభవంలోకి వచ్చేవీ, వారి రేపటి జీవితాన్ని ప్రభావితం చేసేవీ. వాటిని పెద్దలు తీసుకున్నంత తేలికగా పిల్లలు తీసుకోలేరు. ముఖ్యంగా కౌమారంలో ఉన్న బాలికలకు తమ చుట్టూ జరిగే సున్నితమైన పరిస్థితి. అసలే హార్మోన్ల మార్పులతో లోనయ్యే వయసు... ఆపై చదువుల ఒత్తిడి. అవి చాలవన్నట్లు కుటుంబాలు, సమాజంలోని సకల అవలక్షణాల ప్రభావమూ వారి మీద పడుతోంది. జరుగుతున్న సంఘటనల తాలూకు అంతరార్థాలు, ఆ పరిస్థితుల వెనక ఉన్న కారణాలూ తెలియని వయసులో ఉన్న ఆ చిన్ని మనసుల్ని అయోమయంలో పడేస్తున్నాయి. వారి ఆలోచనలు స్వేచ్ఛాయుత వాతావరణంలో చర్చలుగా మారి సమాధానాలు దొరికితే, చక్కటి మార్గదర్శకత్వం అందితే పర్వాలేదు. క్రమంగా మానసిక పరిణతి వస్తుంది. కానీ అలాంటి వాతావరణం లేకపోతే అవే తీరని సమస్యలుగా గుండెల్లో గూడు కట్టుకుని మానసిక రోగాలై జీవితకాలం వేధిస్తాయంటున్నారు నిపుణులు. పెద్దల్లో పెరుగుతున్న మానసిక వ్యాధులపై జరిగిన అధ్యయనాలు ఆ సమస్యల్లో చాలా వాటికి మూలం వారి బాల్యంలోనే ఉందని రుజువుచేశాయి. పెరిగిన వాతావరణం, అనుభవాలు, చైల్డ్‌హుడ్ ట్రామా లాంటివన్నీ మనసులో పేరుకుపోయి వివిధ రకాల మానసిక ఆరోగ్య సమస్యలుగా బయటపడతాయని చెబుతున్నాయి.

బాలికల చదువు, నైపుణ్యాల పెంపు, సాధికారత లాంటి అంశాలకు సంబంధించి మాట్లాడటం, రకరకాల పథకాలను ప్రవేశపెట్టడం జరుగుతోంది. కానీ ఎంతో ముఖ్యమైన వారి మానసికారోగ్యం మాత్రం ఈ ప్రాధాన్యాల్లోకే రావడం లేదన్నది చేదు వాస్తవం. నేడు జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా...



ప్రత్యక్ష, పరోక్ష ప్రభావాలు

దేశంలో కౌమార(10-19 ఏళ్ల మధ్య వయసు) బాలికల్లో 58.9శాతం మంది యాంగ్జయిటీ, డిప్రెషన్ లాంటి సమస్యలతో బాధపడుతున్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. 'అడాలసెంట్ గర్ల్స్ మెంటల్ హెల్త్ ఇన్ ఇండియా: ప్రివలెన్స్ అండ్ డిస్ట్రెస్' అనే అధ్యయనం ప్రకారం 49 నుంచి 60శాతం వరకూ కౌమార బాలికలు కుంగుబాటు, యాంగ్జయిటీ లక్షణాలతో సతమతమవుతున్నారు. మగపిల్లలతో పోలిస్తే ఆడపిల్లల్లో ఒత్తిడి తాలూకు మానసిక రుగ్మతలు ఎక్కువగా ఉంటున్నట్లు మరొక జాతీయ సర్వే వెల్లడించింది. వీటికి సరైన సమయంలో చికిత్స అందించకపోతే స్వీయహాని, ఆత్మహత్యలకు దారితీయవచ్చు. కౌమార వయస్కుల మరణాల్లో మూడొంతులు ఆత్మహత్యలేనన్నది గమనార్హం.

ఏదో చదువుల తాలూకు టెన్షన్ తప్ప పిల్లలకేం సమస్యలుంటాయి... అనుకునే తల్లిదండ్రులు వారి మనసుల్లో ఏముందో తెలుసుకోలేకపోతున్నారు. అందుకే బాధితుల్లో వృత్తినిపుణుల సహాయ సహకారాలు అందుకుంటున్నది అతి కొద్దిమంది మాత్రమే. అసలింతకీ అమ్మాయిల్ని ఇంత ఒత్తిడికి గురిచేస్తున్న సమస్యలేంటీ అంటే- 87శాతం చదువు, 46 శాతం కుటుంబ ఆర్థిక సమస్యలు, 51 శాతం కుటుంబ గొడవలు అని లెక్కలు చెబుతున్నాయి. వీటిని విడమరిచి చెప్పే- చదువు అంటే కేవలం మార్కులు తెచ్చుకోవడమే కాదు, అందులో ఉండే పోటీ, రకరకాల వివక్షలు, బడికీ కాలేజీకీ వెళ్లొచ్చే క్రమంలో ఎదుర్కొనే వేధింపులు లాంటివన్నీ ఉంటాయి. ప్రత్యక్షంగా వాళ్ల అనుభవంలోకి వచ్చేవే సమస్యలు అనుకోకూడదు. స్కూల్లో ఎవరో విద్యార్థిని బాల్యవివాహంతో చదువు మానేసినా, ఎక్కడో లైంగిక వేధింపుల కేసు వెలుగులోకి వచ్చినా కొన్నాళ్లపాటు పిల్లల్లో అది చర్చనీయాంశమవుతుంది. వాళ్లలో వాళ్లు మాట్లాడుకుంటారు తప్పితే దాని గురించి పెద్దవాళ్ల ముందు ప్రస్తావించరు. అది తమకే జరిగితే ఎలా అని కొందరు భయపడటమూ కద్దు. వీటన్నిటికీ తోడు కుటుంబం పిల్లలతో పెట్టుకుంటున్న ఆశలు, పేదరికం, అమ్మానాన్నల మధ్య గొడవలు, వ్యసనాలు, గృహహింస, లైంగిక వేధింపులు... వీటన్నిటికీ ప్రత్యక్ష బాధితులు వాళ్లే. ఇవన్నీ పిల్లల చదువుమీద ప్రభావం చూపుతాయి. ఉత్సాహం మీద నీళ్లు చల్లుతాయి. మందకొడిగా ఉండటం, దేని మీదా ఆసక్తి చూపకపోవడం, ఒంటరితనాన్ని ఇష్టపడటం, తరచూ అనారోగ్యానికి గురికావడం, ఉన్నట్లుండి చదువులో వెనకబడటం లాంటి లక్షణాలు బయటపడతాయి. దీర్ఘకాలం ఈ పరిస్థితి కొనసాగితే అదే కుంగుబాటుకు దారితీస్తుంది.

అప్రమత్తత అవసరం

పాతికేళ్లొచ్చినా కన్నబిడ్డల్ని 'పిల్లలు'గానే పరిగణించే సమాజం మనది. కానీ నిజానికి బాల్యం, కౌమారం, యవ్వనం... ప్రతి దశా ఎదుగుదలకు సంబంధించి ఒక్కో కీలకమైన ఘట్టం. ఏ వయసులో ఏది అవసరమో అదే ఇవ్వాలి. పసిపిల్లలకు కడుపునిండా పాలు, వెచ్చని అమ్మఒడి చాలు. తప్పటడుగులు వేసే చిన్నారిని చేయి పట్టుకుని నడిపించాలి, చూస్తానన్నవన్నీ చూపించాలి, మంచీ చెడూ విడమరిచి చెబుతూ ఉండాలి. బడికెళ్లే పిల్లలకు చిన్న చిన్నగా బాధ్యతలను అలవాటు చేయాలి, నైపుణ్యాలు నేర్పాలి. వ్యక్తిత్వం రూపుదిద్దుకునే కౌమారం చాలా కీలకమైన దశ. నూరేళ్ల వ్యక్తిగత, సామాజిక జీవితానికి పునాది పడేది అప్పుడే. ఇంట్లోనూ బయటా వారిని ప్రభావితం చేసే అంశాలూ ఎక్కువే. ఆ వయసులో మార్గదర్శకత్వంతో కూడిన స్వేచ్ఛనివ్వడం తప్పనిసరి. తల్లిదండ్రులు స్నేహితులుగా మారి అన్ని విషయాలూ చర్చించాలి. వాళ్లు ఏం చేస్తున్నారు, ఏం చూస్తున్నారు, ఏం ఆలోచిస్తున్నారు... అన్నీ గమనిస్తూ ఉండాలి. వారికి కావాల్సినవన్నీ అమరుస్తున్నాం అనుకుంటే సరిపోదు. తాము పిల్లల మీద పెట్టుకున్న ఆశల గురించి చెప్పడం కాదు, తమనుంచి పిల్లలు ఏం ఆశిస్తున్నారో తెలుసుకునే ప్రయత్నం చేయాలి. ప్రస్తుతం సామాజిక మాధ్యమాలు టీనేజీ పిల్లల పాలిట పెద్ద విపత్తుగా పరిణమించాయి. పలు విషయాల్లో ఇతరులతో పోల్చుకోవడం ఎక్కువవుతోంది. ఆన్‌లైన్ స్నేహాలూ ప్రేమలను నమ్మి మోసపోతున్న సంఘటనలు, సైబర్ బుల్లీయింగ్ బాధితులవుతున్న కేసులు పెరుగుతున్నాయి. వీటన్నిటినుంచి అమ్మాయిల్ని రక్షించుకోవాలంటే తల్లిదండ్రులూ ఉపాధ్యాయులూ అప్రమత్తంగా ఉండాలి. 'ఆమె చిన్నదే కావచ్చు కానీ, అపారమైన శక్తి ఆమెలో నిక్షిప్తమై ఉంది' అన్నారు షేక్స్పియర్. ఆ శక్తి కుటుంబానికీ సమాజానికీ ఉపయోగపడేలా మలచుకోవాల్సిన బాధ్యత పెద్దలదే!

– డి.పద్మశ్రీ

అలవాటైపోయింది, ఏదో అలవాటు ప్రకారం చేసేశాను, సారీ... అలవాటులో పొరపాటు, ఆ అలవాటును మానలేకపోతున్నాను... ఇలాంటి మాటలు తరచూ వింటూనే ఉంటాం. మంచి అలవాట్లు చేసుకోవడం కన్నా చెడ్డవి, అవసరం లేనివాటిని వదిలించుకోవడం చాలా కష్టం. అందుకే ఈ మాటలు అంతగా వినిపిస్తుంటాయి.

నిజంగా ఒకసారి అయిన అలవాటును మానలేమా? మానాలనుకుంటే మానవచ్చు. కానీ అనుకోవడం దగ్గరే అసలు కథంతా ఉంటుంది. 'ఈ పాడు అలవాటు ఇక మానేస్తాను. నీ మీదొట్టు' అంటూ చాలా తేలిగ్గా చెప్పేస్తారు కానీ మాటిచ్చినంత సులువుగా ఆచరణలో పెట్టలేరు. కొంత మంది ఆ సమయానికి తప్పించుకోడానికి పెదాల చివర

అలవాట్లను ఓడిద్దాం!



నుంచి మానేస్తానంటారు కానీ చాలా మంది నిజాయతీగానే మానాలనుకుంటారు. కాకపోతే మాటకీ చేతకీ మధ్యనున్న దూరాన్ని అధిగమించడం ఎలాగో తెలియదు. దాంతో ఏదో ఒక బలహీన క్షణంలో వెనకడుగు వేసేస్తారు. అలా కాకుండా మానాలన్న సంకల్పాన్ని కాస్త గట్టిగా చెప్పుకోవాలి. దాన్ని నిజం చేయడానికి మధ్యలో ఉన్న అవాంతరాలను గుర్తించాలి. ఒక్కోదాన్నీ అధిగమిస్తూ రావాలి.

అలవాటు పడిన దేన్నీ మానలేకపోవడానికి కారణం- దానిపై మనం పెంచుకున్న 'ఇష్టమే' (క్రేవింగ్, ఎటాచ్‌మెంట్). అదే అలవాటును వ్యసనంగా మారుస్తుంది. మెదడులో బలమైన 'రివార్డ్' సర్క్యూట్‌ను సృష్టిస్తుంది. దాంతో, కొద్దిరోజుల విరామం తరవాత కూడా, చిన్నపాటి ప్రేరణ దొరికినా, మనసు తిరిగి దాన్ని కోరుకుంటుంది.

- **దృష్టి మరల్చాలి:** ఏ వ్యసనాలకు, అలవాట్లకు దూరంగా ఉండాలనుకుంటున్నారో, వాటి వైపు చూడకూడదు, ఆలోచించకూడదు. వాటిని ప్రేరేపించే వ్యక్తులకు, ప్రదేశాలకు దూరంగా ఉండాలి. ఇది మొదటి మెట్టు.
- **పనిలో నిమగ్నం:** క్షణం తీరిక లేకుండా మరో మంచి అలవాటు చేసుకోవాలి. వ్యాయామం చేయడం, ఇష్టమైన కళ నేర్చుకోవడం, ఏ సంస్థతోనైనా కలిసి స్వచ్ఛంద సేవ చేయడం... ఇలా కాస్త సీరియస్ పనులు ఇతరులతో కలిసి చేసేవి ఎంచుకుంటే తప్పించుకోవడానికి సాకులు చెప్పడం కుదరదు. కాబట్టి తిరిగి పాత అలవాటు వైపు మళ్లే అవకాశాలు తగ్గిపోతాయి.
- **పట్టుదల:** పట్టుకుంటే వదలకుండా ఉండేదే పట్టుదల. దాన్ని సడలనీయకుండా ఉండాలంటే- పాత అలవాటు వల్ల కలిగిన నష్టాలను గుర్తుచేసుకోవాలి. దాన్ని వదిలేయడం వల్ల వచ్చే లాభాలను ఊహించుకోవాలి. మిగిలిన సమయం, మెరుగైన ఆరోగ్యం, కుటుంబసభ్యుల సంతోషం, కొత్త స్నేహితులు... ఇలా లాభనష్టాలను బేరీజు వేసుకుంటే పట్టుదల మరింత గట్టిగా నిలుస్తుంది.
- **నిజాన్ని అంగీకరించడం:** కొంతకాలం విజయవంతంగా అలవాటుకు దూరంగా ఉన్న తరవాత, వచ్చిన మార్పును గుర్తించాలి. చాలామంది ఆ అలవాటు వల్ల తాము ఏమీ కోల్పోలేదు అన్న భ్రమలో ఉంటారు. దాంతో మార్పును గుర్తించడానికి ఇష్టపడరు. ఇది మొదటికే మోసం తెస్తుంది. కాబట్టి వాస్తవాలను అంగీకరించి, మార్పును ఆస్వాదించాలి.

మనిషి తలచుకుంటే సాధ్యం కానిది ఏదీ లేదు, అలాంటిది పనికిరాని అలవాటును వదిలించుకోవడం ఒక లెక్కా!

– కొండేటి ప్రకాష్

ఆర్థిక స్వేచ్ఛ ఎంత?

జీవితంలో ఎదగడానికి అన్ని అవకాశాలు లభించే చోటే జనజీవన ప్రమాణాలు మెరుగుపడతాయి. అలాంటి అవకాశాలు అందరికీ సమానంగా అందుబాటులోకి రావాలంటే ఆయా సమాజాల్లో ఆర్థిక స్వేచ్ఛ ఉండాలి. ప్రభుత్వాల పనితీరు, వ్యయం, చట్టాల అమలు, ధరలు, వేతనాలు వంటివి ప్రజల ఆర్థిక స్వేచ్ఛను ప్రభావితం చేస్తాయి. ఆయా ప్రమాణాల ఆధారంగా 184 దేశాల్లో వందకు 53 స్కోరుతో ఇండియా 128వ స్థానంలో నిలిచింది. నిరుటి ఆర్థిక స్వేచ్ఛా సూచీలో ముందున్న దేశాలు, వాటి స్కోర్లు...

సింగపూర్	84.1
స్విట్జర్లాండ్	83.7
ఐర్లాండ్	83.1
తైవాన్	79.7
లక్సెంబర్గ్	79.5
ఆస్ట్రేలియా	79.3
డెన్మార్క్	79.1
ఎస్తోనియా	78.9
నార్వే	78.3
నెదర్లాండ్స్	78.2
న్యూజిలాండ్	78.1

(ఆధారం: ఇండెక్స్ ఆఫ్ ఎకనామిక్ ఫ్రీడమ్-2025)

విద్యాసంస్థలను వీడని బంధనాలు

నేటి జెన్‌జీ తరానికి అవసరమైన స్థాయిలో సేవలు అందించాలంటే, విద్యాసంస్థలు మరెంతో క్రియాశీలకంగా పని చేయాలి. ప్రస్తుత యువత ఆధునిక సాంకేతిక విద్యను అభ్యసించక తప్పని పరిస్థితుల్లో, మెరుగైన కెరీర్ కోసం నైపుణ్యాలను అందిపుచ్చుకుంటూ, విభిన్న రంగాల్లోకి అడుగుపెట్టడానికి ఉత్సాహం చూపుతోంది. వారికి అవసరమైన రీతిలో నైపుణ్యాలను అందించడంలో ప్రభుత్వ రంగంలోని విశ్వవిద్యాలయాలు వెనకంజవేస్తున్నాయనే విమర్శలున్నాయి. ఈ క్రమంలో విశ్వవిద్యాలయాలకు స్వయంప్రతిపత్తి అనేది కేవలం పరిపాలనపరంగా మాత్రమే కాకుండా బోధనా శాస్త్రాలు, విద్యార్థుల నైపుణ్యాలను అంచనా వేసే విధానాలు, పాఠ్యప్రణాళికలను పూర్తిచేయడం వంటి అంశాల్లోనూ అవసరం. అదేవిధంగా అధ్యాపకుల ఎంపిక, సంస్థ నిర్మాణం, అంతర్గత పరిపాలన కూడా ఎంతో ముఖ్యం. మరో అతి ముఖ్యమైన అంశం ఆర్థిక స్వయంప్రతిపత్తి. ఫీజులను తామే నిర్ణయించుకోవడం, వనరులను సమకూర్చుకోవడం, వాటిని తామే వినియోగించుకోవడం, ఇతర విద్యా సంస్థలతో అనుసంధానం కావడానికి ఇది ఉపకరిస్తుంది. పరిపాలనాపరమైన అనుమతులు పొందడానికి, పరిశోధన అంశాలను నిర్ణయించడానికి, తమ విశ్వవిద్యాలయానికి చెందిన మేధోసంపత్తి హక్కులపై నిర్ణయాలు తీసుకోవడానికి కూడా స్వయంప్రతిపత్తి ఎంతో అవసరం.

పాత పద్ధతుల్లోంచి బయటికి రావాలి

పలు రంగాల్లో వేగంగా మారుతున్న సాంకేతికతలకు అనుగుణంగా విశ్వవిద్యాలయాలు సిలబస్‌ను ఎప్పటికప్పుడు మార్చుకోవాలి. తదనుగుణంగా అధ్యాపకులకు శిక్షణ అందిస్తూ, వివిధ విద్యావిభాగాలను సమ్మిళితం చేసే కార్యక్రమాలు అమలు చేయాలి. జెన్‌జీ తరం విద్యార్థులు కోరుకుంటున్న నైపుణ్యాలను అందిస్తూ, వారిని స్టార్టప్ దిశగా ప్రోత్సహిస్తూ, లైవ్ ప్రాజెక్టులు వంటివి అందించాలి. పరిశ్రమలతో కలిసి నైపుణ్య ప్రాధాన్య డిగ్రీలను అందుబాటులోకి తీసుకురావాలి. ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో ప్రస్తుతం కొనసాగుతున్న అన్నింటికీ ఒకే సూత్రం లాంటి పాత



దేశంలోని ఉన్నత విద్యాలయాలకు స్వయంప్రతిపత్తి కల్పించాలని, తద్వారా ఆయా సంస్థలు నూతన ఆవిష్కరణలు చేయడంలో రాణించగలవని జాతీయ విద్యా విధానం ఉద్ఘాటిస్తోంది. అయినప్పటికీ అనేక విశ్వవిద్యాలయాలు కేంద్రీకృత పరిపాలనా విధానాన్నే అనుసరిస్తున్నాయి. ఫలితంగా నిర్దేశిత లక్ష్యాన్ని అందుకోలేకపోతున్నాయి.

పద్ధతులు మారితేనే ఇదంతా సాధ్యమవుతుంది. హార్వర్డ్, కేంబ్రిడ్జ్, ఎంఐటీ, ఆక్స్‌ఫర్డ్, నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్ వంటి విశ్వవిద్యాలయాలు అత్యున్నత స్వయంప్రతిపత్తితో పనిచేస్తుంటాయి. స్వయంప్రతిపత్తి లేకపోతే, అంతర్జాతీయ స్థాయి అధ్యాపకులు, విద్యార్థులను ఆకర్షించడం, పరిశోధనలకు అవసరమైన నిధులను పొందడంలో భారతదేశ విశ్వవిద్యాలయాలు వెనకంజవేసే అవకాశం ఉంది. స్వయంప్రతిపత్తి ఉంటే, విదేశీ విద్యాసంస్థలతో కలిసి కార్యక్రమాలు చేపట్టడం, పరిశోధన కేంద్రాలను ఏర్పాటుచేయడం, సామాజిక అవసరాలకు తగ్గట్లుగా ప్రాజెక్టులను రూపొందించుకోవడం సాధ్యమవుతుంది.

ఒక విశ్వవిద్యాలయం నుంచి వచ్చే పట్టభద్రుడికి దక్కే ఉద్యోగావకాశాలు, పరిశోధక అవకాశాలు, వారి ద్వారా సమాజంపై పడే ప్రభావం వంటి అంశాలు మాత్రమే యూనివర్సిటీ స్థాయిని నిర్ణయించాలి. ఇదంతా వర్సిటీలకు స్వయంప్రతిపత్తి కల్పించి, బాధ్యతలను పెంచడం ద్వారానే సాధ్యం. సింగపూర్‌లోని విశ్వవిద్యాలయాలు స్వయంప్రతిపత్తి కలిగి ఉన్నా ప్రభుత్వానికి జవాబుదారీగా ఉంటాయి. జర్మనీలో విశ్వవిద్యాలయాలు అందించే పరిశోధనా ఫలితాలే వాటికి దక్కే నిధులను నిర్దేశిస్తాయి. అంతేగానీ, పరిపాలనా విధానాలు కాదు. బ్రిటన్‌లోని స్వతంత్ర నిపుణుల నాణ్యతా సంస్థ విశ్వవిద్యాలయాలు పాటించాల్సిన ప్రమాణాలను నిర్దేశిస్తుంది తప్ప, వాటి అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకోదు. విశ్వవిద్యాలయాలపై సర్కారీ యంత్రాంగం నియంత్రణ- ఆ విద్యాసంస్థల అంతర్గత నిర్ణయాలు ఆలస్యమయ్యేలా చేస్తోంది. స్వయంప్రతిపత్తి కాగితాలకే పరిమితం కావటం వల్ల, ఏఐ తదితర అధునాతన కోర్సులను వర్సిటీలు అందిపుచ్చుకోవడం ఆలస్యమవుతోంది. దీనివల్ల భారతీయ విద్యార్థులకు అధునాతన విద్య అందడంలేదు. ఫలితంగా సరైన ఉద్యోగాలు పొందలేకపోతున్నారు.

ప్రపంచస్థాయిలో పోటీ పడాలంటే...

మన ఉన్నతవిద్యా వ్యవస్థ ప్రపంచస్థాయిలో పోటీ పడాలంటే- విశ్వవిద్యాలయాల స్వయంప్రతిపత్తి అనేది విధానపరంగా ఉండకూడదు. ఒక విద్యాసంస్థలో చదివే విద్యార్థులకు దక్కుతున్న ఉద్యోగావకాశాలు, పరిశోధన ఫలితాలు, సమాజంపై అవి చూపే ప్రభావం తదితర అంశాల ద్వారా స్వయంప్రతిపత్తి కల్పించాలి. అధ్యాపకులు, విద్యార్థుల బృందాలు స్థానికంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి, సామాజిక బాధ్యతను నిర్వర్తించడం ద్వారా వర్సిటీల నాణ్యత పెంచడంలో భాగస్వాములు కావాలి. తద్వారా స్వయంప్రతిపత్తి అనేది ఒక అధికారం కాదని, బాధ్యత అనే సంగతి అవగతమవుతుంది. రేపటితరం ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యాన్ని అందుకోవాలంటే విశ్వవిద్యాలయాలకు విద్య, పాలన, ఆర్థిక, పరిశోధనపరమైన స్వయంప్రతిపత్తి కల్పించడం తప్పనిసరి.




ఆచార్య అప్పారావు పొదిలె
హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ పూర్వ ఉపకులపతి

ఎంపిక

దేవగిరి రాజ్యాన్ని వివేక వర్ధనుడు పాలించేవాడు. తన ఆస్థానానికి ఒక గూఢచారిని నియమించాలి అనుకున్నాడు. దాని కోసం ఒక ప్రకటన చేయించాడు. చాలామంది ఆ పనిలో చేరడానికి వచ్చినా ముగ్గురు మాత్రమే చివరి దశకు చేరుకున్నారు. వాళ్లను సభలోకి తీసుకొచ్చి.. 'మహారాజా! వీళ్లు ముగ్గురూ ఇక్కడ వేగులుగా ఉండటానికి అర్హులని నా అభిప్రాయం. కానీ ఒకరిని మాత్రమే తీసుకోగలం కదా!' అన్నాడు మంత్రి. కాసేపు ఆలోచించిన రాజు.. 'కొన్నిరోజుల వరకూ ముగ్గురినీ పనిలోకి తీసుకోండి. అప్పుడు మళ్లీ ఒక పరీక్ష నిర్వహించి.. ఆ ఒక్కరిని ఎంపిక చేద్దాం' అన్నాడు. సరేనంటూ ఆరోజు నుంచి ముగ్గురినీ పనిలో పెట్టాడు మంత్రి.

అలా నెల రోజులు గడిచిపోయాయి. అప్పుడు వాళ్ల ముగ్గురినీ సభలోకి పిలిచి.. 'ఇన్నిరోజులు ఇక్కడ పని



చేశారు కదా! మీరు గమనించిన, మార్చాల్సిన అంశాలేంటి?' అని అడిగాడు మహారాజు. 'అంతా బాగానే ఉంది.. ఇక్కడ మార్చడానికి నాకేమీ కనిపించలేదు' అన్నాడు మొదటి వ్యక్తి. 'ఇక్కడ కొంతమంది అనుమానంగా కనిపించారు. మిమ్మల్నే మోసం చేయాలని చూస్తున్నట్లు అనిపించింది మహారాజా!' అని చెప్పాడు రెండో వ్యక్తి. ఆ తరవాత చెప్పాల్సిన మూడో వ్యక్తి మాత్రం మౌనంగా ఉండిపోయాడు. అప్పుడు.. 'నువ్వు మాట్లాడవేంటి? నీకూ ఏమీ మార్చాల్సిన అంశాలు కనిపించలేదా?' అని అడిగాడు రాజు. 'అదేం లేదండీ! మీరు అడిగిన విషయం ఇలా సభలో చెప్పాల్సింది కాదు. నేను ఇక్కడ గమనించిన లోటుపాట్లు ఇప్పుడు చెబితే, ఆ తప్పులు చేస్తున్నవారు జాగ్రత్తపడే అవకాశం ఉంది. కాబట్టి మీకు రహస్యంగానే చెబుతాను' అన్నాడు. ఆ మాటలు విన్న మహారాజు.. 'గూఢచారికి ఉండాల్సిన లక్షణాలు గోప్యత, సంయమనం. ఆ రెండూ ఇతనిలో ఉన్నాయి. ఇతణ్నే ఉద్యోగంలోకి తీసుకుంటున్నాను' అని ప్రకటించాడు.

హాయ్! బుజ్జీ!!

– కూచిమంచి నాగేంద్ర

చెప్పుకోండి చూద్దాం!

ఇక్కడ ఆంగ్లంలో ఒకే అక్షరంతో ప్రారంభమయ్యే అంశాల పేర్లు తెలుగులో ఉన్నాయి. కానీ అందులో కొన్ని వేరేవీ కలిసిపోయాయి. అవేంటో కనిపెట్టండి చూద్దాం.

నారింజ	బియ్యం	నీళ్లు
ఉంగరం	వర్షం	ఇల్లు
తాడు	కుందేలు	పడవ


బజాజ్ ఎలక్ట్రానిక్స్
గణతంత్ర దినోత్సవ ఆఫర్లు
CASHBACK UPTO ₹30,000/-*
CASHBACK UPTO ₹30,000/-* IDFC FIRST Bank
CASHBACK UPTO ₹21,000/-* HDB FINANCIAL SERVICES
CASHBACK UPTO ₹20,000/-* ICICI Bank
CASHBACK UPTO ₹15,000/-* BAJAJ FINSERV
INSTANT DISCOUNT UPTO ₹8,000/-* HDFC BANK On CC / DC EMI
SAMSUNG
19 Years Global No.1 TV
Super big Republic. Super big TV.
Awesome India Offers
Limited Period Only
Free* Soundbar worth up to ₹92990 (1 unit)
0 Down payment
EMI up to 30 months*
Up to 20% cashback*
Samsung Care+ starting at ₹599* only
Image simulated for representational purposes only. *T&C apply.
SONY
BRAVIA
CINEMA IS COMING HOME
Happy Makar Sankranti
BRAVIA 7
BRAVIA 8 II
BRAVIA 9
SPECIAL FESTIVE OFFERS!
3 YEARS WARRANTY
INSTANT CASHBACK UPTO RS.25,000/-
UPTO 30% OFF
TV + SOUNDBAR COMBO OFFER
SAVE UPTO Rs.69,990/-
BUY NOW AT Rs.2,995/-
LG
Thank You India for Making LG Most Trusted Brand
LG OLED evo AI
LG QNED evo AI
Life's Good.
CELEBRATION OFFERS
3 YEAR WARRANTY (On Select OLED)
Up to 26% CASHBACK Max ₹26000 ON SELECT CREDIT / DEBIT CARDS
UP TO 30% OFF ON LG SOUNDBAR (With Select TVs)
Haier
QLED
BIG.BOLD.BEYOND
S90 Series
100" (254cm) New
FEATURES
Google TV
SOUND BY KEF
AI CENTER MAX
OFFERS
UP TO 25% INSTANT CASHBACK
0 Down Payment
3 YEARS WARRANTY
AKAI Tokyo Japan
Every frame, vivid. Every moment, celebrated! Let's Akai
MRP ₹5,49,990/-
Special Offer Price ₹2,75,000*
QLED Model: AL100GQU-SFL
Flat Cashback upto ₹25,000*
Google TV QLED 4K
Hey Google
HANDS-FREE Voice Command
MEMC
Dolby VISION·ATMOS
Chromecast built-in
REFRIGERATORS
RANGE STARTS FROM ₹12,490/-*
LG | SAMSUNG | Haier | Whirlpool | IFB
WASHING MACHINES
RANGE STARTS FROM ₹14,990/-*
LG | SAMSUNG | Haier | Whirlpool | IFB | BOSCH
AIR CONDITIONERS
WIDEST RANGE OF SPLIT Ac's
RANGE STARTS FROM ₹26,990/-*
ATTRACTIVE CASHBACK* / NO COST EMI* / INSTALLATION FREE*
LG | SAMSUNG | Haier | LLOYD | BLUE STAR | GENERAL | DAIKIN
CELEBRATE REPUBLIC DAY WITH APPLE
Product | Starting at* | EMI Starting at*
iPhone 17 Pro Max | ₹98,400 | ₹8,533
iPhone 17 | ₹36,400 | ₹1,683
iPhone 16 | ₹24,100 | ₹1,506
Macbook Air M4 | ₹55,900 | ₹2,746
iPad 11th Gen (A16) | ₹30,500 | ₹1,354
Watch S11 | ₹37,400 | ₹4,711
Air Pods 4 | ₹11,000 | ₹500
Upto ₹10,000* Instant cashback on credit cards of ICICI Bank AXIS BANK
Exchange bonus up to ₹10,000*
Enjoy 20% Discount on Protection Plan
SAMSUNG
S25 Ultra Galaxy AI
Special Price ₹1,22,999*
S25 Galaxy AI
Special Price ₹68,999*
Galaxy A56 | A36 5G
Celebrations made awesome with triple zero deal
Awesome Offers
vivo
Y400 Starting at ₹22,999*
10% ₹1,500 CASHBACK
Y31 Starting at ₹16,999*
₹1,000 CASHBACK
zero DOWN PAYMENT
3 Months No Cost EMI
OPPO A6 Pro 5G
Durable and Long-Lasting
8GB + 128GB ₹21,999
8GB + 256GB ₹23,999
80W
Available Now
ColorOS
10% Instant Cashback
3 Months No Cost EMI
Zero Down Payment Schemes
REDMI Note 15 5G
Faster. Stronger. Simply Better.
Own a REDMI Note 15 by paying just ₹399 ₹15 only
Available on Attractive EMI Schemes on IDFC First Bank
₹3,000 Instant Bank Discount
OnePlus 15R
Power On | Limits Off
From ₹44,999*
*Incl. of bank discount
Google Pixel 9a
Magic that's built to last.
Now at ₹34,999*
Instant Discount of ₹10,000
₹5,000 Cashback on HDFC BANK
*Price after store discount and Bank cashback
విజయవాడ: వినాయక థియేటర్ దగ్గర, బందరు రోడ్, గుణదల | మీనాక్షి టవర్స్, ఏలూరు రోడ్, సూర్యారావు పేట | F101, F102, F115, & F116, బొమ్మరిల్లు అపార్ట్‌మెంట్ నందమూరి నగర్ |
71-2-9, మోహన్ దాస్ థియేటర్ ప్రక్కన, వెంకటేశ్వరపురం, పటమట | D.No 76-8-8/5, క్రాంబ్వే రోడ్డు, శివాలయం, భవానిపురం |
గుడివాడ: గ్రౌండ్, 1 & 2 ఫ్లోర్స్, Sy.No. 122/1, వార్డ్ నం.15, ఆంజనేయపేట, | మచిలీపట్నం: ఓల్డ్ D. No. 11/313, సిరి ఎస్టేట్, చెమ్మన్నగిరి పేట
Bajaj Electronics - A Trademark of Electronics Mart India Ltd. CIN No: L52605TG2018PLC126593. Regd. Office: 6-1-91/10, Ground Floor, Next to Telephone Bhavan, Secretariat Road, Saifabad, Hyderabad - 500004. Corporate Office: M. No. 6-3-666/A1 to 7, 3rd Floor, Opp. NIMS Hospital, Punjagutta Main Road, Hyderabad - 500082. Email: communications@bajajelectronics.in

ఏకాత్మ మానవతా వాదం ప్రపంచానికి దిక్సూచి



విజయవాడలో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ కాంస్య విగ్రహం ఆవిష్కరించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి. చిత్రంలో భాజపా నాయకులు యామినీశర్మ, రమేష్ నాయుడు, విష్ణువర్ధన్‌రెడ్డి, పురందేశ్వరి, పీవీఎన్ మాధవ్, పాతూరి నాగభూషణం, సంతోష్ జీ, సత్యకుమార్, మధుకర్, పీవీ పార్థసారథి తదితరులు

- సమస్యల పరిష్కారానికి మోదీ అనుసరిస్తున్న విధానం ఇదే
- '60 వసంతాల ఏకాత్మ మానవ దర్శన పునస్మరణ' సదస్సులో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి




ఈనాడు, అమరావతి: పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఆలోచనలు అంత్యోదయ భారత్‌కు ఎంతో అవసరమని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. విజయవాడ ఐజీఎం స్టేడియంలో శుక్రవారం ప్రారంభమైన 60 వసంతాల ఏకాత్మ మానవ దర్శన పునస్మరణ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. 1965 జనవరి 23న విజయవాడలో జనసంఘ్ 12వ సభలో ఏకాత్మ మానవ దర్శన సిద్ధాంతాన్ని ఆచరణలోకి తీసుకొచ్చిన ప్రాంగణంలో... 60ఏళ్ల తర్వాత పునస్మరణ సదస్సులో పాల్గొనడం పూర్వజన్మ సుకృతమని తెలిపారు. 'దోపిడీ రహిత సమాజం కావాలని, అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలని దీన్‌దయాళ్ కోరుకున్నారు. స్వాతంత్ర్యం వచ్చాక.. బోస్, లాలాజీ, గాంధీజీ, అరబిందో, తిలక్ లాంటి మేధావుల ఆలోచనా విధానాలను కాదని.. వ్యక్తి వాదం, సోషలిజం, కమ్యూనిజం లాంటి ఆచరణ సాధ్యం కాని పాశ్చాత్య సిద్ధాంతాలను మనపై బలంగా రుద్దారు. ఇప్పుడు కూడా ప్రపంచానికి ఈమ సిద్ధాంతమే అవసరమని.. కొన్ని దేశాలు క్యాపిటలిజం, మరికొన్ని దేశాలు కమ్యూనిజం వైపు నడుస్తూ గొడవలు పడుతున్నాయి. మన సమాజానికి, దేశానికి, ప్రపంచానికి కావల్సిన అద్భుతమైన ఏకాత్మ మానవతా సిద్ధాంతాన్ని దీన్ దయాళ్ అందించారు. ప్రధాని మోదీ దాన్ని ఆచరణలో పెడుతూ దేశ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతున్నారు' అని పేర్కొన్నారు.

దీన్‌దయాళ్ విగ్రహావిష్కరణ..

- విజయవాడలో పండిట్ దీన్‌దయాళ్ విగ్రహాన్ని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆవిష్కరించారు.
- కృష్ణవేణయనగర్ ప్రాంగణంలో 60ఏళ్ల నాటి సభ విశేష ప్రదర్శనను భాజపా జాతీయ సంఘటనా ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ ప్రారంభించారు.
- 1965లో జరిగిన జనసంఘ్ 12వ మహాసభ విశేషాల పుస్తకాన్ని, జాగృతి 60 వసంతాల సంచికను అతిథులు ఆవిష్కరించారు. నాటి జాతీయ మహాసభలో పాల్గొన్న నాయకులను, వారి వారసులను సత్కరించారు.

ఆ మార్పుల వల్లే వికసిత్ భారత్‌వైపు

– సతీష్‌రెడ్డి, రక్షణ రంగ నిపుణుడు



భారతీయ ఏకాత్మ మానవ దర్శనం తర్వాత వచ్చిన అనేక మార్పులవల్లే వికసిత్ భారత్ లక్ష్యం వైపు మనదేశం పరుగులు పెడుతోంది. 1750 దశకంలో 24 శాతం వృద్ధి రేటు ఉన్న భారతదేశం స్వాతంత్ర్యం వచ్చేనాటికి 4 శాతానికి పడిపోయింది. దేశంలో ఏ వస్తువూ తయారయ్యేది కాదు. డీఆర్‌డీఓ ప్రారంభంలో రక్షణ రంగంలోని పరికరాలను పరిశీలించిన వరకే పరిమితమైంది. 2014 తర్వాత భారత ప్రభుత్వం తీసుకున్న చొరవతో పలు మార్పులు వచ్చాయి. ప్రధాని మోదీ నిర్ణయాల వల్ల క్షిపణులు, యుద్ధ ట్యాంకులు తయారుచేస్తున్నాం. ఆయుధాలు దిగుమతి చేసుకునే పరిస్థితి నుంచి ఎగుమతి చేసే పరిస్థితికి వచ్చాం. రక్షణ రంగానికి అనుగుణంగా 20 వేల పరిశ్రమలు వచ్చాయి. గతంలో విదేశాలకు వెళ్లే యువత ఇప్పుడు స్వదేశంలో శ్రమిస్తున్నారు. 400 విశ్వవిద్యాలయాల్లో ప్రయోగాలు చేస్తున్నారు.

భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు రూపం

– బీఎల్ సంతోష్, భాజపా జాతీయ సంఘటనా ప్రధాన కార్యదర్శి

భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు కొత్త రూపమే ఏకాత్మ మానవ దర్శనం. ఇది దేశ సమగ్ర స్వరూపానికి ఒక మూల సిద్ధాంతం. పాశ్చాత్య భావదాస్యం నుంచి బయటకు వస్తే వికసిత్ భారత్ చూడగలుగుతాం. ప్రతి ఒక్కరూ వారి ధర్మాలకు కట్టుబడి పనిచేసి ప్రజా సంక్షేమం కోసం ముందుకు రావాలి. గాంధీజీ పేర్కొన్న రామరాజ్యం, సర్వోదయ, అంత్యోదయ కలిపి నేటి ప్రభుత్వం ప్రజలకు సంక్షేమాన్ని అందిస్తోంది.

వికసిత్ భారత్ లక్ష్యానికి ఊతం..

– రామ్ మాధవ్, ఆరెస్సెస్ అఖిల భారత కార్యకారణి


ప్రపంచంలో సంక్షోభం నడుస్తోంది. ఈ తరుణంలో భారత్ నూతన దిశను ఇవ్వబోతోంది. వికసిత్ భారత్ లక్ష్యానికి దీన్‌దయాళ్ సిద్ధాంతం అందించారు. ఆనాడే విదేశీ విధానంపైనా వివరించారు.

భారతీయుల రక్షణ మన ప్రభుత్వ బాధ్యత

– మురళీధర్‌రావు, భాజపా జాతీయ నాయకుడు

ప్రపంచంలోని భారతీయుల రక్షణ మన ప్రభుత్వ బాధ్యత. మోదీ ప్రభుత్వం వచ్చాక రక్షణ రంగంలో పెను మార్పులు వచ్చాయి. ప్రజలకు నైపుణ్యాలు పెంచితే దేశం నంబర్ వన్ స్థానానికి చేరుకుంటుంది.

■ తొలిరోజు సదస్సులో కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ, రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీలు దగ్గుబాటి పురందేశ్వరి, సీఎం రమేశ్, పాకా వెంకట సత్యనారాయణ, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, సుజనాచౌదరి, ఆదినారాయణరెడ్డి, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.



బీఎల్ సంతోష్ హిందీలో మాట్లాడుతుండగా వెనుక తెరపై ఏఐ చేసిన తెలుగు అనువాదం

ఏఐ దుబాసి!

సభలో ప్రధాన వక్త హిందీలోనో, ఇంగ్లిషులోనో మాట్లాడుతుంటే.. దాన్ని అదే వేదిక మీద మరొకరు తెలుగులోకి తర్జుమా చేసి చెప్పేవారు. ఇదంతా గతం. ఇప్పుడు అంతా ఏఐ కాలం కదా.. అందుకే వక్త ఉపన్యాసాన్ని అప్పటికప్పుడు అక్షర రూపంలో అందిస్తోంది. విజయవాడ ఐజీఎం స్టేడియంలో నిర్వహించిన 'ఏకాత్మ మానవ దర్శనం పునఃస్మరణ' సభ ఇందుకు వేదికైంది. సభలో జాతీయ సంఘటన ప్రధాన కార్యదర్శి సంతోష్‌జీ హిందీలో మాట్లాడుతుండగా.. ఆయన మాటలు వెనువెంటనే తెలుగులోకి అనువాదమై తెరపై ప్రత్యక్షమయ్యాయి. ఇది చూసిన భాజపా నాయకులు ఆశ్చర్యానికి గురయ్యారు. – ఈనాడు, అమరావతి

యిజం కాదు.. నిజం..

– ముదిగొండ శివప్రసాద్, చరిత్రకారుడు



దీన్‌దయాళ్ ప్రతిపాదించిన ఏకాత్మ మానవత నినాదం యిజం కాదు.. ఒక నిజం. ఘట్‌కేసర్‌లోని గురుకులానికి వచ్చిన దీన్‌దయాళ్ ఆంగ్లంలో ఏకాత్మ మానవతా వాద సారాంశం వివరిస్తుంటే ఆయన దగ్గర కూర్చుని నోట్సు రాసుకుని తెలుగులో అనువదించి అందరికీ వినిపించా. 1965 నాటి సభలో పాల్గొన్న నేను..60ఏళ్ల తర్వాత నిర్వహించే ఈ పునఃస్మరణ సదస్సుకు రావడం నా భాగ్యం.

ప్రపంచ వ్యాప్త సమస్యలకు పరిష్కారం

– పీవీఎన్ మాధవ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు



ప్రపంచవ్యాప్త సమస్యలకు ఏకాత్మ మానవతా వాదమే పరిష్కారమని దీన్‌దయాళ్ పేర్కొన్నారు. రెండున్నరేళ్ల ఈ అంశాలపై చర్చ జరిగేలా ఆయన శ్రమించారు. 1968లో దీన్‌దయాళ్ హత్య తర్వాత జాతీయవాద సంస్థలు ఈ వాదాన్ని అధ్యయనం చేస్తూ ముందుకు తెచ్చాయి. వాజ్‌పేయీ, మోదీ ప్రభుత్వాలు ఈ లక్ష్యాలు, ఆలోచనలను ముందుకు తీసుకెళ్లాయి.

రూ.150 కోట్లతో ముక్త్యాల-హరిశ్చంద్రపురం కార్గో టెర్మినల్ ప్రతిపాదన

ఈనాడు, అమరావతి: కృష్ణా నదిలో జాతీయ జలరవాణా-4లో భాగంగా ముక్త్యాల-హరిశ్చంద్రపురం మధ్య రూ.150 కోట్లతో కార్గో రవాణా, టెర్మినల్ ఏర్పాటు ప్రతిపాదన అంశాలు జాతీయ జలరవాణా అభివృద్ధి మండలి సమావేశం ముందుకు వచ్చాయి. కేరళలోని కొచ్చిలో శుక్రవారం కేంద్రమంత్రి సర్బానంద సోనోవాల్ అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు. ఇందులో దాదాపు రూ.1,500 కోట్ల విలువైన ప్రాజెక్టులను గుర్తించారు. నది ఆధారిత ఆర్థికాభివృద్ధిని ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ సమావేశంలో చర్చలు జరిగాయి. కార్గో రవాణా, ప్రయాణికుల సేవలు, క్రూయిజ్ టూరిజం వేగంగా విస్తరిస్తున్నందున నదులు ఇందులో కీలకభాగస్వామ్యం వహిస్తాయని, మంచి అవకాశాలు కల్పిస్తాయన్న అంశాలు చర్చకు వచ్చాయి. ఈ సమావేశంలో జలరవాణా అథారిటీ ఛైర్‌పర్సన్ సునీల్ పాలీవాల్, వైస్ ఛైర్మన్ సునీల్‌కుమార్ సింగ్, వివిధ రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

జైలు నుంచి జోగి సోదరుల విడుదల

- కేసులకు భయపడం..
- రెడ్‌బుక్ తీసి జేబులో పెట్టుకోండని జోగి రమేష్ సవాలు



విజయవాడ జైలు నుంచి బయటకు వస్తున్న మాజీ మంత్రి జోగి రమేష్

ఈనాడు, అమరావతి: 'నేను తప్పు చేశానని నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధమే. చంద్రబాబు, లోకేశ్‌కు ఒకటే చెబుతున్నా.. 83 రోజుల పాటు నన్ను, నా సోదరుణ్ని జైల్లో పెట్టారు. కేసులు పెడితే వైకాపా నాయకులు భయపడతారనుకుంటే పొరపాటు. అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదు' అని వైకాపా నేత, మాజీ మంత్రి జోగి రమేష్ పేర్కొన్నారు. ములకలచెరువులో నకిలీ మద్యం కేసులో అరెస్టై విజయవాడ జైల్లో ఉన్న జోగి రమేష్, జోగి రాములకు శుక్రవారం అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె కోర్టు బెయిల్ మంజూరు చేసింది. బెయిల్‌పై విడుదలై బయటికొచ్చిన అనంతరం జోగి రమేష్ మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు హెచ్చరికలు జారీ చేశారు. అనుచరులు, నాయకులతో కలిసి హల్‌చల్ చేశారు.

సిట్ అధికారులకు ప్రజాకోర్టులో శిక్ష పడుతుంది

'చంద్రబాబు, లోకేశ్‌కు తొత్తులుగా మారిన కొందరు పోలీసులకు చెబుతున్నా. చంద్రబాబు శాశ్వతం కాదు. మహా అయితే రెండున్నరేళ్లు ఉంటారు. మీరు శాశ్వతంగా ఉద్యోగాల్లో ఉండేవారు. సిట్ అధికారులకు కూడా చెబుతున్నా.. మీకు భార్యాబిడ్డలు లేరా? చంద్రబాబు ఏం చెబితే అది చేస్తారా? మీకు ప్రజా కోర్టులో శిక్ష పడుతుంది. చంద్రబాబుకు, లోకేశ్‌కు ఛాలెంజ్ చేస్తున్నా.. వైకాపా నేతలపై అక్రమ కేసులు పెడితే భయపడి పారిపోతారనుకున్నారా? మీ రెడ్ బుక్‌ను మడిచి జేబులో పెట్టుకోండి' అని జోగి రమేష్ హెచ్చరించారు. జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసే వరకు వైకాపా శ్రేణులు ప్రజాక్షేత్రంలో పనిచేస్తాయన్నారు.

ప్రకృతి చికిత్స చేయించుకునేందుకు చెవిరెడ్డి భాస్కరరెడ్డికి కోర్టు అనుమతి

ఈనాడు, అమరావతి: ఉండవల్లిలోని మంతెన ఆశ్రమంలో వెన్నునొప్పికి ప్రకృతి చికిత్స చేయించుకునేందుకు వైకాపా నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డికి ఏసీబీ కోర్టు అనుమతి ఇచ్చింది. తాను వెన్నునొప్పితో బాధపడుతున్నానని. . మంతెన సత్యనారాయణ రాజు ఆశ్రమంలో చికిత్సకు అనుమతించాలని కోర్టులో ఆయన పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై ఇటీవల వాదనలు పూర్తి కావడంతో ఏసీబీ కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించింది. 15 రోజుల పాటు చికిత్స పొందేందుకు అనుమతిస్తూ అనిశా కోర్టు న్యాయాధికారి శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులిచ్చారు. చికిత్స కోసం వెళ్లిన రోజు నుంచి 15 రోజులు అనుమతిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వీబీ జీ రామ్ జీ చట్టానికి వ్యతిరేకంగా తమిళనాడు శాసనసభలో తీర్మానం

చెన్నై, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ వీబీ జీ రామ్ జీ చట్టానికి వ్యతిరేకంగా తమిళనాడు శాసనసభలో శుక్రవారం ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రత్యేక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. వంద రోజుల ఉపాధి హామీ పథకాన్ని మహాత్మా గాంధీ పేరిటే కొనసాగించాలని, ఉపాధికి మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వమే రూపొందించుకునేలా వీలు కల్పించాలని, రాష్ట్ర పరిస్థితులకు అనుగుణంగా నిధులు కేటాయించాలని పలు డిమాండ్లను ఈ బిల్లులో ప్రస్తావించారు. సభలో ఈ తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదం పొందింది.

ఇదిగో పులి.. ట్రాప్ కెమెరాలో చిక్కింది!



ట్రాప్ కెమెరాలో నమోదైన పెద్ద పులి

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలం అంతర్వేదిగూడెం, నాగులగూడెం గ్రామాల సమీపంలో పశువుల కొట్టాలపై దాడులు చేస్తూ ఆవులను హతమార్చుతున్న పెద్దపులి అటవీ శాఖాధికారులు అమర్చిన ట్రాప్ కెమెరాకు చిక్కింది. పెద్దపులి సంచారం మన్యంలో మూడు రోజులుగా అలజడి సృష్టిస్తోంది. ఇప్పటికి 5 ఆవులను హతమార్చింది. పులి తిరుగుతుందనుకున్న ప్రదేశాల్లో అధికారులు ట్రాప్ కెమెరాలను అమర్చారు. చివరికి గురువారం రాత్రి ఓ ప్రదేశంలో వేటను తింటున్న పెద్దపులి చిత్రాలు ట్రాప్ కెమెరాలో పడ్డాయి. దాని పాదముద్రలను బట్టి పశువుల కొట్టాలపై దాడి చేసి అంతర్వేదిగూడెం సమీపంలోని కొర్రాజుల కొండపైకి ఎక్కేస్తున్నట్లు అటవీ అధికారులు గుర్తించారు. అటవీ శాఖ సిబ్బందితో నాగులగూడెం, అంతర్వేదిగూడెం గ్రామాల్లో శుక్రవారం పర్యటించి స్థానికులను అప్రమత్తం చేశారు.

కూటమి పార్టీల్లో కోవర్టులున్నారు

ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ వ్యాఖ్యలు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: 'ఏలూరు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో కూటమి పార్టీల్లో కొందరు కోవర్టులున్నారు. వారి కారణంగా భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తవచ్చు. వారి విషయంలో అప్రమత్తంగా ఉండాలి' అని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలు కాకరేపాయి. ఏలూరు నగరంలో శుక్రవారం నిర్వహించిన తెదేపా ఏలూరు పార్లమెంటరీ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో చింతమనేని ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఇతర రాజకీయ పార్టీలకు చెందిన కొందరు కూటమి పార్టీల్లో చేరుతున్నారు. వీరి విషయంలో అప్రమత్తంగా ఉండకపోతే నష్టపోవాల్సి వస్తుంది' అని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలకు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కొలుసు పార్థసారథి స్పందించారు. 'తెదేపాలో చేరాలనుకునే వారి విషయంలో పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుంది. ఈ అంశంలో పార్టీ అధినేత చంద్రబాబుదే తుది నిర్ణయం. ఏదో ఒక నియోజకవర్గంలో నెలకొన్న విషయం గురించి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో కోవర్టులు ఉన్నారంటూ మాట్లాడటం వల్ల పార్టీకి నష్టం వాటిల్లుతుంది' అని అన్నారు. చింతమనేని సొంత నియోజకవర్గం దెందులూరును ఉద్దేశించే ఈ వ్యాఖ్యలు చేసినట్లు పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. ప్రస్తుత జడ్పీ ఛైర్‌పర్సన్ పద్మశ్రీ, ఆమె భర్త ప్రసాదరావు గతంలో వైకాపాలో ఉండగా.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తెదేపాలో చేరిన విషయం విదితమే. జడ్పీ ఛైర్‌పర్సన్ దంపతులకు, చింతమనేనికి మధ్య విభేదాలున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రభాకర్ వ్యాఖ్యలు చేసినట్లు పేర్కొంటున్నాయి.

వీధి వ్యాపారులకు రూ.206 కోట్ల రుణాల పంపిణీ

ఈనాడు, అమరావతి: ప్రధానమంత్రి స్వనిధి కింద రాష్ట్రంలోని వీధి వ్యాపారులకు రూ.206 కోట్ల రుణాలను సీఎం చంద్రబాబు పంపిణీ చేశారు. అన్ని రాష్ట్రాల్లో శుక్రవారం ఒకే రోజు రుణాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. సచివాలయంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు..పీఎం స్వనిధి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేయడంతో పాటు క్రెడిట్ కార్డులూ అందజేశారు. పీఎం స్వనిధి అమలులో దేశంలో ఏపీ రెండో స్థానంలో నిలిచింది. 6,34,874 మంది లబ్ధిదారులకు ఇప్పటివరకు రూ. 991.74 కోట్ల రుణాలు అందించారు.



ఆచరణతోనే నైపుణ్యాలు మెరుగు

మంచి రచయితగా ఎదగాలంటే- ప్రతిరోజూ రాయాలి. చక్కటి వక్తగా గుర్తింపు తెచ్చుకోవాలంటే- తరచూ వేదికలపై మాట్లాడాలి. సేల్స్ పర్సన్‌గా విజయం సాధించాలంటే- ఎక్కువమందికి అమ్మడానికి ప్రయత్నించాలి. అంటే ఆచరణ ద్వారానే మన నైపుణ్యాలు మెరుగవుతాయి తప్ప, ఆలోచనలతోనో, విజయాల గురించి కలలు కనడం ద్వారానో కాదు.

– జాన్ బోర్సియో, బిజినెస్ కన్సల్టెంట్

రెండు డిస్కంల గ్రేడింగ్ మెరుగు

- దిగజారిన ఈపీడీసీఎల్ గ్రేడింగ్
- బి గ్రేడ్‌లో.. మూడు డిస్కంలు
- పనితీరు ఆధారంగా ప్రకటించిన కేంద్రం

ఈనాడు, అమరావతి: విద్యుత్ పంపిణీ సంస్థల పనితీరు, రాష్ట్రప్రభుత్వాల మద్దతు ఆధారంగా పనితీరు అంచనాకు కేంద్ర ఇంధన మంత్రిత్వశాఖ సమగ్ర విధానాన్ని రూపొందించింది. మొత్తం వంద మార్కులకు డిస్కంలు సాధించిన మార్కుల ఆధారంగా గ్రేడింగ్‌లు ఇచ్చింది. 15 బేస్ రేటింగ్ మెట్రిక్స్, 9 డిజ్ఇన్సెంటివ్స్ ఆధారంగా డిస్కంల పనితీరును కేంద్రం అంచనా వేసింది. ప్రతి యుటిలిటీ పనితీరు అంచనాకు 100 పాయింట్లు కేటాయించింది. డిస్కంలు సాధించిన మార్కుల ఆధారంగా (ఎ+, ఎ, బి, బి-, సి, సి-, డి) గ్రేడ్‌లు కేటాయించింది. 2023-24తో పోలిస్తే సెంట్రల్, సదరన్ డిస్కంలు 2024-25లో గ్రేడింగ్ మెరుగుపరుచుకుంటే.. ఈస్టర్న్ డిస్కం గ్రేడింగ్ దిగజారింది. మొత్తం 54 విద్యుత్ సంస్థలకు కేటాయించిన గ్రేడింగ్ జాబితాలో.. సెంట్రల్ 23, సదరన్ డిస్కం 27వ స్థానంలో ఉన్నాయి. ఈస్టర్న్ డిస్కంకు 31వ స్థానం దక్కింది.

డిస్కంలకు వచ్చిన మార్కులు, గ్రేడింగ్

డిస్కం పేరు	2025లో	2024లో
ఏపీసీపీడీసీఎల్	67.53 బి	31.52 సి
ఏపీఎస్‌పీడీసీఎల్	54.24 బి	19.52 సి
ఏపీఈపీడీసీఎల్	50.46-బి	65.12 ఎ

■ మొదటి రెండు డిస్కంలు గతంతో పోలిస్తే గ్రేడింగ్ పెంచుకుంటే.. ఎప్పుడూ ముందుండే ఈపీడీసీఎల్ దిగజారింది. దీంతో మూడు డిస్కంలూ ఇప్పుడు ఒకే గ్రేడింగ్‌కు చేరాయి.

మన డిస్కంలకు.. రెడ్‌కార్డ్ మెట్రిక్స్

- గ్రేడింగ్ కేటాయించేందుకు నిర్దేశించిన నిబంధనలను అతిక్రమించడంతో ఏపీసీపీడీసీఎల్‌కు రెడ్‌కార్డ్ మెట్రిక్స్‌ను కేంద్రం జారీచేసింది.
- ఆడిటర్ల ప్రతికూల అభిప్రాయం కారణంగా మూడు డిస్కంలకూ రెడ్‌కార్డ్ మెట్రిక్స్‌ను ఇచ్చింది. మొత్తం ఎనిమిది డిస్కంలకు రెడ్‌కార్డ్ మెట్రిక్స్ ఇస్తే.. అందులో మూడు మనవే.

బిల్లుల వసూళ్లలో మెరుగు

- విద్యుత్ బిల్లుల వసూలు సామర్థ్యాన్ని 29 డిస్కంలు పెంచుకున్నాయి. అందులో మన మూడు డిస్కంలూ ఉన్నాయి.
- 2024 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే. . 2025లో ఏసీఎస్-ఏఆర్ఆర్ మధ్య యూనిట్‌కు 50 పైసల కంటే ఎక్కువగా తగ్గించిన డిస్కంల జాబితాలో సీపీడీసీఎల్, ఎస్‌పీడీసీఎల్‌లకు చోటుదక్కింది.

డిస్కంల వారీగా నష్టాలు, రుణాలు(రూ.కోట్లలో)

డిస్కం పేరు	నష్టాలు	రుణాలు
సీపీడీసీఎల్	9,688	21,204
ఈపీడీసీఎల్	7,155	20,693
ఎస్‌పీడీసీఎల్	12,577	35,687

కేంద్ర విశ్లేషణ ప్రకారం..


- ఏపీ డిస్కంల నష్టాలు, అప్పులు గతేడాదితో పోలిస్తే పెరిగాయి. నష్టాలు 2025లో రూ. 29,420 కోట్లుగా ఉన్నాయి. 2024లో రూ. 29,210 కోట్లు. అప్పులు 2024లో రూ. 66,290 కోట్లు ఉంటే.. 2025లో రూ. 77,583 కోట్లకు పెరిగాయి.
- ఏసీఎస్-ఏఆర్ఆర్ మధ్య మూడు డిస్కంలు కలిపి యూనిట్‌కు సగటున 15 పైసలుగా (2025లో) ఉంది. యూనిట్ విద్యుత్ సరఫరాకు రూ. 8.11 చొప్పున ఖర్చుచేస్తే.. వినియోగదారుల నుంచి సగటున యూనిట్‌కు రూ. 8.26 వస్తోంది.
- డిస్కంలు సరఫరా చేసిన విద్యుత్‌కు బిల్లుల వసూలు 99.26%గా ఉంది. గత ఏడాది 94.91%గా ఉండేది.
- వార్షిక సాంకేతిక, వాణిజ్య నష్టాలు 2025లో 7.87% ఉంటే.. 2024లో 12.05% ఉన్నాయి.

గ్రేడింగ్‌కు కేంద్రం పరిగణించిన అంశాలు

- యూనిట్ విద్యుత్ సరఫరాకు అయ్యే ఖర్చు(ఏసీఎస్).. వినియోగదారుల నుంచి వస్తున్న సగటు ఆదాయం(ఏఆర్ఆర్) మధ్య వ్యత్యాసానికి స్థూల వాణిజ్య ఆదాయానికి బదులు.. నికర ఆదాయాన్ని కేంద్రం పరిగణనలోకి తీసుకుంది.
- జెన్‌కో, ట్రాన్స్‌కోకు నిర్దేశిత వ్యవధిలో (60 రోజులు) జరిపే చెల్లింపుల ఆధారంగా స్కోరింగ్.
- డిస్కంల అప్పులు ఆస్తుల నిష్పత్తి

స్వాతంత్ర్య పోరాటంలో పటేల్ పాత్ర కీలకం

- పర్యావరణ హితానికి ప్రతివ్యక్తి 100 మొక్కలు నాటాలి
- పటేల్ 150వ జయంత్యుత్సవాల్లో మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శైలజా కిరణ్, అగాట ఎనర్జీ రీఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ డైరెక్టర్ మాదాల శ్రీనివాసులు, ఏయూ ఫైన్ ఆర్ట్స్ ప్రొఫెసర్ వి.రమేశ్, శ్రీప్రకాష్ విద్యాసంస్థల డైరెక్టర్ వాసుప్రకాష్ తదితరులు

ఈనాడు, విశాఖపట్నం, న్యూస్‌టుడే, గ్రామీణ భీమిలి: దేశ స్వాతంత్ర్య పోరాటంలో అధిక ప్రభావం చూపిన నాయకుడిగా ఉక్కు మనిషి సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ ప్రత్యేక గుర్తింపు పొందారని మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ శైలజా కిరణ్ పేర్కొన్నారు. స్వాతంత్ర్యం తర్వాత వందల సంస్థానాలను విలీనం చేశారని గుర్తుచేశారు. హోంమంత్రిగా, ఉప ప్రధానిగా సంక్లిష్టమైన సవాళ్లను ఎదుర్కొన్నారని, ఐఏఎస్, ఐపీఎస్ వ్యవస్థలను రూపొందించారని వివరించారు. పటేల్ 150వ జయంత్యుత్సవాల సందర్భంగా విశాఖ నగరం కాపులుప్పాడలోని శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో ఆయన జీవిత విశేషాలతో విద్యార్థులు రూపొందించిన చిత్రకళ ప్రదర్శనను శుక్రవారం ఆమె ప్రారంభించారు. అంతకు ముందు తనకు స్వాగత గీతం పాడిన పిల్లలను అభినందించారు. పటేల్ జీవిత చరిత్రపై నిర్వహించిన క్విజ్ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు అతిథులు బహుమతులు అందజేశారు. శైలజా కిరణ్‌ను పాఠశాల డైరెక్టర్ చిట్టూరి వాసుప్రకాష్ ఆధ్వర్యంలో సత్కరించారు. అనంతరం విద్యార్థులనుద్దేశించి ఆమె మాట్లాడారు.



తాము గీసిన చిత్రాల గురించి శైలజా కిరణ్‌కు వివరిస్తున్న విద్యార్థినులు

10 లక్షల మొక్కలు నాటాలన్నది లక్ష్యం

'ప్రతి ఒక్కరు తమ జీవితంలో కనీసం 100 మొక్కలు నాటి, సంరక్షించాలి. పర్యావరణ పరిరక్షణ అంటే మన భవిష్యత్తును పరిరక్షించుకోవడమే. మార్గదర్శి సిబ్బంది సహకారంతో ఏడేళ్లలో లక్ష మొక్కలు నాటాం. ప్రభుత్వం స్థలం చూపిస్తే కనీసం 10 లక్షల మొక్కలు నాటి, అటవీ ప్రాంతంగా అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ఉన్నాం. విద్యార్థులు సామాజిక బాధ్యతగా పరిసరాల శుభ్రత, మొక్కల పెంపకం, వేసవిలో నీటి పొదుపు, ప్లాస్టిక్ వినియోగం తగ్గించుకోవడాన్ని అలవరచుకోవాలి. మీరేం చేసినా, ప్రకృతికి నష్టం వాటిల్లకుండా జాగ్రత్తపడాల'ని పిలుపునిచ్చారు. సామాజిక మార్పు విద్యతోనే సాధ్యమని, చదువే మన జీవితాలను సంస్కరిస్తుందని పేర్కొన్నారు. నేడు గ్రామీణ ప్రాంతాల నుంచి ఎందరో ఉపాధ్యాయులు, వైద్యులు, శాస్త్రవేత్తలుగా ఎదుగుతున్నారని చెప్పారు. గుంటూరు వైద్య కళాశాల పూర్వ విద్యార్థులు ఆ విద్యాసంస్థను బాగు చేసుకునేందుకు రూ. 100 కోట్లు ఇచ్చారని గుర్తుచేశారు. 'చదువుకున్న అమ్మాయిలు కుటుంబ పోషణ బాధ్యతలను స్వీకరిస్తున్నారు. సమాజంలో మార్పునకు విద్య శక్తిమంతమైన ఆయుధమని నెల్సన్ మండేలా చెప్పేవారు. మీరు విద్యార్థులు మాత్రమే కాదు, దేశ నిర్మాతలు కూడా. భారీ లక్ష్యాలను చిన్నచిన్న టాస్క్‌లుగా విభజించుకుని ఒక్కోటి పూర్తి చేసుకుంటూ పోతే లక్ష్యం చేరుకోగలర'ని పిల్లల్లో శైలజా కిరణ్ స్ఫూర్తినింపారు.

తల్లిదండ్రులతో ప్రేమగా మాట్లాడండి

"మాతృ దేవోభవ, పితృ దేవోభవ అన్నది మన సంస్కృతి. కానీ, ఎంతమంది పిల్లలు తమ తల్లిని ఆలింగనం చేసుకుని కృతజ్ఞతలు చెబుతున్నారు. ఎంతమంది 'అమ్మా.. భోంచేశావా?', 'నాన్నా.. ఎందుకు నీరసంగా ఉన్నావ్?' అని అడుగుతున్నారు" అని విద్యార్థులను శైలజా కిరణ్ ప్రశ్నించారు. ఎక్కువ మంది అవునని బదులివ్వగా, వారిని అభినందించారు. 'మీ భవిష్యత్తు కోసం ఎంతో కష్టపడే మీ తల్లిదండ్రులు.. మీ నుంచి కోరుకునేది ప్రేమ, ఆదరణ మాత్రమేనని, వాటిని అందివ్వాలని సూచించారు. అగాట ఎనర్జీ రీఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ డైరెక్టర్ మాదాల శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులు మొదటి అవకాశాన్నే.. చివరి అవకాశంగా భావించి అందిపుచ్చుకోవాలన్నారు. బంగారు పతకంతో పాటు రజతమూ ముఖ్యమేనని గ్రహించాలని సూచించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫైన్ ఆర్ట్స్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ వి. రమేశ్ మాట్లాడుతూ విద్యార్థులు చిత్రకళలో అద్భుత ప్రావీణ్యం కనబరిచారని కొనియాడారు.

శ్రీవారిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి



శ్రీవారి ఆలయం ఎదుట జస్టిస్ వి.గోపాలకృష్ణారావు, కుటుంబ సభ్యులు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవేంకటేశ్వరస్వామిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణారావు శుక్రవారం దర్శించుకున్నారు. తెల్లవారు జామున కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారి అభిషేక సేవలో పాల్గొని, దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో ఆయనకు వేదపండితులు ఆశీర్వచనం, తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

తితిదే ట్రస్టులకు రూ.2.50 కోట్ల విరాళం



తితిదే అదనపు ఈవో వెంకయ్యచౌదరికి డీడీ అందిస్తున్న రాజగోపాలరాజు కుటుంబం. చిత్రంలో తితిదే బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి తదితరులు

తిరుమల, న్యూస్‌టుడే: తితిదేలోని వివిధ ట్రస్టులకు హైదరాబాద్‌కు చెందిన పి.ఎల్.రాజు కన్‌స్ట్రక్షన్స్ లిమిటెడ్ సంస్థ రూ.2.50 కోట్ల విరాళాలు అందజేసింది. శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు రూ.75 లక్షలు, శ్రీ వేంకటేశ్వర విద్యాదాన ట్రస్టుకు రూ.75 లక్షలు, బర్డ్ ట్రస్టుకు రూ.50 లక్షలు, శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుకు రూ.25 లక్షలు, శ్రీ వేంకటేశ్వర గోసంరక్షణ ట్రస్టుకు రూ.25 లక్షల చొప్పున తీసిన డీడీలను శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో తితిదే అదనపు ఈవో వెంకయ్య చౌదరికి సంస్థ ప్రతినిధి రాజగోపాలరాజు అందజేశారు. తితిదే బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం కార్యక్రమంలో పాల్గొన్నారు.

మరోసారి బెంగళూరుకు జగన్

ఈనాడు, అమరావతి: వైకాపా అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్ మళ్లీ బెంగళూరుకు వెళ్లారు. ఈ నెల 19న బెంగళూరు నుంచి తాడేపల్లికి వచ్చిన ఆయన గురువారం తన క్యాంపు కార్యాలయంలో ప్రెస్‌మీట్ నిర్వహించారు. శుక్రవారం ఉదయం తిరిగి బెంగళూరుకు వెళ్లారు.

పొదుపు మహిళల రుణాలపై

15 రకాల ఛార్జీలా? తగ్గించండి

- ఎంఎస్‌ఎంఈలకు విరివిగా రుణాలిస్తేనే.. అన్నిరంగాల అభివృద్ధి
- అమరావతిలో బ్యాంకు కార్యాలయాలను వేగంగా నిర్మించాలి
- బ్యాంకర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు





ఎస్‌ఎల్‌బీసీ సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు ★ హాజరైన వివిధ బ్యాంకుల ప్రతినిధులు

ఈనాడు, అమరావతి: పొదుపు సంఘాలు తీసుకునే రుణాలపై బ్యాంకులు 15 రకాల ఛార్జీలు విధిస్తున్నాయని.. వీటిని తగ్గించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు బ్యాంకర్లకు సూచించారు. 'టిడ్కో ఇళ్లపై ఇచ్చిన హామీని గత ప్రభుత్వం అమలు చేయకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. వారికి రుణాలివ్వడంలో సాంకేతిక ఇబ్బందులను అధిగమించేలా చూస్తున్నాం. బ్యాంకర్లు సహకరించాలి' అని సూచించారు. దావోస్ పర్యటన ముగించుకుని వచ్చిన చంద్రబాబు శుక్రవారం ఉదయం సచివాలయంలో రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ(ఎస్‌ఎల్‌బీసీ) సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 2025-26 వార్షిక రుణప్రణాళికపై చర్చించారు. 'రాజధాని అమరావతిని ఆర్థిక సంస్థల కేంద్రంగా తయారుచేయాలని భావిస్తున్నాం. బ్యాంకులు సహా వివిధ ఆర్థిక సంస్థలు కార్యాలయాలను ఏర్పాటు చేస్తున్నాయి. ఇటీవలే 15 బ్యాంకుల కార్యాలయాలకు శంకుస్థాపన చేశాం. వాటి నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలి' అని స్పష్టం చేశారు. రాబోయే ఎస్‌ఎల్‌బీసీ సమావేశాలకు జిల్లాల కలెక్టర్లనూ ఆహ్వానించాలని సూచించారు.

ఎంఎస్‌ఎంఈలకు బ్యాంకర్లు వెన్నుదన్నుగా నిలవాలి

ప్రకృతి సేద్యాన్ని విస్తరించేందుకు బ్యాంకర్లు సహకరించాలని సీఎం చంద్రబాబు కోరారు. 'రాష్ట్రంలో అన్ని రంగాలూ అభివృద్ధి చెందాలంటే ఎంఎస్‌ఎంఈలకు అధిక రుణాలిచ్చి ప్రోత్సహించాలి. వారికి వెన్నుదన్నుగా నిలవాలి. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రుణాలు పెద్దఎత్తున ఇవ్వాలి' అని చెప్పారు.

రుణం కోసం ప్రైవేటు వ్యక్తుల దగ్గరకు వెళ్లాల్సిన అవసరం రాకూడదు

రాష్ట్రంలో ఏ ఒక్కరూ రుణాల కోసం ప్రైవేటు వ్యక్తుల వద్దకు వెళ్లే అవసరం లేనంతగా బ్యాంకర్లు పని చేయాలని సీఎం చంద్రబాబు నిర్దేశించారు. 'వ్యవసాయం సహా ఏ అవసరం వచ్చినా బ్యాంకుకు వచ్చి రుణాలు తీసుకోవాలి. పునరుత్పాదక విద్యుత్తు రంగానికి కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు పెద్దఎత్తున ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఇంధన రంగానికి విరివిగా రుణాలివ్వాలి' అని పేర్కొన్నారు.

రాష్ట్రంలో రూ.2 లక్షల కోట్ల రుణాల రీషెడ్యూల్‌కు అవకాశం

'పాలన ప్రజలకు భరోసా ఇచ్చేలా ఉండాలి. విశ్వసనీయత ఉంటే తక్కువ వడ్డీకే రుణాలు లభిస్తాయి. కానీ గత ప్రభుత్వ హయాంలో వ్యవస్థలు గాడి తప్పాయి. ఎక్కువ వడ్డీలకు అప్పు తెచ్చారు. రాష్ట్రంలో రూ.2 లక్షల కోట్ల రుణాల్ని రీషెడ్యూల్ చేసుకునే అవకాశం ఉందని అంచనా వేశాం. ఇప్పటివరకు రూ. 49వేల కోట్ల రుణాలు రీషెడ్యూల్ చేయడం ద్వారా. . రూ.1,108 కోట్ల మేర వడ్డీ ఆదా చేశాం. గత ప్రభుత్వం 22ఎ పేరుతో భూవివాదాలు సృష్టించింది. ఇప్పుడు భూదస్త్రాలకు భద్రత కల్పిస్తున్నాం. క్యూఆర్ కోడ్ ద్వారా పట్టాదారు పాసుపుస్తకాలిస్తున్నాం. బ్యాంకర్లూ ఖాతాల కోసం క్యూఆర్‌కోడ్ విధానం ప్రవేశపెట్టే ఆలోచన చేయాలి' అని సూచించారు.

రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌కు యూబీఐ మద్దతు

అమరావతిలోని రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌టీఐహెచ్) ప్రధాన కార్యాలయానికి యూబీఐ మద్దతిస్తోందని, సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.10కోట్లు విరాళంగా ఇచ్చిందని బ్యాంకర్లు వివరించారు. స్టార్టప్ సంస్థలకు చేయూతపై సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. ఆర్‌టీఐహెచ్ ద్వారా పరిశ్రమలు ప్రారంభించేవారికి బ్యాంకులు మద్దతుగా నిలుస్తున్నాయని బ్యాంకుల ప్రతినిధులు వివరించారు. రాజమహేంద్రవరంలోని స్పోక్ హబ్‌కు ఎస్‌బీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా.. అనంతపురం స్పోక్ హబ్‌కు కెనరా బ్యాంకు, విశాఖ స్పోక్ హబ్‌కు పంజాబ్ నేషనల్ బ్యాంకు, విజయవాడ స్పోక్‌హబ్‌కు హెచ్‌డీఎఫ్‌సీ, తిరుపతి స్పోక్ హబ్‌కు ఇండియన్ బ్యాంకు సహకారం అందిస్తున్నాయని తెలిపారు. సమావేశంలో మంత్రులు పయ్యావుల కేశవ్, కొండపల్లి శ్రీనివాస్, సీఎస్ విజయానంద్ బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

ఎంఎస్‌ఎంఈలకు రూ.95,714 కోట్ల రుణాలు

- కౌలు రైతులకు రూ.1,490 కోట్లు

ఈనాడు, అమరావతి: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మూడో త్రైమాసికం పూర్తయ్యేనాటికి (2025 డిసెంబరు వరకు) రాష్ట్రవ్యాప్తంగా ఎంఎస్‌ఎంఈలకు ఇచ్చిన రుణాలు రూ.95,714 కోట్లకు చేరాయి. దీనివల్ల 4,84,714 మందికి లబ్ధి కలిగిందని రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్‌ఎల్‌బీసీ) నివేదిక వెల్లడించింది. సచివాలయంలో జరిగిన ఎస్‌ఎల్‌బీసీ సమావేశంలో వార్షిక రుణప్రణాళిక వివరాలు వెల్లడించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో (31.12.2025 వరకు) వివిధ రంగాలకు మొత్తం రూ.9.58 లక్షల కోట్ల రుణాలు అందించారు. 5 కేంద్ర పథకాల్లో 10.58 లక్షల మందికి లబ్ధి కలిగింది. కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు ఎండీ ఆశిష్ పాండే, ఎస్‌ఎల్‌బీసీ కన్వీనర్ సీవీఎన్ భాస్కరరావు, ఆర్‌బీఐ ప్రాంతీయ డైరెక్టర్ బషీర్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు కర్నూలు జిల్లాలో అధికం

★ వ్యవసాయ అనుబంధ రంగాల రుణలక్ష్యం రూ.3.06 లక్షల కోట్లు ఉండగా.. రూ.2.97 లక్షల కోట్లు ఇచ్చారు. ఇందులో పంటరుణాలుగా రూ.1.54 లక్షల కోట్లు, కాలిక రుణాలు రూ.1.09 లక్షల కోట్లు ఉన్నాయి. వ్యవసాయ మౌలిక సౌకర్యాల నిధి, ఇతర అనుబంధ కార్యకలాపాలకు రూ.33,650 కోట్లు రుణాలుగా అందించారు.

★ 1.14 లక్షల మంది కౌలు రైతులకు రూ.1,490 కోట్లు ఇచ్చారు. గతేడాదితో పోలిస్తే 39% అదనంగా కౌలుదారులకు అందాయి. అత్యధికంగా కర్నూలు జిల్లాలో రూ.200 కోట్లు, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో రూ.150 కోట్లు అందించారు.

★ వడ్డీలేని రుణాల పథకం కింద రూ.42.89 కోట్లు చెల్లించాల్సి ఉంది.

ఎంఎస్‌ఎంఈలకు అత్యధికంగా విశాఖపట్నంలో

★ ఎంఎస్‌ఎంఈ రంగంలో విశాఖపట్నం జిల్లాలో అత్యధికంగా 36,058 మందికి రూ.14,737 కోట్లు, ఎన్టీఆర్ జిల్లాలో 37,872 మందికి రూ.12,815 కోట్లు, గుంటూరు జిల్లాలో 30,130 మందికి రూ.9,814 కోట్లు రుణంగా ఇచ్చారు.



క్రమశిక్షణ వద్దనుకుంటే పశ్చాత్తాపం తప్పదు

- జిమ్‌కు వెళ్లడం ఒక ఆప్షనే తప్ప తప్పనిసరి కాదనిపిస్తుంది- మన శరీరం మనకు సహకరించడం మానేసేంతవరకూ.
- నచ్చిన తిండి కాకుండా, పోషకాహారమే తినడమనేది ఓ శిక్షలా అనిపిస్తుంది- మన ఆరోగ్యం దెబ్బతినేంతవరకూ.
- ఖర్చులు తగ్గించుకొని పొదుపుగా బతకాలంటే, జీవితంలో స్వేచ్ఛను కోల్పోయినట్లు అనిపిస్తుంది- ఆర్థిక ఇబ్బందులు తలెత్తేవరకూ.

క్రమశిక్షణతో జీవిస్తూ కొన్ని త్యాగాలకు సిద్ధపడకపోతే, భవిష్యత్తులో పశ్చాత్తాపపడక తప్పదని తెలుసుకోండి.

– బ్లేక్ బర్డ్, కంటెంట్ క్రియేటర్

పది తర్వాత.. భవిత పదిలమయ్యేలా..

'ఈనాడు ప్రతిభ - రిసొనెన్స్ విద్యాసంస్థల ఉచిత వెబినార్'

ఈనాడు ప్రతిభ | Resonance® Junior Colleges with IIT-JEE & NEET Hyderabad

పదో తరగతి తర్వాత..? డాక్టరు కావాలా.. ఇంజినీర్ అవ్వాలా.. సీఏ చదవాలా.. ట్రెండ్‌ని అందిపుచ్చుకుంటూ ఏఐ కోర్సుల్లో చేరాలా? ప్రతి విద్యార్థికీ ఇది ఎటూ తేల్చుకోలేని సందేహం. ఈ కీలక సమయంలో వేసే అడుగే.. వారిని కెరీర్ శిఖరంపై కూర్చోబెడుతుందనే మాట వాస్తవం. రేపటి పౌరులు భవిష్యత్తు కలల గమ్యాన్ని ముద్దాడాలంటే.. ఈ దశలో తీసుకునే నిర్ణయమే అత్యంత కీలకం. అందుకే.. శిలలాంటి వాళ్లని శిల్పాల్లా మార్చేందుకు.. ఎవరికి వారే ఉలిలా మారేందుకు 'ఈనాడు ప్రతిభ - రిసొనెన్స్ విద్యాసంస్థలు' సంయుక్తంగా ఉచిత వెబినార్ నిర్వహిస్తున్నాయి.

ఏమేం చర్చిస్తారంటే..

- 90 నిమిషాల సెషన్‌లో MPC, BiPC, CEC, MEC, HEC, ఒకేషనల్.. ఇలా వివిధ రకాల కోర్సులపై లోతైన అవగాహన కల్పిస్తారు. విద్యార్థుల ఆసక్తి, మార్కెట్ ట్రెండ్స్‌కు అనుగుణంగా ఏ గ్రూపు ఎంచుకోవాలో సూచిస్తారు.
- తెలుగు రాష్ట్రాల్లో ఉద్యోగ విపణిలో డిమాండ్ ఉన్న కోర్సులు, తక్షణ ఉపాధి అవకాశాలు, ప్రవేశ పరీక్షలు, వృత్తి విద్యా కోర్సులు, కృత్రిమ మేధ (ఏఐ),బయోటెక్ లాంటి అంశాల గురించి నిపుణులు వివరిస్తారు. ఈ సమాచారాన్ని సమగ్రంగా అందించే ఈనాడు డాట్‌నెట్, ఈనాడు ప్రతిభ డాట్‌నెట్, ప్రభుత్వ వెబ్‌సైట్ల లాంటి వేదికల గురించి వివరిస్తారు.
- తల్లిదండ్రుల ఒత్తిడి, తోటివారి నిర్ణయాలకు ప్రభావితం కాకుండా.. విద్యార్థులు తమలోని బలాలు, బలహీనతలు తెలుసుకునేలా.. తమ ప్రతిభకు అనుగుణంగా కోర్సులు ఎంచుకునేలా అవగాహన కల్పిస్తారు.
- వెబినార్‌లో సబ్జెక్టు నిపుణులు, అనుభవజ్ఞులైన అధ్యాపకులు, వక్తలు ఇంటర్మీడియట్ గ్రూపుల గురించి క్షుణ్నంగా విశ్లేషిస్తారు. వైవిధ్య మార్గాలను ఎంచుకుని విజయం సాధించిన విద్యార్థుల విజయగాథల్ని పంచుకుంటారు.
- చివరగా విద్యార్థులు తమ సందేహాలను జూమ్ చాట్ ద్వారా నిపుణులతో చర్చించి నివృత్తి చేసుకోవచ్చు.

జూమ్ మీటింగ్, యూట్యూబ్ లైవ్‌లో వెబినార్ నిర్వహిస్తారు

వెబినార్ తేదీ:	జనవరి 25, 2026
సమయం:	ఉదయం 11:00 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు

జూమ్ మీటింగ్ కోసం... | యూట్యూబ్ లైవ్ కోసం...

Join from PC, Mac, iPad, or Android:

Zoom - https://hov.to/4fe6eb78

Youtube Live - https://hov.to/40ee8c05

ఐటీఐ, డిప్లొమా అభ్యర్థులకు రష్యాలో ఉద్యోగాలు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఏపీ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ, సైబర్ స్టీల్ రష్యా సంస్థ సంయుక్తంగా ఐటీఐ, డిప్లొమా అర్హత కలిగిన యువతకు రష్యాలో ఉద్యోగ అవకాశాలను ప్రకటించాయి. రష్యాలోని పెర్వొరల్స్క్ ప్రాంతంలో ఉన్న ఇండోర్ పరిశ్రమలో మెటల్ అండ్ పైప్ స్ట్రెయిటెనర్ పోస్టుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఈడీ మనోహర్ తెలిపారు. ఐటీఐ, డిప్లొమాలతో పాటు ప్రాథమిక ఆంగ్లభాష నైపుణ్యాలు, అనుభవం ఉండి, 20 ఏళ్ల వయసు దాటినవారు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు https://naipunyam.ap.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

గుజరాత్‌లో.. ప్రభుత్వానికి విద్యుత్తు విక్రయిస్తున్న గ్రామం

గుజరాత్‌లోని బనస్కాంఠా జిల్లా రూపపుర పూర్తిగా సౌరశక్తిని వినియోగించుకుంటున్న గ్రామంగా రికార్డు సృష్టించింది. గ్రామంలోని 90 శాతం ఇళ్లు, పొలాల వద్ద సోలార్ ప్యానెళ్లే దర్శనమిస్తాయి. గ్రామస్థులు తాము వాడుకోగా మిగిలిన విద్యుత్తును ప్రభుత్వానికి విక్రయిస్తున్నారు. ఫలితంగా ఒక్కో కుటుంబం ఖాతాలో ఏటా రూ.5,000 నుంచి రూ.7,000 వరకు సర్కారే డబ్బులు జమ చేస్తోంది. విద్యుత్తు అధికారులు గ్రామ సభలు పెట్టి ప్రోత్సహించడంతో స్థానికులు ఒక్కొక్కరుగా సోలార్ ప్యానెళ్లు అమర్చుకున్నారు. ఇప్పుడు ఊరంతా సౌరశక్తి మయమైంది. 3.30 కిలోవాట్ల సోలార్ సిస్టమ్ ఏర్పాటుకు సుమారు రూ.లక్షన్నర ఖర్చవుతుంది. ఇందులో ప్రభుత్వం రూ.78,000 వరకు రాయితీ ఇస్తోంది. రూపపుర గ్రామస్థుల నుంచి పాలు సేకరిస్తున్న 'బనాస్ డెయిరీ' సహకారంతో రైతులు ఈ సొమ్మును సునాయాసంగా కట్టగలిగారు. తమ బోర్డుతో 25 ఏళ్ల ఒప్పందం చేసుకున్న రూపపురను మిగతా గ్రామాలు ఆదర్శంగా తీసుకోవాలని విద్యుత్తు అధికారి ఎం.ఆర్.మోద్ అన్నారు.



మెడికల్ సీటు కోసం.. పాదం నరుక్కొన్న విద్యార్థి

వైద్యులు కావాలని కలలు కనే విద్యార్థులు.. ఆ కలను సాకారం చేసుకునేందుకు కృషి, పట్టుదలతో ప్రయత్నిస్తారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని జౌన్‌పుర్‌కు చెందిన సూరజ్ భాస్కర్ (20) మాత్రం వక్రమార్గాన్ని ఎంచుకున్నాడు. రెండుసార్లు నీట్ ప్రవేశపరీక్ష రాసి విఫలమైన అతడు.. దివ్యాంగుల కోటాలో తేలికగా సీటు పొందవచ్చని భావించి తన పాదాన్ని నరుక్కొని తీవ్రమైన చర్యకు పాల్పడ్డాడు. సూరజ్‌పై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి పారిపోయారని, పాదం తెగి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడని అతడి సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులకు సూరజ్ వాంగ్మూలంపై పలు అనుమానాలు తలెత్తాయి. అతడి డైరీలో "2026లో నేను డాక్టర్ అవుతాను" అని రాసుకొని ఉండటంతో ఆ దిశగా దర్యాప్తు కొనసాగించిన పోలీసులు కట్టుకథ గుట్టును రట్టు చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సూరజ్‌పై ఏయే సెక్షన్ల కింద కేసు నమోదు చేయవచ్చో న్యాయ సలహా తీసుకొంటున్నట్లు పోలీసులు వెల్లడించారు.

– ఇంటర్నెట్ డెస్క్



కాంగ్రెస్ భేటీకి థరూర్ దుమ్మా

దిల్లీ: కేరళ అసెంబ్లీ ఎన్నికల వ్యూహాన్ని ఖరారు చేసేందుకు దిల్లీలో శుక్రవారం ఆ రాష్ట్ర నేతలతో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నిర్వహించిన కీలక సమావేశానికి పార్టీ సీనియర్ నేత, తిరువనంతపురం ఎంపీ శశి థరూర్ గైర్హాజరయ్యారు. ఈ సమావేశానికి రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్, కేరళ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సన్నీ జోసఫ్ తదితరులు హాజరయ్యారు. ఈ కీలక సమావేశానికి ఆ రాష్ట్ర ఎంపీ శశిథరూర్ దుమ్మా కొట్టడం గమనార్హం. కోజికోడ్‌లో జరుగుతున్న కేరళ లిటరేచర్ ఫెస్టివల్ కారణంగా సమావేశానికి హాజరుకాలేకపోతున్నట్లు థరూర్ కార్యాలయం పేర్కొంది. మరోవైపు.. కేరళలో ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో థరూర్ దిల్లీ సమావేశానికి దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో రాహుల్ తనను సరిగ్గా పట్టించుకోలేదని, రాష్ట్ర నేతలు తనను పక్కన పెడుతున్నారని థరూర్ ప్రయత్నిస్తున్నారనే ఆయన సన్నిహితులు పేర్కొంటున్నారు. ఈ అంశంపై ఆయన అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచిన వారిని సత్కరించేందుకు ఈ నెల 19న కొచ్చిన్‌లో జరిగిన మహా పంచాయత్‌లో రాహుల్ వేదికపై ఉన్న ఇతర సీనియర్ నేతల పేర్లను ప్రస్తావించిన పుటికీ, అక్కడే ఉన్న థరూర్‌ను విస్మరించడం అసంతృప్తికి కారణమని భావిస్తున్నారు.

ఇరాన్ దిశగా అమెరికా సేనలు

- భారీస్థాయిలో మోహరింపు
- కదులుతున్న యుద్ధ నౌకలు, ఫైటర్ జెట్లు
- ఏమీ జరగకూడదనే అనుకుంటున్నా: ట్రంప్



దుబాయ్: అమెరికా-ఇరాన్ మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. భారీస్థాయిలో అమెరికా సైన్యం ఇరాన్ దిశగా కదులుతోంది. ఈ విషయాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా వెల్లడించారు. "ఇరాన్‌ను నిశితంగా గమనిస్తున్నాం. భారీ సంఖ్యలో మా యుద్ధనౌకలు ఆ దేశం వైపు కదులుతున్నాయి. ఏమీ జరగకూడదనే అనుకుంటున్నా. వాటిని మేం ఉపయోగించకపోవచ్చు. ఏం జరుగుతుందో చూద్దాం" అని దావోస్ నుంచి అమెరికా వెళ్తూ 'ఎయిర్‌ఫోర్స్ వన్' విమానంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ మోహరింపుపై టెహ్రాన్ స్పందించింది. తమ వేలు ట్రిగ్గర్‌పైనే ఉందని పేర్కొంది. ఇరాన్‌లో కొంతకాలంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారీస్థాయిలో ఆందోళనలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా చెలరేగిన ఘర్షణల్లో 5,002 మంది మరణించారు. ఆందోళనకారులకు మద్దతుగా ట్రంప్ నిలిచారు. వారికి హాని కలిగిస్తే అమెరికా రంగంలోకి దిగుతుందని పలుమార్లు హెచ్చరించారు. అయితే ఆందోళనకారులకు మరణశిక్ష విధించబోమని ఇరాన్ నుంచి హామీ లభించిందని, ఆ దేశంపై సైనిక చర్య తీసుకోకపోవచ్చని గత వారం ట్రంప్ పేర్కొన్నారు. దీంతో యుద్ధం తప్పిందని అంతా భావించారు. ఇప్పుడు అమెరికా యుద్ధనౌకలు, ఫైటర్ జెట్లు, క్షిపణి వ్యవస్థలు, గగనతల రక్షణ వ్యవస్థలు ఇరాన్ వైపు కదులుతుండటంతో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. పశ్చిమాసియాలోని తమ సైనిక స్థావరాల రక్షణకు ఈ సేనలను మోహరిస్తున్నామని అమెరికా అధికారి ఒకరు వివరణ ఇచ్చారు. యుద్ధ విమానాలతో కూడిన యూఎస్‌ఎస్ అబ్రహాం లింకన్ విమాన వాహక నౌక, పలు గైడెడ్ మిసైల్ డెస్ట్రాయర్లు త్వరలోనే పశ్చిమాసియా ప్రాంతానికి చేరుకుంటాయని పేర్కొన్నారు.



జీవితానికీ ఆడిటింగ్ అవసరం

వ్యాపార సంస్థలకే కాదు, మన జీవితాన్ని సమీక్షించుకోవడానికీ ఆడిటింగ్ అవసరం. అందుకోసం తరచూ కొన్ని అంశాలను విశ్లేషించుకోవాలి. అవేంటంటే.. ✦ ఆరోగ్య స్థితి ✦ ఆర్థిక పరిస్థితి ✦ కుటుంబ సంబంధాలు ✦ కెరీర్‌లో ఎదుగుదల ✦ వ్యక్తిగత పురోగతి. దీనివల్ల మనం సరిదిద్దుకోవాల్సిన లోపాలు, మెరుగుపర్చుకోవాల్సిన అంశాలు, అందుకోసం చేపట్టాల్సిన చర్యలేంటో తెలుస్తుంది.

– రుచి కోక్రా, రచయిత్రి

జైల్లో ఖైదీల మధ్య ప్రేమ.. పెళ్లి



ఆమెపై 1, అతడిపై 5 హత్యకేసులు

జైపుర్: దారుణమైన హత్యానేరాల కేసుల్లో జీవితఖైదు శిక్షలు అనుభవిస్తున్న ఇద్దరు ఖైదీల మధ్య రాజస్థాన్‌లోని జైపుర్ ఓపెన్ ఎయిర్ జైలులో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారి.. వివాహబంధంతో ఒకటవుతున్నారు. పెళ్లి చేసుకోవాలన్న తమ నిర్ణయాన్ని ఈ జంట అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా.. వారి అభ్యర్థనను హైకోర్టు అంగీకరించి 15 రోజుల పెరోల్ మంజూరు చేసింది. దీంతో ప్రియా సేథ్ (34), హనుమాన్ ప్రసాద్ (29) బుధవారం జైలు నుంచి విడుదల కాగా.. అదే రోజు నుంచి అల్వార్ జిల్లా బడౌదా మియో పట్టణంలో మూడు రోజుల వివాహ వేడుకలు మొదలయ్యాయి. 2018లో సంచలనం రేపిన జైపుర్ హత్యకేసులో ప్రియా దోషిగా తేలింది. డేటింగ్ యాప్ ద్వారా దుష్యంత్‌శర్మ (27) అనే యువకుణ్ని ముగ్గులోకి దింపిన ఈమె.. తన ప్రియుడితో కలిసి అతణ్ని హత్యచేసి మృతదేహాన్ని సూట్‌కేసులో కుక్కి నగర శివారులో పడేసింది. అల్వార్‌కు చెందిన ఒక మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొన్న హనుమాన్ ప్రసాద్ 2017లో ఆమె భర్తను, ముగ్గురు కుమారులు, మేనల్లుడిని హత్య చేశాడు. ప్రియా, ప్రసాద్‌లకు 2023లో కోర్టు జీవితఖైదు విధించింది. జైపుర్ జైల్లో శిక్ష అనుభవిస్తున్న క్రమంలో ప్రేమించుకున్న వీరిద్దరూ హైకోర్టు మంజూరుచేసిన పెరోల్‌తో ఇప్పుడు దంపతులుగా మారనున్నారు. ప్రసాద్ చేసిన హత్యల కేసులో బాధితుల తరఫు న్యాయవాది సందీప్ లోహారియా పెరోల్ ఉత్తర్వులను హైకోర్టులో సవాలు చేస్తామని తెలిపారు.

డాన్‌బాస్ నుంచి ఉక్రెయిన్ వైదొలగాల్సిందే

- అబుధాబీలో శాంతి చర్చలకు ముందు రష్యా షరతు
- అమెరికా మధ్యవర్తిత్వంతో మొదలైన సంప్రదింపులు

అబుధాబి: నాలుగేళ్లుగా కొనసాగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికే లక్ష్యంతో అమెరికా మధ్యవర్తిత్వంతో శాంతి చర్చలు శుక్రవారం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ) రాజధాని అబుధాబీలో ప్రారంభమయ్యాయి. ఈ చర్చలు ప్రారంభానికి ముందే రష్యా ఓ షరతు విధించింది. యుద్ధం నిలిపివేయాలంటే డాన్‌బాస్ ప్రాంతం నుంచి ఉక్రెయిన్ సేనలు వైదొలగాల్సిందేనని తనను కలిసిన అమెరికా రాయబారికి రష్యా అధ్యక్షుడు పుతిన్ స్పష్టం చేశారు. ఎలాంటి ఫలితాలు వచ్చినప్పటికీ చర్చల ప్రారంభం ముఖ్యమైన విషయమని, 'డాన్‌బాస్ ప్రాంతం' కీలకమైన అంశమేనని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తనను కలిసిన విలేకరులతో పేర్కొనడం విశేషం. రష్యా షరతులు ఎలా ఉన్నప్పటికీ తాము చర్చల్లో పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. 'భగవంతుడి దయతో యుద్ధం ముగింపు దిశగా చర్చలు కొనసాగాల'ని ఆశిస్తున్నట్లు తెలిపారు.

రష్యా-ఉక్రెయిన్-అమెరికా దేశాల ప్రతినిధులు పాల్గొంటున్న చర్చలు అబుధాబీలో ప్రారంభమైన విషయాన్ని యూఏఈ విదేశాంగ మంత్రి నిర్ధారించారు. యుద్ధం ప్రారంభమైన తర్వాత శాంతి చర్చల కోసం మాస్కో-కీవ్ ప్రతినిధులు ముఖాముఖి సమావేశం కావడం ఇదే ప్రథమమని పేర్కొన్నారు. రెండు రోజుల పాటు చర్చలు కొనసాగుతాయని తెలిపారు. దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు సందర్భంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఉక్రెయిన్ అధినేత జెలెన్‌స్కీ సమావేశమవ్వడం, ఆ తర్వాత కొన్ని గంటల వ్యవధిలోనే అమెరికా రాయబారి స్టీవ్ విట్కాఫ్ మాస్కోలో పుతిన్‌తో భేటీ కావడం తెలిసిందే. ఇది జరిగిన మరుసటి రోజే శాంతి చర్చలు ప్రారంభమయ్యాయి. రష్యా ముందస్తు షరతు విధించినప్పటికీ ఉక్రెయిన్ చర్చలకు సిద్ధమవడం, అమెరికా తదితర దేశాల్లో జప్తు చేసిన తమ దేశం ఆస్తుల్లో బిలియన్ డాలర్లను గాజా పునరుద్ధరణకు విరాళంగా ఇస్తామని పుతిన్ ప్రకటించడం ఓ సానుకూల అంశంగా అంతర్జాతీయ నిపుణులు భావిస్తున్నారు.

అమెరికాను వణికించనున్న భీకర మంచు తుపాను

16 కోట్లమందిపై ప్రభావం చూపే అవకాశం



న్యూయార్క్‌లో మంచుతో నిండిన ఓ రహదారి

డాలస్: అమెరికాను భీకర మంచు తుపాను భయపెడుతోంది. దేశంలో దాదాపు మూడింట రెండొంతుల రాష్ట్రాలపై (ప్రధానంగా తూర్పు వైపున) ఈ తుపాను శుక్రవారం సాయంత్రం (అమెరికా కాలమానం ప్రకారం) నుంచి పంజా విసరనుంది! దీని ప్రభావంతో టెక్సాస్, ఓక్లహోమా తదితర రాష్ట్రాల్లో విద్యుత్ సరఫరా, రోడ్డు రవాణాకు తీవ్ర అంతరాయం కలిగే ముప్పుంది. తుపాను నేపథ్యంలో శుక్రవారం డాలస్, అట్లాంటా, ఓక్లహోమా సహా పలు విమానాశ్రయాల్లో 800కు పైగా విమానాల రాకపోకలు ఆలస్యమవడం, రద్దవడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. వారాంతంలో తుపాను ఉద్ధృతి మరింత ఎక్కువగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మిన్నెసోటా, నార్త్ డకోటా రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు మైనస్ 46 డిగ్రీల సెల్సియస్ వరకూ పడిపోతాయని చెబుతున్నారు. మంచు బీభత్సం సృష్టించే ముప్పుండటంతో జార్జియా, మిసిసిపీ రాష్ట్రాల్లో ఇప్పటికే అత్యయిక స్థితి ప్రకటించారు. అమెరికాలో దాదాపు 16 కోట్లమందిపై ఈ తుపాను ప్రభావం ఉంటుందని అంచనా.

అత్యాధునికంగా సువిశాల సుప్రీంకోర్టు

- వచ్చే 50 ఏళ్లకు సరిపడేలా మౌలిక వసతులు
- 17, 15, 13 మంది జడ్జీలు ఆసీనులయ్యేలా మూడు విస్తృత రాజ్యాంగ ధర్మాసనాలు
- సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ వెల్లడి



ఈనాడు, దిల్లీ: దేశ రాజధాని దిల్లీలో కొలువుదీరిన సుప్రీంకోర్టు ప్రాంగణం అత్యాధునిక వసతులతో, సువిశాల భవనాలతో సరికొత్త రూపును సంతరించుకోనుంది. వచ్చే 50 ఏళ్లకు సరిపడేలా మౌలిక వసతుల కల్పన జరుగుతోందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ వెల్లడించారు. న్యాయవాదులు, కక్షిదారులకు ట్రాఫిక్ ఇబ్బందులను నివారించడానికి మెట్రో రైల్ నేరుగా కోర్టు ప్రాంగణంలోకి వచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. సుప్రీంకోర్టు భవనంలో ఇప్పుడున్న వారసత్వ భవనాన్ని యథాతథంగా ఉంచి, మిగతా అవసరాల కోసం కొత్త భవన నిర్మాణం పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. అందులో ఒకేసారి 17 మంది న్యాయమూర్తులు కూర్చొనేలా విస్తృత రాజ్యాంగ ధర్మాసనం ఉంటుందన్నారు. అలాగే 15, 13 మంది జడ్జీలతో కూడిన మరో రెండు రాజ్యాంగ ధర్మాసన కోర్టులు కూడా సిద్ధమవుతున్నాయని చెప్పారు. శుక్రవారం ఉదయం 'హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ వర్సెస్ సైబరాబాద్ ఎక్స్‌ప్రెస్‌వే లిమిటెడ్' కేసు విచారణ సమయంలో దిల్లీలోని ట్రాఫిక్ సమస్యలు ప్రస్తావనకు రాగా సీజేఐ ఈ విషయాలను తెలిపారు. 'నూతన మౌలికవసతుల పనులను కేంద్ర న్యాయ శాఖ కార్యదర్శి క్రమం తప్పకుండా ఇక్కడికొచ్చి పర్యవేక్షిస్తున్నారు. ఇవి పూర్తయితే మరో 50 ఏళ్ల ఎలాంటి సమస్యలూ ఉండవు. కక్షిదారులు, బార్ అసోసియేషన్ సభ్యులకూ సౌకర్యాల కల్పన జరుగుతోంది. మహిళా న్యాయవాదులకు ప్రత్యేక బార్‌రూం, హాల్, క్యాంటీన్, లైబ్రరీ, ఎస్కలేటర్లు, లిఫ్టులు నిర్మిస్తున్నాం. కొత్తభవనంలో సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోసం దాదాపు సీజేఐ ఛాంబర్‌తో సమానమైన కార్యాలయాన్ని నిర్మిస్తున్నారు' అని సీజేఐ వివరించారు.

రాష్ట్రపతి భవన్‌లో గ్రంథ్ కుటీర్

- ప్రారంభించిన ద్రౌపదీ ముర్ము
- తెలుగు సహా 11 ప్రాచీన భాషల పుస్తకాలకు చోటు



గ్రంథ్ కుటీర్ ప్రారంభ కార్యక్రమంలో రాష్ట్రపతి ముర్ము, కేంద్ర సహాయ మంత్రులు జయంత్ చౌదరి, రావ్ ఇంద్రజీత్‌సింగ్ తదితరులు

దిల్లీ: రాష్ట్రపతి భవన్‌లో భాగంగా ఒక గ్రంథ్ కుటీర్‌ను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము శుక్రవారం ప్రారంభించారు. ఇందులో తెలుగు, తమిళం, కన్నడ, ఒడియా సహా 11 ప్రాచీన భారతీయ భాషల పుస్తకాలు, రాతప్రతులకు చోటు దక్కింది. ఇది భారత ఘన సాంస్కృతిక, సాహితీ, మేధో వారసత్వానికి అద్దం పడుతోందని రాష్ట్రపతి భవన్ పేర్కొంది. ఇందులో పురాణాలు, తత్వశాస్త్రం, భాష, చరిత్ర, పాలన, సైన్స్ వంటి అంశాల పుస్తకాలు ఉన్నాయి. ఇప్పటివరకూ ఈ విభాగంలో వలస పాలనకు సంబంధించిన పుస్తకాలు ఉండేవి. తాజాగా వాటిని రాష్ట్రపతి ఎస్టేట్‌లోని ప్రత్యేక ప్రదేశానికి తరలించారు. భారత సాంస్కృతిక వారసత్వం గురించి ప్రజల్లో అవగాహన పెంచడానికి, వలసపాలన ప్రభావాలను వదిలించుకోవాలన్న లక్ష్యానికి అనుగుణంగా ఈ చర్యను చేపట్టినట్లు రాష్ట్రపతి భవన్ పేర్కొంది. ఇందులో తాళపత్ర గ్రంథాలు, కాగితం, చెట్టు బెరడు, వస్త్రంపై రాసిన 50 రాతప్రతులు కూడా ఉన్నాయి. గ్రంథ్ కుటీర్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థలు, సాంస్కృతిక సంస్థలు, దాతల తోడ్పాటుతో సిద్ధం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ. . భారత ప్రాచీన భాషలు దేశ సంస్కృతికి పునాదులు వేశాయని చెప్పారు.

గోవా నైట్‌క్లబ్ యజమానుల ఇళ్లలో ఈడీ సోదాలు

పణజీ: గోవాలో గత ఏడాది డిసెంబరులో జరిగిన అగ్నిప్రమాదం కారణంగా 25 మంది మరణించిన నైట్ క్లబ్ యజమానులపై మనీలాండరింగ్ కేసు నమోదు చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) వారి నివాసాలు, కార్యాలయాలపై శుక్రవారం తెల్లవారుజామున సోదాలు నిర్వహించింది. ఈ కేసులో ప్రమేయమున్న మరికొందరితో పాటు గోవా, దిల్లీ, హరియాణాల్లోని సౌరభ్ లూథ్రా, గౌరవ్ లూథ్రా, సహ వ్యవస్థాపకుడు అజయ్‌గుప్తాల కార్యాలయాలు, నివాసాలు సహా తొమ్మిది ప్రాంగణాల్లో ఏకకాలంలో సోదాలు చేసి పలు కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. 2025 డిసెంబరు 6న అర్పోరా గ్రామంలోని ఓ నైట్ క్లబ్‌లో డాన్స్ పార్టీ నిర్వహిస్తున్నప్పుడు అగ్నిప్రమాదం జరిగి 25 మంది మరణించగా, 50 మందికి పైగా గాయపడ్డారు.

200 డ్రోన్లకు ఒక సైనికుడితో మార్గదర్శనం

- ఏఐ శక్తితో చైనా ముందడుగు

బీజింగ్: డ్రోన్ యుద్ధరీతుల్లో శరవేగంగా ముందడుగు వేస్తున్నట్లు చైనా సైన్యం పేర్కొంది. కృత్రిమ మేధస్సు (ఏఐ) పరిజ్ఞానంతో 200కుపైగా డ్రోన్లను ఒకే సైనికుడితో నియంత్రించే సామర్థ్యాన్ని సాధించినట్లు తెలిపింది. ఈ లోహవిహంగాలు ఒక సమూహంలా పనిచేస్తాయని వివరించింది. ఈ మేరకు జాతీయ రక్షణ పరిజ్ఞాన విశ్వవిద్యాలయం నిర్వహించిన ఒక మూక డ్రోన్ పరీక్ష వివరాలను చైనా అధికారిక మీడియా సీసీటీవీ విడుదల చేసింది. మూకదాడి చేయగల డ్రోన్లు.. ఏఐ, డేటా లింక్‌లపై ఆధారపడి పనిచేస్తాయి. స్వల్ప సమయంలో వందల డ్రోన్లు నింగిలోకి రాగలవు. ఇవి నిర్దిష్ట రీతుల్లో విహరిస్తూ.. స్వయంప్రతిపత్తితో కూడిన అల్గోరిథమ్‌ల ద్వారా తమ మధ్య లక్ష్యాలను పంచుకుంటాయి. ఏకకాలంలో బహుళ లక్ష్యాలపై నిఘా, దాడులు చేయగలవని సీసీటీవీ కథనం పేర్కొంది. కొత్తగా రూపొందించిన ఇంటెలిజెంట్ కంట్రోల్ మాడ్యూల్ వల్ల ఇది సాధ్యమైందని వివరించింది.

'సర్'తో పెరుగుతున్న ఆత్మహత్యలు: మమత



కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో నడుస్తున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమం వల్ల ఒత్తిడి భరించలేక రోజుకు ముగ్గురు నలుగురు ఓటర్లు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తెలిపారు. ఇంతవరకు మొత్తం 110 మంది మరణించారని.. ఆత్మహత్యాయత్నం చేసి ఆసుపత్రిపాలైన 40-45 మంది చావుబతుకుల్లో కొట్టుమిట్టాడుతున్నారని మమత పేర్కొన్నారు. ఇంతవరకు 1.38 కోట్లమంది ఓటర్లను సర్ విచారణకు పిలిచారని. . ఇప్పటికే 58 లక్షల మంది పేర్లు తొలగించారని ఆమె వెల్లడించారు. నేతాజీ సుభాష్ చంద్ర బోస్ జయంతి సందర్భంగా శుక్రవారం కోల్‌కతాలో జరిగిన కార్యక్రమంలో మమతా ప్రసంగించారు. నేతాజీ ఇప్పుడు బతికి ఉంటే ఆయన పౌరసత్వాన్ని కూడా సందేహించేవారని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.


ఈసారి దాడి చేస్తే తీవ్ర పర్యవసానాలు: ఇరాన్



మహ్మద్ పక్పౌర్

దుబాయ్: అమెరికా సైనిక మోహరింపులను నిశితంగా పరిశీలిస్తున్నామని ఇరాన్ పేర్కొంది. తమ వేలు ట్రిగ్గర్‌పైనే ఉందని ఇరాన్ ఐఆర్‌జీసీ అధిపతి మహ్మద్ పక్పౌర్ హెచ్చరించారు. తప్పుడు అంచనాలతో తమపై దాడులు చేస్తే తీవ్ర పర్యవసానాలను అమెరికా, ఇజ్రాయెల్ ఎదుర్కోవాల్సి ఉంటుందని అన్నారు. తమ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ నుంచి ఆదేశాలు అందిన మరుక్షణమే తాము శత్రువులపై విరుచుకుపడతామని తేల్చి చెప్పారు. తన ఒత్తిడి కారణంగానే 800 మంది ఆందోళనకారులకు మరణశిక్షను తాము నిలిపివేశామని ట్రంప్ చెబుతున్న మాటల్లో వాస్తవం లేదని ఇరాన్ పేర్కొంది. "నిరాధారమైన వాదనిది. మా న్యాయవ్యవస్థ అలాంటి నిర్ణయం తీసుకోలేదు" అని ఇరాన్ ప్రధాన న్యాయాధికారి మహమ్మద్ మొవహెది పేర్కొన్నారు.

50 దాకా అంకెలు రాయలేదని కుమార్తెను కొట్టి చంపాడు



ఫరీదాబాద్: హరియాణాలోని ఫరీదాబాద్‌లో కర్కోటకుడైన ఓ తండ్రి 50 దాకా అంకెలు రాయలేదన్న కారణంగా నాలుగేళ్ల కుమార్తెను కొట్టి చంపినట్లు పోలీసులు శుక్రవారం వెల్లడించారు. నిందితుని సిటీ కోర్టులో హాజరుపరిచి పోలీస్ రిమాండుకు తరలించారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని సోన్‌భద్ర్ జిల్లాకు చెందిన కృష్ణ జైస్వాల్ (31) ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తూ స్థానికంగా అద్దె ఇంట్లో ఉంటున్నాడు. ఈయన భార్య కూడా మరో కంపెనీలో పనిచేస్తోంది. ఈ నెల 21న భార్య విధులకు వెళ్లగా.. ఇంట్లో ఉన్న జైస్వాల్ కుమార్తెను అంకెలు రాయమన్నాడు. ఆ చిన్నారి రాయలేకపోవడంతో కోపోద్రిక్తుడైన తండ్రి ఆమెను తీవ్రంగా కొట్టాడు. ఆ దెబ్బలకు తాళలేక పాప చనిపోయింది. సాయంత్రం తల్లి ఇంటికి వచ్చాక ఈ విషయం బయటపడింది. భర్తపై ఆమె ఫిర్యాదు చేయడంతో పోలీసులు జైస్వాల్‌ను అదుపులోకి తీసుకున్నారు.

దక్షిణ చైనా సముద్రంలో కార్గో నౌక బోల్తా.. ఇద్దరి మృతి

బ్యాంకాక్: దక్షిణ చైనా సముద్రంలో 21 మంది ఫిలిప్పీన్స్ దేశస్థులతో ప్రయాణిస్తున్న కార్గో నౌక బోల్తా పడి ఇద్దరు మృతి చెందగా.. మరో నలుగురు గల్లంతయ్యారు. చైనా కోస్ట్ గార్డ్, నౌకా దళం చేపట్టిన ఆపరేషన్‌లో 15 మందిని రక్షించినట్లు శుక్రవారం చైనా అధికార వర్గాలు వెల్లడించాయి. స్కార్‌బరో షోల్ ప్రాంతానికి 100 కిలోమీటర్ల దూరంలో గురువారం రాత్రి ఈ నౌక బోల్తా పడిందని తెలిపాయి.

కశ్మీర్‌ను ముంచెత్తుతున్న హిమపాతం

జమ్మూలో రవాణా సర్వీసులకు అంతరాయం



జమ్మూ-కశ్మీర్‌లోని బుడ్గామ్‌లో శుక్రవారం మంచులో నడుస్తున్న పౌరులు

జమ్మూ: జమ్మూ-కశ్మీర్‌లో భారీగా మంచు కురుస్తోంది. గురువారం సాయంత్రం నుంచి విపరీతంగా మంచు కురుస్తుండడంతో పలు ప్రాంతాలు శ్వేతవర్ణంలోకి మారాయి. ప్రతికూల వాతావరణం కారణంగా, పలు రోడ్లను మూసేశారు. కీలక ప్రాంతాల్లో రైల్వే సేవలను రద్దు చేశారు. ఇక్కడ కురుస్తోన్న మోస్తరు వర్షాలు విమాన సేవలకూ అంతరాయం కలిగించాయి. శ్రీనగర్ విమానాశ్రయంలో కార్యకలాపాలన్నీ రద్దయినందున విమాన రాకపోకలను నిలిపివేసినట్లు అధికారులు శుక్రవారం తెలిపారు. దట్టంగా మంచు కురుస్తోన్న పూంచ్, ఉదంపుర్ జిల్లాల్లో చిక్కుకుపోయిన 100 మందిని రెస్క్యూ సిబ్బంది రక్షించారు. కొన్ని ప్రాంతాల్లో మంచు రెండు అడుగుల మేర పేరుకుపోవడం ఇక్కడి పరిస్థితులకు అద్దం పడుతోంది. జమ్మూలోని మాతా వైష్ణో దేవి ఆలయంలోనూ మంచు కురవడంతో కొన్ని గంటలపాటు యాత్రను నిలిపివేశారు. విపరీతంగా కురుస్తోన్న హిమపాతం వల్ల జమ్మూ-శ్రీనగర్ జాతీయరహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడిందని, వేల వాహనాలు నిలిచిపోయాయని అధికారులు తెలిపారు. మొఘల్ రోడ్డు, శ్రీనగర్-లేహ్ జాతీయ రహదారి, సింథాన్ రోడ్లనూ మూసివేసినట్లు పేర్కొన్నారు. మరోవైపు, అవలాంచ్(మంచు ఉప్పెన) ఏర్పడే ప్రమాదమున్న ఆరు జిల్లాలకు అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. స్థానిక ప్రజలు, పర్యాటకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఐదేళ్ల చిన్నారిని నిర్బంధించిన అమెరికా ఇమ్మిగ్రేషన్ అధికారులు

మిన్నియాపొలిస్: అమెరికాలో ఐదేళ్ల చిన్నారిని ఇమ్మిగ్రేషన్ అధికారులు నిర్బంధించడం ఆందోళన రేకెత్తిస్తోంది. మిన్నెసోటాలోని ఓ ప్రీస్కూల్ నుంచి ఇంటికి వెళ్తున్న చిన్నారిని, అతడి తండ్రిని ఫెడరల్ అధికారులు అదుపులోకి తీసుకొని, వారిని టెక్సాస్‌లోని ఓ నిర్బంధ కేంద్రానికి తరలించారు. స్కూల్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. స్కూల్ నుంచి ఇంటికి వెళ్లిన లియామ్ కోనెజో రామోస్ అనే బాలుడిని అధికారులు నిర్బంధించారు. 2024లో ఈ చిన్నారి కుటుంబం అమెరికాకు వలస వచ్చింది. బహిష్కరణకు సంబంధించి వారికి ఎలాంటి ఉత్తర్వులు జారీ కాలేదని బాలుడి కుటుంబసభ్యులు తెలిపారు. వలసదారులపై కఠినంగా వ్యవహరిస్తున్న అమెరికా ప్రభుత్వం.. తండ్రిని నిర్బంధించేందుకు బాలుడిని అధికారులు ఎరగా ఉపయోగించారని పలు విమర్శలు వెల్లువెత్తున్నాయి. వీటిపై ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ స్పందిస్తూ.. ఇమ్మిగ్రేషన్ అధికారులు చిన్నారి తండ్రిని మాత్రమే లక్ష్యంగా చేసుకున్నారన్నారు. ఈ ఘటనను అమెరికా మాజీ ఉపాధ్యక్షురాలు కమలాహారిస్ తీవ్రంగా ఖండించారు. ఇది తనను తీవ్రంగా కలచివేసిందని 'ఎక్స్' వేదికగా ఆమె పోస్టు పెట్టారు. చిన్నారి తండ్రి అడ్రియన్ అలెగ్జాండర్ కోనెజో అరియాస్ ఈక్వెడార్ జాతీయుడని హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం ప్రతినిధి పేర్కొన్నారు. దేశంలో చట్టవిరుద్ధంగా ఉంటున్న అతడిని అదుపులోకి తీసుకునేందుకు ఆపరేషన్ నిర్వహించారని, పిల్లాడి భద్రత కోసం ఓ అధికారి అతడితోనే ఉన్నట్లు ఆయన తెలిపారు.

కంప్యూటర్ కోడ్‌లు రాయడంలో పెరిగిన ఏఐ వాడకం

తాజా అధ్యయనంలో వెల్లడి

దిల్లీ: వివిధ దేశాల్లో కంప్యూటర్ ప్రోగ్రామ్‌లు రాయడంలో కృత్రిమ మేధ(ఏఐ) వాడకం పెరుగుతోంది. 2024 చివరి నాటికి అమెరికాలో కొత్తగా రాసిన కోడ్‌లలో ఏఐ సహాయంతో రాసినవి దాదాపు మూడో వంతు ఉన్నట్లు తాజా అధ్యయనం ఒకటి వెల్లడించింది. జర్మనీ, ఫ్రాన్స్, భారత్ వంటి దేశాల్లోనూ డెవలపర్లు కోడ్‌లు రాయడంలో ఏఐను ఎక్కువగా ఉపయోగిస్తున్నారంది. కాంప్లెక్సిటీ సైన్స్ హబ్ (ఆస్ట్రియా), అట్రెక్ట్ యూనివర్సిటీ (నెదర్లాండ్స్)కు చెందిన పరిశోధకులు దాదాపు 1.60 లక్షల మంది రాసిన 3 కోట్ల పైథాన్ కోడ్‌లను విశ్లేషించారు. ఆ వివరాలు 'సైన్స్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. "అమెరికాలో ఏఐ సహాయంతో రాసే కోడ్‌ల శాతం 2022లో 5 శాతం ఉండగా, 2024 చివరి నాటికి అది దాదాపు 30 శాతానికి చేరింది. ఫ్రాన్స్‌లో ఇది 24 శాతం, జర్మనీలో 23, భారత్‌లో 20, రష్యాలో 15, చైనాలో 12 శాతంగా ఉంది. జూనియర్ డెవలపర్లు రాసే కోడ్‌లలో ఏఐ సహాయం 37 శాతంగా ఉండగా, సీనియర్ డెవలపర్లలో అది 27 శాతంగా ఉంది. కానీ, ఉత్పాదకత మాత్రం సీనియర్ డెవలపర్లలోనే ఎక్కువగా ఉంది. ఏఐ సహాయం సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లలో సగటున 3.7 % ఉత్పాదకతను పెంచింది" అని అధ్యయనంలో పేర్కొన్నారు.



నొయిడాలోని ఓ పాఠశాలలో తనిఖీలు

నొయిడాలో 20 పాఠశాలలకు బాంబు బెదిరింపులు

నొయిడా, అహ్మదాబాద్: గణతంత్ర దినోత్సవానికి ముందు.. పాఠశాలలకు బాంబు బెదిరింపులు రావడం కలకలం సృష్టించింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని నొయిడాలోని 20 ప్రైవేటు పాఠశాలలు సహా గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఉన్న పలు స్కూళ్లకూ ఈ బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. అప్రమత్తమైన అధికారులు తనిఖీలు చేపట్టారు. నొయిడాలోని గౌతం బౌద్ధ నగర్ జిల్లాలోని 20 ప్రైవేటు పాఠశాలలకు విదేశీ అడ్రస్‌తో మెయిల్ బెదిరింపులు వచ్చాయని అధికారులు తెలిపారు. విద్యార్థులను పాఠశాల నుంచి బయటకు పంపించారు. తనిఖీల్లో ఎటువంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదని పోలీసులు వెల్లడించారు. మరోవైపు అహ్మదాబాద్‌లో దాదాపు డజను పాఠశాలలకు బూటకపు బాంబు బెదిరింపులు అందినట్లు అధికారులు పేర్కొన్నారు.

చరిత్ర వక్రీకరణలో మోదీని మించినోళ్లు లేరు

కాంగ్రెస్ నేత జైరాం రమేశ్



దిల్లీ: చరిత్రను వక్రీకరించడంలో ప్రధాని మోదీని మించినోళ్లు లేరని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సుభాష్ చంద్రబోస్ 129వ జయంతి సందర్భంగా ప్రధానిపై శుక్రవారం ఆయన 'ఎక్స్' వేదికగా పలు విమర్శలు చేశారు. "గత నెలలో పార్లమెంటు వేదికగా 'వందేమాతరం' గీతంపై జరిగిన చర్చలో మోదీ చరిత్రను వక్రీకరించారు. రవీంద్రనాథ్ ఠాగూర్ ప్రతిష్ఠను దెబ్బతీసి ఆయనకు అపఖ్యాతి తెచ్చేలా ప్రధాని వ్యవహరించారు" అని జైరాం పేర్కొన్నారు.

ప్రాజెక్టు ప్రారంభించాక పర్యావరణ అనుమతులు పొందడానికి చట్టంలో ఉన్న అవకాశాన్ని సవాలు చేస్తూ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఎక్స్ పోస్ట్ ఫ్యాక్టో పర్యావరణ అనుమతులు చట్టవిరుద్ధమని, ప్రజారోగ్యానికి అవి హానికరమని, పాలనను అపహాస్యం చేస్తాయన్నారు. ఆరావళి పునర్నిర్వచనంపై అంతకు ముందు ఇచ్చిన తీర్పుపై గత డిసెంబరు 29న జరిపిన సమీక్షను స్ఫూర్తిగా తీసుకుని ఈ పిటిషన్‌ను దాఖలు చేసినట్లు తెలిపారు.



విజయవాడ బస్టాండ్ పక్కనే ఉన్న త్రిశక్తి పీఠంలో సామూహిక అక్షరాభ్యాసాలు..



సరస్వతీ అలంకారంలో ఉన్న దుర్గమ్మను దర్శించుకుంటున్న విద్యార్థులు

అక్షర వసంతం.. ఆనందం అనంతం..

వసంత పంచమి సందర్భంగా శుక్రవారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ ఆలయం భక్తులతో రద్దీగా మారింది. ఉదయం 5గంటల నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. వసంత పంచమి సందర్భంగా దుర్గమ్మను సరస్వతీ దేవిగా అలంకరించారు. సాయంత్రం 6గంటల వరకు 65వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

-విజయవాడ వన్‌టౌన్, కృష్ణలంక, న్యూస్‌టుడే

అందుబాటులో 2,528 టన్నుల యూరియా

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో రబీ పంటల సాగు నేపథ్యంలో ఈనెల 23వ తేదీ నుంచి రాబోయే తొమ్మిది రోజులకు 1,250 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, ప్రస్తుతం 2,528 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి విజయకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎరువుల కొరత లేదని ఆమె వివరించారు.

ఇంటిగ్రేటెడ్ టెర్మినల్‌కు.. రీటెండర్లు

● ముందుకురాని గుత్తేదారులు.. నిబంధనల సడలింపు
● ఈ నెల 27న మళ్లీ పిలిచేందుకు కసరత్తు



ఈనాడు, అమరావతి

విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో రూ.470 కోట్లతో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ టెర్మినల్‌కు సంబంధించి మిగులు పనుల కోసం గత నెలలో పిలిచిన టెండర్లకు గుత్తేదారుల నుంచి స్పందన రాలేదు. ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్(ఈపీసీ) విధానంలో పిలిచిన టెండర్లకు కనీసం ఒక్కరు కూడా ముందుకొచ్చి బిడ్లను దాఖలు చేయలేదు. మిగులు పనులను మూడు నెలల్లో పూర్తి చేయాలని టెండరు నిబంధనల్లో పెట్టారు. కీలకమైన దశలో ఉన్న పనులు కావడంతో. . ఎంత సమయంలో పూర్తిచేయాలనేది నిర్ణయించి, బడ్జెట్ అంచనాలు రూపొందించి.. పనులు చేపట్టడం కష్టమవుతుందని, అందుకే బిడ్లను దాఖలు చేయలేదంటూ గుత్తేదారుల నుంచి అభిప్రాయాలొచ్చినట్టు తెలిసింది.

★ ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ పనులు ఇప్పటికే 80శాతం పూర్తయ్యాయి. వాస్తవంగా 2022 చివరి నాటికే పూర్తవ్వాల్సి ఉన్నా గుత్తేదారు సంస్థ ఎన్‌కేజీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ తీరుతో తీవ్ర జాప్యమైంది. దీంతో మిగిలిన 20 శాతం పనుల్లో జాప్యం జరగకుండా ఉండేందుకు.. ఎన్‌కేజీ ఇన్‌ఫ్రాను భారత విమానయాన సంస్థ(ఏఏఐ) తప్పించేసింది. మిగులు పనుల పూర్తికి మరో కొత్త సంస్థను ఎంపిక చేసేందుకు గత నెలలో టెండర్లను పిలిచి.. జనవరి 6 వరకూ సమయం ఇచ్చారు. ఎవరూ రాకపోవడంతో మరో ఐదు రోజులు పొడిగించారు. అయినా స్పందన లేకపోవడంతో టెండర్లను రద్దు చేశారు.

ఏ పని ఎంత ఉందనేది గుర్తించి..

ప్రస్తుతం నిబంధనలు సడలించి మళ్లీ కొత్తగా టెండర్లను పిలిచేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే దీనిపై విజయవాడ విమానాశ్రయం నుంచి నివేదికను సైతం ఏఏఐకి పంపించారు. ఈనెల 27న కొత్తగా మళ్లీ టెండర్ నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్నట్టు తెలిసింది. ఈసారి ఈపీసీ విధానంలో కాకుండా.. ఏఏ పనులు ఎంత మిగిలాయనే దానిని బట్టి టెండర్లు పిలవనున్నారు. ఒక్కో పని ఎంత పూర్తయింది, ఇంకా ఎంత ఉంది, దానికి ఎంత ఖర్చు, సమయం పడుతుందనేది నిర్ణయించి.. వేర్వేరుగా కేటాయించేందుకు కసరత్తు చేస్తున్నారు.

పీల్చేది.. రోగాలే..!

గతేడాది కంటే పెరిగిన పీఎం10

ఈనాడు, అమరావతి

విజయవాడ నగరాన్ని కాలుష్యం కమ్మేస్తోంది. తాజా గణాంకాల ప్రకారం నగరంలో కాలుష్య స్థాయి పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. గాలిలో నాణ్యత పెంచేందుకు కేంద్రం కేటాయించిన నిధులను గత వైకాపా సర్కారు పక్కదారి మళ్లించింది. దీంతో కొత్త నిధుల విడుదలకు నిబంధనలు ప్రతిబంధకంగా మారాయి.

ఏడాది	పీఎం10
2020-21	56
2021-22	67
2022-23	72
2023-24	62
2024-25	64
2025-26	65

ముప్పు ముంగిట..

★ దేశంలోని 131 అత్యంత కాలుష్య నగరాల్లో విజయవాడ ఉంది. 2020-21లో కోవిడ్ నేపథ్యంలో పీఎం10 (పర్టిక్యులేట్ మ్యాటర్) కాలుష్య పరిమాణం 56 పాయింట్లు నమోదైంది. అత్యధికంగా 2022-23లో 72 పాయింట్లు నమోదు కావడం ఆందోళన కలిగించింది. ఈ ఏడాది సైతం 65 పాయింట్లు ఉంది. ప్రమాణాల ప్రకారం పీఎం10(కాలుష్య స్థాయి) 60 పాయింట్ల వరకు ప్రభావం ఉండదు. నగరంలో గత ఆరేళ్లగా 56 నుంచి 72 మధ్య నమోదు కావడం ప్రమాద ఘంటికలు మోగిస్తోంది.



వాహనం నుంచి వెలువడుతున్న పొగ

వాహనాల వల్లే అధికం..

★ నగరంలో బెంజిసర్కిల్, భవానీపురం, రామవరప్పాడు, ఎంజీరోడ్డు, పాలిక్లినిక్ రోడ్ ఇలా 13 ప్రాంతాల్లో ఎక్కువ మోతాదులో కాలుష్యం నమోదవుతోంది.

రూ. 71.18 కోట్లు మాయం..

★ 2026 నాటికి గాల్లో పీఎం-10 కాలుష్య కారకాలను 40శాతం తగ్గించడమే లక్ష్యంగా కేంద్రం 2019లో ఎన్‌సీఏపీ(నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం)ని ప్రారంభించింది. కాలుష్య నివారణ పార్కులు, ఫౌంటెన్ల ఏర్పాటు, సిమెంటు రహదారుల నిర్మాణం.. నగరంలో పారిశుద్ధ్యం యంత్రాల కొనుగోలు చేపట్టాలి.

★ విజయవాడకు 2020 నుంచి 2023 మధ్య రూ. 124.35కోట్లు కేటాయించారు. ఇందులో రూ.53.17 కోట్లు మాత్రమే వినియోగించింది. మిగిలిన మొత్తాన్ని పక్కదారి మళ్లించింది. నిబంధనల ప్రకారం 75శాతం పనులు చేసి చెల్లిస్తేనే తదుపరి బిల్లులు వస్తాయి. దీంతో కూటమి సర్కారు వచ్చాక గత రెండేళ్లలో రూ.63 కోట్లు మంజూరైనా నిధులు జమ కావడం లేదని తెలిసింది.

అవగాహన కార్యక్రమాలు పెడుతున్నాం

★ దీనిపై పీసీబీ ఈఈ శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాలుష్య నియంత్రణకు అవగాహన కార్యక్రమాలు పెడుతున్నాం. ప్రజలు సైతం విద్యుత్తు వాహనాలు వాడాలి. వాహనాల కండిషన్ సవ్యంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి అని తెలిపారు.

% కొంతకాలం కిందట తిరుపతి ఐఐటీ బృందం చేసిన అధ్యయనంలో వాహనాల ద్వారా 33.1శాతం, నిర్మాణ రంగం, రహదారుల నుంచి 24శాతం కాలుష్యం ఉత్పత్తి అవుతోంది. పరిశ్రమల వల్ల దాదాపు 10శాతం కాలుష్యమవుతున్నట్లు తేలింది.

జాతీయ కబడ్డీ పోటీల విజేత హరియాణా



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు తదితరులు

గుడివాడ, న్యూస్‌టుడే : గుడివాడలోని నందమూరి తారక రామారావు క్రీడా ప్రాంగణంలో ఐదు రోజులుగా నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా 69వ జాతీయ అండర్- 14 కబడ్డీ పోటీల్లో శుక్రవారం ఫైనల్‌లో హిమాచల్‌ప్రదేశ్‌పై హరియాణా జట్టు విజయం సాధించింది. నాకౌట్ పద్ధతిలో నిర్వహించిన పోటీల్లో 27 రాష్ట్రాల జట్లు పాల్గొన్నాయి. ఫైనల్‌లో హరియాణా 51 పాయింట్లు, హిమాచల్‌ప్రదేశ్ 24 పాయింట్లు సాధించగా.. 27 పాయింట్ల తేడాతో హరియాణా ఎస్జీఎఫ్ జాతీయ కబడ్డీ విజేతగా నిలవగా.. హిమాచల్ ప్రదేశ్ 2వ స్థానంలో నిలిచింది. మరో పక్క 3వ స్థానం కోసం మహారాష్ట్ర, తమిళనాడు పోటీ పడగా మహారాష్ట్ర విజేతగా నిలిచింది. తమిళనాడు 4వ స్థానం పొందింది. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు తదితరులు విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

అడుగిడితే జోగి.. అడుగడుగునా యాగీ..

■ విజయవాడ- హైదరాబాద్ రహదారిపై స్తంభించిన ట్రాఫిక్
■ పోలీసులు అడ్డుకున్నా.. గొడవ పడి మరీ బలప్రదర్శన

ఈనాడు, అమరావతి- న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం: నకిలీ మద్యం కేసులో బెయిల్‌పై విడుదలైన జోగి రమేష్, అతని తమ్ముడు రాము తమ అనుచరులతో కలిసి అనధికారికంగా కార్లు, ద్విచక్ర వాహనాలతో జాతీయ రహదారిపై శుక్రవారం హల్‌చల్ చేశారు. విజయవాడ జిల్లా జైలు నుంచి విడుదలైన తర్వాత.. వారు, తమ అనుచరులు కలిసి కార్లతో ర్యాలీగా విజయవాడ- హైదరాబాద్ ఎన్‌హెచ్- 65 మీదుగా ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం రింగ్ వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి డీజేలు పెట్టి.. బాణసంచా కాలుస్తూ.. ఊరేగింపుగా ఇబ్రహీంపట్నం ఫెర్రీ సమీపంలోని జోగి ఇంటికి వెళ్లేందుకు వైకాపా శ్రేణులు సన్నాహాలు చేశారు. జోగి సోదరులు, అనుచరుల కార్లు రింగ్ వద్దకు రాగానే.. అరుస్తూ.. డీజే పెట్టి.. జాతీయ రహదారిపై ట్రాఫిక్‌ను ఆపేసి మరీ.. హంగామా ఆరంభించగా పోలీసులు డీజేను తొలగించారు. ర్యాలీని అడ్డుకోవడంతో ఆగ్రహంతో జోగి రమేష్, రాము ఇద్దరూ కారులో నుంచి బయటకొచ్చి, అనుచరులతో కలిసి పోలీసులతో గొడవకు దిగారు. **అనుమతి లేదన్నా వినకుండా..** ర్యాలీకి అనుమతి లేదంటూ.. జోగి రమేష్ కారును మాత్రం ఇంటికెళ్లమంటూ విజయవాడ పశ్చిమ ఏసీపీ దుర్గారావు సూచించారు. దీంతో జోగి ఆగ్రహంతో ఊగిపోతూ.. 'నువ్వు ఎవరు ట్రాఫిక్‌ను ఆపడానికి? కార్లన్నింటినీ పంపించు. నువ్వు ట్రాఫిక్ దగ్గర ఏం చేస్తున్నావ్?, గతంలో ర్యాలీలు జరగలేదా? ఏం ఏసీపీ.. ఏందయ్యా ఇదీ?' అంటూ వెటకారంగా మాట్లాడారు. అందరినీ వదలాల్సిందేనంటూ పట్టుబట్టారు. ఆ సమయంలో జోగి అనుచరులు పోలీసులను చుట్టుముట్టి.. ఈలలు, అరుపులతో నినాదాలు చేశారు. జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించడంతో.. విధిలేక పోలీసులు జోగి, అతని అనుచరుల కార్లన్నింటినీ విడిచిపెట్టడంతో ర్యాలీగా ఇంటి వరకూ హంగామా చేస్తూ వెళ్లారు. అనుమతి లేకుండా ర్యాలీ, ఊరేగింపు చేపట్టినందుకు జోగి రమేష్, అతని సోదరుడిపై పోలీసులు కేసు నమోదు చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.



పోలీసులతో దురుసుగా మాట్లాడుతూ..



ఇబ్రహీంపట్నం రింగ్ వద్ద గుమికూడిన వైకాపా శ్రేణులు

చికెన్ బిర్యానీకి పోటీగా.. ఇడ్లీ.. దోశ

ఈనాడు- ఈనాడు డిజిటల్, అమరావతి



విజయవాడ వాసులు చికెన్ బిర్యానీ ఇష్టంగా తింటారనేది తెలిసిందే. కానీ ఇడ్లీ, దోశలు కూడా అంతేస్థాయిలో లాగించేస్తున్నారనే విషయం ఆసక్తికరం. ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తే.. ఇంటికి ఆహారాన్ని తీసుకొచ్చే సంస్థల్లో ఒకటైన స్విగ్గీ 2025 ఏడాదికి సంబంధించిన వివరాలను తాజాగా విడుదల చేసింది. విజయవాడ పరిధిలో 2025 జనవరి 1 నుంచి నవంబరు 30 వరకు తమ సంస్థ ద్వారా ఏ ఆహారం ఎక్కువగా వినియోగదారులకు చేర్చారనే విషయాలను తెలియజేసింది.

7.78 లక్షల ఆర్డర్లు..

★ విజయవాడలో గత కొన్నేళ్లుగా చికెన్ బిర్యానీదే అగ్రస్థానం. ఈసారి కూడా 11 నెలల వ్యవధిలో 7.78 లక్షల చికెన్ బిర్యానీలను ఆహార ప్రియులకు స్విగ్గీ డెలివరీ చేసింది. ★ రెండో స్థానంలో 3.2 లక్షల ఆర్డర్లతో ఇడ్లీ, మూడో స్థానంలో 2.7 లక్షల వెజ్ దోశలను నగరవాసులు ఇంటికి తెప్పించుకుని తిన్నారు.

నగరవాసుల తొలి ప్రాధాన్యం ఈ మూడింటికే..

★ భోజనం తర్వాత, ముందు ఆరగించే గులాబ్ జామ్, పూర్ణం బూరెలు, బొబ్బట్లు, బూందీ లడ్డూ, కాజూ బర్ఫీ, చాక్లెట్ కేక్, అప్రికాట్ కేక్.. లాంటివి లాగిస్తున్నారు. ★ బెంగాలీ, పంజాబీ వంటకాలను ఆస్వాదించే వాళ్లూ పెరుగుతున్నట్టు సంస్థ వెల్లడించింది. గతంతో పోలిస్తే ఈసారి 30 నుంచి 35శాతం పెరిగారు. ★ సమయాన్ని బట్టి ఉదయం అల్పాహారంలో ఇడ్లీ, వెజ్‌దోశతో పాటు ఉల్లి దోశ, పూరీ, వడలతో పాటు నగ్గెట్స్, వెజ్ పిజ్జా, ఫ్రెంచ్‌ఫ్రైస్‌లూ అధికంగానే తింటున్నారు. ★ మాంసాహార ప్రియులు మాత్రం స్నాక్స్‌గా.. చికెన్ బర్గర్, చికెన్ ఫ్రై, చికెన్ పిజ్జా, చికెన్ పాప్‌కార్న్‌లు తింటున్నారు.

పూర్ణం బూరెలు.. బొబ్బట్లు..

బెజవాడ జంక్షన్‌కు డిమాండ్ పెరిగింది..

విజయవాడ జంక్షన్‌లో రైల్వే ప్రయాణికుల కోసం.. ఫుడ్ ఆన్ ట్రైన్ ద్వారా ఆర్డర్లను అందజేస్తున్నారు. ఈ ఆర్డర్లలో బెజవాడ జంక్షనే అగ్రస్థానంలో నిలిచింది. గతేడాదితో పోలిస్తే 2025లో ఆర్డర్ల సంఖ్య 233శాతం పెరిగినట్టు సంస్థ ప్రకటించింది. దేశంలోనే అత్యధిక ఆర్డర్లలో ఇది ఒకటి కావడం గమనార్హం.

ఒక్కో ఖాతాకు.. రూ.60వేలు

☛ స్థాయిని, వ్యక్తిని బట్టి వెచ్చించిన సూర్య
☛ అద్దె ఖాతాల కేసులో వెలుగులోకి కీలక అంశాలు

ఈనాడు, అమరావతి

బెట్టింగ్, సైబర్ నేరాలకు ఉపయోగించే అద్దె ఖాతాలను తెరిపించేందుకు ఒక్కో దానికి రూ.60వేల వరకు వివిధ స్థాయిల్లో కమీషన్ల రూపంలో మోసగాళ్లు వ్యయం చేస్తున్నారు. ఈ మొత్తాన్ని ఖాతాదారులకు, సహకరించినవారికి వివిధ స్థాయిల్లో ఇస్తున్నారు. రూ.కోట్లలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు వినియోగించే ఈ ఖాతాలకు భారీ స్థాయిలో వెచ్చిస్తున్నారు. ఇటీవల విజయవాడలో వెలుగుచూసిన మ్యూల్ ఖాతాల కేసు దర్యాప్తులో పలు అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. నిందితులు సూర్య (ఏ1), సౌభాగ్యలక్ష్మి (ఏ4) మూడు రోజుల కస్టడీ శుక్రవారంతో ముగిసింది. విచారణ అనంతరం వీరిని సాయంత్రం నగరంలోని మూడో ఏసీజేఎం కోర్టులో న్యాయాధికారి తిరుమలరావు ఎదుట పోలీసులు హాజరుపర్చారు. అనంతరం రిమాండ్‌కు తరలించారు.

వారి నుంచే అధికం

ప్రధానంగా ముగ్గురి నుంచే నిందితుల ఖాతాలను తీసుకున్నట్లు చెప్పారు. నల్లమేకల వేణుగోపాల్, గోపీకృష్ణ, మౌలాలి ఈ వ్యవహారంలో కీలకపాత్ర పోషించినట్లు తేలింది. అప్పట్లో ఓ ప్రైవేటు బ్యాంకులో పనిచేసిన మౌలాలి అందరి కంటే ఎక్కువగా 80 నుంచి 90 వరకు, గోపీకృష్ణ.. 40, వేణుగోపాల్ 17 ఖాతాలు తెరిపించి సూర్యకు అందజేశారు. ప్రతి ఖాతాదారుడికి రూ.10వేలు, కృష్ణారెడ్డికి రూ.20వేలు, మౌలాలికి రూ.25వేలు వంతున సూర్య సర్దుబాటు చేసేవాడు. తనకు వచ్చే 0.5శాతం కమీషన్‌లో నుంచి ఇలా ప్రతి అంచెలోని వ్యక్తికి అందజేసేవాడు. ఫిలిప్పీన్స్‌లో ఉన్న స్రవంతికి ఎంత ముట్టేది? అన్నది ఇంకా తేలలేదు.

పరారీలో ముగ్గురు నిందితులు

అద్దె ఖాతాల వ్యవహారంలో కీలకంగా వ్యవహరించిన పల్నాడు జిల్లాకు చెందిన వేణుగోపాల్, గోపీకృష్ణ, మౌలాలిని కూడా పోలీసులు నిందితులుగా చేర్చారు. వీరు ప్రస్తుతం పరారీలో ఉన్నారు. వీరి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ ముగ్గురు దొరికితే పలు విషయాలు బయటకు వచ్చే అవకాశం ఉంది. మాజీ బ్యాంకు ఉద్యోగి అయిన మౌలాలి.. నగరంలో ఉన్న ఇతర రాష్ట్రాలకు చెందిన వారికి కూడా మాయమాటలు చెప్పి ఖాతాలు తెరిపించినట్లు దర్యాప్తులో తేలింది. వీరు ఖాతాలు తెరిచిన బ్యాంకులకు సమాచారం కోసం పోలీసులు లేఖలు రాయనున్నారు. వివరాలు వచ్చిన తర్వాత ఖాతాదారులను పిలిపించి ప్రశ్నించనున్నట్లు తెలిసింది.

సీసీ కెమెరాలు గుర్తించాయ్!

★ కుటుంబాల చెంతకు అదృశ్యమైన మహిళ, బాలిక

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే

★ ప్రసాదంపాడుకు చెందిన ఒక మహిళ (50) కుటుంబ సమస్యలతో ఈనెల 19న ఇంటి నుంచి వెళ్లిపోయింది. పోలీసులు కేసు నమోదు చేసి విజయవాడ..ఆ తరువాత శ్రీకాళహస్తిలో అణువణువు గాలించారు. చివరకు నరసరావుపేటలో ఉన్నట్లు గుర్తించి కుటుంబీలకు అప్పగించారు.

★ పటమట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఒక బాలిక (13) ఈనెల 21న ఉదయం 6 గంటల సమయంలో ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. పోలీసులు కూచిపూడిలో బాలిక ఉన్నట్లు గుర్తించి.. తీసుకొచ్చి కుటుంబసభ్యులకు అప్పగించారు.



సీసీ ఫుటేజీలో మహిళ

ఈ రెండు కేసుల్లో ఇంట్లో నుంచి వెళ్లిపోయిన వారిని గుర్తించడంలో సీసీ కెమెరాలు ముఖ్య భూమిక పోషించాయి. అదృశ్యం కేసు నమోదు కాగానే వారిని గుర్తించేందుకు నగరాన్ని జల్లెడ పడుతున్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఎన్టీఆర్ జిల్లాలో 10,550 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వాటిలో ముఖాలు, వాహనాల నంబరు ప్లేట్లను గుర్తించే కెమెరాలు ఉన్నాయి. వీటినే పోలీసులు కేసు దర్యాప్తుల్లో వినియోగిస్తున్నారు.

నగరాన్ని జల్లెడ పట్టి.. ప్రసాదంపాడుకు చెందిన మహిళ మిస్సింగ్ కేసు దర్యాప్తును పోలీసులు వేగంగా చేశారు. వారి ఇంటికి సమీపంలో ఒక దుకాణం, ఒక అపార్టుమెంట్ దుకాణం వద్ద ఉన్న సీసీ కెమెరాల ద్వారా మహిళ ఆటో ఎక్కినట్లు గుర్తించారు. అక్కడ నుంచి వరుసగా ఉన్న కెమెరాలను చూసుకుంటూ రామవరప్పాడు రింగ్ వద్ద ఆర్టీసీ బస్సు ఎక్కినట్లు, ఆ తరువాత ఉదయం 5.30 గంటల సమయంలో బస్టేషన్‌లో ఆమె కదలికలను గుర్తించారు. ఆ తరువాత శ్రీకాళహస్తిలో ఉన్నట్లు గుర్తించి అక్కడకు చేరుకున్నారు. అక్కడ ఒక మహిళతో మాట్లాడినట్లు సీసీ కెమెరాలో గుర్తించారు. ఆమె చెప్పిన మేరకు నరసరావుపేటకు చేరుకుని అక్కడ మహిళను గుర్తించి విజయవాడకు తీసుకొచ్చి కుటుంబసభ్యులకు అప్పగించారు. బాలికను సైతం ఇలాగే గుర్తించి కూచిపూడి నుంచి తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

నారా లోకేశ్ ట్వీట్: 'ఎన్టీఆర్ జిల్లా పోలీసులు కొన్ని గంటల్లోనే తప్పిపోయిన మహిళను కనుగొన్నారు. ఆందోళన చెందుతున్న కుటుంబానికి ఉపశమనం కలిగించారు. వారి బాధను అర్థం చేసుకుని సమస్యను పరిష్కరించినందుకు ధన్యవాదాలు. ప్రజాసేవకు ఎప్పుడూ కట్టుబడి ఉందాం..' అంటూ ఎన్టీఆర్ జిల్లా పోలీసులను అభినందిస్తూ మంత్రి నారా లోకేశ్ ట్వీట్ చేశారు.


యువతకు మంచి భవిష్యత్తే లోకేశ్ లక్ష్యం



కేక్ కోస్తున్న ఎంపీ శివనాథ్, ఎమ్మెల్యే ఉమా, మాజీ ఎమ్మెల్సీ వెంకన్న తదితరులు

పటమట, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ అరాచక విధానాలను నిలదీసి, ప్రజలకు అండగా నిలిచి ప్రజా ప్రభుత్వ ఏర్పాటులో మంత్రి లోకేశ్ కీలక పాత్ర పోషించారని ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, రాష్ట్ర యువతకు మంచి భవిష్యత్తు అందించడమే లక్ష్యంగా ఆయన ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. శుక్రవారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో ఎంపీ శివనాథ్ ఆధ్వర్యంలో లోకేశ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ఉమా, మాదేకుల కార్పొరేషన్ ఛైర్మన్ నాగుల్‌మీరా, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అనంతరం పేదలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. మంత్రి లోకేశ్‌పై ఏపీ నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ రచించిన గీతాన్ని ఎంపీ ఆవిష్కరించారు. లోకేశ్ ఆయురారోగ్యాలతో ఉండాలని రాష్ట్ర క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు స్వామిదాసు నేతృత్వంలో పాదర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శివనాథ్ మాట్లాడుతూ.. ప్రపంచ స్థాయి కంపెనీలను రాష్ట్రానికి రప్పించేందుకు లోకేశ్ నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.8 లక్షల చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బొప్పన భవకుమార్, చెన్నుపాటి గాంధీ, చెరుకూరి రాజేశ్వరరావు, ఎరుబోతు రమణరావు, పేరేపి ఈశ్వర్, చెన్నుపాటి ఉషారాణి, జాస్తి సాంబశివరావు, సంజయ్ వర్మ, సొలంకి రాజు, పరిసపోగు రాజేష్, పామర్తి కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

శభాష్.. ధీరజ్



యోగాసనాల్లో శ్రీకృష్ణ పతకాల సాధన

న్యూస్‌టుడే-విజయవాడ క్రీడలు

నగరానికి చెందిన దేవరాజుగట్టు ధీరజ్ శ్రీకృష్ణ మార్షల్ ఆర్ట్స్‌లో పాటు యోగాసన పోటీల్లో సత్తా చాటుతున్నాడు. పదో తరగతి చదువుతున్న ధీరజ్.. శశికళ, నాగరాజు దంపతుల చిన్న కుమారుడు. 2019లో మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ప్రారంభించాడు. యూట్యూబ్‌లోనూ కొన్ని వీడియోలు చూసి నాన్-చాక్, స్వార్డ్ (కత్తి)తో ప్రదర్శన ఇవ్వడంపై సాధన చేశాడు. కొవిడ్ కాలంలో యోగాపై దృష్టి సారించాడు. దీనిలో రాణించాలని తరువాత ఢిల్లీ, ముంబయిలోని శిక్షకుల పర్యవేక్షణలో అడ్వాన్స్డ్ యోగాసనాలపై శిక్షణ తీసుకున్నాడు. 2021లో తొలి సారి నగరంలో జరిగిన రాష్ట్ర స్థాయి ఆర్టిస్టిక్ యోగాసన పోటీలో బాలుర సబ్ జూనియర్ విభాగంలో పసిడి పతకం సాధించాడు. వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో తలపడి ఇప్పటివరకు 40కి పైగా పసిడి పతకాలు సొంతం చేసుకున్నాడు.

సాధించిన విజయాలు కొన్ని..

- 2022-24 వరకు దక్షిణకొరియాలో జరిగిన అంతర్జాతీయ యోగాసన పోటీల్లో మూడేళ్లు పసిడి పతకాలు సాధించాడు.
- గత ఏడాది నవంబరులో హిమాచల్ ప్రదేశ్‌లోని 'ఉనా'లో జరిగిన జాతీయ స్థాయి పోటీలో పసిడి కైవసం చేసుకున్నాడు.
- గత ఏడాది జనవరిలో సింగపూర్‌లో జరిగిన ఏషియన్ యోగాసన పోటీలో ఒక పసిడి, 2 రజతం, ఒక కాంస్యం సాధించాడు.
- గత ఏడాది జూన్ 17, 18వ తేదీల్లో నిర్వహించిన యోగాంధ్ర-2025లో పసిడి పతకం వరించింది.
- యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం విశాఖలో నిర్వహించిన ప్రదర్శనలో ఆసనాలు వేశాడు. ప్రధాని మోదీ అభినందనలు పొంది 'ఆంధ్రప్రదేశ్ యోగా స్టార్' బిరుదు అందుకున్నాడు.
- గత ఏడాది ఆగస్టు 29న విశాఖలో నిర్వహించిన కార్యక్రమంలో 'వాంధియన్' అవార్డును మంత్రి లోకేశ్ చేతుల మీదుగా తీసుకున్నాడు.
- విజయవాడ క్లబ్‌లో ఏపీటీఏ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి 'ఎక్సలెన్స్ అవార్డు-2025'ను అందుకున్నాడు.

పెళ్లి సంబంధాల కోసం చూస్తున్నారా

కాపు/నాయుడు/తెలగ కుల వధూవరులకు సువర్ణావకాశం

నేడు, రేపు కాపు/నాయుడు/తెలగ కుల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్



తెలుగింటి వివాహ వరంపరులకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి, కాపు/నాయుడు/తెలగ కుల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తుంది. విజయవాడ ఆటోనగర్‌లోని స్టాలిన్ కార్పొరేట్ బిల్డింగ్, బి బ్లాక్, 3వ అంతస్తులోని ఈనాడు కార్యాలయం వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురుచూస్తున్న వారు, సంబంధిత తల్లిదండ్రులు **నేడు, రేపు** (24 & 25 **జనవరి 2026**) ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 గం. వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు. ★ ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ పోర్టల్ యాప్ ద్వారా కూడా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫోటోలు క్రింద తెలిపిన ఫోన్ నెంబర్లకు సంప్రదించిన వాట్సాప్ ద్వారా పంపవచ్చు.

మరిన్ని వివరాలకు

95501 28306 & 92475 20500

ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చు.

వైద్యుల సమస్యల పరిష్కారమే ధ్యేయం

విజయవాడ(గవర్నర్‌పేట), న్యూస్‌టుడే: వైద్యుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఏపీ మెడికల్ కౌన్సిల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నామని డాక్టర్స్ డెమోక్రటిక్ ప్యానెల్ ప్రకటించింది. ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ నందకిశోర్, డాక్టర్ కొర్రె నేతృత్వంలో ఈ ప్యానెల్ సభ్యులు శుక్రవారం విజయవాడలోని ఐఏ హాలులో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా డాక్టర్ నందకిశోర్ మాట్లాడుతూ తమ ప్యానెల్ తరఫున మొత్తం 13 మంది సభ్యులు పోటీ చేస్తున్నామని తెలిపారు. గతంలో మేము తీసుకొచ్చిన సంస్కరణలను దృష్టిలో ఉంచుకుని వైద్యుల సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యం ఇస్తున్నామని వివరించారు. మా ప్యానెల్ ఎన్నికల్లో విజయం సాధిస్తే ఏపీ మెడికల్ కౌన్సిల్‌కు సొంత భవనం నిర్మిస్తామన్నారు. వైద్యుల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు, డిమాండ్ల సాధనకు మా ప్యానెల్‌ను గెలిపించాలని కోరారు. సమావేశంలో ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ జయధీర్, డాక్టర్ వెంకటసుబ్బారెడ్డి, డాక్టర్ అర్జున్‌కుమార్, డాక్టర్ వాణి, డాక్టర్ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అనంతరం తాడేపల్లిలోని కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు.

ఉత్సాహంగా రంగోత్సవ పోటీలు

ఈనాడు, అమరావతి: సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి రంగోత్సవ పోటీలు విజయవాడలో శుక్రవారం ఉత్సాహంగా జరిగాయి. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీస్తూ సాంస్కృతిక చైతన్యాన్ని నింపే లక్ష్యంతో ఈ పోటీలు సాగాయి. రాష్ట్రవ్యాప్తంగా 250 మంది విద్యార్థులు వీటిల్లో పాల్గొన్నారు. ప్రధానంగా జానపద నృత్యం, పాత్రధారణ, చిత్రలేఖనం, చిత్రలేఖనం, రంగోలి విభాగాల్లో విద్యార్థులు అద్భుతమైన ప్రతిభను ప్రదర్శించారు. ప్రతి విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీడీలు ప్రసన్న కుమార్, రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు పాఠశాల స్థాయిలో ప్రదర్శించే ప్రతిభ జీవితాంతం గుర్తుండిపోతుందని, పట్టుదల, అంకితభావంతో కృషి చేస్తే విజయం తప్పక వరిస్తుందని సూచించారు. సృజనాత్మకత వ్యక్తిత్వ వికాసానికి ఎంతో తోడ్పడుతుందని తెలిపారు.

ఫిగర్ స్కేటింగ్‌లో మెరిసిన తేజేష్



విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: లడఖ్‌లో ఈ నెల 20 నుంచి 26వ తేదీ వరకు జరుగుతున్న 6వ ఎడిషన్ ఖేలో ఇండియా వింటర్ గేమ్స్‌లో భాగంగా నగరానికి చెందిన తేజేష్ ఫిగర్ స్కేటింగ్‌లో తెలంగాణ రాష్ట్రానికి ఆడి రజత పతకాన్ని కైవసం చేసుకున్నాడు. గత ఏడాది నవంబరు 15 నుంచి 26వ తేదీ వరకు డెహ్రాడూన్‌లో జరిగిన జాతీయ ఫిగర్ స్కేటింగ్ జట్టు శిక్షణ శిబిరంలో పాల్గొన్నాడు. ఈ ఏడాది అక్టోబరులో జరిగే వరల్డ్ గేమ్స్‌లో జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. తేజేష్ ప్రస్తుతం కేఎల్‌యూ (హైదరాబాద్)లో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు.

వాహనచోదకులకు శిరస్త్రాణమే రక్షణ కవచం



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ తదితరులు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: వాహనచోదకుల ప్రాణాలకు శిరస్త్రాణం (హెల్మెట్) రక్షణ కవచం లాంటిదని, దీనిని విధిగా ధరించి సురక్షితంగా గమ్యానికి చేరుకోవాలని కలెక్టర్ జి.లక్ష్మీశ సూచించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని జిల్లా రవాణా, పోలీసు శాఖల ఆధ్వర్యంలో శుక్రవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద తెలుగు ర్యాలీని ఫ్లాగ్ ఆఫ్ చేసి కలెక్టర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ..ద్విచక్ర వాహనాలు నడిపే వారిలో హెల్మెట్ ధరించకపోవడం వల్లే ప్రమాదాల తీవ్రత పెరుగుతోందన్నారు. ఉత్తమంలో శిరస్త్రాణం ధరించి వాహనాలు నడపడంపై వారికి అవగాహన కల్పించి, చైతన్యవంతులను చేయడం ఎంతో అవసరమన్నారు. డీసీపీ ఎస్.కె.హరిహరన్ వేడుక మాట్లాడుతూ.. శిరస్త్రాణం లేకుండా వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేసి, జరిమానాలు విధిస్తున్నట్లు తెలిపారు. ర్యాలీలో ఏపీఐ వంశీధర్‌రావు, ఆర్.టి.ఒ.లు ఆర్.ప్రవీణ్, కె.వెంకటేశ్వరరావు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఎండీ అలీ, కె.శివరాంగాప్, ఎ.ఉదయ్ శివప్రసాద్, సీహెచ్.గీతాంజలి, కె.బి.ఎస్.కళాశాల ఏవో నారాయణరావు, మహిళలు పాల్గొన్నారు. ఎంజీ (బందరు) రోడ్డు మీదుగా ర్యాలీ సాగింది.

రీసర్వేపై అందిన ఫిర్యాదులు పరిష్కరించండి

గాంధీనగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో భూముల రీసర్వేని తాత్కాలికంగా ఆపి..ఇప్పటివరకు ప్రభుత్వానికి అందిన ఫిర్యాదులపై తగిన చర్యలు తీసుకొని, రైతులకు న్యాయం చేయాలని లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాసిన లేఖను విడుదల చేసిన అనంతరం బాబ్జీ విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో భూముల రీసర్వేలో రైతులకు మంచికంటే చెడు ఎక్కువ జరిగిందన్నారు. అందుకే ప్రభుత్వానికి 8,75,986 మంది రైతుల నుంచి ఫిర్యాదులు అందాయన్నారు. రీ సర్వే పేరుతో అధికారులు తప్పులు చేస్తే..శిక్ష రైతులు పడే రెవెన్యూ అధికారుల చుట్టూ పనిమానుకొని తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వీఆర్వో నుంచి కూడా తూతూమంత్రంగా నడుస్తోందని ఫిర్యాదుదారులు పేర్కొంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన అవసరం ఉందని ప్రభుత్వం ఆచరణ ముందే చెప్పింది. జిల్లా, రాష్ట్ర స్థాయిలో కొన్ని చోట్ల రెవెన్యూ అధికారులు తీరు మార్చుకోలేదని, తగిన సిబ్బంది లేక అధికారులు ఒత్తిడికి గురవుతున్నారని, దిగువ స్థాయి సిబ్బంది తమకు లేని నష్టం వ్యవహారాల్లో రైతుల జీవితాలతో ఆడుకుంటున్నారని ఆరోపించారు. సమావేశంలో పార్టీ నాయకులు ఉప్పులూరి రవితేజ, బి.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బోధన రుసుముల బకాయిలు విడుదల చేయాలి



నిరసన చాటుతున్న నాయకులు

రాఘవయ్యపార్క్ కూడలి (కృష్ణలంక), న్యూస్‌టుడే: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి సంక్షేమ హాస్టళ్ల సౌకర్యాలు మెరుగుపరచాలని దళిత బహుజన ఫ్రంట్ డిమాండ్ చేసింది. బాలోత్సవ భవన్‌లో సంఘం అధ్యక్షుడు కొరివి వినయ్‌కుమార్ అధ్యక్షతన శుక్రవారం ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, ఉపకారవేతనాలపై సమాలోచన సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జరిగే ఉద్యమాల్లో వైకాపా భాగస్వామిగా ఉంటుందన్నారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రభుత్వం బకాయిలు చెల్లించకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోందన్నారు. అద్దె భవనాల్లోని 600 హాస్టళ్లకు అన్ని సౌకర్యాలతో పక్కా భవనాలు నిర్మించాలన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం, వసతి, మంచినీటి సౌకర్యం సక్రమంగా లేని కారణంగా విద్యార్థులు మరణించారని పేర్కొన్నారు. ఏఐసీసీ ఏరియా ఆర్థిక పరిశీలకుడు మస్తాన్‌వలి, ఆదివాసీల భద్రత, సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేడీ శీలం, జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వి.లక్ష్మణరెడ్డి, ఏపీ బడ్జెట్ వాచ్ రాష్ట్ర కన్వీనర్ అల్లాడి దేవకుమార్, రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పులేటి దేవిప్రసాద్, ఆయా పార్టీలకు చెందిన నేతి మహేష్, పి.వరప్రసాద్, ప్రసన్న, రాజేష్, రవిచంద్ర పాల్గొన్నారు.

వెటర్నరీ ఆస్పత్రిని సందర్శించిన గుజరాత్ అధికారులు

ఈనాడు, అమరావతి: విజయవాడలోని ఎన్టీఆర్ వెటర్నరీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని శుక్రవారం గుజరాత్ పశు సంవర్థక శాఖ సంయుక్త సంచాలకుడు డాక్టర్ కిరణ్ వసావా, ఇతర అధికారులు సందర్శించారు. ఆస్పత్రిలో అందిస్తున్న వైద్యసేవలు, వ్యాధి నిర్ధారణ పరీక్షల నిర్వహణ తీరు, బెడ్ పేషెంట్ వార్డులను అధికారులు పరిశీలించారు. ఆసుపత్రిలోని సౌకర్యాలు, ఓపీ వివరాలు, అందిస్తున్న వైద్య సేవలను ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ శ్రీనివాసరావు గుజరాత్ బృందానికి వివరించారు. ఆసుపత్రిలో అందిస్తున్న సేవలు బాగున్నాయని ఏపీ పశు సంవర్థక శాఖతో పాటు, రాష్ట్ర ప్రభుత్వానికి ఈ బృందం అభినందనలు తెలిపింది.

ఇన్‌స్టాలో పరిచయం.. బాలుడి ఇంటికెళ్లిన బాలిక

పటమట, న్యూస్‌టుడే: ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన మైనర్ బాలుడి వద్దకు మైనర్ బాలిక ఇల్లు విడిచి వెళ్లడం కలకలం రేపింది. పోలీసుల వివరాల ప్రకారం.. విజయవాడ గ్రామీణ మండలం ప్రసాదంపాడుకు చెందిన 16 ఏళ్ల బాలిక పదో తరగతి ఫెయిల్ అయింది. ఓ దుకాణంలో పని చేస్తోంది. ఇన్‌స్టాలో తరచూ ఒకరితో ఛాటింగ్ చేస్తుండగా తల్లి మందలించింది. ఈ నెల 21వ తేదీ రాత్రి ఆమె సమీపంలోని అమ్మమ్మ ఇంటికి వెళ్లింది. అదే రోజు రాత్రి అమ్మ వద్దకు వెళ్తున్నానని అమ్మమ్మకు చెప్పింది. కానీ బస్సు ఎక్కి ఇన్‌స్టాలో పరిచయమైన మైనర్ బాలుడి వద్దకు వెళ్లింది. 22న కూతురు ఇంటికి రాకపోవడంతో తల్లి తన అమ్మకు ఫోన్ చేసింది. కిందట రోజు రాత్రే ఇంటికి వచ్చినట్లు ఆమె తెలిపింది. బాలికకు ఫోన్ చేయగా.. స్విచ్ఛాఫ్ వచ్చింది. 22న రాత్రే పటమట పోలీసులకు తల్లి ఫిర్యాదు చేసింది. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు బాలుడి ఇన్‌స్టా ఐడీ ద్వారా లోకేషన్ కనిపెట్టారు. పామర్రు నియోజకవర్గం కూచిపూడిలో ఉన్నట్లు గుర్తించి అక్కడికి వెళ్తుండగా... బాలుడి కుటుంబ సభ్యుల నుంచి బాలిక కుటుంబ సభ్యులకు ఫోన్ వచ్చింది. బాలిక తమ వద్ద ఉందని తీసుకొస్తున్నామని చెప్పారు. దాంతో పోలీసులు బాలిక, బాలుడిని పటమట స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఆమెను తల్లికి అప్పగించారు. వాస్తవానికి బాలికను చూసిన బాలుడి తల్లిదండ్రులు ఆందోళన చెందారు. ఇంటికి వెళ్లాలని చెప్పినా.. ఆమె నిరాకరించింది. కుటుంబ సభ్యుల ఫోన్ నంబరు కూడా ఇవ్వలేదు. చివరికి చనిపోతానని కూడా బెదిరించింది. ఎలాగోలా ఆమెను ఒప్పించి విజయవాడ తీసుకువస్తుండగా.. పోలీసులు ఎదురుపడ్డారు. స్టేషన్‌కు తీసుకెళ్లారు.

బ్రాయిలర్ ధరలు
(కిలో కి రూ.లలో)



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -150 రిటైల్ ధర 177 చికెన్ విత్ స్కిన్ - 257 చికెన్ స్కిన్‌లెస్ - 292.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & బ్రీడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 172, 181, 192 చికెన్ విత్ స్కిన్ - 334 చికెన్ స్కిన్‌లెస్ - 344.

కుటుంబసభ్యుల ధ్రువపత్రం జారీకి లంచం

అనిశా చేతికి చిక్కిన వీఆర్వో.. కేసు నమోదు



అనిశాకు చిక్కిన వంజరపు వెంకటేశ్

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: కుటుంబసభ్యుల ధ్రువపత్రం కోసం రూ.45 వేల లంచం తీసుకున్న 231 నంబరు సచివాలయం వార్డు రెవెన్యూ సెక్రటరీ వంజరపు వెంకటేశ్‌ను అనిశా అధికారులు వలపన్ని పట్టుకున్నారు. ప్రధానసూత్రధారి అయిన 229 సచివాలయం వార్డ్ రెవెన్యూ సెక్రటరీ గుడ్డేటి విజయగాంధీ పరారీలో ఉన్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి...రామలింగేశ్వరపేటకు చెందిన వృద్ధుడు కూచిభొట్ల వెంకట పర్వతేశ్వర రవి కుమార్ కుటుంబసభ్యుల ధ్రువపత్రం కోసం దరఖాస్తు చేసుకున్నారు. రెవెన్యూ సెక్రటరీ విజయగాంధీని సంప్రదించగా రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆ తరువాత మీ కోసమని ఒక సున్నా తీసేసి..రూ.50 వేలు ఇవ్వాలనడంతో రవికుమార్ అంగీకరించారు. ఆ తరువాత అనిశా అధికారులను సంప్రదించగా వారు వలపన్ని లంచం సొమ్ముతో పంపించారు. అయితే విజయగాంధీ అందుబాటులో లేకపోవడంతో 231 సచివాలయ రెవెన్యూ కార్యదర్శి వంజరపు వెంకటేశ్ అక్కడకు వచ్చారు. తానే వీఆర్వోనని.. సర్టిఫికెట్ ఇచ్చేది తానేనని చెప్పి లంచం సొమ్ము ఇమ్మన్నారు. అయితే డబ్బులు విజయగాంధీకే ఇస్తానని రవికుమార్ పట్టుపట్టారు. ఫోన్‌లో సంప్రదించిన తరువాత వెంకటేశ్‌కు డబ్బులు ఇవ్వగా అనిశా అధికారులు దాడి చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతనిపై కేసు నమోదు చేశారు. గాంధీ అక్కడకు రాకుండా పరారయ్యారు. అతని కోసం గాలింపు చేపట్టారు.

కృష్ణా వర్సిటీ సాఫ్ట్‌బాల్ పోటీలు నేడే

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక ఆంధ్రా లయోలా కళాశాల మైదానంలో ఈ నెల 24వ తేదీన కృష్ణా విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల పురుషుల సాఫ్ట్‌బాల్ పోటీలు నిర్వహించి, వర్సిటీ జట్టు ఎంపిక చేస్తామని స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి జె.నవీన లావణ్యలత తెలిపారు. పోటీలో తలపడే ఆసక్తి గల కళాశాలలు, జట్టు లేకుండా ఎంపిక పోటీలో వ్యక్తిగతంగా పాల్గొనే క్రీడాకారులు 24వ తేదీ ఉదయం 9 గంటలకు మూడు సెట్ల అర్హత పత్రాలతో పాటు క్రీడాకారుల గుర్తింపు కార్డుతో కళాశాల మైదానంలో పోటీల కార్యనిర్వాహక కార్యదర్శి పి.గోపికి రిపోర్టు చేయాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 92480 18778 నంబరులో సంప్రదించాలని సూచించారు.

న్యాయం చేశాకే రహదారి పనులు చేపట్టాలి

గొల్లపూడి, న్యూస్‌టుడే : జక్కంపూడిలోని రైతులు, 60:40 స్థల యజమానులతో సంప్రదించకుండా ఖమ్మం- విజయవాడ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారని స్థల యజమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం జక్కంపూడిలో ఆయా నిర్మాణ పనుల వద్ద స్థల యజమానులు నిరసన తెలిపారు. 60:40 స్థలాల యజమానుల సంఘం అధ్యక్షుడు ధనేకుల వెంకట సుబ్బారావు, కోశాధికారి ఆలూరి వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ ఈ రహదారి 60:40 స్థలాల్లోంచి వెళ్తుందని, దీంతో తామంతా నష్టపోతున్నామన్నారు. గతంలో 60:40 నిష్పత్తిలో తమ పొలాలను ప్రభుత్వానికి ఇచ్చామన్నారు. ప్రస్తుతం ఆ స్థలాల్లోంచి ఖమ్మం రహదారి వెళ్తుందని, ఏవిధమైన భూసేకరణ చేయకుండా, నష్టపరిహారం చెల్లించకుండా పనులు చేపట్టడం తగదన్నారు. స్థల యజమానులు బసవయ్య, మహేష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టం పరిరక్షణకు పోరాటం

రాఘవయ్యపార్క్ కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నిరంకుశ చట్టాలను అమల్లోకి తెస్తోందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు పేర్కొన్నారు. బాలోత్సవ భవన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెలలో జరిగిన పార్టీ కేంద్ర కమిటీ సమావేశాలు, విజయవాడలో జరిగిన రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశాల్లో కీలక అంశాలు, ప్రమాదకర సంస్కరణలపై చర్చించినట్లు చెప్పారు. ఉపాధి హామీ చట్టాన్ని గతంలో మాదిరిగానే అమలు చేయాలని ఈనెల 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 5 వరకు పార్టీ ఇంటింటి ప్రచారాన్ని చేపడుతున్నట్లు వెల్లడించారు. జనవరి 30న మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఉపాధి హామీ చట్టం పరిరక్షణకు పోరాడతామని ప్రతిజ్ఞ చేయడంతోపాటు 2వ తేదీ వరకు సంతకాల సేకరణ చేపట్టి గ్రామ సచివాలయాల్లో మహజర్లు సమర్పిస్తామన్నారు. 'వీబీ జీ రామ్ జీ'తో ప్రజలకు తీవ్రమైన హాని జరుగుతుందని, కేంద్రం తనకు నచ్చిన రాష్ట్రాలకు నిధులిచ్చుకునేలా చట్టంలో మార్పులు చేసి పనిదినాల్లో కోత పెట్టిందన్నారు. చట్టం అమల్లోకి వస్తే రాష్ట్రాలు అప్పుల పాలై సామాజిక న్యాయం దెబ్బతింటుందన్నారు. లేబర్‌కోడ్లతో కార్మికులు కనీస హక్కులు కోల్పోతారని, ఎనిమిది గంటల పనివిధానం రద్దవుతుందన్నారు. ప్రమాదకర మినీ అణు విద్యుత్తు కేంద్రాలను విదేశీ వ్యక్తులు నేరుగా ఏర్పాటు చేసుకునేలా బిల్లు తెస్తున్నారని, ప్రమాదాలు తలెత్తితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. సీడ్ బిల్లు వల్ల కార్పొరేట్ సంస్థలకు లాభాలు వస్తాయని, వ్యవసాయం దెబ్బతింటుందని హెచ్చరించారు. ప్రైవేటీకరణకంటే ప్రమాదకర పీపీపీ విధానాన్ని గత వైకాపా, ప్రస్తుత తెదేపాలు అనుసరిస్తున్నాయన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడారు.

స్టార్ షట్లర్ సూర్య చరిష్మకు సన్మానం

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్టార్ షట్లర్ తమిరి సూర్య చరిష్మను డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య వర్సిటీ ఉప కులపతి డాక్టర్ పి.చంద్రశేఖర్, రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికారెడ్డి శుక్రవారం వర్సిటీలో ఘనంగా సన్మానించారని స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఇ.త్రిమూర్తి తెలిపారు. ఇటీవల నగరంలో జరిగిన జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో చరిష్మ వ్యక్తిగత విభాగంలో పసిడి, టీమ్ విభాగంలో కాంస్య పతకాలు సొంతం చేసుకుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో చరిష్మ తండ్రి నవీన్‌బాబు, కోచ్ కె.భాస్కర్ పాల్గొన్నారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

రాజశ్యామలాదేవి నవరాత్రోత్సవం


శ్యామలాదేవిగా అలంకారం

కంభంపాడు(ఎ.కొండూరు), న్యూస్‌టుడే: మండలంలోని కంభంపాడు శివాలయంలో రాజశ్యామలా దేవి నవరాత్రోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఆలయంలోని విజయదుర్గాంబిక అమ్మవారిని అర్చకులు శ్యామలాదేవిగా అలంకరించి విశేష పూజలు చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

స్పందన: తిరువూరు పట్టణం 18వ వార్డులోని డ్రెయిన్లలో మట్టి, చెత్త పేరుకున్నాయని స్థానికుడు శివ ప్రసాద్ 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా సమస్యను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన శానిటరీ అధికారి సతీష్ తమ సిబ్బందిని పంపించి డ్రెయిన్లను శుభ్రం చేయించారు.

✦ తిరువూరు పట్టణం 10వ వార్డులోని మురుగు కాలువల్లో వ్యర్థాలు పేరుకుని నీటి పారుదలకు ఆటంకంగా ఉందని స్థానికుడు ప్రసన్న కుమార్ 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సమస్యను మున్సిపల్ అధికారుల దృష్టికి తెచ్చారు. వెంటనే స్పందించిన శానిటరీ అధికారి తమ సిబ్బంది ద్వారా కాలువను శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించి సమస్య పరిష్కరించారు. - న్యూస్‌టుడే, తిరువూరు

✦ చెవుటూరు ఎస్సీ ఏరియాలో కొన్ని రోజులుగా వీధి దీపాలు వెలగక అవస్థలు పడుతున్నామని స్థానికులు సమస్యను ఈనాడు 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా అధికారులకు తెలిపారు. స్పందించిన పంచాయతీ కార్యదర్శి రమాదేవి, సర్పంచి పిన్నిబోయిన శ్రీదేవి సిబ్బంది ద్వారా విద్యుత్తు దీపాలు అమర్చడంతో వీధులు వెలుగులు నింపాయి. - న్యూస్‌టుడే, జి.కొండూరు

వైభవంగా దీపాలంకరణ సేవ

నెమలి(గంపలగూడెం): మండలంలోని నెమలి వేణుగోపాల స్వామి గుడిలో శుక్రవారం అష్టోత్తర శత దీపాలంకరణ సేవను వైభవంగా నిర్వహించారు. అర్చకుడు గోపాలాచార్యులు ఆధ్వర్యంలో రుత్విక బృందం, భక్తులు దీపాలు వెలిగించారు. అద్దాల మండపంలో రుక్మిణి, సత్యభామా సమేత వేణుగోపాల స్వామి ఉత్సవమూర్తులను పవళింపు వేదికను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

నిబంధనలకు అనుగుణంగా భూ రీసర్వే


శిక్షణార్థులకు సూచనలిస్తున్న తిరువూరు ఆర్డీవో మాధురి

తిరువూరు, న్యూస్‌టుడే: స్థానిక బాలికోన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న భూ రీసర్వే శిక్షణ కార్యక్రమాన్ని ఆర్డీవో కె.మాధురి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా శిక్షణార్థులతో మాట్లాడుతూ భూ రీసర్వే ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా, జాగ్రత్తతో నిర్వహించాలని సూచించారు. సరిహద్దుల నిర్ధారణలో స్పష్టత ఉండాలని, భూ రికార్డుల సమగ్రంగా పరిశీలించి క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహించాలన్నారు. తిరువూరు డివిజన్ పరిధిలోని డిప్యూటీ తహసీల్దార్లు, సర్వేయర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్వచ్ఛ రథం ప్రారంభం నేడు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: స్వచ్ఛ రథం ప్రారంభ కార్యక్రమం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం నిర్వహించనున్నామని ఎంపీడీవో శ్రీమంతుల శుక్రవారం తెలిపారు. కార్యక్రమంలో మైలవరం ఎమ్మెల్యే కృష్ణప్రసాద్, కలెక్టర్ లక్ష్మీశ పాల్గొంటారని చెప్పారు. మండల అధికారులు అందరూ పాల్గొనాలని కోరారు.

ముఖ్యమంత్రి సహాయనిధితో పేద ప్రజలకు మేలు

మైలవరం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సహాయనిధి(సీఎంఆర్ఎఫ్) ద్వారా అందజేస్తున్న ఆర్థిక సాయంతో ఎంతో మంది పేదలకు మేలు కలుగుతోందని స్థానిక శాసన సభ్యుడు వసంత కృష్ణప్రసాద్ అన్నారు. మండలంలోని 43 మందికి మంజూరైన చెక్కులను స్థానిక ఆయన కార్యాలయంలో లబ్ధిదారులకు శుక్రవారం అందజేశారు. 30 మందికి రూ.9,23,564లు మంజూరు కాగా, మరో 13 మందికి రూ.20,02,578 విలువైన ఎల్ఓసీలను మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

నేత్రదానం అభినందనీయం


జానకమ్మ, కృష్ణకుమారి (పాత చిత్రాలు)

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని తోటమూలకు చెందిన నాళ్ల కృష్ణకుమారి(74) మృతి చెందగా కుటుంబ సభ్యులు ఆమె నేత్రాలను శుక్రవారం శివశంకర్ ఆర్గాన్ కంటి ఆసుపత్రికి దానం చేశారు. లయన్స్ క్లబ్ ప్రతినిధి జి.కృష్ణారెడ్డి బొరంపాటి నేత్రదాన అవశ్యకతను వివరించడంతో కుటుంబ సభ్యులు అంగీకరించారు.

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: తాను తనువు చాలించినా ఆ నేత్రాలు లోకాన్ని చూస్తూనే ఉండాలని ఓ వృద్ధురాలు భావించారు. ఇబ్రహీంపట్నానికి చెందిన పి.జానకమ్మ(70) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఆమె కుమారుడు రఘు తల్లి కోరిక మేరకు నేత్రాలను దానం ఇవ్వడానికి సిద్ధమై శంకర్ ఐ బ్యాంకుకు సమాచారమిచ్చారు. వైద్యులు వచ్చి తగిన జాగ్రత్తలతో వాటిని సేకరించి ఐ బ్యాంకుకు తరలించారు.

అంగన్‌వాడీ చిన్నారుల ఆరోగ్యానికి భరోసా

ఇబ్రహీంపట్నం గ్రామీణం, కొండపల్లి, న్యూస్‌టుడే

అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. ఇటీవల చిన్నారులకు చదువు, ఆటలు, కథలు, మంచి అలవాట్లు, పూర్వ గణితం వంటి అంశాలున్న నవ చేతన, ఆధార శిల అనే పుస్తకాలను అందజేసింది. ప్రస్తుతం కేంద్రాల్లోని విద్యార్థుల ఆరోగ్యం కోసం మందుల పెట్టెలను ఇచ్చింది. ఇందులో అత్యవసర పరిస్థితుల్లో ప్రాథమిక వైద్యం చేయడానికి అవసరమయ్యే మందులున్నాయి. వైకాపా ప్రభుత్వం కేంద్రాలకు ఈ కిట్లను అందించకుండా అటకెక్కించింది. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చాక ఇప్పటికే రెండు సార్లు కిట్లు అందజేసింది. ఈ క్రమంలో కేంద్రంలోని చిన్నారులు అనారోగ్యానికి గురైనా, ఆటపాటల్లో గాయపడినా ప్రాథమిక వైద్యం అందిస్తారు. దీనిపై ఆయాలకు, అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ కూడా ఇచ్చారు.

సర్వసాధారణం : చిన్నారులకు కాలానుగుణ వ్యాధులు, చిన్న చిన్న ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడడం సర్వసాధారణం. వీరి కోసం 11 రకాల మందులు ఉన్న కిట్లను కేంద్రాలకు సరఫరా చేశారు. మైలవరం ఐసీడీఎస్ పరిధిలోని ఇబ్రహీంపట్నం, మైలవరం, జి.కొండూరు మండలాల్లోని 243 కేంద్రాలకు వీటిని అందజేశారు. దీంతో 11 వేల మంది చిన్నారులకు ఆరోగ్య భద్రతపై భరోసా లభించింది. కిట్టులో గాయాలకు, చెవి పోటు, జ్వరానికి, దగ్గు, జలుబు, నీళ్ల విరేచనాలు తదితర వాటి నివారణకు ఉపయోగపడే మందులు ఉన్నాయి. అవి ఎలా పని చేస్తాయి? ఏ మోతాదులో ఉపయోగించాలో అవగాహన కల్పించారు.

కేంద్రాలపై పర్యవేక్షణ : ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో కార్యక్రమాలు పరిశీలిస్తున్నాం. చదువు, ఆటపాటలతో పాటు మౌలిక వసతులు కల్పిస్తున్నాం. చిన్నారుల ఆరోగ్య భద్రతపై ప్రభుత్వం ముందు చూపుతో ప్రతి కేంద్రానికి కిట్లు సరఫరా చేసింది. అవసరమైన సమయాల్లో తగిన మోతాదులో వాటిని వాడాలని కార్యకర్తలకు తెలియజేశాం. - పుష్పలత, సీడీపీవో, మైలవరం

రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలబెట్టేందుకు లోకేశ్ కృషి


మైలవరంలో కేకు కోస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్


తిరువూరులో ద్విచక్ర వాహన ర్యాలీ


చిలుకూరు అంగన్‌వాడీ కేంద్రంలో..

ఆంధ్రప్రదేశ్‌ను అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలబెట్టేందుకు మంత్రి నారా లోకేశ్ విశేషంగా కృషి చేస్తున్నారని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ తెలిపారు. తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కేకులు కోసి బాణసంచా కాల్చారు. పలు చోట్ల రక్తదాన శిబిరాలు, అన్నదానాలు, వస్త్ర దానాలు చేశారు. - న్యూస్‌టుడే, బృందం


విస్సన్నపేట తెదేపా కార్యాలయంలో రక్తదాన శిబిరం


గంపలగూడెంలో..


ఎ.కొండూరులో..


గొల్లపూడిలో కూటమి నాయకులు


నాగులూరులో..


కొండపల్లిలో అన్నదానం


కవులూరులో..

ఘనంగా వసంత పంచమి వేడుక


ఊటుకూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు


మైలవరం లీలావతి స్కూల్లో సరస్వతీ దేవి పూజ

మైలవరం, న్యూస్‌టుడే: వసంత పంచమిని పురస్కరించుకుని స్థానిక లీలావతి పాఠశాలలో విద్యార్థులతో సరస్వతీ దేవికి పూజలు చేయించారు. వసంత పంచమి విశిష్టతను ప్రధానోపాధ్యాయుడు ఉడతా లక్ష్మీనారాయణ వివరించారు. మండలంలో అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు కార్యకర్తలు ఆధ్వర్యంలో అక్షరాభ్యాసాలు చేశారు. ఊటుకూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో వావిళ్ల క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో సరస్వతీ దేవి విగ్రహానికి పూజలు నిర్వహించారు. విద్యార్థులకు పరీక్ష అట్టలు, పెన్నులు ఇచ్చారు.


ఎన్టీటీపీఎస్ ఏ- కాలనీలో..

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లో వసంత పంచమి వేడుకలు నిర్వహించారు. పెనుగొ


పెనుగొలనులో చిన్నారులకు అక్షరాభ్యాసం

నిర్వహణ లోపం.. పర్యవేక్షణ శూన్యం


శిథిలావస్థకు చేరిన పంచాయతీ రాజ్, రోడ్లు, భవనాల శాఖ బంగ్లా

తిరువూరు, న్యూస్‌టుడే

తిరువూరు పట్టణంలో రూ.కోట్లు ప్రజాధనంతో నిర్మించిన ప్రభుత్వ ఆస్తులపై పర్యవేక్షణ లేక శిథిలావస్థకు చేరుకున్నాయి. ఒకప్పుడు ప్రజలకు సేవలందించేందుకు వినియోగించిన కార్యాలయ భవనాలు నేడు పాడు పడిపోతున్నాయి. సరైన నిర్వహణ, కాలనుగుణంగా మరమ్మతులు చేపట్టక పోవడంతో ప్రస్తుతం అధ్వానంగా తయారయ్యాయి. పలు శాఖలకు చెందిన భవనాలు కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. కొన్ని చోట్ల తలుపులు, కిటికీలు తెగిపోయి, లోపల చెత్త చెదారం, ముళ్ల పొదలు పెరిగాయి.

ఇందుకు కారణం..

ఇవి వినియోగంలో లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత శాఖల మధ్య సమన్వయ లోపం, బాధ్యతయుత పర్యవేక్షణ లేకపోవడమే ఇందుకు కారణమని చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి శిథిలావస్థలోని ప్రభుత్వ ఆస్తులపై సమగ్ర సర్వే నిర్వహించాలని, వాటి పరిస్థితిని అంచనా వేసి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. అవసరం లేని భవనాలను ఇతర శాఖలకు కేటాయించడం లేదా ప్రజాప్రయోజనాలకు వినియోగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇలా నిర్లక్ష్యంగా వదిలేస్తే రూ.కోట్ల ప్రజాధనం వృథా కావడంతో పాటు భవనాలు కూలిపోయి ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

ఆక్రమణలతో సరి.. చర్యలేవి మరి?


అడవిని తలపిస్తున్న విస్సన్నపేట పరిధిలోని ఇసుక వాగు

విస్సన్నపేట, న్యూస్‌టుడే

కొండపర్వ మెరకలు నుంచి నూజివీడు రోడ్డు పక్కగా రాణి గారి ఫంక్షన్ హాల్ నుంచి సత్తుపల్లి రహదారి వరకు విస్సన్నపేట పరిధిలో 2 కి.మీ ప్రవహించే ఇసుకవాగు ఆక్రమణలతో నిండిపోయింది. దీంతో వానకాలం వరద నీరు సక్రమంగా పోయే మార్గం లేక మండల కేంద్రం ముంపునకు గురవుతూ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పూర్వం ఇసుక వాగు ద్వారా వరద మొత్తం గ్రామంలోని పెద్ద చెరువులోకి ప్రవహించేది. కాలక్రమేణా వాగు నిర్వహణను అధికారులు పట్టించుకు పోవడంతో ఆక్రమణలతో పాటు పిచ్చి చెట్లు, పొదలు అల్లుకుపోయి అడవిని తలపిస్తోంది. ప్రతి ఏటా వరదలు పోటెత్తి పట్టణంలోని తిరుపతమ్మ పేటని ముంచెత్తడంతో సుమారు 100 కుటుంబాల వారు ముంపునకు గురికావాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు.

కట్టను ఎత్తు పెంచితే.. దీని పరిధిలో 1000 ఎకరాల ఆయకట్టు ఉంది. పేద ప్రజలు ఎక్కువగా సేద్యంపై ఆధారపడి జీవిస్తున్నారు. ఇసుక వాగులోని ఆక్రమణలను తొలగించి జంగిల్ క్లియరెన్స్ చేస్తే విస్సన్నపేటకు ముంపు ప్రమాదం తప్పుతుంది. ఆయకట్టుకు పుష్కలంగా సాగునీరు అందుతుందని నివాసితులు, సాగుదారులు అభిప్రాయ పడుతున్నారు. ఇసుక వాగు దక్షిణం వైపు కట్టను ఎత్తు పెంచి రహదారి వేస్తే విస్సన్నపేట పరిధిలోని కమ్మటూరు, గొల్లగూడెం, నిమ్మతోట బజారు, నందేటి వారి బజారు ప్రజలు సత్తుపల్లి రోడ్డుకు చేరడానికి వీలుగా ఉంటోంది. రహదారి నిర్మించడం ద్వారా కట్ట ఎత్తు పెరిగి పంట పొలాలు ముంపు బారిన పడకుండా కాపాడవచ్చని ఆయకట్టు రైతులు తెలుపుతున్నారు.

ప్రకటన

మా క్లయింట్లు, 1) ఐదుపులపాటి వర్షిని, భర్త: లేటు నాగ మల్లేశ్వరరావు, 2) ఐదుపులపాటి లావణ్య, తండ్రి: లేటు నాగ మల్లేశ్వరరావు, 3) ఐదుపులపాటి జితేంద్రనాథ్, తండ్రి: లేటు నాగ మల్లేశ్వరరావు, నివాసం: ఫ్లాటు నెం. 401, శ్రీ ఆంజనేయ రెసిడెన్సీ, గుంటుపల్లి, ఇబ్రహీంపట్నం మండలం, ఎన్.టి.ఆర్. జిల్లా వారల సంజాయిషీ పొంది యావన్మందికీ తెలియజేయునది ఏమనగా,

ఈ దిగువ దాఖలా షెడ్యూలు ఆస్తులను పార్టీషను మరియు డిక్లరేషను గురించి మా క్లయింట్లు ప్రతివాదులైన 1) ఐదుపులపాటి ఉమా మహేశ్వరరావు, 2) ఐదుపులపాటి రిషిత, 3) ఐదుపులపాటి తనుష్క (మైనరు అయినందున ఈమె తండ్రి గార్డియను ఐదుపులపాటి ఉమా మహేశ్వరరావు) మరియు 4) ఐదుపులపాటి నాగరత్నం వారిపై శ్రీయుత 13వ అదనపు జిల్లా జడ్జి కోర్టు, విజయవాడలో ఓ.ఎస్. నెం. 198/2025గు దావాను వేయటం జరిగినది. సదరు దావా పెండింగులో వున్నది.

పై తెలిపిన దావా పెండింగులో వుండగానే ప్రతివాదులు అడంగులలో పేర్లు మార్చుకొని దావా షెడ్యూలు ఆస్తులను విక్రయించుటకు ప్రయత్నించుచున్నారు. కావున షెడ్యూలు ఆస్తులను ఎవరైనను క్రయం పొందిన యెడల అటువంటి విక్రయాలు చెల్లనేరవు మరియు మా క్లయింట్లను బైండుచేయజాలవు.

దావా షెడ్యూలు ఆస్తులు: అయిటం నెం. 1: ఎన్.టి.ఆర్. జిల్లా, ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, ఇబ్రహీంపట్నం గ్రామములో గల ఆస్తికి రీ. సర్వే నెం. 287/5ఎ, 287/5బి రు దాఖలా య. 0-67 సెంట్లు శేరీ మెరక భూమికి **హద్దులు: తూర్పు:** ఐ.వెంకట శివయ్య గారి భూమి, **దక్షిణం:** పోరంబోకు (ట్యాంకు), **పడమర:** సి.హెచ్. శివరామయ్య గారి భూమి, **ఉత్తరము:** గారపాటి పకీరయ్య మరియు ఇతరుల భూమి.

అయిటం నెం. 2: ఎన్.టి.ఆర్. జిల్లా, ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, ఇబ్రహీంపట్నం గ్రామములో గల ఆస్తికి రీ. సర్వే నెం. 316/1బి2 రు దాఖలా య. 0-56 శెంట్లు శేరీ మెరక భూమికి **హద్దులు: తూర్పు:** ఐ.సుబ్బారావు గారి భూమి, **దక్షిణం:** సి.హెచ్.శివరామకృష్ణ మరియు ఇతరుల భూమి, **పడమర:** ఐ.రాధాకృష్ణమూర్తి గారి భూమి, **ఉత్తరము :** పి.సత్యనారాయణ మరియు ఇతరుల భూమి.

అయిటం నెం. 3: ఎన్.టి.ఆర్. జిల్లా, ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, ఇబ్రహీంపట్నం మండలం, గుంటుపల్లి గ్రామ పంచాయతీలో చేరిన గుంటుపల్లి గ్రామములో గల ఆస్తికి రీ. సర్వే నెం. 217/1 రు దాఖలా య 1-00 సెంట్లు శేరీ మెరక భూమికి **హద్దులు: తూర్పు:** ఐ. సుబ్బారావు గారి భూమి, **దక్షిణం:** ఇరిగేషను బోదె, **పడమర:** ఐ. రాధాకృష్ణమూర్తి గారి భూమి, **ఉత్తరము:** ఎ.సుబ్బారావు గారి భూమి.

అయిటం నెం. 4: ఎన్.టి.ఆర్. జిల్లా, ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, ఇబ్రహీంపట్నం మండలం, గుంటుపల్లి గ్రామ పంచాయతీలో చేరిన గుంటుపల్లి గ్రామములో గల ఆస్తికి రీ. సర్వే నెం. 36/2 రు దాఖలా పూరా య. 2-09 సెంట్లులో య. 0.52 శెంట్లు శేరీ మెరక భూమికి **హద్దులు: తూర్పు:** మారుపూడి విష్ణువర్ధనరావు గారి భూమి, **దక్షిణం:** మారుపూడి ప్రభాకరరావు గారి భూమి, **పడమర:** పెదర్ల నాగేశ్వరరావు గారి భూమి, **ఉత్తరము:** పెదర్ల వెంకట రామయ్య గారి భూమి.

అయిటం నెం.5: ఎన్.టి.ఆర్. జిల్లా, ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, ఇబ్రహీంపట్నం మండలం, గుంటుపల్లి గ్రామపంచాయతీలో చేరిన గుంటుపల్లి గ్రామములో గల ఆస్తికి రీ. సర్వే నెం. 287/5, అసెస్‌మెంట్ నెం. 974, డోరు నెం. 6-96రు లోని చ.గ. 487.0చు ఖాళీ నివేశన స్థలమునకు **హద్దులు: తూర్పు:** చెరుకూరి శివరామకృష్ణ గారి ఆస్తి, **దక్షిణం:** చెరుకూరి శివరామకృష్ణ గారి ఆస్తి, **పడమర:** దారి మరియు ఐ.రాధాకృష్ణమూర్తి గారి ఆస్తి, **ఉత్తరము:** ఐ.బాస్కరరావు గారి ఆస్తి.

అయిటం నెం. 6: ఎన్.టి.ఆర్. జిల్లా, ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, విజయవాడ రూరల్ మండలం, పైడూరుపాడు గ్రామపంచాయతీలో చేరిన పైడూరుపాడు గ్రామములో గల ఆస్తికి రీ. సర్వే నెం. 124/3 రు దాఖలా య. 1-26 సెంట్లు భూమికి **హద్దులు: తూర్పు:** పోరంబోకు, **దక్షిణం:** పంట కాలువ, **పడమర:** గొల్లపూడి కనకదుర్గాప్రసాద్ మరియు గొల్లపూడి ఏక్‌నాద్ గార్ల భూమి, **ఉత్తరము:** గొల్లపూడి రాజారావు మరియు గొల్లపూడి రాజా నందిశర్మ గార్ల భూమి.

అయిటం నెం. 7: ఎన్.టి.ఆర్. జిల్లా, ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, ఇబ్రహీంపట్నం మండలం, గుంటుపల్లి గ్రామపంచాయతీలో చేరిన గుంటుపల్లి గ్రామములో గల ఆస్తికి రీ. సర్వే నెం. 225 రు దాఖలా పూరా య. 1-71 సెంట్లులో య. 0.42 సెంట్లు శేరీ మెరక భూమికి **హద్దులు: తూర్పు:** డొంక, **దక్షిణం:** పెదర్ల కరుణశ్రీ గారి భూమి, **పడమర :** కాజీ భూమి, **ఉత్తరము:** పెదర్ల శేషయ్య గారి భూమి.


కురేటి శ్రీనివాసరావు
వాదుల తరపు న్యాయవాది, విజయవాడ. సెల్: 88858 86659

రైల్వే కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయం


కిశోర్, సుబ్రహ్మణ్యంలను సత్కరిస్తున్న నాయకులు

గుంటుపల్లి (ఇబ్రహీంపట్నం గ్రామీణం), న్యూస్‌టుడే : రైల్వే కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయమని ఎస్సీఆర్ ఎంప్లాయీస్ సంఘ్ డిప్యూటీ కార్యదర్శి, వ్యాగన్ వర్క్స్ షాపు శాఖ కార్యదర్శి గద్దా సురేష్ తెలిపారు. గుంటుపల్లి వ్యాగన్ వర్క్సుషాపు ఎంప్లాయీస్ సంఘ్ శాఖ నూతన ఉపాధ్యక్షులుగా ఎన్నికైన కె.కిశోర్, పి.బి సుబ్రహ్మణ్యంల అభినందన సభ వ్యాగన్ వర్క్సుషాపు సంఘ్ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కుల సాధనకు సంఘ్ రాజీలేని పోరాటాలను సాగించి ఫలితాలు సాధించిందని వివరించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నాయకులు కార్మికుల హక్కుల సాధనకు కృషి చేస్తూ తమ కార్మిక సంఘానికి పేరు తీసుకురావాలని కోరారు. నాయకులు దాసరి డేవిడ్ రాజ్, విమల్‌సాయి, శివనాగేశ్వరరావు తదితరులు మాట్లాడారు. అనంతరం నూతనంగా ఉపాధ్యక్షులుగా ఎన్నికైన వారిని నాయకులు, కార్మికులు ఘనంగా సత్కరించారు.

ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని వినతి


విద్యార్థులు, తల్లిదండ్రులకు కరపత్రాలు అందిస్తున్న ఉపాధ్యాయులు

కోడూరు(ఎ.కొండూరు), న్యూస్‌టుడే : మండలంలోని కోడూరులో ప్రాథమిక, జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.రామ్‌ప్రదీప్, డి.శరత్ బాబు, ఉపాధ్యాయులు వి.తేజస్విని, టి.సుప్రియ, బి.నాగేంద్రరావు ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా బడిబాట కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. 2026-27 విద్యా ఏడాదిలో విద్యార్థులను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని కోరుతూ ఇంటింటా ప్రచారం చేశారు. ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలు, సౌకర్యాలను తల్లిదండ్రులకు వివరించి కరపత్రాలు అందించారు.


'శివుని గుడి వద్ద అన్యమత ప్రార్థనలు తగదు'


విస్సన్నపేట, న్యూస్‌టుడే : కొండపర్వలోని వృద్ధాశ్రమాన్ని నిర్వాహకులు నాగరాజు, అనంత రాణి పట్టించుకోకుండా, అందులో సొంత వ్యాపారం నిర్వహిస్తున్నారని గ్రామస్థులు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఫిర్యాదు చేశారు. అంతే కాకుండా ప్రసిద్ధ శివుడి గుడి వద్ద అన్యమత ప్రార్థనలు నిర్వహిస్తూ ప్రజల ఐక్యతకు భంగం కలిగిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఏవో ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు.

నేతాజీ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం


కాచవరం ప్రాథమిక పాఠశాలలో ఫొటోలు ప్రదర్శిస్తూ..

మైలవరం, న్యూస్‌టుడే : స్వాతంత్ర్య పోరాటంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ చూపిన పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఉప ప్రిన్సిపల్ రమేష్‌రెడ్డి తెలిపారు. నేతాజీ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం కళాశాలలో ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఎన్ఎస్ఎస్ అధికారి శివహరిప్రసాద్, ఉమామహేశ్వరరెడ్డి, కోఆర్డినేటర్ పవిత్ర తదితరులు పాల్గొన్నారు.


మైలవరం: నేతాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు


గొల్లపూడిలో నివాళులర్పిస్తున్న ఉమా

గొల్లపూడి : ధైర్య సాహసాలు, పట్టుదలకు ప్రతీక నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. గొల్లపూడిలోని ఆయన కార్యాలయంలో సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి ఉమా ఘనంగా నివాళులర్పించారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం


ప్రతిజ్ఞ చేస్తున్న వెంకటరత్నం, రవికుమార్ తదితరులు

జి.కొండూరు, న్యూస్‌టుడే : బాల్య వివాహాలను నిర్మూలించి బాల్య వివాహాల రహిత రాష్ట్రంగా తీర్చి దిద్దుకునేందుకు ప్రతి ఒక్కరూ తోడ్పాటు ఇవ్వాలని అంగన్‌వాడీ సిబ్బంది రమాదేవి పిలుపునిచ్చారు. వెలగలేరులో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రదర్శనలో ఆమె పాల్గొని మాట్లాడారు. బాల్య వివాహాలతో వాటిల్లే నష్టాలను గ్రామస్థులకు వివరించారు. అనంతరం బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉప సర్పంచి కిలారు వెంకటరత్నం, వీఆర్వో యాకుబ్, చిరుమామిళ్ల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు

కొండపల్లి, న్యూస్‌టుడే : బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అన్నారు. కొండపల్లి మసీదు సెంటర్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. అనంతరం మసీదు సెంటర్ నివాసితులతో ప్రతిజ్ఞ చేయించారు.

వీధి వ్యాపారులు ఆర్థికంగా బలోపేతం కావాలి

తిరువూరు: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మెప్మా ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి ఆత్మ నిర్భర్ నిధి 2.0 కార్యక్రమం నిర్వహించారు. ఇందులో కమిషనర్ మనోజ మాట్లాడుతూ ప్రధాన మంత్రి స్వనిధి పథకాన్ని సద్వినియోగం చేసుకుని వీధి వ్యాపారులు ఆర్థికంగా బలోపేతం కావాలని ఆమె కోరారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

మామిడిలో సస్యరక్షణ చర్యలు చేపడితే దిగుబడి

జి.కొండూరు, న్యూస్‌టుడే : పూత, పిందె దశలోని మామిడి పంటకు సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడి సాధించవచ్చని నూజివీడు మామిడి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ బి.కనకమహాలక్ష్మి తెలిపారు. చెవుటూరు, కోడూరులోని మామిడి తోటలను ఆమె శుక్రవారం పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు.

పశు ఆరోగ్య వైద్య శిబిరం ప్రారంభం

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : మూలపాడు పశు వైద్యశాల వద్ద శుక్రవారం జరిగిన పశు ఆరోగ్య వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచి భాగ్యలక్ష్మి, మూలపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడు గరికపాటి శ్రీను ప్రారంభించారు. పశు వైద్యురాలు శైలుమాధురి, సిబ్బంది నరేంద్ర, సాయి, కుటుంబరావు పాల్గొన్నారు.

కొండపల్లి, న్యూస్‌టుడే : జంతు సంక్షేమ పక్షోత్సవాల సందర్భంగా టీకాల కార్యక్రమాన్ని కొండపల్లి పశు వైద్యశాలలో శుక్రవారం నిర్వహించారు. పురపాలిక సంఘ ఛైర్మన్ చిట్టిబాబు, వైస్ ఛైర్మన్ శ్రీను, వైద్యులు ఎం.హనుమంతరావు, శ్రీనివాసరావు, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

సీమ వరదాయినిగా.. అనంత వాహినిగా

- హంద్రీ-నీవాలో రికార్డు స్థాయిలో నీటి తరలింపు
- 191 రోజుల్లో 40.31 టీఎంసీల కృష్ణా జలాల ఎత్తిపోత


హంద్రీ-నీవా కాలువలో నీటి ప్రవాహం

అనంతపురం (శ్రీనివాసనగర్), న్యూస్‌టుడే: రాయలసీమ వరప్రదాయిని హంద్రీ-నీవా ప్రాజెక్టు అరుదైన ఘనత సాధించింది. ప్రాజెక్టు చరిత్రలో తొలిసారిగా ప్రస్తుత నీటి సంవత్సరంలో 191 రోజుల్లో 40 టీఎంసీలకు పైగా నీటిని తరలించారు. ఈ ఏడాది జులై 17న శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి మల్యాల పంపుహౌస్ ద్వారా నీటి ఎత్తిపోతలను సీఎం చంద్రబాబు స్విచాన్ చేశారు. ఇప్పటివరకు 40.31 టీఎంసీల నీటిని తరలించారు. ఇందులో ఉమ్మడి కర్నూలు జిల్లా పరిధిలో 1.57 టీఎంసీలు వాడుకోగా, అనంతపురం జిల్లా సరిహద్దుకు 38.74 టీఎంసీలు చేరాయి.

◆ ఇప్పటివరకు ఒక సీజన్‌లో ఇంత తక్కువ సమయంలో 40 టీఎంసీలకు పైగా నీటిని ఎత్తిపోసిన దాఖలాలు లేవు. 2021-22 సీజన్‌లో 265 రోజుల పాటు పంపుహౌస్ నడిపించి 40.01 టీఎంసీల నీటిని తరలించారు. ప్రస్తుత సీజన్‌లో మార్చి నెలాఖరు వరకు ఎత్తిపోతలు కొనసాగించే అవకాశముంది. నిర్దేశిత లక్ష్యం 50 టీఎంసీల నీటి తరలింపు మార్చి మొదటి వారానికే చేరుకునే అవకాశముంది. ఎన్డీయే ప్రభుత్వం రూ.3,800 కోట్లు వెచ్చించి, ప్రధాన కాలువను వెడల్పు చేయడంతో నీటి ప్రవాహ సామర్థ్యం పెరిగింది.

◆ అనంతపురానికి తొలిసారిగా 2013లో కృష్ణా జలాలు ఎత్తిపోశారు. అప్పట్లో మొదటి నీటి సీజన్‌లో 5.35 టీఎంసీల మేర తరలించారు. తర్వాత 2021-22లో 34, 2019-20లో 30 టీఎంసీల చొప్పున తరలించారు.

శ్రీసత్యసాయికి 21.59 టీఎంసీలు

ప్రస్తుతం మల్యాల పంపుహౌస్ వద్ద 2,343 క్యూసెక్కుల చొప్పున ఎత్తిపోస్తుండగా, అనంతపురం జిల్లా సరిహద్దుకు 2,160 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. ఇప్పటికే అనంతపురం జిల్లాకు 38.74 టీఎంసీల నీరు రాగా, 3.39 టీఎంసీల మేర వినియోగించారు. 35.34 టీఎంసీల నీరు జీడిపల్లి జలాశయానికి చేరగా, అక్కడి నుంచి ఎప్పటికప్పుడు కాలువల ద్వారా చెరువుల్లోకి మళ్లిస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లాకు 21.59 టీఎంసీలు విడుదల చేశారు. గొల్లపల్లి, మారాల, చెర్లోపల్లి జలాశయాలతో పాటు మడకశిర, పుంగనూరు ఉప కాలువలకూ నీటి ప్రవాహం కొనసాగుతోంది.

50 టీఎంసీల వరకు తరలించి మరో రికార్డు సృష్టించాలి: సీఎం

ఈనాడు, అమరావతి: హంద్రీ-నీవా నుంచి 50 టీఎంసీల నీటిని రాయలసీమకు తరలించి, మరో రికార్డు సృష్టించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. రాయలసీమ ప్రాంతంలోని జలాశయాలు, చెరువులను నీటితో నింపాలని, అన్ని చెరువులు, జలాశయాలు నిండినప్పుడే తనకు సంతోషమని తెలిపారు. సీమను సస్యశ్యామలం చేసినందుకు శుక్రవారం రాయలసీమ జిల్లాలకు చెందిన మంత్రులు పయ్యావుల కేశవ్, బీసీ జనార్దన్‌రెడ్డి, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. హంద్రీ-నీవా నుంచి 40టీఎంసీలు తరలించి రికార్డు సృష్టించామని, ఇక్కడితో ఆగకూడదని సీఎం సూచించారు. హంద్రీ-నీవా ద్వారా సీమ జిల్లాలకు 50 టీఎంసీలు తరలించాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడిని ఆదేశించారు. వచ్చే నెలాఖరు లేదా మార్చి మొదటి వారంలోగా అదనంగా 10 టీఎంసీలను తరలించి, మొత్తంగా 50 టీఎంసీల నీటిని తరలించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి రామానాయుడు సీఎంకు తెలిపారు.

చంద్రబాబు చిత్తశుద్ధికి ఇది నిదర్శనం: కాలవ శ్రీనివాసులు

హంద్రీనీవా ద్వారా రాయలసీమకు 191 రోజుల్లో 40 టీఎంసీలకు పైగా నీటి తరలింపు ఓ రికార్డని రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. ఇది రాయలసీమ ప్రజలు, రైతాంగంపై సీఎం చంద్రబాబుకున్న చిత్తశుద్ధికి నిదర్శనమని ఓ ప్రకటనలో స్పష్టం చేశారు.

ప్రభుత్వాలు సబ్సిడీని ఏటా చెల్లించాల్సిందే

- ట్రూఅప్ అంటే.. ఛార్జీలు పెంచడం కాదా?
- 2026-27 విద్యుత్ టారిఫ్‌పై నిపుణులు, సంఘాలు



విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఏపీ విద్యుత్తు మండలి బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ చేస్తుండగా.. బయట విద్యుత్తు సర్దుబాటు ఛార్జీలు తగ్గించాలని నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నేతలు

ఈనాడు, అమరావతి: విద్యుత్ సంస్థలకు ప్రభుత్వాలు చెల్లించాల్సిన సబ్సిడీలు, ప్రభుత్వ విభాగాలు వినియోగించిన విద్యుత్‌కు బిల్లులు ఏటా చెల్లించకపోవడంతో డిస్కంలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయని విద్యుత్‌రంగ నిపుణులు పేర్కొన్నారు. రూ.25వేల కోట్ల బకాయిలు వసూలు కావాలని డిస్కంలు ఏఆర్ఆర్‌లో చూపాయన్నారు. మిగులు విద్యుత్ ఉన్నట్లు డిస్కంలు చూపాయని.. ఇంకా బహిరంగ మార్కెట్ కొనుగోళ్లకు కమిషన్ ఎందుకు అనుమతులిచ్చిందని ప్రశ్నించారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి డిస్కంలు ప్రతిపాదించిన ఏఆర్ఆర్, విద్యుత్ ఛార్జీలపై విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రెండోరోజు బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణను రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) చేపట్టింది. పలువురు నేరుగా, మరికొందరు వర్చువల్‌గా అభిప్రాయాలను వెల్లడించారు. కమిషన్ ఛైర్మన్ వెంకట రామిరెడ్డి మాట్లాడుతూ.. 'బకాయిల వసూలుకు ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తున్నాం. సబ్సిడీ మొత్తాన్ని ఏటా పూర్తిగా డిస్కంలకు చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నాం. రూఫ్‌టాప్ ప్రాజెక్టుల్లో వినియోగదారుల నుంచి తీసుకున్న విద్యుత్‌కు ప్రతినెలా బిల్లులు చెల్లించేలా డిస్కంలకు ఇప్పటికే ఇచ్చిన ఉత్తర్వులను పక్కాగా అమలుచేయాలని మరోసారి ఆదేశిస్తాం' అని పేర్కొన్నారు. విచారణలో పలువురు వెల్లడించిన అభిప్రాయాలు..

అది ఛార్జీలు పెంచడం కాదా?

– ఎంవీ ఆంజనేయులు, విద్యుత్ వినియోగదారుల ఐక్య వేదిక కన్వీనర్

'టారిఫ్ పెంచలేదని డిస్కంలు చెబుతూ.. ఆ తర్వాత ట్రూఅప్, ఎఫ్‌పీపీసీఏ ఛార్జీల పేరుతో అదనపు భారాలు వేస్తున్నాయి. అది ఛార్జీలు పెంచడం కాదా? ప్రభుత్వం నుంచి, ప్రైవేటు కంపెనీల నుంచి రావాల్సిన బకాయిలు రూ.25,383 కోట్లు వచ్చే మార్చిలోగా వసూలుచేయాలి'

స్మార్ట్ మీటర్లతో ప్రయోజనమేంటి?

– జి.కోటేశ్వరరావు, సీపీఐ ప్రతినిధి

'ప్రతిపక్షంలో ఒకలా అధికారంలోకి రాగానే మరోలా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయి. స్మార్ట్ మీటర్లను ఇప్పుడు యథావిధిగా కొనసాగిస్తున్నారు. ట్రూఅప్ ఛార్జీలతో అద్దె ఇళ్లలో ఉన్న వారు ఇబ్బందులు పడుతున్నారు.'

◆ 75 హెచ్‌పీ కనెక్షన్ కావాలంటే.. రూ.3 లక్షలతో ఏర్పాట్లు చేసుకోవచ్చని, డిస్కం మాత్రం రూ.12లక్షలు కట్టించుకుంటోందని షేక్ మస్తాన్ వలి అన్నారు. అదనపు లోడ్ డిపాజిట్ ఛార్జీలను చిన్న పరిశ్రమలు తట్టుకోలేవని చెప్పారు. కొవిడ్ సమయంలో ఆక్సిజన్ సరఫరాకు వినియోగించిన విద్యుత్తుకు ఇప్పుడు ఎఫ్‌పీపీసీఏ ఛార్జీలు వేయడమేంటని ఎమర్జెన్సీ మెడికల్ ఆక్సిజన్ సరఫరాదారు రాజేష్‌బాబు మండిపడ్డారు. రూఫ్‌టాప్ సౌర విద్యుత్తు ప్లాంట్లలో కిలోవాట్‌కు 144 యూనిట్లకు మించి తీసుకోబోమని డిస్కంలు చెబుతూ, అంతకంటే ఎక్కువ ఇచ్చినా చెల్లించకపోవడం వినియోగదారులను మోసం చేయడమేనని టాక్స్‌పేయర్స్ అసోసియేషన్ ప్రతినిధి సాంబిరెడ్డి విమర్శించారు. వాటర్‌ప్లాంట్లకు కేటగిరీ-2 కింద బిల్లులు వస్తున్నాయని, దాన్ని కేటగిరీ-3గా మార్చాలని విజయవాడ వాటర్‌ప్లాంట్స్ అసోసియేషన్‌కు చెందిన శంకర్ కోరారు. ఆంధ్ర సుగర్స్ లిమిటెడ్‌లోని క్లోర్ ఆల్కలై యూనిట్‌కు టారిఫ్ కేటగిరీ మార్చాలని ఆ సంస్థకు చెందిన నరేంద్రనాథ్ చౌదరి కోరారు. క్యాప్టివ్ ప్లాంటు నుంచి వసూలు చేస్తున్న గ్రిడ్ సపోర్ట్ ఛార్జీలు భారంగా మారినట్లు చెప్పారు. అదనపు లోడ్ కోసం దరఖాస్తు చేసి రెండు నెలలైనా స్పందించట్లేదని ఒంగోలు ష్రింప్ హేచరీస్ అసోసియేషన్ ప్రతినిధి ఎస్‌వీఎస్ చౌదరి అన్నారు.

'వెచ్చదనం' ముగ్గురి ప్రాణాలు తీసింది!

- నిప్పుల కుంపటితో ఊపిరాడక భార్య, భర్త, కుమారుడు మృతి



మధు, సత్యవతి దంపతులు ★ మోస్య మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

పార్వతీపురం మన్యం (జియ్యమ్మవలస), న్యూస్‌టుడే: వెచ్చదనం కోసం ఇంట్లో వేసిన నిప్పుల కుంపటి ఒకే కుటుంబంలోని ముగ్గురి ప్రాణాలు తీసింది. మరో చిన్నారిని ప్రమాదంలోకి నెట్టింది. ఈ విషాద ఘటన పార్వతీపురం మన్యం జిల్లా జియ్యమ్మవలస మండలంలో చోటుచేసుకుంది. డీఎస్పీ రాంబాబు, సీఐ తిరుపతిరావు వివరాల మేరకు.. వనజ గ్రామానికి చెందిన మీనక మధు(35), సత్యవతి(30) దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు. పెద్ద పాప మాధురి విజయనగరం కేజీబీవీలో, రెండో అమ్మాయి మోక్ష తాతగారి ఊరు జియ్యమ్మవలస మండలం బొమ్మికలో ఉంటూ చదువుతున్నారు. మిగిలిన ఇద్దరు పిల్లలు ఆయేషా(6), మోస్య(బాబు)(4) తల్లిదండ్రుల వద్దే ఉంటున్నారు. వీరు నలుగురు ఎప్పటిలాగే గురువారం రాత్రి ఇంట్లో నిద్రపోయారు. ఉదయం ఎంతకీ నిద్ర లేవకపోయే సరికి చుట్టుపక్కల వారు, బంధువులు.. తలుపులు తెరిచి చూశారు. మధు, సత్యవతి, ఆయేషా, మోస్య కదలిక లేకుండా ఉన్నారు. వారిని సమీపంలోని చినమేరంగి సామాజిక ఆసుపత్రికి తరలించగా.. మధు, సత్యవతి, మోస్య అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆయేషాను పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం విశాఖ తరలించారు. ఇంట్లో వెచ్చదనం కోసం నిప్పుల కుంపటి పెట్టడం, తలుపులు మూసేయడంతో కార్బన్ మోనాక్సైడ్ వెలువడి ఊపిరి ఆడక వారు మరణించినట్లు ప్రాథమికంగా తెలిసిందని డీఎస్పీ చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మళ్లీ ఎన్జీటీకి పంపాలా? మేమే నిర్ణయం తీసుకోవాలా?

ఇసుక అక్రమ తవ్వకం కేసులో కక్షిదారులకు సుప్రీంకోర్టు ప్రశ్న

ఈనాడు, దిల్లీ: 'ఇదివరకు కోర్టు జారీచేసిన ఉత్తర్వులను అనుసరించి జైప్రకాశ్ పవర్ వెంచర్స్ రూ.7 కోట్ల పరిహారం మొత్తం డిపాజిట్ చేసింది. ఇప్పుడు మా ముందు రెండు మార్గాలున్నాయి. ఈ కేసును మళ్లీ ఎన్జీటీకి పంపి వారు విధించిన రూ.18 కోట్ల జరిమానాలో పిటిషనర్ చెల్లించిన రూ.7 కోట్లను మినహాయిస్తే మిగిలిన మొత్తం ఎవరు చెల్లించాలన్న అంశాన్ని తేల్చమని చెప్పడం... లేదంటే సుప్రీంకోర్టే ఈ కేసును విచారించి నిర్ణయం వెలువరించడం.. ఈ రెండింటిలో మీకు ఏది కావాలో చెప్పండి' అని ధర్మాసనం పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఇసుక అక్రమ తవ్వకాల కేసులో సుప్రీంకోర్టు కక్షిదారులను ప్రశ్నించింది. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరిపినందుకు రూ.18 కోట్ల జరిమానా విధిస్తూ జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్జీటీ) జారీ చేసిన ఆదేశాలను సవాల్ చేస్తూ జైప్రకాశ్ పవర్ వెంచర్స్ సంస్థ దాఖలు చేసిన కేసుపై శుక్రవారం విచారణ చేపట్టిన జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్.కె.సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు స్పందించింది. అయితే జైప్రకాశ్ పవర్ వెంచర్స్ తరఫున హాజరుకావాల్సిన సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి అందుబాటులో లేనందున విచారణను వాయిదా వేయాలని వారి తరఫున జూనియర్ న్యాయవాది కోరారు. ఎన్జీటీలో కేసు దాఖలు చేసిన దండా నాగేంద్రకుమార్ తరఫు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా మాత్రం సుప్రీంకోర్టే దీన్ని విచారించాలని కోరారు. అనంతరం జస్టిస్ సంజయ్ కరోల్ ఈ కేసు తదుపరి విచారణను ఫిబ్రవరి 11కి వాయిదా వేశారు.

పాంబన్ పాత రైల్వే వంతెనకు ఇక సెలవు

తొలగింపు పనులు ప్రారంభం


పాంబన్ పాత రైల్వే వంతెన (మధ్యలోనిది)

చెన్నై(ప్యారిస్), న్యూస్‌టుడే: తమిళనాడులోని రామనాథపురం జిల్లాలో ఉన్న పాంబన్ పాత రైల్వే వంతెన తొలగించే పనులు ప్రారంభమయ్యాయి. మండపం-రామేశ్వరం ద్వీపాన్ని కలిపే చారిత్రక చిహ్నంగా ఉన్న పాంబన్ పాత రైల్వే వంతెనను 1914లో ప్రారంభించారు. సుమారు 2.3 కి.మీ పొడవు ఉంటుంది. పడవలు వెళ్లేలా వంతెన మధ్య లిఫ్ట్ తరహాలో ఏర్పాటు చేసిన వంతెన ఇది. 1964లో వచ్చిన తుపాను దాటికి ధ్వంసమైన తర్వాత మళ్లీ పునరుద్ధరించారు. తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తుతుండటంతో కొత్త బ్రిడ్జికి 2019లో శంకుస్థాపన చేసి 2020లో పనులు మొదలుపెట్టారు. గతేడాది ప్రధాని మోదీ కొత్త బ్రిడ్జిని ప్రారంభించారు. దేశంలోనే మొట్టమొదటి వర్టికల్ లిఫ్ట్ రైల్వే సముద్ర వంతెనగా పేరుగాంచింది. అయితే, పడవలు వెళ్లేందుకు దీన్ని తెరిచినప్పుడల్లా పాత వంతెనను కూడా తెరవాల్సి వస్తోంది. దీంతో పాత బ్రిడ్జిని తొలగించేందుకు రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ చర్యలు చేపట్టింది. నాలుగు నెలల్లో పనులు పూర్తి చేయనుంది.

ఉగ్రవాదంతో మానవ జాతికే ప్రమాదం

పార్లమెంట్‌ను కాపాడిన వీర జవాన్ల త్యాగం చిరస్మరణీయం ● మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



మాట్లాడుతున్న వెంకయ్యనాయుడు, వేదికపై యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, చిగురుపాటి వరప్రసాద్, హాజరైన విద్యార్థులు

ఈనాడు, అమరావతి, విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

దేశ ప్రజాస్వామ్య సౌధాన్ని దెబ్బతీసి, భారతీయులను బలహీనపరచాలనే ఉగ్రవాదుల కుట్రను.. మన వీర జవాన్లు రక్తం చిందించి తిప్పికొట్టారని.. మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. ఉగ్రవాదమే తమ జాతీయ విధానంగా చేసుకున్న పాకిస్తాన్.. ఉగ్రవాదులను మనపైకి పంపిస్తోందన్నారు. భారత పార్లమెంటుకు రక్షణగా కమలేష్ కుమారి లాంటి భద్రతా సిబ్బంది నిలబడి.. తమ ప్రాణాలను అర్పించి నేటితరానికి ఆదర్శంగా నిలిచారని వెంకయ్యనాయుడు కొనియాడారు. వారి త్యాగాలను ఎన్నటికీ మరచిపోకూడదన్నారు. భారత పార్లమెంట్‌పై పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు దాడి జరిపి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా విజయవాడలోని చిగురుపాటి కృష్ణవేణి పాఠశాలలో అమరజవాన్లకు నివాళులర్పించే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. పార్లమెంట్‌పై ఉగ్రమూకలు దాడి చేసిన సమయంలో తాను కూడా పార్లమెంట్‌లోనే ఉన్నానని గుర్తు చేశారు. 'ఉగ్రవాదం మానవ జాతికే శత్రువు. పాకిస్తాన్‌కు ఆర్థికంగా సాయాన్ని అందించే దేశాలపైనా అంతర్జాతీయ సమాజం కఠినంగా వ్యవహరించాలి. ఉగ్రవాదానికి మతం, ప్రాంతం, సరిహద్దులు లేవు. కేవలం విధ్వంసం మాత్రమే దాని ప్రధాన లక్ష్యం. మానవత్వానికే ఇదో పెద్ద సవాలు. ఈ ఉగ్ర మూకలకు మన పొరుగుదేశం కేంద్రంగా మారింది. శాంతియుతమైన భారత్ ఇంతవరకు ఏ దేశంపైనా దాడి చేయలేదు. తుపాకీ గొట్టంలోని తూటా కంటే.. మన ఓటు శక్తి చాలా ఎక్కువ. తుపాకీతో ఏదీ సాధించలేరు. శాంతితోనే అభివృద్ధి సాధ్యం.' అని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.

వాళ్లకి ఇంకా బుద్ధి రాలేదు..

'పాకిస్తాన్‌లోని జైషే మొహమ్మద్ అధినేత మసూద్ అజర్ పేరుతో ఇటీవల సామాజిక మాధ్యమాల్లో ఓ ఆడియో తిరుగుతోంది. వేలాది మంది ఆత్మాహుతి దళాలతో మన దేశం మీదకి దాడికి సిద్ధంగా ఉన్నారని అంటున్నాడు. ఆపరేషన్ సింధూర్ దెబ్బకు అతనికి చావుతప్పి కన్ను లొట్టపోయింది. అయినా ఇంకా బుద్ధి రాలేదని అర్థమవుతోంది. అవసరం వస్తే.. మళ్లీ బుద్ధి చెప్పేందుకు భారత్ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది. తనను అంతా మరచిపోయారనే.. బతికున్నానని చెప్పడానికే.. ఇలాంటి ప్రగల్భాలు పలుకుతున్నాడు. అవన్నీ ఒట్టి గాలి మాటలే.' అంటూ వెంకయ్యనాయుడు కొట్టిపడేశారు. అవేవీ మనల్ని భయపెట్టలేవన్నారు. పాకిస్తాన్‌లో ప్రజాస్వామ్యానికి విలువ లేదని, ఎన్నికైన ప్రధానిని కూడా తొలగించి సైన్యం పాలన చేస్తుందన్నారు. వాళ్ల సైన్యం ఎప్పుడూ యుద్ధ కాంక్ష, పగతో ఉంటుందని, మనపై వాళ్లు నిరంతరం చేసే కుట్రలను తిప్పికొడుతూనే ఉన్నామని పేర్కొన్నారు. అమాయక యువతను మతం పేరుతో రెచ్చగొట్టి ఆత్మాహుతి బాంబర్లుగా మార్చడం.. పిరికిపందలు చేసే చర్యలన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఏవో వ్యాఖ్యలు చేస్తూనే ఉంటారని, మన ప్రధాని నరేంద్రమోదీ వాటిపై ఏమాత్రం స్పందించాల్సిన అవసరం లేదన్నారు. కానీ సమయం వచ్చినప్పుడు ఏం చేయాలో అది చేసి చూపిస్తారని వెంకయ్యనాయుడు అన్నారు. విశ్రాంత డీజీపీ మన్నం మాలకొండయ్య మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం అనంతర దేశంలోని వివిధ ప్రాంతాల్లో అనేక సమస్యలు వచ్చాయని, వీటిలో 32వేల మందికి పైగా పోలీసులు మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ చిగురుపాటి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న ఇంద్రియ లోగో గజెల్

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : విజయవాడ ఎంజీ రోడ్డులోని ఇంద్రియ నగల షోరూం వద్ద లోగోకు సంబంధించిన గజెల్‌ను 30 అడుగుల ఎత్తులో ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. దాన్ని శుక్రవారం షోరూం ప్రతినిధులు ప్రారంభించారు. అది వినూత్నంగా.. ఎంతో ఆకర్షణీయంగా ఉంది. షోరూంకు వచ్చిన వినియోగదారులు, నగర ప్రజలు ఆసక్తిగా తిలకిస్తున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్యాషన్ షో ఆకట్టుకుంది. ఇంద్రియ మార్కెటింగ్ హెడ్ శాంతిస్వరూప్ పాండా మాట్లాడుతూ.. అందరికీ సరికొత్త డిజైన్లతో కూడిన బంగారు, వజ్రాభరణాలు అందుబాటు ధరల్లో ఉన్నాయని, మేకింగ్ ఛార్జీలు కూడా తక్కువని పేర్కొన్నారు. ప్రజలు షోరూంని సందర్శించాలని కోరారు.



దుర్గమ్మ సేవలో మంత్రులు



మంత్రులు అనిత, సవితలకు అమ్మవారి చిత్రపటం అందిస్తున్న ఈవో శీనా నాయక్, ఛైర్మన్ రాధాకృష్ణ తదితరులు

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై ఉన్న దుర్గమ్మను వసంత పంచమి సందర్భంగా హోం మంత్రి వంగలపూడి అనిత, మంత్రి సవిత వేర్వేరుగా అమ్మవారిని దర్శించుకున్నారు. శుక్రవారం ఆలయానికి విచ్చేసిన వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. ఆలయ ఈవో వీకే శీనానాయక్, ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ అమ్మవారి ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

ఏపీపీఎస్సీ పరీక్షలకు పక్కా ఏర్పాట్లు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఈనెల 27వ తేదీ నుంచి 31 వరకు వివిధ ఉద్యోగ నోటిఫికేషన్లకు సంబంధించి జరగనున్న ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జేసీ ఎస్.ఇలక్కియా ఆదేశించారు. జూనియర్ లెక్చరర్(లైబ్రేరియన్ సైన్స్), ఏఈఈ (సివిల్), ఉద్యాన శాఖ అధికారులు, సహాయ మోటారు ఇన్‌స్పెక్టర్లు ఇలా మొత్తం 17 నోటిఫికేషన్లకు సంబంధించిన పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో పరీక్షల ఏర్పాట్లపై శుక్రవారం సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ..ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్తు తదితర సదుపాయాలను కల్పించాలన్నారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా చూడాలన్నారు. ఏపీపీఎస్సీ సహాయ కార్యదర్శి ఎస్.నాగూర్‌షరీఫ్, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం తదితరులు పాల్గొన్నారు.

జాతీయ క్రీడల నిర్వహణతో గుడివాడకు వన్నె


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, తెదేపా నాయకులు


రన్నరప్ ట్రోఫీని హిమాచల్ ప్రదేశ్ జట్టుకు అందజేస్తూ..

గుడివాడ, న్యూస్‌టుడే : ఎందరో మహానుభావులు జన్మించిన గుడివాడకు జాతీయ క్రీడల నిర్వహణతో వన్నె వచ్చిందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) పేర్కొన్నారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఐదు రోజులుగా సాగుతున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా 69వ జాతీయ అండర్- 14 కబడ్డీ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా హరియాణా, హిమాచల్ ప్రదేశ్ మధ్య ఫైనల్ మ్యాచ్‌ను ఆయన గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న తదితరులతో కలిసి తిలకించారు. అనంతరం మాట్లాడుతూ గుడివాడ ఎంతో మంది ఉత్తములకు జన్మనిచ్చిందని.. కానీ గత పాలకులు గుడివాడ పరువు, ప్రతిష్ఠ దిగజార్చారని.. ఎమ్మెల్యే రాము దాన్ని తిరిగి తెస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ రానున్న కాలంలో గుడివాడలో మరిన్ని జాతీయ క్రీడలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఏపీ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశినేని చిన్ని గుడివాడలో క్రికెట్ పిచ్ ఏర్పాటుకు హామీ ఇవ్వడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ స్టేడియంలో కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్, జనసేన గుడివాడ బాధ్యుడు బూరగడ్డ శ్రీకాంత్, గాస్పెల్ ప్రేయర్ టెంపుల్ మినిస్ట్రీస్ అధినేత సజ్జా బర్నబాస్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శులు అరుణ, ఎస్.గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

క్యూపీఆర్ఐ సంస్థతో ఎన్టీఆర్ వర్సిటీ ఒప్పందం

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరంలో చేరే విద్యార్థులు మానసికంగా దృఢంగా ఉండేలా ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు శుక్రవారం విజయవాడలోని ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయంలో వీసీ డాక్టర్ పి.చంద్రశేఖర్, రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికారెడ్డి.. క్యూపీఆర్ఐ ప్రతినిధులతో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ఈ మేరకు ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు.


పత్రాలు మార్చుకుంటున్న వీసీ చంద్రశేఖర్, రిజిస్ట్రార్ రాధికారెడ్డి, క్యూపీఆర్ఐ సంస్థ ప్రతినిధులు

బలమైన మహిళా ఉద్యమాలు అవసరం


జాతీయ మహిళా సమాఖ్య కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: మోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ యత్నాలను అడ్డుకునేందుకు బలమైన మహిళా సమాఖ్య ఉద్యమాలు రావాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ పిలుపునిచ్చారు. విజయవాడ ఐఎంఏ హాలులో రెండు రోజులుగా జరుగుతున్న జాతీయ మహిళా సమాఖ్య కౌన్సిల్ సమావేశాలు శుక్రవారం ముగిశాయి. సమావేశంలో అక్కినేని వనజ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తిని విచ్ఛిన్నం చేస్తుందన్నారు. సమావేశం అమెరికా యుద్ధోన్మాద చర్యలను తీవ్రంగా వ్యతిరేకించింది. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరును మార్చడాన్ని తప్పు పట్టింది. సమాఖ్య జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సైదా సయ్యుద్దీన్ హమీన్, నిషా సిద్ధు నేతృత్వంలో వివిధ అంశాలపై చర్చించారు. సమావేశంలో డాక్టర్ కొన్నికా రాయ్, డాక్టర్ కె.రజని, శ్యామ్‌శ్రీ బాస్, పెన్మత్స దుర్గాభవాని, కన్వల్‌సిత్ కౌర్, అత్తిలి విమల, పద్మావతి, యామిని తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు ఆమోదించారు. ☛ మణిపూర్‌లో శాంతి నెలకొల్పేందుకు ఇరువర్గాలతో చర్చలు నిర్వహించాలి. ☛ 33 శాతం మహిళా రిజర్వేషన్లు తక్షణమే అమలు చేయాలి. ☛ మహిళలపై అత్యాచారాలను నియంత్రించాలి.

ప్రయాణికుల సౌకర్యాలకు ప్రాధాన్యం

విజయవాడ డివిజన్ ఆదాయం రూ.4,629 కోట్లు


అధికారులతో సమీక్షిస్తున్న డీఆర్ఎం

విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: ప్రయాణికుల సౌకర్యాలకు మొదటి ప్రాధాన్యం ఇస్తామని డీఆర్ఎం మోహిత్ సొనాకియా పేర్కొన్నారు. అధికారులు, సిబ్బంది కృషి ఫలితంగా ఈ ఆర్థిక సంవత్సరం డిసెంబరు చివరి నాటికి విజయవాడ డివిజన్‌కు రికార్డు స్థాయిలో రూ.4,629 కోట్ల ఆదాయం సమకూరినట్లు వెల్లడించారు. శుక్రవారం డీఆర్ఎం కార్యాలయంలో నిర్వహించిన డీఆర్‌యూసీసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 6.49 శాతం ఆదాయం పెరిగినట్లు చెప్పారు. సరకు రవాణా ద్వారా రూ.3,345 కోట్ల ఆదాయం లభించిందన్నారు. అమృత్ భారత్ పథకం కింద డివిజన్ పరిధిలోని ముఖ్య రైల్వే స్టేషన్లను ఆధునికీకరిస్తున్నామని చెప్పారు. పండగల నేపథ్యంలో విజయవాడ మీదుగా 272 ప్రత్యేక రైళ్లు నడిపినట్లు తెలిపారు. మూడో కొత్త రైల్వే మార్గం పనులు తుది దశకు చేరుకున్నాయని, డివిజన్ పరిధిలో 126.82 కిమీ మేర అత్యాధునిక సిగ్నలింగ్ వ్యవస్థ అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. ఈ సందర్భంగా డీఆర్‌యూసీసీ సభ్యులు ప్రయాణికుల సమస్యలను డీఆర్ఎం దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం కొండా శ్రీనివాసరావు, సీనియర్ డీసీఎం బి.ప్రశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ మద్యం కేసులో నిందితులకు రిమాండ్ పొడిగింపు

ఈనాడు, అమరావతి: నకిలీ మద్యం కేసులో నిందితులకు న్యాయస్థానం రిమాండ్ పొడిగించింది. నిందితులకు విధించిన రిమాండ్ శుక్రవారంతో ముగియనుంది. ఈ నేపథ్యంలో విజయవాడ కారాగారంలో ఉన్న ధారబోయిన ప్రసాద్, జినేష్, శిబులను పోలీసులు కోర్టులో వ్యక్తిగతంగా, నెల్లూరు, మదనపల్లి కారాగారాల్లో ఉన్న జనార్దనరావు, జగన్మోహన్‌రావు సహా 13 మందిని వీసీ ద్వారా న్యాయాధికారి ఎదుట హాజరుపర్చారు. వీరికి వచ్చే నెల 5వ తేదీ వరకు రిమాండ్ పొడిగిస్తూ న్యాయాధికారి లెనిన్ బాబు ఉత్తర్వులిచ్చారు.

వసుంధర

vasundhara@eenadu.in

కొంతమంది మహిళలు 'సూపర్ హ్యూమన్ విజన్'ని కలిగి ఉంటారు. ఇలాంటి వాళ్లు ఎక్కువ రంగుల్నీ, షేడ్స్‌నీ గుర్తించగలరట. దీన్ని 'టెట్రాక్రోమసీ' అంటారు. ఇది జన్యుపరంగా వస్తుందట. అందరికీ కళ్లలో మూడు రకాల (ఎరుపు, ఆకుపచ్చ, నీలం) రంగుల్ని గుర్తించే కోన్ కణాలు ఉంటే... వీళ్లకి మాత్రం అవి నాలుగు ఉంటాయట. దీనివల్ల వాళ్లు ఎక్కువ షేడ్స్‌ని గుర్తుపట్టగలరట.

మీకు తెలుసా?

మాటల్లో చెప్పలేని దైన్యం... కళ్లలో భయం... చుట్టూ మనుషులున్నా ఒంటరితనం... ఎక్కడున్నారో, ఏం చేస్తున్నారో తెలియక ఆగని కన్నీళ్లతో... రైల్వే ప్లాట్‌ఫామ్‌ల మీద విలపించే చిన్నారుల పరిస్థితి ఇది. వీళ్లంతా తప్పిపోయిన, అపహరణ, అక్రమ రవాణా బాధితులే. ఇలాంటి వందల మంది పిల్లల్ని రక్షించి 'అతి విశిష్ట రైల్ సేవా పురస్కార్'ని అందుకున్నారు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్) ఇన్‌స్పెక్టర్ చందనా సిన్హా.



వాళ్ల రక్షణ...

ఆమె కర్తవ్యం!

'కొన్ని లక్షల మంది ప్రయాణికులతో కిక్కిరిసిన అతిపెద్ద రైల్వే వ్యవస్థ మనది. అత్యంత రద్దీగా ఉండే ఈ ప్రాంతాలు అక్రమ రవాణాకు ఆవాసాలు కూడా. పిల్లల్ని అపహరించడం, పని ఇస్తామంటూ మాయమాటలు చెప్పడం, ప్రేమ పేరుతో మోసం చేయడం ద్వారా... రాష్ట్రాలు దాటించి వాళ్ల భవిష్యత్తును అంధకారంలోకి నెడుతున్న కేసులెన్నో' అంటారు చందన. ఈమె ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పుర్‌లో పుట్టి పెరిగారు. చిన్నప్పట్నుంచీ పోలీస్ అవ్వాలన్నదే లక్ష్యం. దూరదర్శన్‌లో వచ్చిన 'ఉడాన్' సీరియలే ఇందుకు కారణమట. 'దీనిలోని ప్రధాన పాత్ర కల్యాణీ సింగ్ స్ఫూర్తితోనే పోలీస్ కావాలనుకున్నా. యూనిఫామ్ వేసుకున్న మహిళను చూడటం అదే మొదటిసారి' అని గుర్తుచేసుకుంటారు చందన.

ఆ ఘటనతో...

చదువయ్యాక తన లక్ష్యాన్ని సాధించే ప్రయత్నాలు మొదలుపెట్టారామె. 'అన్నీ విఫలయత్నాలే. అయినా నిరాశ దరిచేరనివ్వలేదు. ఈక్రమంలోనే ఆర్‌పీఎఫ్ నోటిఫికేషన్ వచ్చింది. పరీక్ష రాసి పాసయ్యాను. దిల్లీ రైల్వే స్టేషన్‌లో నా మొదటి పోస్టింగ్' అని చెప్పే చందన మొదట్లో డెస్క్ విధులు నిర్వర్తించారు. 'పనివేళలు, కుటుంబ బాధ్యతలు విధి నిర్వహణలో మహిళలకు అడ్డుకట్ట వేస్తాయనే భావనతో ఉండేవారట అప్పటి అధికారులు. అందుకే క్షేత్రస్థాయి విధుల్లో మహిళలకి అవకాశం ఇచ్చేవాళ్లు కాదట. వాళ్లం



దరితో పోరాడి ఫీల్డ్ బాధ్యతలు దక్కించుకున్నారీమె. 'ఛఠ్ పూజ సందర్భమది. వేల మంది జనాలతో రైల్వేస్టేషన్ నిండిపోయింది. ఓ మహిళ కంగారుగా తప్పిపోయిన తన కొడుకు కోసం వెతుకుతూ... అందరినీ వాకబు చేస్తోంది. ఆమె కళ్లల్లో బాధ నాకు ఇప్పటికీ గుర్తే. దాదాపు రెండు గంటలు వెతికితే ఏడుస్తూ కనిపించాడు పిల్లాడు. ఇది కాస్తా అధికారులకు తెలిసింది. దాంతో 'ఆపరేషన్ నన్హే ఫరిశ్తే'కు నాయకత్వం వహించే బాధ్యతలు అప్పగించార'నే చందన అది మొదలు వెనుదిరగలేదు.

అత్యున్నత పురస్కారంతో...

లఖ్‌నవూ, చార్‌బాగ్ రైల్వేస్టేషన్‌లో ఆమె విధులు ప్రారంభం అయ్యాయి. అక్రమరవాణా, బాలకార్మిక వ్యవస్థను అంతమొందించాలనే లక్ష్యంతో పనిచేశారు. తన ఆశయానికి అనుగుణంగా బలమైన బృందాన్ని తయారుచేసుకున్నారు. రైల్వే ప్లాట్‌ఫామ్‌పై పిల్లల నడవడికలో ఏ కాస్త తేడా కనిపించినా, వాళ్లని ఆపి పరీక్షించే విధంగా వ్యవస్థను డెవలప్ చేశారు. అలా మూడేళ్లలో దాదాపు 1500 మంది పిల్లల్ని అక్రమరవాణా, బాలకార్మిక వ్యవస్థ నుంచి కాపాడారు. గతేడాది అక్రమరవాణాకు గురైన 152 మంది చిన్నారుల్ని రక్షించి సురక్షిత కేంద్రాలకు తరలించారు. 'మేము చూసే కేసుల్లో చాలావరకూ బాలబాలికలే. ఆన్‌లైన్ గేమింగ్, ఇంటర్నెట్ అందుబాటులోకి వచ్చాక ఇలాంటి కేసుల సంఖ్య ఇంకా పెరిగింది. తల్లిదండ్రులు కొట్టారనో, తిట్టారనో ఇంటి నుంచి పారిపోయి వచ్చేవాళ్లే ఎక్కువ. అపహరణ కేసులూ చాలానే. ఇలాంటి వాళ్లని రక్షించడమే కాదు... తప్పొప్పులు తెలుసుకోవాలంటే కౌన్సెలింగ్ కూడా ముఖ్యం. అందుకే పిల్లలకు, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇప్పించడం కూడా మా చర్యల్లో భాగం' అనే చందన తాజాగా భారత రైల్వే అత్యున్నత పురస్కారాల్లో ఒక్కటైన 'అతి విశిష్ట రైల్ సేవా పురస్కారా'న్ని అందుకున్నారు. అది తీసుకున్న మరు నిమిషమే అపహరణ కేసు వచ్చిందంటూ ఫోన్ రావడంతో, ఫంక్షన్ వదిలేసి విధులకు బయలుదేరారు చందన. ఇది ఆమెకు వృత్తిపట్ల ఉన్న నిబద్ధతకు అద్దం పడుతోంది అంటూ తోటి, పై అధికారులంతా ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. తనను కాదన్న వాళ్లతోనే శభాష్ అనిపించుకుంటున్న ఇన్‌స్పెక్టర్ చందన ప్రయాణం స్ఫూర్తిదాయకం కదూ!

జాతీయ బాలికా దినోత్సవం

'సాంకేతికతతో సమస్యలు పెరుగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా మానవ అక్రమ రవాణా విషయంలో బాధితులకు దోషులను గుర్తించడం మరింత కష్టమవుతోం'దంటారు సామాజిక కార్యకర్త సునీతా కృష్ణన్. తన సంస్థ 'ప్రజ్వల' ద్వారా వేలమంది అమ్మాయిలను రక్షించారు. ఎంతో మంది పిల్లలు వ్యభిచార కూపంలోకి వెళ్లకుండా కాపాడారు. దశాబ్దాలుగా మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఆమెను పలకరించగా... కొన్ని విషయాలను పంచుకున్నారిలా...



మాకు జరగవు అనుకోవద్దు!

✦ 'వ్యభిచారం'... ఈ పదాన్నే వ్యతిరేకిస్తాను నేను. కానీ ఇప్పటికీ కొన్ని వర్గాలు లైంగిక సేవలు అందించాలనే చెబుతాయి. అప్పుడే సమాజంలో సమన్వయం సాధ్యమంటారు. అంటే వేరెవరి బిడ్డో బలైతే కానీ తమ పిల్లలు సురక్షితంగా ఉండరన్న భావన. అంతేకాదు, ఆ అమ్మాయిల శరీరాల మీద హక్కు, వాళ్లని ఏమైనా చేసే అధికారం తమకు ఉన్నట్లు భావిస్తారు. పైగా దీనికి అందమైన రంగులద్దుతున్నారు. కానీ ఈ లైంగిక బానిసత్వం ఆ అమ్మాయిల ఆత్మవిశ్వాసాన్నీ, వ్యక్తిగత విలువనీ తగ్గించడమే కాదు... వాళ్ల శరీరం, మనసు, ఆత్మలపైనా దుష్ప్రభావాలను చూపుతుంది. అలాంటిదాన్ని సమాజ శ్రేయస్సు అని ఎలా చెబుతారు?

✦ అక్రమరవాణా 30 ఏళ్ల క్రితంతో పోలిస్తే ఇప్పుడు మరింత పెరిగింది. మరీ చిన్నపిల్లల్నీ 'వ్యభిచారం' కోసం తీసుకెళ్తున్నారు. అది ఇంకా ప్రమాదం. మూడేళ్లు, అంతెందుకు, నెలల పిల్లలపైనా కామవాంఛ తీర్చుకుంటున్న వీడియోలు ఇప్పుడు ఆన్‌లైన్‌లో దొరుకుతున్నాయి. అదీ అక్రమార్కులకు అవకాశమిస్తోంది. అవయవాలు, చర్మం... ఇలా ఎన్నో అవసరాలకూ వీళ్లని తీసుకెళ్తున్నారు. సమస్యల్లా ఫలానా వాళ్లు ఎత్తుకెళ్లారన్నదే తెలియడం లేదు. ఫేక్ ప్రొఫైల్‌తో ఆన్‌లైన్ మాటున దాగి ఉద్యోగం, ప్రేమ పేరుతో వల వేసి మోసం చేస్తున్నారు. ఆ వెనక ముఖం ఎవరిదో ఎవరికీ తెలియదు. ఇది వ్యక్తికే కాదు... దేశ భవిష్యత్తుకీ ప్రమాదమే.

ఈటీవీ భారత్

✦ సోషల్‌మీడియా, మెసేజింగ్ యాప్‌లు, డేట్‌సైట్లు, మాట్రిమోనీలు, ఉద్యోగ సంబంధిత సైట్లు కూడా ట్రాఫికింగ్‌కి వేదికలవుతున్నాయి. ఏఐ దీన్ని మరింత జఠిలం చేస్తోంది. అయితే దాంతోనే సమస్యకు చెక్ చెప్పొచ్చు కూడా. పిల్లల్లో లైంగిక వేధింపులకు సంబంధించిన వీడియోలను వెతికితే మన దేశమే ముందుంటోంది. కొవిడ్‌లో తెలిసినవాళ్లు 'ఛైల్డ్ పోర్నోగ్రఫీ' వీడియోల కోసం వెదికితే మూడురోజుల్లో 2 లక్షలు దొరికాయి. వీటిని ఒక ఆఫీసర్ ఒక్కొక్కటి చొప్పున తొలగించడం కష్టం. అలాంటప్పుడు వీటిని తొలగించడానికీ పోస్ట్ చేసేవారిని పట్టుకోవడానికీ సాంకేతికతను వాడొచ్చు కదా! నేరాలకు వ్యతిరేకంగా ఎంత మంది టెక్నాలజీ సాయం తీసుకుంటున్నారన్నదే ప్రశ్న.

✦ పిల్లలు సురక్షితంగా ఉండాలంటే ఆ ప్రయత్నం ఇంటి నుంచే జరగాలి. తల్లిదండ్రులు ఆన్‌లైన్ భద్రత గురించి తెలుసుకోవాలి. పిల్లలకు సురక్షితమైన సమాచారమే అందేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఒకప్పుడు టీనేజర్లకు అమ్మానాన్నలు స్నేహితులుగా మారాలి అనేవారు. ఇప్పుడు 3-4 ఏళ్ల వయసులోనే వాళ్లకి ఫ్రెండ్స్‌గా మారాలి. మంచీచెడూ, మోసం జరిగే అవకాశాలు, ఎవరికి దూరంగా ఉండాలి వంటివాటి గురించి మాట్లాడాలి. పిల్లలు ఆడే ఆన్‌లైన్ ఆటలపైనా కన్నేసి ఉంచాలి. ఇప్పటి అమ్మానాన్నలకు పిల్లలను పెంచడమే పెద్ద టాస్క్. వాళ్లకి అర్థమయ్యేలా సున్నితంగా చెప్పడం కష్టమే అయినా తప్పదు. 'ఇలాంటివి మా వరకూ రావు, మాకు జరగవు' అన్న ధోరణి ఏమాత్రం పనికిరాదు. ప్రమాదం ఎప్పుడైనా ఎలాగైనా పలకరించొచ్చు. జాగ్రత్తగా ఉండాల్సిందే.

అక్రమ రవాణాకు సంబంధించి సుప్రీంకోర్టు 2015లో కొన్ని సూచనలు ఇచ్చినా అవి సరిగ్గా అమల్లోకి రాలేదు. భారతీయ న్యాయ సంహితలో సెక్షన్ 143, సెక్షన్ 111 వంటివి ఉన్నాయి. కానీ అవి ఎంతవరకూ ప్రభావవంతంగా పని చేస్తున్నాయన్నదీ ప్రశ్నే.

తమ హక్కులను తెలుసుకునేలా...

మనదేశ గ్రామీణ ప్రాంతాల్లో నివసించే బాలికలు ఎదుర్కొంటున్న సవాళ్లు అనేకం. విద్యావకాశాల కొరత, అనారోగ్య సమస్యలు, నైపుణ్యాల అభివృద్ధి లోపం...వంటివి వారి భవిష్యత్తును అంధకారమయం చేస్తున్నాయి. ఈ పరిస్థితినే చక్కదిద్దాలనుకున్నారు లఖ్‌నవూకి చెందిన శ్వేతా శుక్లా. 'అన్వరత్ ఫౌండేషన్' ఏర్పాటు చేసి లక్షలాది మంది బాలికలకు కొత్త ఆశలు కల్పిస్తున్నారు.






'అన్వరత్' అంటే నిరంతర ప్రయత్నం. పేరుకు తగ్గట్టుగానే ఈ సంస్థ ఆడపిల్లల అభివృద్ధి కోసం నిరంతరాయంగా కృషి చేస్తోంది. ఫలితంగానే... ఇప్పటివరకూ 18 రాష్ట్రాల్లో 3 లక్షల మంది జీవితాల్లో మార్పు తీసుకురాగలిగింది. ముఖ్యంగా గ్రామీణ బాలికల కోసం రూపొందించిన ప్రాజెక్ట్ సురభి ద్వారా జీవన నైపుణ్యాలు, విద్య, వృత్తి నైపుణ్యాల్లో శిక్షణ అందిస్తోంది. నెలసరి పరిశుభ్రత, పోషకాహారంపై అవగాహన కల్పిస్తోంది. సెల్ఫ్‌డిఫెన్స్‌లో తర్ఫీదునందిస్తోంది. శ్వేత ఏర్పాటు చేసిన సురభి సెంటర్లు... బాలికలకు సురక్షిత స్థలాలుగా మారాయి. అక్కడ వారు తమ హక్కుల కోసం మాట్లాడగలుగుతున్నారు. తమ కలల్ని పంచుకుంటున్నారు.

జ్ఞాపకశక్తికి

ఏకపాద సేతుబంధ సర్వాంగాసనం



చేసే విధానం: మ్యాట్‌పైన ముందుగా శవాసనంలో వెల్లకిలా పడుకోండి. ఇప్పుడు మోకాళ్లను వంచి రెండు పాదాలను నేలపైన ఆన్చి ఉంచండి. తర్వాత భుజాలు, కాళ్ల ఊతంతో నడుమును పైకి ఎత్తండి. ఇప్పుడు అర చేతులతో నడుమును పట్టుకొని మోచేతులను లోపలవైపుగా సరిచేస్తూ నడుమును వీలైనంత పైకి ఎత్తండి. గడ్డాన్ని సాధ్యమైనంత మేర ఛాతీకి నొక్కి ఉంచండి. ఆపై ఒక కాలిని ముందు వైపుగా చాచి, పాదాన్ని ఆన్చి ఉంచండి. ఆ తర్వాత చాచిన కాలు, చేతులు, భుజాల ఊతంతో రెండో కాలిని 90డిగ్రీల కోణంలో పైకి నిటారుగా పైకి ఎత్తి ఉంచండి. ఇలా 10-12 సెకన్లు ఉంచి నెమ్మదిగా కాలిని దించి, నడుమును నేలపైన ఆన్చాలి. ఆపై కాళ్లను చాచి శవాసనంలో విశ్రాంతి తీసుకోండి. రెండు నిమిషాల తర్వాత ఆసనాన్ని మరోవైపు పునరావృతం చేయండి.

జాగ్రత్తలు: మెడ, భుజాలు, వెన్నెముక సమస్యలు, సర్జరీలు అయిన వాళ్లు చేయరాదు.

ఉపయోగాలు: జ్ఞాపకశక్తికి అద్భుతంగా పనిచేస్తుంది. తుంటి, నడుము కండరాలకు బలం చేకూరుస్తుంది. థైరాయిడ్ గ్రంథిని ఉత్తేజపరుస్తుంది.

ఆహారం: జ్ఞాపకశక్తి పెరగాలంటే మెదడుకు మేలుచేసేలా పోషకాహారం తీసుకోవాలి. మొలకలు, బాదం, వాల్‌నట్స్, తృణధాన్యాలు, పండ్లు ఆహారంలో భాగం కావాలి. తగినంత నీరు, నిద్ర అవసరం.

\- శిరీష, యోగ గురు

ఏఐ యుగం. సంస్థలన్నీ ఈ సాంకేతికతను అందిపుచ్చుకుని అభివృద్ధి బాటలో నడవాలనుకుంటున్నాయి. ఈ దిశగానే ఏఐ కంపెనీలూ తమ సేవల్ని విస్తరించుకుంటున్నాయి. ఆ ప్రయత్నంలోనే ప్రముఖ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పరిశోధన సంస్థ ఆంత్రోపిక్... తన కార్యకలాపాలను భారత్‌లో విస్తరించేందుకు ఓ కీలక నిర్ణయం తీసుకుంది. మైక్రోసాఫ్ట్ ఇండియా మాజీ ఎగ్జిక్యూటివ్ ఇరినా ఘోష్‌ను భారతదేశానికి మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించింది.

భారత్‌లో వ్యాపారం

విస్తరించాలని...



ఉన్నత విద్యావంతుల కుటుంబంలో జన్మించారు ఇరినా. బనారస్ హిందూ యూనివర్సిటీలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ పూర్తిచేశారు. తర్వాత జంషెడ్‌పూర్ ఎక్స్‌ఎల్‌ఆర్‌ఐ నుంచి ఎంబీఏ పట్టా అందుకున్నారు. ఇరినా కెరియర్ టాటా స్టీల్‌లో ప్రారంభమైంది. హెచ్‌సీఎల్ ఇన్ఫో సిస్టమ్స్, విప్రో ఇన్ఫోటెక్‌ల్లోనూ పనిచేశారు. 2001లో రీజనల్ పార్ట్‌నర్ అలయన్స్ మేనేజర్‌గా మైక్రోసాఫ్ట్‌లో చేరి అంచెలంచెలుగా ఎదిగారు. 2023లో మైక్రోసాఫ్ట్ ఇండియాకు మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేశారు. ఈ కాలంలో ఎంటర్‌ప్రైజ్ సేల్స్, క్లౌడ్ సేవలు అందించడంతో పాటు బ్యాంకింగ్, హెల్త్ కేర్, తయారీ రంగాల్లో ఏఐ వినియోగాన్ని పెంపొందించడంలోనూ కీలకపాత్ర పోషించారు. తన ఏఐ సేవలను భారత్‌లో మరింతగా విస్తరించాలనుకున్న ఆంత్రోపిక్ సంస్థ... ఇరినాను భారత విభాగానికి ఇటీవలే మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించింది. ఈ సంస్థ క్లౌడ్ ద్వారా ఏఐ సేవలను అందిస్తోంది. ఈ సంస్థకు భారత్ ప్రపంచంలోనే రెండో అతి పెద్ద మార్కెట్. తన వ్యాపార వ్యూహంలో భాగంగా సంస్థ ఈ నిర్ణయం తీసుకుంది.

సాధికారత కోసం...

ఇరినాకు సేవా దృక్పథం కూడా ఎక్కువే. పేద బాలికల సాధికారత కోసం కృషి చేయాలనుకున్నారు. ఇందుకోసమే 2010లో 'మైలిటిల్‌బిట్' అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించారు. స్కూళ్లు, కాలేజీల్లో కంప్యూటర్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయడంతో పాటు, అల్పాదాయ వర్గాలకు చెందిన విద్యార్థినులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తూ.. వారు ఉన్నత విద్యను అభ్యసించేలా ప్రోత్సహిస్తున్నారు. గణితం, సైన్స్ పాఠాలు నేర్చుకునేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వారికి అవసరమైన యూనిఫాంలూ అందిస్తున్నారు. అంతేకాదు.. మహిళా వ్యాపారవేత్తల సాధికారత కోసం స్థాపించిన శాండర్‌కనెక్ట్ అనే సంస్థకు ట్రస్టీగానూ వ్యవహరిస్తున్నారు.

బంగారం - వెండి

23న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కేజీ)
హైదరాబాద్	1,57,580	1,44,450	3,60,000
విజయవాడ	1,55,880	1,46,400	3,36,700
ప్రొద్దుటూరు	1,60,000	1,47,240	3,26,000
రాజమహేంద్రవరం	1,57,150	1,44,050	3,60,000
విశాఖపట్నం	1,57,450	1,44,050	3,25,000
తమిళనాడు	-----	1,45,500	3,45,000



ఆ ముప్పుని తగ్గించే ఆటలు!

కౌమారదశలోని బాలికలు శారీరక వ్యాయామం ఎక్కువగా చేయడం వల్ల వారి రొమ్ము కణజాలం ఆరోగ్యంగా ఉంటుందనీ, భవిష్యత్తులో బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చే ముప్పు తగ్గుతుందనీ చెబుతోంది ఓ కొత్త పరిశోధన. కొలంబియా యూనివర్సిటీ పరిశోధకులు నిర్వహించిన ఈ అధ్యయనం 'బ్రెస్ట్ క్యాన్సర్ రీసర్చ్' జర్నల్‌లో ప్రచురితమైంది. రిక్రియేషనల్ ఫిజికల్ యాక్టివిటీ-ఆర్‌పీఏ బాలికల రొమ్ము కణజాలంలోని నీటిశాతంతో పాటు ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను కూడా తగ్గిస్తుందని గుర్తించారట. రొమ్ములో నీటిశాతం ఎక్కువగా ఉంటే బ్రెస్ట్ క్యాన్సర్ ముప్పు పెరుగుతుందని గత అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ సమస్యకు దూరంగా ఉండాలంటే ఆటలు, నడక, డ్యాన్స్... ఇలా ఏ రూపంలో అయినా శరీరానికి శ్రమ అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

చిన్నగా 'మాయ' చేయొచ్చు!

ఆఫీసు అయినా, ప్రయాణమైనా... 'ముందు జాగ్రత్త' మీదే మన దృష్టి కదూ! అనుకోకుండా పార్టీకి పిలుపు రావొచ్చు. హడావుడిగా సిద్ధమవ్వాల్సి ఉండొచ్చు. అవసరం ఏదైనా అప్పటికప్పుడు కంగారుపడటం మనకు నచ్చదు. కాబట్టే, మనదైన కిట్ హ్యాండ్ బ్యాగులో ఎప్పుడూ ఉండాల్సిందే. కానీ రోజూ ఆ బరువు మోయాలా? చిన్నగా వీటిని ప్రయత్నిస్తే పోలా!

సౌలభ్యం

రంగుల క్యాప్సూల్





పెదాలకు రంగులద్దడం వయసుతో సంబంధం లేకుండా ప్రతి అమ్మాయీ మెచ్చే పని. మేకప్ మీద ఆసక్తి లేకపోయినా ఆఫీసులు, కాలేజీలకు దీన్ని మాత్రం రోజువారీగా ప్రయత్నించేవాళ్లూ చాలామందే. అంతేనా, మూడ్‌ని బట్టి షేడ్‌ని ఎంచుకుంటుంటారు. అంటే బ్యాగులో కనీసం రెండు మూడైనా ఉండాల్సిందేగా! ఈ చిట్టి మ్యాటే లిప్‌స్టిక్‌లు తీసుకోండి. రెండు మూడేంటి ఎన్నైనా పెట్టేసుకోవచ్చు. పైగా బరువు తక్కువ.



కురులనీ మెరిపించొచ్చు

ముఖాన్ని అయితే మేకప్‌తో మాయ చేయొచ్చు. మరి కురుల సంగతేంటి? పొరపాటున వారం రోజులు ఊరెళ్తున్నామంటే షాంపూ శాచెట్లు తీసుకెళ్లొచ్చు. కండిషనర్ అలాకాదుగా! మరి పరిష్కారం ఏంటంటే... ఈ హెయిర్ క్యాప్సూల్స్. చిట్టిగా ఉన్న వీటిని తుంచి, సీరమ్‌ను కురులకు పట్టిస్తే సరి. చక్కగా మెరుస్తూ నిగనిగలాడతాయి.

మేకప్ అద్దేయొచ్చు



ఫౌండేషన్, కన్సీలర్... ముఖం మెరిపించాలంటే ఈ బేసిక్ ఉత్పత్తులు కావాల్సిందే. వీటినీ ఏ జంజాటం లేకుండా తీసుకెళ్లొచ్చు. మేకప్ క్యాప్సుల్స్ అందుకు వచ్చినవే. కొన్ని అయితే బీబీ, సీసీ క్రీమ్‌ల్లా ఒకటే రాసుకుంటే సరిపోయేలానూ వస్తున్నాయి. ముఖానికి అలా టచప్ ఇచ్చేస్తే చాలు. పర్‌ఫెక్ట్ లుక్‌తో బయటికి వెళ్లిపోవచ్చు.



బరువు లేకుండా... అందం విషయంలో రాజీ పడకుండా ఈ చిట్టి నేస్తాలు భలేగున్నాయి కదూ! కీ చెయిన్‌కి చిట్టి బ్యాగు తగిలించుకునీ వీటిని సర్దేసుకోవచ్చు. ఇంకేం ప్రయత్నించేయండి మరి.

అందమైన గోళ్లకు ఈ ఆహారం...



చేతులూ, కాళ్లూ... వేళ్లూ, గోళ్లూ అందంగా కనిపించాలని బోలెడన్ని డబ్బులు ఖర్చుపెట్టి మేనిక్యూర్, పెడిక్యూర్ చికిత్సలు చేయిస్తాం. కానీ, కొన్నాళ్ల తర్వాత మామూలే. ఎందుకంటే దీనికి పరిష్కారంగా కేవలం పైపై మెరుగులకు ప్రాధాన్యం ఇస్తే సరిపోదంటున్నారు నిపుణులు. ఆహారపరంగా కొన్ని మార్పులూ చేసుకోవాలని సూచిస్తున్నారు. గోళ్లు ప్రధానంగా కెరటిన్ అనే ప్రొటీన్‌తో తయారవుతాయి. అయితే, ఇది బలంగా, నాణ్యంగా ఉత్పత్తి అవ్వాలంటే బయోటిన్(విటమిన్ బి7), ప్రొటీన్, జింక్, ఐరన్, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు, విటమిన్ సి వంటి పోషకాలు అవసరం. ఇవి లోపిస్తే గోళ్లు పెళుసుగా మారతాయి. నెమ్మదిగా పెరుగుతాయి. ఈ సమస్యను అధిగమించడానికి గుడ్లు, చికెన్, పెరుగు, పాల ఉత్పత్తులు, నట్స్, సీడ్స్, బీన్స్, పప్పుధాన్యాలు, ఆకుకూరలు, బెర్రీస్, చిలగడ దుంప వంటి వాటిని ఆహారంలో చేర్చుకోవాలి. వీటితోపాటు జింక్ కూడా అవసరమే... ఇది కెరటిన్ నిర్మాణంలో కీలక ఎంజైమ్‌లను యాక్టివేట్ చేస్తుంది. ఇది ప్రొటీన్ నిర్మాణంలోనూ కీలకం. ఈ పోషకం తగ్గితే గోళ్లు నెమ్మదిగా పెరుగుతాయి. తెల్ల మచ్చలు ఏర్పడతాయి. అలాకాకుండా ఉండాలంటే... గుడ్లు, సీఫుడ్, చికెన్, పాల ఉత్పత్తులు, చిక్కుళ్లు, గింజలు, తృణధాన్యాలు తగిన మోతాదులో తీసుకోవాలి. అలానే, వీటన్నింటితోపాటు విటమిన్ సి, ఒమేగా త్రీ, విటమిన్ డి, కాల్షియం వంటివీ కావాలి. ఇందుకోసం సమతులాహారానికి ప్రాధాన్యం ఇవ్వడంతోపాటు తగినన్ని నీళ్లు మంచి నిద్ర ఉంటే సరిపోతుంది.



చిటారు కొమ్మన మిఠాయి పొట్లం..

చెట్టు కొమ్మ చివరన ఉన్న పురుగులను భక్షించేందుకు ఈ పక్షి చేసిన విన్యాసాన్ని చూస్తే... చిటారు కొమ్మన మిఠాయి పొట్లం చేతికందదేం గురుడా! వాటం చూసి ఒడుపు చేసి వంచర కొమ్మను నరుడా... పాట గుర్తుకొస్తుంది. సన్నని కొమ్మ మీద ఉన్న పురుగులను తినాలని నిర్ణయించుకొన్న పక్షి... ఆ కొమ్మపై వాలింది. తన బరువుకు కొమ్మ పైకీకిందకీ ఊగుతుండగా.. కిందా మీద పడుతూ ఒక్కో అడుగూ ముందుకేస్తూ.. పురుగుల దరిచేరి ఒడుపుగా ఒక్కోదాన్ని నోట్లో వేసుకొని కడుపు నింపుకొంది. నారాయణపేట జిల్లా మద్దూరు మండలం అప్పిరెడ్డిపల్లి శివారులో 'ఈనాడు' కెమెరాకు చిక్కిన చిత్రాలివి. –ఈనాడు, మహబూబ్‌నగర్

పులుల గణనలో శివంగులు




అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారు. ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ సహా అటవీశాఖ పోస్టుల్లో ఎంతో మంది మహిళలు కీలకంగా ఉన్నారు. ఆ ఉద్యోగాలు సాధించాలనుకొనే వారితో పాటు, అడవులు, వన్యప్రాణులంటే ఆసక్తి ఉన్న పదుల సంఖ్యలో యువతులు ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న (ఈ నెల 20 నుంచి 25 వరకు) పులులు (ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేషన్-2026), ఇతర వన్యప్రాణుల గణనలో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఈ గణనలో పాల్గొనేందుకు అటవీశాఖ వాలంటీర్లకు అవకాశం కల్పించడంతో సద్వినియోగం చేసుకుంటున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మంగళవారం నుంచి ప్రారంభమైన జంతు గణనలో 200 మంది వాలంటీర్లు భాగస్వాములయ్యారు. వీరిలో 80 మంది యువతులు ఉండడం విశేషం. వీరంతా దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి స్వచ్ఛందంగా వచ్చారు. ఈ సర్వేలో మూడు రోజులు శాకాహార జంతువులతో పాటు చెట్లు, పొదలు, మొక్కలు, ఆవాసాలను లెక్కిస్తారు. మూడు రోజులు మాంసాహార జంతువుల లెక్కింపు ఉంటుంది. జంతువుల పాదముద్రలు, పెంటికలు, మలం ఆధారంగా లెక్కింపు చేస్తున్నారు. గణనలో పాల్గొంటున్న వాలంటీర్లకు అటవీశాఖ భోజనం, వసతి సమకూరుస్తోంది. లెక్కింపు పూర్తయ్యాక ధ్రువపత్రం ఇస్తారు. –న్యూస్‌టుడే, జన్నారం

'మాది తమిళనాడులోని మదురై. సర్వే గురించి తెలుసుకొని జన్నారం వచ్చా. ప్రస్తుతం ఉడుంపూర్ అటవీ ప్రాంతంలో సర్వే చేస్తున్నా. నాకు వన్యప్రాణులు, అడవులంటే ఇష్టం. గత సంవత్సరం అసిస్టెంట్ కన్జర్వేటర్ స్థాయి పోస్టుకు పరీక్ష రాశా' అని మోనాలిసా తెలిపారు.



'ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ఐఎఫ్ఎస్) పరీక్షకు సన్నద్ధం అవుతున్నా. ఈ సర్వేలో పాల్గొనడం.. పరీక్షకు ఉపయోగపడుతుందని భావిస్తున్నా. గతంలో బర్డ్‌వాచ్‌కు హాజరయ్యా' అని శ్రీకాకుళానికి చెందిన నళిని వివరించారు.



'ఎమ్మెస్సీ జువాలజీ చేశా. అడవులు, వన్యప్రాణులంటే ఇష్టం. గణనలో పాల్గొనడం వల్ల భవిష్యత్తులో ఉపయోగం ఉంటుందని వచ్చా. అడవిలో నడుచుకుంటూ తిరగడం వల్ల ఎంతో ఉత్సాహంగా ఉంది' అని సూరత్‌కు చెందిన సుహాసిని చెప్పారు.





మార్జాల జీవనం!



ఇటీవలకాలంలో కుక్కలతో పాటు పిల్లులను పెంచుకునే వారి సంఖ్య అధికమవుతోంది. వాటితో ఆడుకోవడం, సమయం గడపడాన్ని ఇష్టపడుతున్నారు. అలాంటి వారిలో ఒకరైన శరత్ అనే యువకుడు దేశంలోనే తొలిసారిగా పిల్లుల కోసం మైసూరులో అమ్యూజ్‌మెంట్ పార్కు, మ్యూజియాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ 14 వేర్వేరు జాతులకు చెందిన 20 కంటే ఎక్కువ పిల్లులు ఉన్నాయి. ఇండియన్, పర్షియన్, మెయిన్‌కూన్, బెంగాల్, స్ఫింక్స్, హిమాలయన్ జాతులకు చెందిన వాటిని సంరక్షిస్తున్నారు. ఇందులో సందర్శకులు పెంపుడు పిల్లుల ప్రపంచాన్ని, వాటి జీవనశైలిని దగ్గరగా చూసి తెలుసుకోవచ్చు. 'సాధారణంగా పిల్లులను సరిగ్గా చూసుకుంటే 12 నుంచి 18 సంవత్సరాలు జీవిస్తాయి. పిల్లి పిల్లకు ఏడు నెలలు వచ్చాక తప్పనిసరిగా వ్యాక్సిన్ ఇప్పించాలి. లేకపోతే వ్యాధుల బారిన పడతాయి. మా దగ్గర పిల్లులు భవనం అంతటా స్వేచ్ఛగా తిరుగుతాయి. రోజుకు 16 గంటలు నిద్రపోతాయి. ఉదయం మందిరిన, పాలు, పొడి ఆహారం అందిస్తాం. వీటి పిల్లలను సంరక్షిస్తున్నాం' అని శరత్ చెబుతున్నారు. –న్యూస్‌టుడే, మైసూరు

ప్రతి అరగంటను ఒక యూనిట్‌గా విభజించుకోండి

సమయాన్ని ప్రణాళికబద్ధంగా వినియోగించుకోవాలంటే రేపు ఏయే పనులు చేయాలో ఈరోజే నిర్ణయించుకోండి. అందుకు అనుగుణంగా ప్రతి అరగంట వ్యవధిని ఒక్కో యూనిట్‌గా విభజించుకోవాలి. వాటిని మీరు చేయాల్సిన పనుల కోసం కేటాయించుకోండి. ఆ షెడ్యూల్‌ను కచ్చితంగా పాటించడం మరవకండి. దీనివల్ల మీరు ఆశించిన ఫలితాలు సొంతమవుతాయి. – సాహిల్ బ్లూమ్, రచయిత

'అల'జడిని పసికట్టే వామన్



సముద్రంలో మార్పులను ఎప్పటికప్పుడు గుర్తించేందుకు వేవ్ మానిటరింగ్ అలాంగ్ నియర్ షోర్ (వామన్) ప్రాజెక్టులో భాగంగా తీరం వెంబడి ఇన్‌కాయిస్ ఏర్పాటు చేసిన అత్యాధునిక సాంకేతిక బోయ్‌లు (తేలియాడే పరికరాలు) విజయవంతంగా పనిచేస్తున్నాయి. తీరానికి 5 నుంచి 10 కిలోమీటర్ల దూరంలో సముద్రంపై తేలియాడే సెన్సర్లతో కూడిన 17 బోయ్‌లను ఏర్పాటు చేశారు. ఇవి అలల ఎత్తు, దిశ, వేగం, సముద్ర ఉపరితల ఉష్ణోగ్రత వంటి సమాచారాన్ని ప్రతి నిమిషం నమోదు చేసి, శాటిలైట్ ద్వారా ఇన్‌కాయిస్ కేంద్రానికి పంపుతాయి. ఈ డేటాను కంప్యూటర్ మోడళ్ల ద్వారా విశ్లేషించి రాబోయే మూడు నుంచి ఐదు రోజుల్లో సముద్ర స్థితి ఎలా ఉంటుందో కచ్చితంగా అంచనా వేస్తారు. ఈ సమాచారాన్ని మత్స్యకారులకు, నౌకలకు, ఓడరేవులకు అందిస్తారు. తద్వారా ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించేందుకు సాధ్యమవుతుంది. రియల్ టైమ్‌లో మార్పులను అంచనా వేసే ఈ ప్రాజెక్టుపై తమ పరిశోధన వ్యాసం ప్రముఖ జర్నల్ 'బులెటిన్ ఆఫ్ ద అమెరికన్ మెట్రాలజికల్ సొసైటీ' (బీఏఎంఎస్)లో ప్రచురితమైందని ఇన్‌కాయిస్ డైరెక్టర్ టి.ఎం. బాలకృష్ణన్‌నాయర్ తెలిపారు. –ఈనాడు, హైదరాబాద్



దగ్ధమైన బస్సు వద్ద రహదారి భద్రత పాఠం

ప్రమాదానికి గురైన ఓ బస్సు వద్దకు విద్యార్థులను తీసుకెళ్లి.. వారికి ప్రమాదాల తీరుపై అవగాహన కల్పించారు.. కాకినాడ జిల్లా అధికారులు. రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా ప్రత్తిపాడు మండలం ధర్మవరం శివారున రవాణా, పోలీసు శాఖలు సంయుక్తంగా వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. స్థానిక మినర్వా డిగ్రీ కళాశాల విద్యార్థినులకు ఇలా అవగాహన కల్పించాయి. ధర్మవరం శివారులో 2024 జనవరి 14న ట్రావెల్ బస్సు దగ్ధం కావడంతో శుక్రవారం ఆ ఘటనా స్థలికి విద్యార్థులను తీసుకెళ్లారు. ఆనాటి ప్రమాదం ఎలా జరిగిందో కాకినాడ జిల్లా కత్తిపూడి ఎంవీఐ శ్రీనివాస్ వారికి వివరించారు. వాహనాల్లో మంటలు వచ్చినప్పుడు సురక్షితంగా ఎలా బయటపడాలో చెప్పారు. – న్యూస్‌టుడే, ప్రత్తిపాడు



ఆత్మవిశ్వాసాన్ని జోడించె.. విధిరాతను ఓడించె!

విధి తమను చిన్న చూపు చూసినా... ఈ క్రీడాకారులు మాత్రం తమ సత్తా ఏంటో చూపారు. నిరుత్సాహం తమ దరికి రాదని చాటుతూ ఆటలో ఔరా అనిపించారు.. దివ్యాంగులు. విశాఖ మెడ్‌టెక్ జోన్‌లో నాలుగు రోజుల పాటు జరిగే జాతీయ స్థాయి 'పారా కబడ్డీ' పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పలు రాష్ట్రాల జట్లు తొలిరోజు తలపడ్డాయి. పాయింట్ల సాధనకు క్రీడాకారులు పడిన తపన, ప్రత్యర్థి జట్ల క్రీడాకారుల పట్టుకు చిక్కకుండా చేసిన ఫీట్లు చూసి తీరాల్సిందే అన్నట్లు పోటీలు సాగాయి. – ఈనాడు, విశాఖపట్నం

లైఫ్ జాకెట్‌లా కాపాడిన డైపర్!

ఛత్తీస్‌గఢ్‌లోని జాంజగీర్ - చాంపా జిల్లా సియోని గ్రామంలో బావిలో పడిన 20 రోజుల పసికందును నీటిలో మునిగిపోకుండా డైపర్ కాపాడింది. ఓ మహిళ తన బిడ్డతో ఇంటి బయట కూర్చొని ఉండగా కోతుల గుంపు దాడి చేసింది. ఓ కోతి మహిళ ఒడిలో ఉన్న చిన్నారిని లాక్కొంది. చుట్టుపక్కలవారు కేకలు వేస్తూ దానిని వెంబడించారు. దీంతో ఆ కోతి దూరంగా ఉన్న బావిలో చిన్నారిని విసిరేసి వెళ్లిపోయింది. బావిలో తేలుతున్న చిన్నారిని గ్రామస్థులు రక్షించారు. పాపకు వేసిన డైపరు ఆమె పాలిట లైఫ్ జాకెట్‌లా మారి నీటిలో తేలడం వల్లే ప్రాణాలు నిలిచాయని అత్యవసర చికిత్స అందించిన వైద్యసిబ్బంది తెలిపారు. –ఇంటర్నెట్ డెస్క్



శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామికి హారతి ఇస్తున్న అర్చకులు

వేంకన్న సన్నిధిలో శాస్త్రోక్తంగా వసంత పంచమి

వసంత పంచమి పర్వదినం సందర్భంగా తిరుమలలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వార్షిక విశేష పూజను నిర్వహించారు. ముందుగా అర్చకులు ఆలయంలోని కల్యాణ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామిని వేంచేపు చేసి, ప్రత్యేక పూజలు చేశారు. పూజల్లో అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, తిరుమల



సరస్వతీ దేవిగా దర్శనమిస్తున్న అమ్మవారికి హారతి ఇస్తున్న అర్చకులు

సరస్వతీదేవిగా దర్శనమిచ్చిన కనకదుర్గమ్మ

సరస్వతీదేవి జన్మనక్షత్రం సందర్భంగా శుక్రవారం ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను సరస్వతీదేవిగా అలంకరించారు. దుర్గమ్మ దర్శనం చేసుకున్న విద్యార్థులకు అమ్మవారి పాకెట్ క్యాలెండరు, కంకణం, పెన్ను, ప్రసాదాలు పంపిణీ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. మహామండపం ఆరో అంతస్తులో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. – ఈనాడు, అమరావతి

వైభవంగా 'రథసప్తమి' శోభాయాత్ర

అరసవల్లిలో నేటి అర్ధరాత్రి నుంచి వేడుకలు ప్రారంభం

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరం శుక్రవారం పలు ఆలయాల ప్రచార రథాలతో శోభాయమానంగా వెలుగులీనింది. రథసప్తమి నేపథ్యంలో సోమవారం నుంచి నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం నగరంలో శోభాయాత్ర నిర్వహించారు. ఇందులో రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాల ప్రచార రథాలతో పాటు 56 రకాల కళారూపాలు కళకళలాడాయి. మంత్రి కె. అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ డప్పు కొట్టి శోభాయాత్రను ప్రారంభించారు. యాత్రలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఉదయం నగరంలో సామూహిక సూర్యనమస్కారాలు, క్రీడా పోటీలు, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

✦ అరసవల్లిలోని సూర్యనారాయణస్వామి ఆలయంలో శనివారం అర్ధరాత్రి నుంచి రథసప్తమి వేడుకలు ప్రారంభం కానున్నాయి. రాత్రి 12 గంటలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి కె.అచ్చెన్నాయుడు స్వామికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు.



శ్రీకాకుళం నగర వీధుల్లో సాగుతున్న శోభాయాత్ర



ఎలక్ట్రిక్ రాకెట్ విడిభాగాలను అనుసంధానిస్తున్న విద్యార్థులు. చిత్రంలో విజ్ఞాన్ వర్సిటీ సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి

పంట పొలమే లాంచ్‌ప్యాడ్..!

రాకెట్లను ప్రయోగించి సత్తా చాటిన యువత

ఈనాడు, అమరావతి – న్యూస్‌టుడే, పొన్నూరు: పంట పొలమే లాంచ్‌ప్యాడ్ అయింది. పరిసరాల్లోని చెట్ల నీడే వీక్షకుల గ్యాలరీగా మారింది. వివిధ రకాల రాకెట్లతో ఆ ప్రాంతం శ్రీహరికోట సతీష్‌ధవన్ అంతరిక్ష కేంద్రాన్ని జ్ఞప్తికి తెచ్చింది. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు సుమారు 2 గంటల పాటు గుంటూరు జిల్లా వడ్లమూడి విజ్ఞాన్స్ వర్సిటీ సమీపంలోని గ్రీన్‌ఫీల్డ్స్‌లో చేపట్టిన రాకెట్ ప్రయోగాలు అందరినీ కట్టిపడేశాయి. ఏపీ స్పేస్ టెక్ సమిట్-2026లో భాగంగా సౌత్ ఇండియా రాకెట్రీ ఛాలెంజ్‌లో తొలిరోజు హైడ్రో రాకెట్ ప్రయోగాలను విద్యాలయం ప్రాంగణంలోనే చేపట్టారు. రెండోరోజైన శుక్రవారం కెమికల్ రాకెట్ ప్రయోగాలను నిర్వహించారు. భద్రతా కారణాల దృష్ట్యా సమీపంలోని పంట పొలాలను ఎంచుకున్నారు. అక్కడ మట్టిని చదును చేసి లాంచ్‌ప్యాడ్‌ను రూపొందించారు. ప్రయోగాలు విజయవంతమవడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.



నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి..

సేవ.. అభిమానుల తోవ!

- మంత్రి లోకేశ్ జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరాలు

ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే బృందం: రాష్ట్ర ఐటీ మంత్రి నారా లోకేశ్ జన్మదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా కార్యకర్తలు, తెదేపా నేతలు పెద్దఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహించారు. నియోజకవర్గాల్లో అన్నవితరణ చేశారు. వాహనదారులకు హెల్మెట్లు పంపిణీ చేశారు. నియోజకవర్గ కేంద్రాల్లో మానవ హారాలు పాటించారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. మంగళగిరికి చెందిన చిత్రకారిణి జీయన్ సాయిశ్రీ గీసిన చిత్రాల్ని ఇందులో ప్రదర్శించారు. సాయిశ్రీని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు, ఏపీ బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్ అభినందించారు.



రాజంపేటలో రక్తదానం చేస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

✦ వైఎస్సార్ కడప జిల్లాలో తెదేపా శ్రేణులు రక్తదానం చేశాయి. రాజంపేటలో ఏర్పాటు చేసిన శిబిరంలో నాయకులు, కార్యకర్తలు 400 యూనిట్ల రక్తమిచ్చారు. సుండుపల్లిలో, ప్రొద్దుటూరులోని కామిశెట్టి కళాశాలలో, మంగళగిరిలోని భోగి ఎస్టేట్‌లో రక్తదానం చేశారు. ప్రకాశం జిల్లా కనిగిరిలో ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి ఆధ్వర్యంలో, కర్నూలు జిల్లా ఆదోనిలో ఎమ్మెల్యే బీటీ నాయుడు ఆధ్వర్యంలోనూ రక్తదానం చేశారు.

లోకేశ్‌ను చూస్తే నా చేతుల్లో ఆడుకున్న పిల్లాడేనా అనిపిస్తుంది

– నారా భువనేశ్వరి

"కుమారుడు ఎంత ఎదిగినా తల్లికి మాత్రం బిడ్డగానే కనిపిస్తాడంటారు. లోకేశ్‌ను చూస్తున్నప్పుడు నా చేతుల్లో ఆడుకున్న పిల్లాడేనా అనిపిస్తుంది. ఆ పిల్లాడే ఇప్పుడు మంత్రిగా బాగా పనిచేసి అందరి ప్రశంసలు అందుకుంటుంటే సంతోషంగా ఉంది" అని నారా లోకేశ్ తల్లి నారా భువనేశ్వరి పేర్కొన్నారు.

నా బలం నువ్వే లోకేశ్

– నారా బ్రాహ్మణి

"నా బలం, నా ప్రశాంతత నువ్వే లోకేశ్. నీవు చేస్తున్న త్యాగాలు, మౌనంగా మోస్తున్న బాధ్యతల్ని చాలా రోజులుగా చూస్తున్నాను. సమాజంలో మార్పు తీసుకురావాలనే నీ అంకితభావం నన్ను ఎంతో ప్రేరేపిస్తోంది".

మరింత శక్తి, సుఖ సంతోషాలు ఇవ్వాలి

– ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

'రాష్ట్ర విద్యావ్యవస్థలో భావితరాల ప్రయోజనాలకు అనుగుణంగా మార్పులు తీసుకురావడంలో, ఐటీ సంస్థల స్థాపనకు కృషిచేస్తూ యువత ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపరచడంలో లోకేశ్ ముందడుగు వేస్తున్నారు. ఆయనకు మరింత శక్తిని, సుఖసంతోషాలు ఇవ్వాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నా'.



రక్తదాన శిబిరంలో కేక్ కోస్తున్న తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, దమ్మాలపాటి శ్రీనివాస్, పోసాని వెంకటేశ్వర్లు తదితరులు

హైకోర్టు వద్ద రక్తదాన శిబిరం

తెదేపా న్యాయ విభాగం(లీగల్ సెల్) ఆధ్వర్యంలో శుక్రవారం హైకోర్టు వద్ద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి పారా కిశోర్‌తో కలిసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. శిబిరంలో పలువురు న్యాయవాదులు పాల్గొని రక్తదానం చేశారు. స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి, నారా లోకేశ్ జన్మదినం సందర్భంగా భారీ కేకు కోశారు. అన్నదానం చేశారు. అడ్వొకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్, పీపీ ఎం.లక్ష్మీనారాయణ, శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు, న్యాయవాదులు గొట్టిపాటి రామకృష్ణప్రసాద్, పాండురంగారావు, చుక్కపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సైనైడ్ కేసులో సైకోకు జీవితశిక్ష

- రెండో నిందితుడికి పదేళ్ల కఠిన కారాగారం
- ప్రసాదమిచ్చి పది మందిని చంపిన నిందితులు
- ఏలూరు కోర్టు సంచలన తీర్పు



వెల్లంకి సింహాద్రి, అమీనుల్లా బాబు

ఈనాడు, ఏలూరు: ప్రసాదంలో సైనైడ్ కలిపి పది మందిని హతమార్చిన కేసులో ఇద్దరు నిందితులకు కోర్టు శిక్ష విధించింది. రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఈ కేసులో ఏలూరు 8వ అదనపు డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి కోర్టు శుక్రవారం సంచలన తీర్పునిచ్చింది. కేసులో ప్రధాన నిందితుడు ఏలూరుకు చెందిన వెల్లంకి సింహాద్రి (శివ) ఎ2 షేక్ అమీనుల్లా బాబు (విజయవాడ వాంబేకాలనీ)పై నేరం రుజువైంది. వీరిలో సింహాద్రికి జీవితఖైదు, పదేళ్ల కఠిన కారాగారశిక్ష, అమీనుల్లాకు పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు వెలువరించారని ఏలూరు జిల్లా పోలీసులు తెలిపారు. ప్రధాన నిందితుడు సింహాద్రి సులువుగా డబ్బులు సంపాదించేందుకు స్థిరాస్తి వ్యాపారంలో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని ఆశ పెట్టి, రైస్ పుల్లింగ్‌లో కాయిన్లు ఇప్పిస్తానని అమాయకులను నమ్మించి వారిని రప్పించేవాడు. వచ్చినవారు హిందువులైతే వారికి తిరుపతి ప్రసాదమని, క్రైస్తవులైతే జెరూసలెం ప్రసాదమని చెప్పి.. అందులో సైనైడ్ కలిపి ఇచ్చేవాడు. అది తిన్న కొద్దిసేపటికే వారు చనిపోయేవారు. తర్వాత వారి వద్ద ఉన్న సొత్తు, బంగారం దోచుకుని వెళ్లిపోయేవాడు. ఇలా ఎవరికీ అనుమానం రాకుండా చంపేవాడు. అప్పట్లో ఈ హత్యలు సంచలనంగా మారాయి. 20 నెలల్లో మూడు జిల్లాల పరిధిలో పదిమందిని హతమార్చాడు. ఏలూరుకు చెందిన కాటి నాగరాజు బంధువుల ఫిర్యాదు మేరకు నిందితుడు సింహాద్రిపై 2019లో ఏలూరు మూడో పట్టణ పోలీసులు కేసు నమోదుచేశారు. దర్యాప్తులో భాగంగా విజయవాడ వాంబేకాలనీకి చెందిన అమీనుల్లా బాబు సైనైడ్ సరఫరా చేసేవాడని గుర్తించి అతన్ని ఎ2గా చేర్చారు. నిందితులు పాల్పడిన నేరాలపై సాక్ష్యాధారాలతో ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఏలూరు ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆధ్వర్యంలో ఏర్పాటైన కోర్టు మానిటరింగ్ సెల్ ఈ కేసులో కోర్టుకు అవసరమైన సాక్ష్యాధారాలను అందజేసి నిందితులకు శిక్షలు పడేలా చేయడంలో విజయవంతంగా పనిచేసింది.


విజయ్ సేల్స్
నమ్మకం ముఖ్యం
www.vijaysales.com
నూతన షోరూమ్
విజయవాడ
గవర్నర్ పేట, ఏలూరు రోడ్,
60% వరకు తగ్గింపు
మెగా రిపబ్లిక్ డే సేల్
క్రెడిట్ కార్డు/డెబిట్ కార్డు మరియు పేపర్ ఫైనాన్స్‌పై ₹30,000/- వరకు తక్షణ డిస్కౌంట్ మరియు క్యాష్ బ్యాక్
Cool.Calm. Power-Smart
Unleash Exciting Savings with Exclusive Offers!
1.5T 5 STAR INVERTER AC WITH WIFI ₹28,990 AFTER OLD AC EXCHANGE
• 5 YRS COMPREHENSIVE WARRANTY
• FREE STD INSTALLATION
LLOYD 43 [108 cm] 4K UHD powered by webOS Hub
PRICE ₹45,900
REPUBLIC DAY SALE PRICE ₹20,990
ZERO DOWN PAYMENT | EMI ₹2,624 x 8 Months
LG 55 [138 cm] 4K OLED webOS
CASHBACK UPTO ₹7,500
EMI STARTS FROM ₹1,999
TELEVISIONS
RANGE AVAILABLE FROM 32 (80 cm) TO 100 (254 cm)
32 55 100 85 43
UPTO 26% CASHBACK*
UPTO ₹26,000
FULL HD 4K 8K OLED | QLED | QNED | NanoCell | Google TV | android tv | webOS | Mini LED
Haier LG LLOYD mi Panasonic SONY SANSUI TCL VISE
SANSUI 65 [164 cm] 4K QLED Google TV
PRICE ₹71,990
REPUBLIC DAY SALE PRICE ₹43,990
DOWN PAYMENT ₹8,798 | EMI ₹4,399 x 8 Months
SANSUI 75 [189 cm] 4K QLED Google TV
PRICE ₹1,61,910
REPUBLIC DAY SALE PRICE ₹64,990
DOWN PAYMENT ₹12,998 | EMI ₹6,499 x 8 Months
SONY 85 [215 cm] 4K UHD Google TV
CASHBACK UPTO ₹15,000
EMI STARTS FROM ₹8,500
LLOYD 100 [254 cm] 4K QLED Google TV
PRICE ₹8,29,500
REPUBLIC DAY SALE PRICE ₹2,24,990
ZERO DOWN PAYMENT | EMI ₹28,124 x 8 Months
REFRIGERATORS
RANGE AVAILABLE FROM 190 LTRS TO 800 LTRS
Latest Models - Convertible and Inverter Technology
SIDE BY SIDE: RANGE STARTING FROM ₹49,990* CASHBACK UPTO ₹20,000* (UE)
FROST FREE: RANGE STARTING FROM ₹21,990* CASHBACK UPTO ₹8,000* (UE)
DIRECT COOL: RANGE STARTING FROM ₹11,990* CASHBACK UPTO ₹2,500* (UE)
WASHING MACHINES
RANGE AVAILABLE FROM 6.5 KG TO 14 KG
Latest Models with AI & Turbo Wash, Hygiene Steam, Refresh and many more multi tasking features at your finger tips!!
FRONT LOAD: RANGE STARTING FROM ₹30,500* CASHBACK UPTO ₹10,000* (UE)
TOP LOAD: RANGE STARTING FROM ₹12,500* CASHBACK UPTO ₹5,000* (UE)
SEMI AUTOMATIC: RANGE STARTING FROM ₹9,500* CASHBACK UPTO ₹2,000* (UE)
EXPERIENCE THE BEST OF APPLE
Product | Starting at* | EMI Starting at*
iPhone 16 | ₹59,290 | ₹5,191
iPhone 15 | ₹48,200 | ₹4,350
MacBook Air M4 | ₹79,900 | ₹3,746
iPad (11th gen) | ₹30,500 | ₹1,375
Apple Watch (Series 11) | ₹41,090 | ₹4,843
AirPods 4 | ₹10,990 | ₹500
Upto ₹10,000* Instant cashback & No Cost EMI on credit cards of ICICI Bank | AXIS BANK
+ Exchange bonus Up to ₹10,000*
Available at stores only.* *T & C apply.
REDMI Note 15 5G
Faster. Stronger. Simply Better.
108 MasterPixel Edition
₹19,999* ₹21,999*
SAMSUNG
Galaxy A56 | A36 5G
Awesome Offers
Best Deals on Laptops
Dive into Exclusive Deals and Enjoy Huge Discounts!
hp PAVILION, VICTUS, SPECTRE, OMEN, ENVY
• Cashback Upto ₹15,000/-*
• Hyper X CloudX Stinger 2 Core Wired Headset @ ₹499/-*
• 1 Year Warranty + 3 Years Antivirus @ ₹1,999/-*
ASUS ROG, STRIX, ZENBOOK, TUF GAMING, ZEPHYRUS DUO
• Asus CW101 Keyboard + Mouse @ ₹999/-*
• Laptop Warranty Starting @ ₹99/-*
• Upto 15 Months Paper Finance Offer
LED TVs | Large Appliances | Air Conditioners
Mobiles | Laptops | Desktops | Printers | Accessories
Kitchen Appliances
ICICI Bank INSTANT DISCOUNT UP TO ₹15,000* ON CREDIT CARDS NON EMI, CREDIT & DEBIT CARDS EMI
HDFC BANK INSTANT DISCOUNT UP TO ₹7,500* WITH EASYEMI ON HDFC BANK CREDIT CARDS
AMERICAN EXPRESS INSTANT DISCOUNT UPTO ₹15,000* ON AMERICAN EXPRESS EMI TRANSACTIONS
UP TO ₹30,000/- INSTANT DISCOUNT & CASHBACK ON CREDIT CARD / DEBIT CARD & PAPER FINANCE
SBI card HSBC onecard BOBCARD YES BANK pnb DBS IDFC FIRST Bank HDB FINANCIAL SERVICES
విజయ్ సేల్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్
ఆంధ్ర ప్రదేశ్ | హైదరాబాద్ | వరంగల్ | ముంబయి | పూణే | అహ్మదాబాద్ | సూరత్ | వడోదర | ఢిల్లీ | గురుగ్రామ్ | నోయిడా | ఇందిరాపురం | ఫరీదాబాద్ | ఘజియాబాద్
విజయవాడ - ఏలూరు రోడ్: ప్రసన్న కుమార్ - 91549 03539, శ్రీనివాస్ - 87126 12331
విజయవాడ - ఎం జి రోడ్: రజనీ కుమార్ - 96665 03755, దుర్గా భవానీ - 91549 03667
విజయవాడ - ఎన్టీఆర్ సర్కిల్: ఈశ్వర్ - 88866 53042, చక్రపాణి - 91333 16947
రాజమండ్రి - జె ఎల్ ఎన్ రోడ్: గౌతం - 91549 03693, ప్రవీణ్ - 87120 32656
రాజమండ్రి - ఇన్నిస్‌పేట్: సతీష్ - 88866 74548, అనంత్ - 73373 76206
తిరుపతి - ఎం ఆర్ పల్లి: కిరణ్ - 99482 28111, కళ్యాణ్ - 87126 00792
తిరుపతి - లీలా మహల్: వేణు - 73373 76215, వెంకటేష్ - 91543 85029
కాకినాడ - అపోలో హాస్పిటల్ ప్రక్కన: శివ గంగాధర్ - 91543 16627, నాగశ్రీ - 73373 76220
వైజాగ్ - దొండపర్తి: రమేష్ - 99482 41112, కిరణ్ కుమార్ - 91549 03528
SCAN FOR STORES
Scan to Shop Online www.vijaysales.com
*Conditions apply. This offer includes all other discounts also. No other offer can be clubbed with this offer. Images shown are for illustrative purpose only. Offer till stocks last. Finance offer applicable at the sole discretion of Financier. #Processing Fees and other charges is applicable as per Financier Bank. For Paper Finance: Please bring Aadhaar Card, Pan Card, Electric Bill & Cancelled Cheque. Offer is based on minimum transactions slabs defined by Finance company. Convenience fees will be applicable for HDB finance Cashback. Kindly speak to our store sales staff for the "Terms and Conditions" of all the bank offers, and for the respective Instant Discount/Cashback amounts applicable on each Bank. Upto 60% off on select brands and models only. *Cashback Applicable Select Banks & Cards. Upto off on select brands and models only.

EENADU Vol: 52, Issue: 164 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao

ఈతరం

youthpage@eenadu.in

ఓట్రోవర్ట్ అంటార్రా బాబూ!



ఎవరితో కలవని వాళ్లను ఇంట్రావర్ట్స్ అని, కొంచెం చనువిస్తే చాలు మాటల దాడి చేసేవాళ్లని ఎక్స్‌ట్రావర్ట్స్ అని, ఏదైనా విషయాన్ని నమ్మిన వ్యక్తులతో చర్చించి ఒక నిర్ణయం తీసుకునే వారిని ఆమ్రోవర్ట్స్ అంటారని మనకు తెలుసు.

ఇప్పుడు కొత్తగా ఓట్రోవర్ట్ అనే పదం ఎక్కువగా వైరల్ అవుతోంది. ఇదో స్పానిష్ వర్డ్. వీళ్లు గ్రూప్స్‌లో అంత త్వరగా కలవలేరు. అలా అని సిగ్గుతో కాదు. ఎక్కువ మందితో పైపైన మాటల కంటే ఒక్కరితో లోతైన సంభాషణను ఇష్టపడతారట. అర్థవంతమైన బంధాల పట్లే ఆకర్షితులవుతారట. సోషల్‌గా యాక్టివ్‌గా ఉన్నప్పటికీ.. మానసికంగా అందరికీ అందుబాటులో ఉండరు. ఒక్కమాటలో చెప్పాలంటే.. సెలెక్టెడ్‌గా మాత్రమే మాట్లాడేవారిని ఓట్రోవర్ట్ అంటున్నారు.

అదీ ఓ కళే..

మనసులో చాలా మంచి మాటలుంటాయి. కానీ అవి బయటకు వచ్చేసరికి ఇంకెలాగో మారిపోతాయి. చెప్పాలనుకున్న విషయాన్ని సరిగ్గా కమ్యూనికేట్ చేయలేకపోవడం వల్ల వచ్చే సమస్యలివి. కాలేజ్, ఉద్యోగం.. ఎక్కడైనా సరే మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ అవసరం, అప్పుడే అనుకున్న లక్ష్యాలు సాధించగలుగుతాం. అయితే కమ్యూనికేషన్ అంటే కేవలం మనం మాట్లాడటమే కాదు.. ఇంకా కొన్ని విషయాలున్నాయి అంటున్నారు నిపుణులు. అవేంటంటే..

1 **సరిగ్గా వినడం:** అవతలి వ్యక్తులు మాట్లాడేటప్పుడు ఆసక్తి, ఓపికతో శ్రద్ధగా వినాలి. ఇలా వినడం ద్వారా వారి భావనలను పూర్తిగా అర్థం చేసుకోగలుగుతాం. ఏదో తప్పదు అన్నట్లు తల ఊపడం, ఊకొట్టడం కాకుండా ఆసక్తిగా వినాలి.

2 **నిజాయతీ:** స్పష్టంగా, నిజాయతీతో విషయాలను పంచుకోవాలి. అప్పుడే ఇతరులు కూడా మనతో సరైన సంభాషణను జరపగలరు, విషయాలను పూర్తిగా పంచుకోగలరు. కమ్యూనికేషన్‌లో నిజాయతీగా ఉండటం ద్వారా ఇద్దరి మధ్య నమ్మకం బలపడుతుంది. ఇది చాలా ముఖ్యం.

3 **సహానుభూతి, గౌరవం:** మంచి కమ్యూనికేషన్‌లో ఎంపథీ తప్పనిసరి. ఇతరుల భావాలను అర్థం చేసుకొని... సహానుభూతి చూపించాలి. దీంతో వారికున్న బాధలను, భావాలను మనతో నిర్భయంగా పంచుకుంటారు. వారికి మనపై ఓ విధమైన గౌరవం ఏర్పడుతుంది.

4 **అభిప్రాయం:** మన అభిప్రాయాలను కూడా ఇతరులతో పంచుకోవాలి. అదే సమయంలో ఇతరుల అభిప్రాయాలను గౌరవించాలి. ఇది కమ్యూనికేషన్‌లో చాలా ముఖ్యమైనది. ఎవరికి ఎటువంటి ఒపీనియన్స్ అయినా ఉండొచ్చు. కానీ సంభాషణ దశలో వాటితో ప్రభావితం కాకుండా, ముందు పూర్తిగా వినాలి.

నేనే లీడర్



5 **శారీరకభాష:** సంభాషణ అంటే కేవలం మాట్లాడటమే కాదు. శారీరక భాష, ముఖ కవళికలు, మౌనం కూడా దీనిలో భాగమే. వాటినీ గమనిస్తూ ఉండాలి. మన శారీరక భాష మీద కూడా అదుపుతో వ్యవహరించాలి. ఇవన్నీ చేయగలిగితే.. ఎఫెక్టివ్ కమ్యూనికేషన్ మన సొంతం!

రూ.2 కోట్ల జీతం వదిలి.. పాల వ్యాపారం!

అతడు చిన్ననాటి నుంచి కలలు కన్న కొలువులో ఉన్నాడు. చక్కగా ఏడాదికి రూ.2.02 కోట్ల జీతం. అంతా బాగుంది అనుకున్న సమయంలో కుటుంబ పరిస్థితులు తలకిందులయ్యాయి. రకరకాల సమస్యలతో ఊరి జనం తన కుటుంబాన్ని దూరం పెట్టారు. అది తట్టుకోలేని అతడు.. ఎక్కడో కాదు, సొంతఊళ్లోనే తానేంటో నిరూపించుకోవాలి అనుకున్నాడు. ఉన్న ఉద్యోగం వదిలి వ్యాపారానికి సిద్ధమయ్యాడు. అతి తక్కువ కాలంలోనే అంతకంటే ఎక్కువ సంపాదించే స్థాయికి ఎదిగాడు!

తాటిపర్తి సతీష్‌రావుది ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం వెల్తుర్లపల్లి గ్రామం, వ్యవసాయాధారిత కుటుంబం. సతీష్‌రావు చిన్నతనంలో తల్లిదండ్రులు వ్యవసాయంలో సరిగా దిగుబడులు రాక పూర్తిగా నష్టపోయారు. అయినా ముగ్గురు పిల్లల చదువులను ఏనాడూ ఆపలేదు. సతీష్ భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రంలో పదో తరగతి పూర్తి చేశాడు. ములుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రాడ్యుయేషన్ అనంతరం వరంగల్ ఎన్ఐటీలో ఎమ్మెస్సీ చేశాడు.

ఆపైన అమెరికాలో మాస్టర్స్ చేసేందుకు స్కాలర్‌షిప్‌తో సహా సీటు రావడంతో అక్కడికి వెళ్లిపోయాడు. అక్కడే ఫైజర్ కంపెనీలో స్టాటిస్టికల్ ప్రోగ్రామర్‌గా ఉద్యోగం సాధించాడు. తొలుత రూ.85 లక్షలతో జీతం మొదలైంది. ఆ తర్వాత పలు కంపెనీలు మారాడు. వేతనం పెరిగింది. అయినా సంతృప్తి చెందలేదు. ఎందుకంటే చిన్నప్పటి నుంచి తనకు ఉద్యోగం చేయడం కాదు, ఉద్యోగాలు ఇవ్వడం కల. అదే సమయంలో గ్రామంలో వారి కుటుంబానికి అనుకోని ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో ఎలాగైనా ఊర్లోనే స్థిరపడి తలెత్తుకుని తిరగాలి అనుకున్నాడు. డెయిరీ పరిశ్రమ మదిలో మెదిలింది. దాంతో అమెరికాలో చాలా డెయిరీలను సందర్శించాడు. వీకెండ్స్‌లో అక్కడికి వెళ్లి కొత్త విషయాలు నేర్చుకున్నాడు. ఆ సమయానికి తన జీతం రూ.2.02 కోట్లు.. తోటి స్నేహితులు 'మంచి జీతం ఉంది ఇక్కడే ఉండొచ్చు కదా' అన్నారు. అయినా లక్ష్యాన్ని వీడలేదు. 2023లో ఊరికి వచ్చేశాడు.



అప్పుడే మొదలు

రెండు నెలలు ఇంట్లో ఉంటూ.. వర్క్ ఫ్రం హోం చేశాడు. ఈ సమయంలో తన డెయిరీ ఫాం ప్రాజెక్టు గురించి బ్యాంకులకు వెళ్లి మేనేజర్లకు వివరించేవాడు. 'అమెరికాలో కోట్ల జీతం వస్తుందంటున్నావు.. అదంతా వదిలేసి ఇది సాధ్యమవుతుందా?' అన్నవారే ఎక్కువ. ఇంకొందరైతే 'మీ ఇంట్లో వాళ్లని తీసుకురా' అని కూడా చెప్పారు. అయినా పట్టు వదలని విక్రమార్కుడిలా ప్రయత్నిస్తూనే ఉన్నాడు. అప్పటికే డెయిరీ కోసం తన దగ్గర ఉన్న డబ్బుతో 22 ఎకరాల వ్యవసాయ భూమిని కొనుగోలు చేశాడు. చివరికి ఓ బ్యాంకు తన ప్రాజెక్టును ఒప్పుకొని రూ.4 కోట్ల రుణం మంజూరు చేసింది.

2024లో నాలుగెకరాల్లో రెండు షెడ్లు వేసి మొదట పంజాబ్ నుంచి వంద గేదెలు తీసుకొచ్చాడు. ప్రస్తుతం మరో వంద గేదెలు తీసుకురావడంతో.. వాటి సంఖ్య 200కు చేరింది. డెయిరీ ఫాంకు ఒక మేనేజర్, సూపర్‌వైజర్, పది గేదెలకు ఒకరు చొప్పున మనుషులను ఏర్పాటు చేశాడు. ఎలాంటి యంత్రాలు వాడకుండా సంప్రదాయ పద్ధతిలో పాలు తీస్తున్నారు. రోజుకు 900 నుంచి 950 లీటర్ల పాలు వస్తున్నాయి. ఈ పాలను నేరుగా 'నేచర్ డెయిరీ ఫాం' పేరుతో జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని గణపురం, మంజూనగర్, భూపాలపల్లిలో మొత్తం నాలుగు అవుట్‌లెట్స్ ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు. డెయిరీ ఫాం, అవుట్‌లెట్లలో కలిపి మొత్తం 28 మంది పనిచేస్తున్నారు. మరో 25 మంది వరకూ పాల ఉత్పత్తుల ద్వారా ఉపాధి పొందుతున్నారు. నెలకు పాతిక లక్షల వరకూ వస్తోంది! సొంత వ్యాపారాలు చేయాలనుకునే యువతకు సతీష్ అనుభవం ఓ చక్కని పాఠం.

– పురుషోత్తం గుళ్లెపెల్లి, వరంగల్

డ్యాన్స్ లాంటిది.. కానీ కాదు



వయసు చిన్నదే కానీ బరువు మాత్రం సమస్య మనలో కొందరికి. అలాగే దానికి తగినట్టు ఒత్తిడి కూడానూ! అందుకే శరీరానికీ, మనసుకూ పనికొస్తుందని మెడిటేషన్, యోగా వంటివి చేస్తుంటారు. జుంబా డ్యాన్స్ వంటివీ ఉండనే ఉన్నాయి. ఈమధ్య ఇంకాస్త వెరైటీగా.. సోమాటిక్ షేకింగ్ చేస్తున్నారు. అంటే ఏం లేదు.. శరీర భాగాలను రిథమిక్‌గా కదిలించడం లాంటిదే ఇది. దీనిలో పలు రకాలున్నాయి. ముఖ్యంగా ఒత్తిడిని తగ్గించుకోవడానికి సోమాటిక్ షేకింగ్ ఓ మంచి మార్గమట. ఇది నాడీవ్యవస్థ సరైన పనితీరుకు దోహదం చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఈ వ్యాయామం చేయడం ద్వారా అడ్రినల్, కార్టిసాల్ హార్మోన్లు విడుదలవుతాయట. అంతేకాదు.. హృదయ స్పందన రేటు, రక్తపోటును సరిగ్గా ఉంచడానికి పనికొస్తుందట. సోమాటిక్ షేకింగ్ అనేది శరీరంలోని అన్ని భాగాలనూ కదిలిస్తుంది. చూడటానికి డ్యాన్స్‌లా అనిపిస్తూ సరదాగానూ ఉంటుంది. మరి మీరూ ట్రై చేస్తారా!

మెయిల్ పంపండి



ఈతరం పేజీలో వస్తున్న కథనాలు, శీర్షికలపై మీ విలువైన సలహాలు, సూచనలు మాకు పంపండి. మా మెయిల్ అడ్రస్ **youthpage@eenadu.in**

తనే వారి చూపు

సరదాకైనా కాసేపు కళ్లు మూసి నడవలేం. అలాంటిది అప్పటివరకూ సాధారణ జీవితం గడుపుతూ అందమైన భవిష్యత్తును ఊహించుకున్న అతని ముందు హఠాత్తుగా కారుచీకట్లు కమ్ముకున్నాయి. మంచి జీతంతో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా రాణిస్తున్న సమయంలో కంటిచూపు పోయి అంతా అంధకారమైంది. కానీ తను వెనకడుగు వేయలేదు. తనలాంటి మరెందరికో చేయూతనందిస్తున్నాడు. అతడే శ్రీకాకుళానికి చెందిన వేణుగోపాల్‌నాయుడు.



పట్టణంలోని జిల్లా పరిషత్ కాలనీకు చెందిన తుమ్మి వేణుగోపాల్‌నాయుడు పుట్టుకతో అంధుడు కాదు. పాలిటెక్నిక్ డిప్లొమా (ఈసీఈ)తో ఇన్ఫోటెక్ ఎంటర్‌ప్రైజస్ లిమిటెడ్ (ప్రస్తుతం సీవైఈఎన్‌టీ)లో మంచి ఉద్యోగం అందుకున్నాడు. ఇంటర్న్‌షిప్ అనంతరం అదే సంస్థలో టెలీకమ్యూనికేషన్స్ విభాగంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఎంపికయ్యాడు. తర్వాత వివిధ సంస్థల్లో ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ విభాగంలో సీనియర్ టీం లీడర్‌గా పనిచేశాడు. 2020 జనవరి నెల చివరికి ఏపీ ఫైబర్, ఈ-ప్రగతి విభాగాలకు ఐటీ ఎల్ డెస్క్ మేనేజర్‌గా మంగళగిరిలో ఉన్నాడు.

కరోనాతో మారిన తలరాత..

అలా సంతోషంగా సాగుతున్న వేణుగోపాల్ బంగారు జీవితాన్ని కొవిడ్ తలకిందులు చేసింది. కరోనా సోకి చూపు తగ్గడంతో వైద్యులకు చూపించాడు.. అయినా ఉపయోగం లేదు. 2020 మార్చి నెల చివరికి పూర్తిగా చూపు పోయింది. ఆ వ్యాధి వల్ల కంటి నరాలు బలహీనపడటం వల్ల ఇలా జరిగిందని వైద్యులు నిర్ధారించారు. ఆ మాటతో తను ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు! అప్పటివరకూ ఉన్న కెరియర్ ఒక్కసారిగా దూరమై.. వృత్తి, కుటుంబ జీవనం కష్టమైపోయింది. ఎటూ పాలుపోని అవస్థ. కానీ తను ఆత్మవిశ్వాసాన్ని కోల్పోలేదు. అంధులకు ప్రత్యేకంగా పనిచేసే స్క్రీన్ ఉంటుందని తెలుసుకున్నాడు. అప్పటి స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జనార్దననాయుడుని ఓ స్నేహితుడి సలహాతో కలిశాడు. ఆయన ఎన్‌డీవీఎస్, జాస్ వంటి ప్రత్యేక సాఫ్ట్‌వేర్ల సహాయంతో కంప్యూటర్, చరవాణి స్క్రీన్‌లను ఎలా ఉపయోగించాలో వేణుకి నేర్పించారు. అప్పటి నుంచి అతడి దారిమారింది.

మరింత మందికి ఉపాధి

తర్వాత బెంగళూరులో ఆరు నెలల ప్రత్యేక శిక్షణ తీసుకున్నాడు. కేవలం తనకు ఉపాధి వెతుక్కోవడం కాదు. తనలా చూపు లేని వారు ఆర్థికంగా నిలదొక్కుకోవడం కోసం పనిచేయాలి అనుకున్నాడు. అందుకే విశాఖపట్నంలో అంధులకు ఎంప్లాయిబిలిటీ ట్రైనర్‌గా చేరాడు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన వారికి తగిన శిక్షణ ఇచ్చి వివిధ రంగాల్లో ఉపాధి పొందేందుకు సాయం చేస్తున్నాడు. కంప్యూటర్ శిక్షణ, కార్యాలయంలో పనిచేసే నైపుణ్యాలు పెంచి ఉద్యోగాలు పొందేవరకూ తోడుంటున్నాడు. వారిలో ఆత్మస్థైర్యం పెంచుతున్నాడు.

★ కేవలం ఒక్క ఏడాదిలోనే మూడు బ్యాచ్‌లకు శిక్షణ పూర్తిచేసి 11 మంది అంధులకు చక్కని ఉద్యోగాలు వచ్చేలా కృషి చేశాడు. మరో 70 మందికి ప్రస్తుతం శిక్షణ అందుతోంది. ఈ కార్యాచరణను ముందుకు తీసుకెళ్లడానికి 'విజువల్లీ ఛాలెంజింగ్ యూత్ అసోసియేషన్'లో చేరి జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. అంధులకు ఉన్నత ఉద్యోగాల కల్పన అవకాశాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాడు. అనుకోని కష్టానికి కుమిలిపోకుండా నిలబడటమే కాదు.. మరో పది మందికి వెన్నుదన్నుగా నిలుస్తున్న తన కృషిని మనమూ అభినందిద్దాం.

– కాళూరి వెంకట శ్రీనివాస్, శ్రీకాకుళం

విడివిడిగా..



ట్రావెలింగ్‌లో ఒక్కొక్కరిదీ ఒక్కోతీరు. ఆమెకేమో ఎయిర్‌పోర్ట్‌లో స్టోర్స్ అన్నీ ఓ లుక్కేయాలి అనిపిస్తుంది. అతనికేమో గేటు దగ్గర కూర్చుని ప్రశాంతంగా పుస్తకం చదవాలి అనిపిస్తుంది. ఉన్న కొద్ది సమయంలో రెండూ చేసేదెలా? అందుకే ఓ పద్ధతి పాటించేస్తున్నాయి యువజంటలు.

అదేంటంటే.. ఎయిర్‌పోర్ట్ సెక్యూరిటీ చెక్ పూర్తి కాగానే, ఎవరి దారిన వారు ఉంటున్నారట. ఇద్దరిలో ఎవరికి నచ్చింది వారు చేస్తూ.. తిరిగి ఫ్లైట్ ఎక్కేముందు కలుస్తున్నారట. దీనికి 'ఎయిర్‌పోర్ట్ డివోర్స్' అనే పేరు కూడా పెట్టేశారు. అయితే ఇది నిజంగా విడాకులు కాదు, కేవలం కాసేపు ఇద్దరూ 'మి టైమ్' గడపడానికి చేసుకున్న వెసులుబాటు. దీనివల్ల వాదనలు తగ్గడం, స్ట్రెస్‌ఫుల్ ట్రావెలింగ్‌లో కాస్త రిలాక్స్ కావడం జరుగుతోందట. అందుకే దీన్ని ఫాలో అయిపోతున్నారు మన యూత్ జనాలు.

కొంటె కొటేషన్



1. ఓహో టెకీ దొర.. ఒత్తిడితో అయ్యావా సొర? – తేజస్వి చిన్ని, హైదరాబాద్
2. చాకు వంటి కుర్రాడు.. చేప వెంట పడ్డాడు. – విజయ్
3. హాయిగా వెళ్లకుండా డ్యూటీకి.. చేపతో దిగాడు పోటీకి! – సూర్య స్వరూప్, విజయనగరం
4. నాకోసం తెరిచావా నోరు.. లోపలికి పోతుంది నీరు. – సాయితేజ
5. కుర్రాడి హుషారుకి చేప పరారు. – దీక్షిత్ రెడ్డి, హైదరాబాద్



ఈ ఫొటోకి సరదా వ్యాఖ్య రాసి పంపండి. బాగున్నవి ప్రచురిస్తాం.

హితులేనా..?

స్నేహితులంటేనే మంచి కోరేవారు. కానీ ఈ పోటీ ప్రపంచంలో ఫ్రెండ్స్‌గా కనిపిస్తూనే మనకు నష్టం చేకూర్చాలని చూసేవారు ఉంటారు. అందుకే ఎవరు ఎలాంటివారో తెలుసుకునేందుకు కొన్ని లక్షణాలను పరిశీలించాలి.

ఎనర్జీ : నిజమైన స్నేహితులు మన ఎనర్జీ, ఎఫర్ట్స్‌కు తగిన విధంగా ప్రవర్తిస్తారు. ప్లాన్స్ మనతోపాటు వారు కూడా వేస్తారు. కాల్స్, మెసేజెస్‌లో ముందుంటారు. ఎప్పుడో వారికి అవసరమైనప్పుడే కాల్ చేయడం కాకుండా నిజంగా మన మంచిచెడ్డలు పట్టించుకుంటారు. ఎప్పుడూ మనమే ముందు అడుగు వేస్తున్నట్టుండి, వారు యాక్టివ్‌గా లేనట్టు అనిపిస్తే.. ఆ స్నేహం గురించి మరోసారి ఆలోచించాల్సిందే.



గాసిప్స్ : కొందరు మనతో ఫ్రెండ్స్‌గా ఉంటూ వెనక చాడీలు చెబుతారు. రహస్యాలను 'ఎవరికీ చెప్పను' అంటూనే వేరే వారితో పంచుకుంటారు. మన ద్వారా తెలుసుకున్న వ్యక్తిగత సమాచారాన్ని మనకే వ్యతిరేకంగా ప్రయోగిస్తారు. 'ఎందుకిలా చేశావ్' అని అడిగితే బుకాయిస్తారు. ఇలాంటి వారితో చాలా జాగ్రత్తగా ఉండాలి.

అసూయ : మనల్ని ఎవరైనా కాస్త పొగిడితే చాలు.. చూడలేక విమర్శించడం మొదలుపెడతారు. అది కూడా నవ్వుతూనే హర్ట్ చేయడంలా ఉంటుంది. మంచి కోరే వారిలా నటిస్తూనే, ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసేలా వీరి మాటలుంటాయి. అసలైన మిత్రుల తీరు ఇది కాదు.

బాధ్యతలేమి : ఎంతో ఎమోషన్‌తో మాట్లాడే విషయాలను కూడా సరిగ్గా వినరు. వారికి అంతగా ఉపయోగం కాని, మీకు సంబంధించిన విషయాల్లో బాధ్యతలేమితో ప్రవర్తిస్తారు. ఏదైనా అడిగితే లోతైన జవాబు చెప్పరు. తమ తప్పులకు కుంటిసాకులు వెతుకుతారు. ఇలాంటి లక్షణాలన్నీ కనిపిస్తే.. వెంటనే ఆ ఫ్రెండ్‌షిప్‌ను సమీక్షించుకోవాల్సిందే!

కొంత సమయం..

ఎవరైనా నచ్చి.. వారితోనే ఉండాలని నిర్ణయం తీసేసుకుని.. ఆ తర్వాత రిలేషన్‌షిప్ వర్క్‌అవుట్ అవ్వడం లేదని బాధపడటం లేదు ఇప్పటి యూత్. అందుకే డేటింగ్‌కు కూడా కొంత సమయం అంటూ పెట్టుకుంటున్నారు. ఒక మూడు నెలలో, ఆరు నెలలో టైమ్ ఇచ్చి.. ఈ అనుబంధం కొనసాగే అవకాశం ఉందా లేదా అనేది పరిశీలిస్తున్నారు. అంతా బాగుంటే సరేసరి. ఒకవేళ సరిపడదు అనుకుంటే కొంత సమయం తర్వాత వారి నిర్ణయం వారు తీసుకుంటున్నారు. ఈ కొత్త ట్రెండ్‌కు 'సన్‌సెట్ డేటింగ్' అనే పేరొచ్చింది. ఎందుకంటే.. అదీ కొంత సమయం తర్వాత ముగిసిపోతుంది కదా.. ఇదీ అలాగే అన్న ఆలోచనతో ఇలా పిలుస్తున్నారు. నిజానికి టైమ్ వేస్ట్ అయ్యేకంటే ఇదే మంచిదని జెన్‌జీ అభిప్రాయపడుతోందట. మన దేశంలో 22-35 వయసు ఉన్న ఏడువేల మందికి పైగా ఒంటరి యూత్‌ను క్వాక్‌క్వాక్ సంస్థ సర్వే చేసింది. దీనిలో 37శాతం మంది ఈ డేటింగ్ ట్రెండ్ బాగుందని చెప్పారు. నచ్చకపోతే మర్యాదగా విడిపోవడం మంచి విషయమేగా అని వీరి ఉద్దేశం.



ఫంకీ కీచెయిన్



పాపులర్ బ్రాండ్స్ ఇప్పటికే వీటినిలా మార్కెట్‌లో దించుతున్నాయి.

లిప్‌బామ్ లేని అమ్మాయిల బ్యాగ్ ఉంటుందా చెప్పండి? అదీ చలికాలంలో! కానీ దాంతో ఓ సమస్య. ఎక్కడో బ్యాగ్ అడుగుకి వెళ్లిపోతూ ఉంటుంది. కావాల్సిన ప్రతిసారీ వెతుక్కోవడమే. ఒక్కోసారి బ్యాగ్‌లో ఉండే ఇతర వస్తువుల వల్ల దుమ్ము కూడా పట్టేస్తూ ఉంటుంది. అలాంటి సమయాల్లో దాన్ని వాడటానికి మనసొప్పదు. ఈ సమస్యలన్నింటికీ పరిష్కారంగా కీచెయిన్ లిప్‌బామ్స్‌ను తయారుచేశారు డిజైనర్లు. స్టైలిష్‌గా బ్యాగ్ జిప్‌కి తగిలించేసి హ్యాపీగా ఎప్పుడు కావాలంటే అప్పుడు వాడేసుకోవచ్చు. ఆకట్టుకునే రంగులు, డిజైన్లలో వస్తుండటంతో జెన్‌జీ అమ్మాయిలు తెగ ముచ్చటపడిపోతున్నారు వీటిని చూసి! ఇలా లిప్‌గ్లాస్ కూడా దొరుకుతోంది. మరి మీకూ నచ్చిందా!





నీ ప్రేమకు 'ఖైదీ'ని..



వెరైటీ ప్రేమ లేఖ

నిన్ను చూశాక 'ఇంద్ర'లోకం నుంచి దిగి వచ్చావా అనిపించింది. నువ్వు కూడా నాలాగే చిరు ఫ్యాన్ అని తెలిసి 'జై చిరంజీవ' అని ఎగిరి గంతేశాను. ఎప్పటి నుంచో నువ్వంటే నాకు 'ఆరాధన'. తొలిచూపులోనే నా మనసు దోచుకున్న 'మంచి దొంగ' నువ్వు. ఓ 'అన్నయ్య' ద్వారా నీ వివరాలు తెలిశాయి. నీ పేరు శశిరేఖని.. మీ 'డాడీ' పరమ 'మొండిఘటం' కాబట్టి అందరూ ముద్దుగా 'హిట్లర్' అని పిలుస్తారని తెలిసింది.


ఇంతకీ నా పేరు చెప్పలేదు కదూ.. 'శంకర వరప్రసాద్'. డిగ్రీ చదివి 'స్వయంకృషి'తో ఓ స్కూల్ స్థాపించా. దానిలో 'మాస్టార్'ని. అచ్చతెలుగులో 'ఆచార్య'ని. టోటల్‌గా నా స్కూల్‌కి నేనే 'బిగ్ బాస్'. చూడటానికి 'చంటబ్బాయ్'లా కనిపిస్తా కానీ.. లోపల 'కొదమ సింహం' తెలుసా! నిన్ను పెళ్లాడాలని నా 'అభిలాష'. అలా అని 'ఛాలెంజ్'లు చేస్తూ 'హీరో' డైలాగులు కొట్టను. నా స్వచ్ఛమైన ప్రేమకు ముచ్చటపడి 'విజేత'ను చేస్తే 'చూడాలని ఉంది'. దాంతో మనల్ని అందరూ 'జగదేక వీరుడు అతిలోక సుందరి'లా ఉన్నారని పొగుడుతారు తెలుసా? నా ఈ ప్రేమకు 'పునాది రాళ్లు' వేసింది నువ్వే కనుక.. ఈ 'యుద్ధభూమి'లో నన్ను గెలిపించే బాధ్యత నీదే! – సత్య, విశాఖపట్నం

అందమైన ఆ రోజులు..

చేతిలో ఏమీ లేకపోయినా గుండెల్లో కొండంత సంతోషం నిండిన రోజులవి. టిఫిన్ బాక్స్‌లో అమ్మచేత్తో కలిపి పెట్టిన అన్నం. పుట్టిన రోజున ఆశ చాక్లెట్లు పంచడం.. ఆ రోజు మొత్తం చుట్టూ తిరుగుతూ ప్రత్యేకంగా చూసే ఫ్రెండ్స్. ఎంత మధురమైన జ్ఞాపకం!

బస్సులో కిటికీ పక్కన కూర్చుని అమ్మ పక్కన కబుర్లు చెబుతూ అమ్మమ్మ ఇంటికి వెళ్లడం, ఆగస్టు 15 రోజున జెండా పండగ, ఊళ్లో జరిగే సంత.. జోరువానలో చుక్క నీరు పడకుండా బ్యాగు అడ్డుపెట్టుకుని స్కూల్‌కెళ్లడం.. గేమ్స్ పీరియడ్ కోసం ఎదురుచూపులు, హోంవర్క్ చేయకుండా వెతుక్కున్న సాకులు, బెంచ్ మీద రాసుకున్న పేర్లు, క్లాస్ అయిపోగానే నాన్న ఇచ్చిన రూపాయి ఖర్చు చేయడానికి పరుగులు..

90ల్లోకి వెళ్దామా..



ప్రతిదీ గొప్ప అనుభవం.

సంతలో అమ్మ కొనిచ్చిన రంగు కళ్లద్దాలతో చూసినప్పుడు ప్రపంచం ఇంత అందంగా ఉంటుందా అనిపించింది. ఆదివారం నాడు తొక్కుడుబిళ్లలో గెలిచినప్పుడు కలిగిన ఆనందం చెప్పడానికి మాటలు చాలవు. కుంకుడుకాయలతో అమ్మ చేయించిన తలస్నానం, ఇంటిముందు చెట్టుకు తాత కట్టిన ఉయ్యాల, మొదటిసారి నాన్న కొనిచ్చిన కిడ్డీబ్యాంక్.. ప్రతిదీ అపురూపమే. కాగితపు పడవలు, అరచేతిలో బొంగరాలు, ఆడి ఆడి అలసిపోయి బోరు నీళ్లతో తీర్చుకున్న దాహం, చింతకాయలు, రేగిపళ్లు, తాటి ముంజలు, ఈతకాయలు.. అన్నింటితో స్నేహమే.

ఆకాశంలో విమానాన్ని చూసి వెంట పరిగెత్తే రోజుల నుంచి అందులో కూర్చుని ప్రయాణం చేసే స్థాయికి వచ్చినా.. ఆ రోజులు మర్చిపోలేను.

– రవళి అరకట్ల

ఈనాడు సినిమా

'స్పిరిట్' సన్నాహాలు


ప్రభాస్

ఈ సంక్రాంతి బరిలో 'ది రాజాసాబ్'గా సందడి చేశారు కథానాయకుడు ప్రభాస్. ఇప్పుడాయన తిరిగి 'స్పిరిట్' కోసం రంగంలోకి దిగేందుకు సిద్ధమవుతున్నారు. సందీప్ రెడ్డి దర్శకత్వంలో మస్తాబవుతున్న ఈ పాన్ ఇండియా చిత్రం ఇప్పటికే షెడ్యూల్‌ని పూర్తి చేసుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడీ చిత్ర కొత్త షెడ్యూల్‌ను డెహ్రాడూన్‌లో ప్రారంభించేందుకు సందీప్ సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. ఈనెలాఖరు నుంచి మొదలు కానున్న ఈ షెడ్యూల్‌లో ప్రభాస్‌తో పాటు ముఖ్య తారాగణంపై కీలక సన్నివేశాలు చిత్రీకరించనున్నట్లు సమాచారం. ఇది దాదాపు రెండు వారాలు సాగనున్నట్లు తెలుస్తోంది. పవర్ ఫుల్ పోలీసు కథతో యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతోన్న ఈ చిత్రంలో ప్రభాస్ ఐపీఎస్ అధికారిగా అలరించనున్నారు. తమిళంలో విన్న లుక్‌లో కనువిందు చేయనున్నట్లు ప్రచారం జరుగుతోంది.

మాస్ కథతో... మార్చి నుంచే!

విజయవంతమైన 'వీరసింహా రెడ్డి' తర్వాత నందమూరి బాలకృష్ణ - గోపీచంద్ మలినేని కలయికలో మరో చిత్రం రానున్న సంగతి తెలిసిందే. బాలకృష్ణ 111వ చిత్రంగా కొన్ని నెలల కిందటే ఆ ప్రాజెక్టుని అధికారికంగా ప్రకటించారు. ఇక సినిమా పట్టాలెక్కడమే తరువాయి అనుకున్న దశలో... బడ్జెట్ పరిమితుల దృష్ట్యా కథని మార్చాల్సి వచ్చింది. కొన్ని రోజులుగా మరో కథపై దర్శకుడు గోపీచంద్ మలినేని కసరత్తులు కొనసాగిస్తూ వచ్చారు. ఇటీవలే బాలకృష్ణకు ఆ కొత్త కథని చెప్పడం, ఆయన పచ్చజెండా ఊపడంతో సినిమా చిత్రీకరణకి చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. మాస్ యాక్షన్ కథతో, మార్చి నెల నుంచి సెట్స్‌పైకి వెళ్లనున్న ఆ సినిమాని వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు నిర్మించనున్నారు. మొదట ఈ ప్రాజెక్ట్‌లో కథానాయికగా నయనతార పేరు వినిపించింది. కథ మారింది కాబట్టి, మరో కొత్త కథానాయికకు చోటు దక్కుతుందా లేక, నయనతారే నటిస్తుందా అనే విషయంలో స్పష్టత రావాలంటే ఇంకొన్నాళ్లు వేచి చూడాల్సిందే.


గోపీచంద్ మలినేని, బాలకృష్ణ

ఈసారైనా ఆస్కార్ వరించేనా?

● మూడుసార్లు ఉత్తమనటుడిగా నామినేషన్

ఇటీవల ప్రకటించిన 98వ ఆస్కార్ అవార్డుల నామినేషన్ల జాబితాలో 'మార్టీ సుప్రీం' సినిమాతో ఉత్తమ నటుడిగా చోటు దక్కించుకున్నాడు హాలీవుడ్ నటుడు తిమోతీ చాలమేట్. ప్రతిష్ఠాత్మక ఆస్కార్ పురస్కారానికి నామినేట్ అవ్వడమే చాలనుకునేవారెందరో. అలాంటిది ఏకంగా మూడుసార్లు అకాడమీ అవార్డులకు నామినేట్ అయ్యాడు తిమోతీ. 30 ఏళ్లకే ఈ ఘనత సాధించిన నటుడిగా రికార్డు సృష్టించాడు. ఇంతకు ముందు 2017లో 'కాల్ మీ బై యువర్ నేమ్', 2024లో 'ఏ కంప్లీట్ అన్నోన్' చిత్రాలకు గానూ ఉత్తమ నటుడిగా నామినేట్ అయ్యాడు. పలు టెలివిజన్ సిరీస్‌లతో నటుడిగా ప్రయాణం మొదలుపెట్టి 'మెన్, విమెన్ అండ్ చిల్డ్రన్'తో సినీరంగ ప్రవేశం చేసిన అతడు.. ప్రేక్షకాదరణ పొందిన 'ఇంటర్‌స్టెల్లర్' చిత్రంతో మరో మెట్టు ఎక్కాడు. రొమాంటిక్ డ్రామాగా తెరకెక్కిన 'కాల్ మీ బై యువర్ నేమ్' చిత్రంతో అంతర్జాతీయంగా క్రేజ్ సంపాదించుకున్నాడు. పలు విభాగాల్లో ఆస్కార్ అవార్డులు సొంతం చేసుకున్న 'డ్యూన్' చిత్రంలో కథానాయకుడీయన. ప్రస్తుతం 'డ్యూన్ 3'లో నటిస్తున్నాడు. ఈసారి ఆస్కార్ బరిలో తిమోతీ నటించిన 'మార్టీ సుప్రీం' చిత్రం తొమ్మిది విభాగాల్లో నామినేట్ అయింది.


తిమోతీ చాలమేట్

సరిపడే కథ వస్తే నేనూ... శ్రీవిష్ణు కలిసి నటిస్తాం!

– శర్వానంద్


అనిల్, కేశినేని చిన్ని, శర్వానంద్, శ్రీవిష్ణు, రామ్ అబ్బరాజు

"విజయం విలువ నాకు బాగా తెలుసు. నిర్మాత అనిల్ సుంకర నాకు ఓ గొప్ప విజయాన్నిచ్చారు. తదుపరి ఆయనతో చేయబోయే సినిమాకి రూపాయి కూడా తీసుకోను. హీరో... నిర్మాత కలిసి పనిచేస్తే ఎలాంటి ఫలితాలు వస్తాయో మేం చూపిస్తాం'' అన్నారు శర్వానంద్. ఆయన కథానాయకుడిగా నటించిన 'నారీ నారీ నడుమ మురారి' విజయోత్సవం ఇటీవల హైదరాబాద్‌లో జరిగింది. రామ్ అబ్బరాజు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమిది. అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర సంయుక్తంగా నిర్మించారు. శర్వానంద్‌కు జోడీగా సంయుక్త, సాక్షి వైద్య నటించారు. ఈ విజయోత్సవానికి విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శర్వానంద్ మాట్లాడుతూ "శ్రీవిష్ణు ఎంతో గొప్ప మనసుతో ఇందులో ఓ చిన్న పాత్రని చేశారు. సినిమానీ, స్నేహాన్ని నమ్మి ఒక హీరో చిన్న పాత్రలో నటించడం అనేది మామూలు విషయం కాదు. మా ఇద్దరికీ సరిపడే కథ వస్తే అనిల్ సుంకర నిర్మాణంలో కలిసి సినిమా చేస్తాం" అన్నారు. ఈ విజయంతో మరింత బాధ్యత పెరిగిందని, తదుపరి సినిమా ఇంతకంటే ఉత్తమంగా ఉండేలా చూస్తామన్నారు నిర్మాత అనిల్ సుంకర. ఈ కార్యక్రమంలో చిత్రబృందంతోపాటు, దర్శకులు త్రినాథరావు నక్కిన, వశిష్ఠ, నిర్మాత రాజేశ్ దండా తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ తెరపైకి 'లవ్‌స్టోరీ'


నాగచైతన్య, సాయిపల్లవి

నాగచైతన్య - సాయిపల్లవి జంటగా శేఖర్ కమ్ముల తెరకెక్కించిన చిత్రం 'లవ్‌స్టోరీ'. ఇప్పుడిది ప్రేమికుల రోజు సందర్భంగా ప్రేక్షకుల్ని మరోసారి అలరించనుంది. ఈమేరకు దీన్ని ఫిబ్రవరి 14న థియేటర్లలో రీరిలీజ్ చేస్తున్నట్లు చిత్ర నిర్మాతలు ప్రకటించారు. ఇది తెలంగాణ నేపథ్యంలో సాగే అందమైన ప్రేమకథతో ముస్తాబైన సినిమా. దీంట్లో చైతన్య, సాయిపల్లవిల కెమిస్ట్రీ, సంగీత దర్శకుడు పవన్ అందించిన పాటలు ప్రేక్షకుల్ని బాగా అలరించాయి. ఈ చిత్రాన్ని నారాయణ్ దాస్ కె నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్‌రావు సంయుక్తంగా నిర్మించారు.

ఎల్366 ప్రయాణం మొదలు


మోహన్‌లాల్

గతేడాది తరుణ్ మూర్తి దర్శకత్వంలో మలయాళ అగ్ర కథానాయకుడు మోహన్‌లాల్ 'తుడరుమ్' చిత్రంతో బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్ హిట్‌ని తన ఖాతాలో వేసుకున్నారు. ఈ సినిమా అత్యధిక వసూళ్లు చేసిన మూడో మలయాళ చిత్రంగా రికార్డు నెలకొల్పింది. ఇప్పుడు మళ్లీ వీరిద్దరి కాంబినేషన్‌లోనే ఎల్366 (వర్కింగ్ టైటిల్) అనే పేరుతో ఓ సినిమా రూపొందుతోంది. తాజాగా ఈ సినిమా చిత్రీకరణలో భాగమయ్యారు మోహన్‌లాల్. ఈ విషయాన్ని ఆయన ఇన్‌స్టాలో వెల్లడిస్తూ.. పలు ఫొటోలను పంచుకున్నారు. "ఎల్366 సెట్స్‌లో ఈ ప్రయాణాన్ని కృతజ్ఞతతో ప్రారంభిస్తున్నాను'' అనే వ్యాఖ్యల్ని జోడించారు. మోహన్‌లాల్ గతేడాది 'ఎల్2: ఎంపురాన్', 'కన్నప్ప'(అతిథి పాత్ర), 'హృదయపూర్వం', 'వృషభ'లో కనిపించారు. తదుపరి 'దృశ్యం 3', 'పేట్రియాట్' సినిమాలతో ప్రేక్షకుల్ని అలరించనున్నారు.

37ఏళ్ల తర్వాత విడుదల


రజనీ కాంత్


హేమా మాలిని


శత్రుఘ్న సిన్హా

రజనీ కాంత్, శత్రుఘ్న సిన్హా, హేమా మాలిని ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'హమ్ మే షెహెన్‌షా కౌన్'. 37 ఏళ్ల క్రితం తెరకెక్కిన ఈ చిత్రం ఇప్పటికీ ప్రేక్షకుల ముందుకు రాలేదు. పలు కారణాలతో విడుదలకు నోచుకోలేకపోయిన ఈ సినిమా ఎట్టకేలకు విడుదల కానున్నట్లు తెలుస్తోంది. దివంగత హర్మేష్ మల్హోత్రా దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని రాజా రాయ్ నిర్మించారు. అనితా రాజ్, ప్రేమ్ చోప్రా, శరత్ సక్సేనా, దివంగత నటులు అమ్రిష్ పురి, జగదీప్‌లు ఈ సినిమాలో నటించారు. ఈ సినిమా విడుదల గురించి తాజాగా ఓ ప్రకటనలో నిర్మాత రాజా రాయ్.. మాట్లాడుతూ "ఈ సినిమాపై మేము ఎప్పుడూ ఆశ కోల్పోలేదు. ఇది ఎన్నో ఎదురుదెబ్బలు, నిశ్శబ్దంతో కూడిన బాధని భరించింది. ఎన్నో ఏళ్ల తర్వాత ఈ సినిమా ప్రేక్షకులను కలుసుకుంటున్నందుకు కృతజ్ఞుడను. ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రావడానికి అన్ని రకాల అడ్డంకులను ఎదుర్కొని బయటపడింది. త్వరలోనే విడుదల తేదీని ఖరారు చేసుకోనుంద''ని తెలిపినట్లు బాలీవుడ్ వర్గాలు వెల్లడించాయి. "ఈ సినిమాని సాంకేతికతను ఉపయోగించి అన్ని రకాల హంగులతో అసలు కథలోని సినిమాటిక్ అనుభవం కోల్పోకుండా జాగ్రత్తలు తీసుకుని రూపొందించారు. విజువల్స్ ఆడియో నాణ్యతను మెరుగుపరచడానికి ఏఐ టెక్నాలజీ, ఫోర్‌కేతో పాటు పలు ఆధునిక పద్ధతులతో థియేటర్ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దినట్లు'' చిత్రవర్గాల సమాచారం.

'రాకాస' వీరుడు


సంగీత్ శోభన్

'యుగ యుగాలుగా ప్రతి కథలో ఒక సమస్య. ఆ సమస్యని ఛేదించడానికి ఒక వీరుడు పుడతాడు. ఆ వీరుడు ఎవరని తెలిసేలోపే నిశ్శబ్దంగా తన పనిని ముగిస్తాడు. ఈ కథలో ఆ వీరుడు నేనే...' అంటూ ఒకరు రంగంలోకి దిగారు. మరి తన పని ఎలా ముగిసింది? ఇంతకీ ఈ కథలో సమస్య ఏమిటో తెలియాలంటే 'రాకాస' చూడాల్సిందే. సంగీత్ శోభన్ కథానాయకుడిగా తెరకెక్కుతోన్న చిత్రమిది. నయన్ సారిక కథానాయిక. మానసశర్మ దర్శకత్వం వహిస్తున్నారు. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ పతాకంపై ఉమేశ్ కుమార్ బన్సాల్‌తో కలిసి నిహారిక కొణిదెల నిర్మిస్తున్నారు. ఏప్రిల్ 3న ప్రేక్షకుల ముందుకు రానుందీ చిత్రం. శుక్రవారం ప్రచార చిత్రాన్ని విడుదల చేశారు. ఉత్కంఠ రేకెత్తించే విజువల్స్‌తో మొదలైన ప్రచార చిత్రం. కథలోని హాస్యకోణాన్ని ఆవిష్కరించింది. ఒక కొత్త అంశాన్ని స్పృశించే ఈ సినిమాలో హాస్యానికి పెద్దపీట వేసినట్టు తెలుస్తోంది. వెన్నెల కిశోర్, బ్రహ్మాజీ, తనికెళ్ల భరణి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అనుదీప్ దేవ్, ఛాయాగ్రహణం: రాజు ఎదురోలు.

ప్రతి విరామానికి ఓ అర్థం


అనుపమ

అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రలో ఎమోషనల్ డ్రామా నేపథ్యంతో రూపొందిన చిత్రం 'లాక్‌డౌన్'. ఏఆర్ జీవా దర్శకత్వం వహించారు. గతేడాది విడుదల కావాల్సిన ఈ సినిమాని తమిళనాడులోని పలు ప్రాంతాల్లో సంభవించిన తుపానుతో పాటు పలు కారణాలతో విడుదలను వాయిదా వేసింది నిర్మాణసంస్థ. ఎట్టకేలకు ఈ సినిమా కొత్త విడుదల తేదీని ఖరారు చేసుకుంది. ఈ సినిమా ఈ నెల 30 థియేటర్లలో విడుదల కానుంది. ఈ విషయాన్ని నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ సామాజిక మాధ్యమాలలో 'ప్రతి విరామానికి ఓ అర్థం ఉంటుంది' అంటూ ఓ పోస్టర్‌తో అధికారికంగా ప్రకటించింది. నాయికా ప్రాధాన్యంగా తెరకెక్కిన ఈ చిత్రంలో అనుపమ అనిత అనే పాత్రలో కనిపించనుంది. కరోనా లాక్‌డౌన్ సమయంలో ఎదురైన సమస్యలతో సతమతమవుతున్న ఓ యువతిగా ఇప్పటికే విడుదలైన ఈ చిత్ర ట్రైలర్‌తో వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ సినిమాని రూపొందించినట్లు స్పష్టంచేసింది చిత్ర బృందం.

సునీత విలియమ్స్‌ను కలిసిన ప్రకాశ్‌రాజ్



అంతరిక్ష వ్యోమగామి సునీతా విలియమ్స్‌ను ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్ కలిశారు. ఇటీవల కేరళ లిటరేచర్ ఫెస్టివల్(కేఎల్ఎఫ్)ని సునీత ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమంలో సునీతను కలిసి ఈ సందర్భంగా ఆమెతో కలిసి దిగిన ఫొటోలను సామాజిక మాధ్యమాలలో పంచుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు ప్రకాశ్ రాజ్. ఎంతో ధైర్యవంతురాలైన సునీతతో మాట్లాడే అవకాశం దక్కడం ఎప్పటికీ మరచిపోలేని జ్ఞాపకమని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు ప్రకాశ్‌రాజ్.

సమాజానికి అవసరమైన చిత్రం


సంధ్య, వంశీ

"ఆత్మన్యూనత భావనని అధిగమించి జీవితంలో ఎలా ముందడుగు వేయాలో చెప్పే స్ఫూర్తిదాయకమైన కథ ఇది. నీలో ఉన్న లోపం నీకు బలం కావాలి, దాన్ని స్వీకరించి ముందుకు వెళ్లాలని చెప్పగలిగే సినిమాలు మరిన్ని రావాలి, దానికి 'శ్రీ చిదంబరం గారు' పునాది కావాలని కోరుకుంటున్నా'' అన్నారు ప్రముఖ సంగీత దర్శకుడు, నటుడు ఆర్పీ పట్నాయక్. ఆయన ముఖ్య అతిథిగా 'శ్రీ చిదంబరం గారు' విడుదల తేదీ పోస్టర్ ఆవిష్కరణతోపాటు, చిత్రంలోని 'వెళ్లేదారిలోన...' పాట విజయోత్సవం శుక్రవారం హైదరాబాద్‌లో జరిగింది. వంశీ తుమ్మల, సంధ్యా వశిష్ఠ జంటగా నటించిన చిత్రమిది. వినయ్‌రత్నం దర్శకుడు. చింతా వినీషారెడ్డి, చింతా గోపాలకృష్ణారెడ్డి నిర్మాతలు. ఫిబ్రవరి 6న వంశీ నందిపాటి చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ సందర్భంగా ఆర్పీ పట్నాయక్ మాట్లాడుతూ "కీరవాణిని ఒప్పించి ఇందులో పాట పాడించడంతోనే ఓ పెద్ద లక్ష్యాన్ని చేరుకుంది చిత్రబృందం. సమాజానికి ఎంతో అవసరమైన, స్ఫూర్తిదాయకమైన కథ ఇద''న్నారు. మా రెండో సినిమాలోనే కీరవాణి పాట పాడటం ఎంతో ఆనందంగా ఉందన్నారు సంగీత దర్శకులు చందు- రవి.

'వైట్'లో జెన్నిఫర్ పాట!


జెన్నిఫర్

ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త శ్రీశ్రీ రవిశంకర్ జీవిత కథతో బాలీవుడ్ యువ కథానాయకుడు విక్రాంత్ మాస్సే ప్రధాన పాత్రలో తెరకెక్కుతోన్న చిత్రం 'వైట్'. ఇందులో పలువురు అంతర్జాతీయ నటులు, సాంకేతిక నిపుణులు పనిచేస్తున్నట్టు తెలుస్తోంది. తాజాగా ఈ జాబితాలో ప్రముఖ అమెరికన్ పాప్ గాయని జెన్నిఫర్ లోపేజ్ ఓ ప్రత్యేక గీతాన్ని ఆలపించనున్నట్టు సమాచారం. ప్రపంచానికి ఈ కథ థీమ్‌ని తెలిసేలా చేసే ఈ గీతం చిత్రానికి ప్రత్యేక ఆకర్షణ కానుందట. మైఖేల్ జాక్సన్ 'హీల్ ది వరల్డ్' స్ఫూర్తితో దీన్ని తీర్చిదిద్దుతున్నట్లు సమాచారం. ఈ సినిమాని 21కి పైగా భాషల్లో విడుదల చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. మోంటో బస్సీ దర్శకత్వంలో సిద్ధార్థ్ ఆనంద్, మహావీర్ జైన్ నిర్మిస్తున్నారు. పలు అంతర్జాతీయ చిత్ర నిర్మాణ సంస్థలు ఈ సినిమాకి నిర్మాణ భాగస్వాములుగా వ్యవహరిస్తున్నాయి.

భర్త అహంకారం.. భార్య ప్రతీకారం


తరుణ్ భాస్కర్, ఈషా రెబ్బా

'ఓం శాంతి శాంతి శాంతిః' చిత్రంతో థియేటర్లలో వినోదాలు పంచనున్నారు తరుణ్ భాస్కర్, ఈషా రెబ్బా. ఈ ఇద్దరూ జంటగా నటించిన ఈ సినిమాని ఏఆర్ సజీవ్ తెరకెక్కించారు. ఎస్ ఒరిజినల్స్, మూవీ వెర్స్ స్టూడియోస్ సంస్థలు నిర్మించాయి. బ్రహ్మానందం, బ్రహ్మాజీ, సురభి ప్రభావతి తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. ఈ చిత్రం ఈ నెల 30న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే హీరో విజయ్ దేవరకొండ శుక్రవారం ఈ చిత్ర ట్రైలర్‌ని విడుదల చేశారు. తనపై పెత్తనం చెలాయించే భర్తకి ఓ భార్య ఎలా బుద్ధి చెప్పింది.. అతడి అహంకారాన్ని ఎలా అణిచింది అనే నేపథ్యంలో సాగే కథ ఇది. దీన్ని గోదావరి జిల్లాల నేపథ్యం నుంచి చెప్పడం ఈ కథకు కొత్తదనాన్ని అద్దింది. ఓంకార్ నాయుడుగా తరుణ్ భాస్కర్ పాత్రని తీర్చిదిద్దిన తీరు.. ఈషాతో తన కెమిస్ట్రీ, వీళ్లిద్దరి మధ్య తలెత్తే సంఘర్షణ ఆసక్తిరేకెత్తించేలా ఉన్నాయి. "మన గోదారోళ్లకి ఎటకారాలు సూటయినట్టు.. ప్రతీకారాలు సూటవ్వవురా" అంటూ ట్రైలర్‌లో హీరోకి బ్రహ్మాజీ ఇచ్చే సలహా నవ్వులు పూయించింది.

చట్టపరమైన విషయమిది


ఆనంద్ ఎల్.రాయ్

ఆనంద్ ఎల్.రాయ్ దర్శకత్వంలో ధనుష్, కృతి సనన్ జంటగా నటించిన చిత్రం 'తేరే ఇష్క్ మే'. ఈ సినిమా గతంలో తాము నిర్మించిన హిట్ చిత్రం 'రాంఝనా'కు సీక్వెల్ అంటూ.. 'తేరే ఇష్క్ మే'ను ప్రచారం చేశారని, దానికి తమ అనుమతి తీసుకోలేదని ఇరోస్ ఇంటర్నేషనల్ సంస్థ ఆరోపణలు చేసింది. ఈ మేరకు ఇరోస్ సంస్థ ముంబయి హైకోర్టుని ఆశ్రయించి నిర్మాణ సంస్థ, దర్శకుడు ఆనంద్ ఎల్.రాయ్‌పై కాపీరైట్ చట్టాన్ని ఉల్లంఘించి తమ ప్రతిష్ఠను దెబ్బ తీసినందుకుగానూ రూ.84 కోట్లు నష్టపరిహారంగా ఇప్పించాలంటూ పిటిషన్ దాఖలు చేసినట్లు ప్రచారం జరిగింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆనంద్ ఎల్ రాయ్ దీనిపై స్పందించారు. ఈ వివాదాలు చిత్ర పరిశ్రమ వ్యాపారంలో భాగమన్నారు. "వ్యాపారంలోకి అడుగుపెట్టినప్పుడు ఇలాంటివి జరుగుతూనే ఉంటాయి. ఇది చట్టపరమైన విషయం. కాబట్టి చట్టపరమైన వ్యక్తులు దీనిని చూసుకుంటారు. దీని గురించి పెద్దగా మాట్లాడను. ఇది అంత తీవ్రమైన విషయమేమీ కాద''ని అన్నారు రాయ్.


ఇది మామూలు కథ కాదు!



విష్ణు

ఒక చిన్న పెట్టె... ఆరుగురి జీవితాల్ని ఎలా ప్రభావితం చేసిందో తెలియాలంటే 'బాబా బ్లాక్‌షీప్' చూడాల్సిందే. టిను ఆనంద్, ఉపేంద్ర, జార్జ్ మరియన్, అక్షయ్, విష్ణు, కార్తికేయ, విస్మయ శ్రీ, మాళవి, కశ్యప్, రాజా రవీంద్ర ప్రధాన పాత్రధారులుగా రూపొందుతున్న చిత్రమిది. గుణి మంచికంటి దర్శకుడు. చిత్రాలయం స్టూడియోస్ పతాకంపై వేణు దోనేపూడి నిర్మిస్తున్నారు. ఈ సినిమా టీజర్‌ని ప్రముఖ కథానాయకుడు శర్వానంద్ శుక్రవారం విడుదల చేశారు. 'చెప్పుకోవడానికి ఇది మామూలు కథ కాదు, అండ పిండ బ్రహ్మాండాలనే అల్లాడించే కథ...' అంటూ మొదలైన టీజర్ హాస్యం, ఉత్కంఠ మేళవింపుగా సాగింది.

క్షమిస్తాం కానీ.. ఇప్పుడు కాదు

తాప్సి ప్రధాన పాత్రలో తెరకెక్కిన సినిమా 'అస్సీ'. అనుభవ్ సిన్హా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం టీ సిరీస్ సమర్పణలో రూపొందుతోంది. తాజాగా ఈ సినిమా విడుదల తేదీని ప్రకటిస్తూ మోషన్ పోస్టర్‌ను ఆవిష్కరించింది చిత్రబృందం. ఓ యువతిని వెంబడిస్తున్న కొందరితో ఉన్న ఈ పోస్టర్‌కు 'మనం మర్చిపోతాం.. క్షమిస్తాం.. కానీ ఈసారి కాదు.. రోజుకు 80 మంది'' అంటూ థ్రిల్లర్ చిత్రంగా స్పష్టతనిస్తూ తప్పక చూడాల్సిన చిత్రమనే క్యాప్షన్‌ని జోడించింది. ఈ సినిమా ఫిబ్రవరి 20న థియేటర్లలో విడుదల కానుంది. రేవతి, మనోజ్ పహ్వా, నసీరుద్దీన్ షా తదితరులు ఈ సినిమాలో నటిస్తున్నారు. ఇది ఒక పరిశోధనాత్మక థ్రిల్లర్‌గా కోర్టు రూమ్ డ్రామా నేపథ్యంతో రూపొందుతున్నట్లు చిత్ర వర్గాల సమాచారం.


తాప్సి



ఏజెంటిక్ ఏఐ నైపుణ్యాలకు అధిక గిరాకీ

- నిపుణుల కొరత 50% పైనే
- క్వెస్‌కార్ప్ నివేదిక

ఏజెంటిక్ ఏఐ (కృత్రిమ మేధ), స్పెషలైజ్డ్ జెన్‌ఏఐ ఉద్యోగాలకు గిరాకీ గణనీయంగా పెరుగుతోంది. 'ఏటా ఈ కొలువుల సంఖ్య 35-40% పెరిగే అవకాశం ఉందని, అయితే ఆయా నైపుణ్యాలున్న అభ్యర్థుల కొరత 50% పైగా ఉంటుందని', అంతర్జాతీయ వర్క్‌ఫోర్స్ సొల్యూషన్ల సంస్థ క్వెస్‌కార్ప్ తాజా నివేదికలో వెల్లడించింది. కృత్రిమ మేధ అధునాతన రూపమే ఏజెంటిక్ ఏఐ. స్వయంప్రతిపత్తితో నిర్ణయాలు తీసుకోవడం, చర్యలు చేపట్టడంపై ఇది దృష్టి పెడుతుంది. ప్రస్తుతం సంస్థల నియామకాల్లో ఏజెంటిక్ ఏఐ కొలువులను కలుపుతున్నారు. జెన్ ఏఐ పైలట్‌ల నుంచి ఉత్పత్తి- గ్రేడ్ స్వయంప్రతిపత్తి పనులకు వ్యవస్థలు మారడం ఇందుకు దోహదం చేస్తోందని నివేదిక తెలిపింది. 'ఈజ్ ఇండియాస్ వర్క్‌ఫోర్స్ రెడీ ఫర్ ది ఏజెంటిక్ ఏఐ ఎరా?' పేరిట క్వెస్‌కార్ప్ ఈ నివేదిక వెలువరించింది. 28,000కు పైగా ఉద్యోగ పోస్టింగ్‌లను విశ్లేషించి, దీన్ని రూపొందించింది.

✦ 2024లో భారత ఏజెంటిక్ ఏఐ మార్కెట్ విలువ దాదాపు 276 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.2500 కోట్లు)గా ఉంది. 2030కు ఇది 3.5 బిలియన్ డాలర్ల (రూ.31,500 కోట్ల)కు చేరే అవకాశం ఉందని అంచనా.

✦ సీనియర్ ఆర్కిటెక్చర్, సేఫ్టీ స్థానాల్లో పనిచేస్తున్న వారి వేతనాలు 20- 28% వరకు పెరుగుతున్నాయి.

✦ అధునాతన ఏఐ కొలువుల్లో 30-35 శాతాన్ని అంతర్గత నియామకాల ద్వారా భర్తీ చేస్తున్నారు. ఇందుకోసం 70-75% జీసీసీలు, పెద్ద కంపెనీలు సొంతంగా ఏఐ శిక్షణ కార్యక్రమాలు చేపడుతున్నాయి. మొత్తం అధునాతన ఏఐ నియామకాల్లో 15-20% మందికి 'ఇంటి నుంచే పని చేసే' సౌలభ్యాన్ని కంపెనీలు కల్పిస్తున్నాయి.

✦ ఏజెంటిక్ ఏఐ నియామకాల గిరాకీలో 54% గ్లోబల్ కేపబిలిటీ కేంద్రాల (జీసీసీ) నుంచే వస్తోంది. జీసీసీ వ్యవస్థల్లో వస్తున్న మార్పులను ఇది సూచిస్తోంది.

✦ ఉత్పత్తులు, వినియోగదారు సేవలకు ఏజెంట్లను కలపడం ద్వారా, ఏజెంటిక్ ఏఐను 68% టెక్, ఎస్‌ఏఏఎస్ సంస్థలు అందిపుచ్చుకుంటున్నాయి.

✦ ఏజెంటిక్ ఏఐ నియామకాల్లో 70 శాతానికి పైగా మధ్య-స్థాయి సీనియర్ నిపుణులు ఉంటున్నారు. ప్రారంభ స్థాయి నియామకాల వాటా 20%. పరిపాలన, భద్రత, ప్రోడక్ట్ వ్యూహాల్లో నాయకత్వ పదవులు ఉంటున్నాయి.

ఈ పోస్టుల భర్తీ వేగవంతం

మూడేళ్ల క్రితం పెద్దగా గుర్తింపు లేని ఏఐ ఆర్కెస్ట్రేషన్ ఇంజినీర్లు, ఏజెంట్ బిహేవియర్ అనలిస్ట్‌లు, ఏజెంట్ సేఫ్టీ, గవర్నెన్స్ స్పెషలిస్ట్‌లు, వెక్టర్ డేటాబేస్ ఆర్కిటెక్ట్‌లు, ఏజెంట్ లైఫ్‌సైకిల్ మేనేజర్లు, ఏజెంటిక్ ఏఐ ప్రోడక్ట్ మేనేజర్లు లాంటి స్థానాలకు అధిక గిరాకీ ఉంది.

అగ్రస్థానాల్లో హైదరాబాద్, బెంగళూరు

ఏజెంటిక్ ఏఐ నియామకాల్లో 62% బెంగళూరు, హైదరాబాద్‌లోనే జరుగుతున్నాయి. కోచి, కోయంబత్తూర్, జయపుర, అహ్మదాబాద్ వంటి ద్వితీయ శ్రేణి నగరాల వాటా 10 శాతంగా ఉంది. పరిపాలన, విస్తరణ, వర్క్‌ఫ్లో నిర్వహణ కేంద్రాలుగా దిల్లీ-ఎన్‌సీఆర్, పుణె, చెన్నై విస్తరిస్తున్నాయి. టెక్నాలజీ నిపుణులకు ఏజెంటిక్ ఏఐ ఒక కొత్త నైపుణ్యమే కాదని, కెరీర్ కూడా అని క్వెస్‌కార్ప్ ఐటీ స్టాఫింగ్ సీఈఓ కపిల్ జోషి తెలిపారు.

ఈనాడు బిజినెస్

ఆస్టర్- క్వాలిటీ కేర్ విలీన సమావేశానికి ఎన్‌సీఎల్‌టీ అనుమతి

ఈనాడు, హైదరాబాద్: దేశీయ ఆరోగ్య సేవల రంగంలో భారీ విలీనానికి రంగం సిద్ధమైంది. ఆస్టర్ డీఎం హెల్త్‌కేర్, క్వాలిటీ కేర్ ఇండియా లిమిటెడ్ విలీన ప్రక్రియలో భాగంగా.. వాటాదారులు, రుణదాతల సమావేశాల నిర్వహణకు ఎన్‌సీఎల్‌టీ హైదరాబాద్ బెంచ్ అనుమతినిచ్చింది. ఇప్పటికే కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ), స్టాక్ ఎక్స్ఛేంజీల ఆమోదం పొందిన ఈ విలీన ప్రక్రియ.. 2026-27 తొలి త్రైమాసికంలో పూర్తవుతుందని అంచనా. విలీనం తర్వాత ఆస్టర్ డీఎం క్వాలిటీ కేర్ లిమిటెడ్ పేరుతో ఏర్పడే కొత్త సంస్థ ఆస్టర్ ప్రమోటర్లు, బ్లాక్‌స్టోన్ సారథ్యంలో నడవనుంది. ఆ తర్వాత ఆస్టర్ డీఎం, కేర్ హాస్పిటల్స్, కిమ్స్ హెల్త్, ఎవర్‌కేర్ ఒకే సంస్థ కింద పనిచేయనున్నాయి. వీటన్నింటికీ కలిపి 2025 సెప్టెంబరు నాటికి 10,360కి పైగా పడకల సామర్థ్యం ఉంది. భవిష్యత్తులో పడకల సంఖ్యను 14,715కు పెంచడమే లక్ష్యమని, దేశంలోనే మూడో అగ్రశ్రేణి హాస్పిటల్ చైన్‌గా ఈ సంస్థ అవతరించనుందని, ఛైర్మన్ ఆజాద్ మూపెన్ వెల్లడించారు.

కేవీబీ లాభం రూ.690 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: ప్రైవేటు రంగంలోని కరూర్ వైశ్యా బ్యాంక్ (కేవీబీ), డిసెంబరు త్రైమాసికంలో రికార్డు స్థాయిలో రూ.690 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఇదే కాల లాభం రూ.496 కోట్లతో పోలిస్తే ఇది 39% అధికం. నికర వడ్డీ ఆదాయం రూ.1,081 కోట్ల నుంచి 14.62% పెరిగి, రూ.1,239 కోట్లకు చేరింది. ఏప్రిల్-డిసెంబరులో బ్యాంకు నికర లాభం రూ.1,785 కోట్లు, ఆదాయం రూ.3,580 కోట్లుగా నమోదైంది. మొత్తం వ్యాపారం డిసెంబరు 31కి రూ.2,11,647 కోట్లకు చేరింది. డిపాజిట్లు రూ.1,14,595 కోట్లు, రుణాలు రూ.97,052 కోట్లకు చేరుకున్నాయి. నికర నిరర్థక ఆస్తులు 0.20% నుంచి 0.19 శాతానికి తగ్గాయి. నిర్దేశించుకున్న లక్ష్యాలకు అనుగుణంగా బ్యాంకు పనితీరు ఉందని బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ బి.రమేశ్ బాబు పేర్కొన్నారు. లాభదాయకత, ఆస్తి నాణ్యత, వృద్ధి అనే కీలక అంశాలతో ముందుకెళ్తున్నట్లు వివరించారు. రమేశ్ బాబును ఎండీ, సీఈఓగా మరో రెండేళ్లు కొనసాగించాలని బోర్డు ప్రతిపాదించింది.

అలుఫ్లూరైడ్ ఆకర్షణీయ ఫలితాలు

ఈనాడు, హైదరాబాద్: అల్యూమినియమ్ ఫ్లూరైడ్‌ను ఉత్పత్తి చేసే అలుఫ్లూరైడ్, డిసెంబరు త్రైమాసికంలో రూ.59.73 కోట్ల ఆదాయంపై, రూ.9.44 కోట్ల నికర లాభం, రూ.12.08 ఈపీఎస్ నమోదు చేసింది. 2024-25 ఇదే కాలంలో ఆదాయం రూ.47.93 కోట్లు, నికర లాభం రూ.6.07 కోట్లుగా ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి 9 నెలల్లో రూ.159.04 కోట్ల ఆదాయం, రూ.20.53 కోట్ల నికర లాభాన్ని సంస్థ ఆర్జించింది. ఈపీఎస్ రూ.26.26గా ఉంది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఆదాయం రూ.135.92 కోట్లు, లాభం రూ.16.61 కోట్లు, ఈపీఎస్ రూ.21.24గా ఉన్నాయి. క్రితం ఆర్థిక సంవత్సరం పూర్తి కాల లాభం రూ.18.31 కోట్లు కాగా, ఈ ఆర్థిక సంవత్సరంలో 3 త్రైమాసికాల్లోనే దీన్ని మించింది.

కోడి గుడ్డు



24న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	475
వరంగల్	477
విజయవాడ	523
తూ/ప గోదావరి	475
విశాఖపట్నం	475
చిత్తూరు	523

174% పెరిగిన లారస్ ల్యాబ్స్ లాభం

ఈనాడు, హైదరాబాద్: ఫార్మా సంస్థ లారస్ ల్యాబ్స్, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.1,778 కోట్ల ఆదాయంపై రూ.252 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2024-25 ఇదే కాలంలో ఆదాయం రూ.1,415 కోట్లు, నికర లాభం రూ.92 కోట్లుగా ఉన్నాయి. వీటితో పోలిస్తే ఆదాయం 26%, నికర లాభం 174% పెరిగాయి. ఏప్రిల్-డిసెంబరు కాలానికి ఆదాయం రూ.5,001 కోట్లు, నికర లాభం రూ.610 కోట్లుగా ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-డిసెంబరులో ఆదాయం రూ.3,834 కోట్లు, నికర లాభం రూ.124 కోట్లు మాత్రమే. ఈసారి 9 నెలల కాలానికి నికరలాభం 388% పెరిగింది. జనరిక్స్ విభాగం 37% వృద్ధితో రూ.1,327 కోట్ల ఆదాయాన్ని ఆర్జించినట్లు లారస్ ల్యాబ్స్ సీఈఓ సత్యనారాయణ చావా తెలిపారు.

గ్రాన్యూల్స్ ఇండియా లాభంలో 28% వృద్ధి

ఈనాడు, హైదరాబాద్: ఔషధ తయారీ సంస్థ గ్రాన్యూల్స్ ఇండియా డిసెంబరు త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు ప్రకటించింది. రూ.1,387.9 కోట్ల ఆదాయంపై రూ.150.2 కోట్ల నికర లాభాన్ని సంస్థ ప్రకటించింది. ఈపీఎస్ రూ.6.19గా ఉంది. 2024-25 ఇదే కాలంలో ఆదాయం రూ.1137.7 కోట్లు, నికర లాభం రూ.117.6 కోట్లుగా ఉన్నాయి. వీటితో పోలిస్తే సమీక్షా త్రైమాసికంలో ఆదాయం 22%, లాభం 28% పెరిగాయి. ఉత్తర అమెరికా నుంచి ఆదాయం 14% పెరిగి రూ.1,002.6 కోట్లకు, ఐరోపా విక్రయాలు 131% వృద్ధితో రూ.234.4 కోట్లకు చేరాయి. పరిశోధన-అభివృద్ధి కోసం మూడో త్రైమాసికంలో రూ.68.9 కోట్లు వెచ్చించినట్లు గ్రాన్యూల్స్ ఇండియా సీఎండీ కృష్ణప్రసాద్ చిగురుపాటి తెలిపారు.

ఔన్సు వెండి 100 డాలర్లకు

అంతర్జాతీయ విపణిలో ఔన్సు వెండి ధర తొలిసారిగా 100 డాలర్లను అధిగమించింది. శుక్రవారం అంతర్జాతీయ విపణిలో ఔన్సు (31.10గ్రా) వెండి ధర 5 డాలర్ల వరకు పెరిగి 101 డాలర్లను మించింది. ఔన్సు బంగారం ధర 71 డాలర్లు అధికమై 4980 డాలర్ల వద్ద ఉంది. హైదరాబాద్ బులియన్ విపణిలో రాత్రి 11.55 గంటలకు 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.1,59,990 వద్ద, కిలో వెండి ధర రూ.3,33,500 వద్ద స్థిరపడ్డాయి.

టెకీలూ.. భారత్‌కొచ్చేయండి



- జోహో సహవ్యవస్థాపకుడు శ్రీధర్ వెంబు పిలుపు
- మేడిన్ ఇండియా 'ఈఆర్‌పీ సొల్యూషన్' ఆవిష్కరణ

కుంభకోణం: ఇతర దేశాల్లో పనిచేస్తున్న భారత వృత్తి నిపుణులు మాతృ దేశానికి రావాలని, ఇక్కడి భారీ అవకాశాలను అందిపుచ్చుకోవాలని జోహో సహ వ్యవస్థాపకుడు, చీఫ్ సైంటిస్ట్ శ్రీధర్ వెంబు పిలుపునిచ్చారు. అంతర్జాతీయంగా వాణిజ్య, టారిఫ్, వీసా అనిశ్చితులు నెలకొన్న నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రధాన అంతర్జాతీయ కంపెనీలు విస్తరణ నిమిత్తం మన దేశంలోనే గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీ) ఏర్పాటు చేస్తున్నాయని గుర్తుచేశారు. 'భారత్‌లో నిపుణులకు మంచి అవకాశాలు ఉన్నాయి. భవిష్యత్తులోనూ ఇది కొనసాగుతుంది. మన విద్యా వ్యవస్థ, మౌలిక వసతులు, విధానాలు.. ఇలా అన్నీ కలిసి మనకు గొప్ప శక్తినిచ్చాయ'ని శ్రీధర్ పేర్కొన్నారు. హెచ్1బీ కొత్త వీసా ఫీజు భారీగా పెంచడంతో పాటు, మన ఉత్పత్తులపై అమెరికా విధించిన టారిఫ్‌లపై ప్రశ్నించగా.. భారత వృత్తి నిపుణులు ఇక్కడే పనిచేసి, ఇక్కడే పన్నులు కట్టాలని ఆయన సూచించారు.

ఐపీఓకు వెళ్లే ఆలోచన లేదు: ప్రస్తుతానికి తమ సంస్థను పబ్లిక్ ఇష్యూకు తెచ్చే ఆలోచనేమీ లేదని శ్రీధర్ తెలిపారు. దేశీయ కంపెనీల కోసం ఎంటర్‌ప్రైజ్ రీసోర్స్ ప్లానింగ్ (ఈఆర్‌పీ) సొల్యూషన్‌ను ఆయన ఇక్కడ ఆవిష్కరించారు. అంతర్జాతీయ ఈఆర్‌పీ సొల్యూషన్లకు ప్రత్యామ్నాయంగా జోహో ఈఆర్‌పీని తీసుకొచ్చినట్లు కంపెనీ సీఈఓ శైలేశ్ దవే పేర్కొన్నారు.

అమెజాన్‌లో 14,000 మందికి లేఆఫ్!

అమెరికా ఇ-కామర్స్ దిగ్గజ సంస్థ అమెజాన్, మరో విడత భారీ లేఆఫ్‌లకు సిద్ధమవుతోందని వార్తలొస్తున్నాయి. 14,000 మంది కార్పొరేట్ ఉద్యోగులను తొలగించే ప్రక్రియను వచ్చే వారం నుంచి సంస్థ ప్రారంభించొచ్చనీ చెబుతున్నారు. 2025 అక్టోబరులోనూ ఇంతే స్థాయిలో సిబ్బంది కోతను సంస్థ విధించిన సంగతి విదితమే. తాజా ప్రతిపాదనతో కలిపి, ఈ కంపెనీ మొత్తం లేఆఫ్‌ల సంఖ్యను 30,000 వరకు తీసుకెళ్లొచ్చని ఆంగ్ల వార్తా సంస్థ 'రాయిటర్స్' తెలిపింది.

ఈ విభాగాల్లో కోతలు: అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్), రిటెయిల్ కార్యకలాపాలు, ప్రైమ్ వీడియో, మానవ వనరుల విభాగం (పీఎక్స్‌టీ) తదితరాల్లోని సిబ్బందిపై తాజా లేఆఫ్‌ల ప్రభావం పడొచ్చని ఈ అంశంతో సంబంధమున్న వ్యక్తులను ఉటంకిస్తూ రాయిటర్స్ వార్తాసంస్థ పేర్కొంది. కంపెనీలో దాదాపు 3.5 లక్షల మంది కార్పొరేట్ ఉద్యోగులు పనిచేస్తుండగా, ప్రస్తుత లేఆఫ్‌ల అనంతరం ఉద్యోగ కోతలు 10% లోపే ఉంటాయని సమాచారం.

క్యాప్‌స్టన్ బోనస్ షేర్లు

హోమ్ సర్వీసెస్ కోసం అనుబంధ సంస్థ

ఈనాడు, హైదరాబాద్: ప్రైవేటు సెక్యూరిటీ సేవల సంస్థ క్యాప్‌స్టన్ సర్వీసెస్ తన వాటాదార్లకు బోనస్ షేర్లు జారీ చేయనుంది. ప్రతి 2 షేర్లకు 1 బోనస్ షేరు ఇవ్వాలని శుక్రవారం నిర్వహించిన బోర్డు సమావేశంలో నిర్ణయించారు. రికార్డు తేదీని సంస్థ త్వరలో తెలియజేయనుంది. ఈ కంపెనీ షేరు ముఖ విలువ రూ.5. బోనస్ షేర్ల జారీతో మూలధనం పెరుగుతుంది. కంపెనీ కొత్తగా హోమ్ సర్వీసెస్ వ్యాపారంలోకి విస్తరించేందుకు 'క్యాప్‌స్టన్ హోమ్ సర్వీసెస్' అనే అనుబంధ సంస్థను ఏర్పాటు చేయనుంది. ఇళ్లు శుభ్రం చేయడం, బ్యూటీ, స్పా సేవలు, ఈపీసీ (ఎలక్ట్రిసిటీ, ప్లంబింగ్, కార్పెంటరీ) సేవలు, ఏసీ మరమ్మతు, పెయింటింగ్ సేవలు అందిస్తారు. ఇప్పటివరకు తాము కంపెనీలు, కార్పొరేట్ సంస్థలకు ఈ తరహా సేవలు అందిస్తున్నామని, ఇకపై రిటెయిల్ వినియోగదారులకూ వీటిని విస్తరిస్తామని క్యాప్‌స్టన్ సర్వీసెస్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీకాంత్ కొడాలి వివరించారు. త్వరలో డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను ఆవిష్కరిస్తామని, దీని ద్వారా వినియోగదారులు తమకు కావాల్సిన సేవల కోసం ఆర్డర్ చేసుకోవచ్చని తెలిపారు.

90% తగ్గిన ఇండస్‌ఇండ్ బ్యాంక్ లాభం

ఇండస్‌ఇండ్ బ్యాంక్, డిసెంబరు త్రైమాసికంలో రూ.127.98 కోట్ల నికరలాభాన్ని ఆర్జించింది. 2024-25 ఇదే కాల లాభం రూ.437 కోట్లతో పోలిస్తే, ఇది 90% తక్కువ. సూక్ష్మరుణ వ్యాపారంలో ఒత్తిడి పెరగడం ఇందుకు కారణం. నికర వడ్డీ ఆదాయం కూడా 13% తగ్గి రూ.4562 కోట్లుగా నమోదైంది. స్థూల నిరర్థక ఆస్తులు సెప్టెంబరు త్రైమాసికం నాటి 3.60% నుంచి 3.56 శాతానికి మెరుగైనా, 2024-25 డిసెంబరు త్రైమాసికం నాటి 2.25 శాతంతో పోలిస్తే పెరిగాయి. సాంకేతికంగా రద్దు చేసిన రుణాల మొత్తం రూ.983 కోట్ల నుంచి రూ.2612 కోట్లకు; కేటాయింపులు రూ.1744 కోట్ల నుంచి రూ.2096 కోట్లకు చేరాయి.

57% క్షీణించిన సిప్లా లాభం

సిప్లా, డిసెంబరు త్రైమాసికంలో రూ.676 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. 2024-25 ఇదే కాల లాభం రూ.1,571 కోట్లతో పోలిస్తే ఇది 57% తక్కువ. అమెరికా మార్కెట్‌లో అమ్మకాలు తగ్గడం ఇందుకు కారణమని కంపెనీ తెలిపింది. మొత్తం కార్యకలాపాల ఆదాయం రూ.7,073 కోట్ల నుంచి రూ.7,074 కోట్లకు చేరింది. ఉత్తర అమెరికాలో విక్రయాలు రూ.1,906 కోట్ల నుంచి 22% క్షీణించి రూ.1,485 కోట్లకు పరిమితమయ్యాయి. 'మా భాగస్వామిపై యూఎస్‌ఎఫ్‌డీఏ ఆడిట్ తర్వాత, అమెరికాలో లాన్రియోటైడ్ ఔషధానికి సరఫరా సవాళ్లు ఎదురయ్యాయి. ఈ సమస్యను పరిష్కరించేందుకు కలిసి పనిచేస్తున్నాం. 2026-27 ప్రథమార్థంలో ఔషధ సరఫరాలు పునరుద్ధరించే అవకాశం ఉంది' అని సిప్లా ఎండీ, గ్లోబల్ సీఈఓ (డెసిగ్నేట్) అచిన్ గుప్తా పేర్కొన్నారు.

బోహ్రింగర్ ఇంగెల్‌హీమ్ ఇండియాతో వియాష్ సైంటిఫిక్ ఒప్పందం

'పెట్ కేర్' ఉత్పత్తుల విక్రయాలు పెంచుకునేందుకు

హైదరాబాద్: వియాష్ సైంటిఫిక్ (గతంలో సీక్వెంట్ సైంటిఫిక్)కు పూర్తి స్థాయి అనుబంధ సంస్థ అలివిరా యానిమల్ హెల్త్ లిమిటెడ్, మనదేశంలో జంతు సంరక్షణ ఉత్పత్తుల అమ్మకాలు పెంచుకునేందుకు జర్మనీకి చెందిన బోహ్రింగర్ ఇంగెల్‌హీమ్ అనుబంధ బోహ్రింగర్ ఇంగెల్‌హీమ్ ఇండియాతో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. దేశీయ మార్కెట్లో 'పెట్ హెల్త్‌కేర్ ఉత్పత్తుల మార్కెట్ ఎంతో వేగంగా పెరుగుతున్నందున, ఈ విభాగంలో విస్తరించడానికి ఈ ఒప్పందం వీలుకల్పిస్తుందని వియాష్ లైఫ్‌సైన్సెస్ ఎండీ, గ్రూపు సీఈఓ హరిబాబు బోడేపూడి తెలిపారు. తమ దీర్ఘకాలిక లక్ష్యాల సాధనకు ఈ ఒప్పందం వీలుకల్పిస్తుందని బోహ్రింగర్ ఇంగెల్‌హీమ్ ఇండియా కంట్రీ హెడ్ (యానిమల్ హెల్త్) వినోద్ గోపాల్ పేర్కొన్నారు.

అక్టోబరు-డిసెంబరు త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం) 2025-26	నికర లాభం/(నష్టం) 2024-25	మొత్తం ఆదాయం 2025-26	మొత్తం ఆదాయం 2024-25
జేఎస్‌డబ్ల్యూ స్టీల్	2410	719	42264	41525
జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ	420	168	4255	2640
జీసీపీఎల్1	497.91	498.31	4079	3749
సుందరం హోమ్‌ఫైనాన్స్	75.14	62.56	--	--
సోనా బీఎల్‌డబ్ల్యూ ప్రెసిషన్2	150	150	1200	868
ఇండియా సిమెంట్స్	(2.67)	116.52	1114	940
అదానీ గ్రీన్ ఎనర్జీ	5	474	2837	2636
కోఫోర్జ్	297	256	4188	3258
టీపీసీఎల్	7545.27	4,649.20	1,36,000	1,27,550
డీసీబీ బ్యాంక్	185	151	625	543
శ్రీరామ్ ఫైనాన్స్	2,530	3,249	---	---
పిరమాల్ ఫైనాన్స్	401	39	---	---

1) మధ్యంతర డివిడెండ్ రూ.5 2) మధ్యంతర డివిడెండ్ రూ.1.6

సాధారణ బీమా కంపెనీల్లో వేతన సవరణకు ప్రభుత్వ ఆమోదం



- నాబార్డ్ ఉద్యోగులు, ఆర్‌బీఐ పింఛనుదార్లకూ

దిల్లీ: ప్రభుత్వ రంగ సాధారణ బీమా కంపెనీలతో పాటు నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ (నాబార్డ్)లోని ఉద్యోగుల వేతన సవరణ ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ), నాబార్డ్‌లో పదవీ విరమణ చేసిన వారికి పింఛను సవరణకూ అనుమతులు ఇచ్చింది. దీంతో మొత్తం 46,322 మంది ఉద్యోగులు; 23,570 మంది పింఛనుదారులు; 23,260 మంది కుటుంబ పింఛనుదార్లకు ప్రయోజనం కలగనుందని శుక్రవారం ఆర్థిక శాఖ పేర్కొంది.

✦ పీఎస్‌యూ సాధారణ బీమా కంపెనీలకు 2022 ఆగస్టు 1 నుంచి వేతన సవరణ అమల్లోకి వస్తుంది. ఇందుకోసం రూ.8,170.30 కోట్లు వెచ్చించనున్నారు.

✦ నాబార్డ్‌లో వేతన సవరణ 2022 నవంబరు 1 నుంచి అమల్లోకి వస్తుంది. అదనపు వార్షిక వేతనం కింద రూ.170 కోట్లతో పాటు, మొత్తం రూ.510 కోట్ల బకాయిలను చెల్లిస్తారు.

✦ ఆర్‌బీఐ పింఛనుదార్లు, కుటుంబ పింఛనుదార్లకు బేసిక్, డీఏపై 10% పెంపు ఉంటుంది. దీనిని 2022 నవంబరు 1 నుంచి అమలు చేస్తారు.

యూనికార్న్‌గా జస్‌పే

ఫిన్‌టెక్ సంస్థ జస్‌పే, సరికొత్త యూనికార్న్ (100 కోట్ల డాలర్లు-రూ.9100 కోట్ల)గా అవతరించింది. జస్‌పే విలువను 1.2 బిలియన్ డాలర్లు (సుమారు రూ.10,920 కోట్లు)గా పరిగణిస్తూ, 50 మిలియన్ డాలర్ల (సుమారు రూ.455 కోట్ల)ను వెస్ట్‌బ్రిడ్జ్ క్యాపిటల్ తాజాగా అందచేయడం ఇందుకు నేపథ్యం. గతేడాది సంస్థ విలువ 900 మిలియన్ డాలర్లు (సుమారు రూ.8190 కోట్లు)గా ఉంది. కార్యకలాపాలను అంతర్జాతీయంగా విస్తరించేందుకు, తాజాగా సమీకరించిన నిధులు వినియోగించాలన్నది జస్‌పే ప్రణాళిక. తమ ప్లాట్‌ఫామ్ ద్వారా జరిగిన వార్షిక చెల్లింపుల విలువ రూ.91 లక్షల కోట్లను అధిగమించినట్లు జస్‌పే తెలిపింది.

ఫిలిప్పీన్స్‌లో అరబిందో ఫార్మా యూనిట్

ఈనాడు, హైదరాబాద్: అరబిందో ఫార్మా అంతర్జాతీయ కార్యకలాపాలను మరింత విస్తృతం చేసింది. ఫిలిప్పీన్స్‌లో అరబిందో ఫార్మా ఫిలిప్పీన్స్ ఇంక్ పేరుతో కొత్త అనుబంధ సంస్థను ఏర్పాటు చేసినట్లు కంపెనీ శుక్రవారం స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారం ఇచ్చింది. నెదర్లాండ్స్‌లోని తమ సబ్సిడరీ సంస్థ హెలిక్స్ బి.వి. ద్వారా ఈ కొత్త యూనిట్ నెలకొల్పినట్లు తెలిపింది. కొత్త కంపెనీలో 100% వాటా కోసం అరబిందో ఫార్మా దాదాపు రూ.18 కోట్ల (12 కోట్ల పేసోలు) పెట్టుబడులు పెట్టింది.

5 ఏసీ విడిభాగాల కంపెనీలకు పీఎల్ఐ ప్రోత్సాహకాలు

దిల్లీ: ఉత్పత్తి అనుసంధానిత ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకానికి 5 ఏసీ విడిభాగాల సంస్థలను కేంద్రం ఎంపిక చేసింది. అందులో కిర్లోస్కర్ న్యూమాటిక్, ఇండో ఏషియా కాపర్, గోద్రేజ్ అండ్ బోయ్స్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ, క్రియాన్ టెక్నాలజీ, వికాస్ (ఇండియా) ఉన్నాయి. నాలుగో దఫాలో 13 దరఖాస్తులను మదింపు చేశాక.. వైట్ గూడ్స్ (ఏసీ, ఎల్ఈడీ లైట్స్) పీఎల్ఐ పథకం కింద అయిదింటికి అనుమతులు ఇచ్చినట్లు వాణిజ్య శాఖ తెలిపింది. 2027-28 వరకు ఈ 5 కంపెనీలు రూ.863 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నాయి. రూ.8,337.24 కోట్ల విలువైన ఉత్పత్తులను తయారు చేయనున్నాయి. 1,799 మందికి ఉపాధి కల్పిస్తాయి.

భారత్‌లోకి ఎఫ్‌డీఐ వరద

- 2025లో 73% వృద్ధితో రూ.4.32 లక్షల కోట్లకు
- డేటాసెంటర్ల పెట్టుబడుల్లో టాప్-10లో: ఐక్యరాజ్యసమితి

ఐక్యరాజ్యసమితి: గతేడాది మొత్తం మీద మన దేశంలోకి 47 బి. డాలర్ల (రూ.4.32 లక్షల కోట్ల) విలువైన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) తరలివచ్చాయి. 2024లో వచ్చిన ఎఫ్‌డీఐ కంటే ఇవి 73% అధికం. సేవలు, తయారీలోకి ఎక్కువ శాతం పెట్టుబడులు వచ్చాయని, ఇందుకు భారత విధానాలు మద్దతుగా నిలిచాయని ఐక్యరాజ్యసమితి పేర్కొంది. 'ద గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రెండ్స్ మానిటర్' పేరిట యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్ ఆన్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్ (యూఎన్‌సీటీఏడీ) ఒక నివేదికను విడుదల చేసింది. దీని ప్రకారం.. అంతర్జాతీయ ఎఫ్‌డీఐ 14% వృద్ధితో 1.6 లక్షల కోట్ల డాలర్ల (దాదాపు రూ.147 లక్షల కోట్ల) కు చేరింది. చైనాలోకి వరుసగా మూడో ఏడాదీ ఎఫ్‌డీఐలు తగ్గాయి. 2025లో 8% క్షీణతతో 107.5 బి. డాలర్లకు పరిమితమయ్యాయి. ఈ నివేదికలోని ఇతర ముఖ్యాంశాలు..

✦ భారత్‌లో ఆర్థిక, ఐటీ, ఆర్ అండ్ డీ వంటి సేవలు, తయారీ విభాగాల్లోని ఎక్కువ ఎఫ్‌డీఐ వచ్చింది.

✦ డేటా సెంటర్ల పెట్టుబడుల విషయంలో అగ్రగామి 10 దేశాల్లో ఒకటిగా భారత్ నిలిచింది. ఫ్రాన్స్, అమెరికా, రిపబ్లిక్ ఆఫ్ కొరియా తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. భారత్ ఏడో స్థానంలో ఉంది.

✦ మొత్తం కొత్త డేటా సెంటర్లలోకి వచ్చిన పెట్టుబడులు 270 బి. డాలర్లుగా ఉన్నాయి. మొత్తం ప్రాజెక్టుల్లో ఇది అయిదో వంతు కంటే ఎక్కువ.

అదానీ గ్రూప్ చేతికి ఐఏఎన్ఎస్

వార్తా ఏజెన్సీ ఐఏఎన్ఎస్ (ఇండో- ఏషియన్ న్యూస్ సర్వీస్)లో మిగిలిన 24% వాటాను కొనుగోలు చేయడంతో.. ఆ సంస్థపై పూర్తి నియంత్రణను అదానీ గ్రూపు తన చేతిలోకి తెచ్చుకుంది. ఈ వాటాను ఎంత మొత్తానికి కొనుగోలు చేసిందీ సంస్థ వెల్లడించలేదు. అదానీ ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన మీడియా సంస్థ ఏఎంజీ మీడియా నెట్‌వర్క్స్ ఈ కొనుగోలు లావాదేవీని పూర్తి చేసింది. 2023 డిసెంబరులో 50.50% వాటాను కొన్న సంస్థ, 2024 జనవరిలో ఈ వాటాను 76 శాతానికి పెంచుకుంది. ఇప్పుడు 100% ఆధీనంలోకి తెచ్చుకుంది.

రూ.7 లక్షల కోట్ల సంపద ఆవిరి

సెన్సెక్స్ ▼770 81538 | నిఫ్టీ ▼241 25049

- సెన్సెక్స్ 82000 దిగువకు
- డాలరు @ రూ.91.90

ఎఫ్ఐఐ అమ్మకాలు.. రూ.4113.38 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు.. రూ.4102.56 కోట్లు



మదుపర్ల సంతోషం ఒక్కరోజు (గురువారం)కే పరిమితమైంది. దేశీయ స్టాక్ మార్కెట్ శుక్రవారం మళ్లీ భారీగా నష్టపోయింది. రూపాయి విలువ మరింత క్షీణించడం, విదేశీ సంస్థాగత మదుపర్ల (ఎఫ్ఐఐ) అమ్మకాలు కొనసాగడం ప్రభావం చూపాయి. అంతర్జాతీయ అనిశ్చితుల నేపథ్యంలో, సురక్షిత పెట్టుబడి సాధనాలైన పసిడి, వెండిలోకి పెట్టుబడులను మదుపర్లు మళ్లిస్తుండటమూ ఇందుకు ఓ కారణం. దేశీయంగా మద్దతునిచ్చే పరిణామాలేవీ లేకపోవడం వల్ల, సెంటిమెంట్ బలహీనంగా ఉంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 32 పైసలు తగ్గి 91.90 వద్ద ముగిసింది. రూపాయి విలువకు ముగింపుపరంగా ఇది తాజా జీవనకాల కనిష్ఠ స్థాయి. ఇంట్రాడేలో 92 వద్ద రికార్డు కనిష్ఠాన్ని తాకింది. బ్రెంట్ ముడి చమురు 1.89% పెరిగి 65.26 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లన్నీ లాభాల్లో ముగియగా.. ఐరోపా మార్కెట్లు ప్రతికూల ధోరణిలో ఆరంభమయ్యాయి.

✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.6.96 లక్షల కోట్లు తగ్గి రూ. 451.56 లక్షల కోట్ల (4.93 లక్షల కోట్ల డాలర్ల)కు పరిమితమైంది.

వారంలో 2.43% నష్టం..: బీఎస్ఈ సెన్సెక్స్ 82,335.94 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 82,307.37) స్వల్ప లాభాల్లో ఆరంభమైంది. అయితే వెంటనే నష్టాల్లోకి వచ్చి.. చివరి వరకు అలానే సాగింది. ఒక దశలో 81,471.82 పాయింట్ల వద్ద ఇంట్రాడే కనిష్ఠానికి దిగివచ్చినా, చివరకు 769.67 పాయింట్ల నష్టంతో 81,537.70 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 241.25 పాయింట్లు కోల్పోయి 25,048.65 వద్ద స్థిరపడింది. వారం మొత్తం మీద సెన్సెక్స్ 2,032.65 పాయింట్లు (2.43%), నిఫ్టీ 645.70 పాయింట్లు (2.51%) చొప్పున నష్టపోయాయి.


ఏడే రాణించాయి..: సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో 7 మినహా మిగతా 23 కంపెనీల షేర్లు నష్టాలతో ముగిశాయి. అత్యధికంగా అదానీ పోర్ట్స్ 7.52%, ఎటర్నల్ 6.29%, ఇండిగో 4.27%, యాక్సిస్ బ్యాంక్ 2.72%, బజాజ్ ఫిన్‌సర్వ్ 2.26%, పవర్‌గ్రిడ్ 2.06%, మారుతీ సుజుకీ 1.87% డీలాపడ్డాయి. హిందుస్థాన్ యునిలీవర్ 0.92%, టెక్ మహీంద్రా 0.79%, ఇన్ఫోసిస్ 0.44%, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ 0.23% పెరిగాయి.


✦ డాలర్ రూపేణ తీసుకున్న రుణం వచ్చే నెలలో తీర్చాల్సి ఉన్నందున, 15 ఏళ్ల కాలవ్యవధికి రూపాయల్లో రుణం తీసుకున్నట్లు **జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్** తెలిపింది. 287 మిలియన్ డాలర్ల రుణాన్ని తీర్చేందుకు, రూ.2,100 కోట్ల రుణాన్ని 7.82% వడ్డీకి తీసుకున్నట్లు వివరించింది.

అదానీ గ్రూపు కంపెనీల షేర్లు డీలా..

26.5 కోట్ల డాలర్ల (సుమారు రూ.2,400 కోట్లు) లంచం కేసు, మోసానికి పాల్పడ్డారనే ఆరోపణల వ్యవహారంలో అదానీ గ్రూపు ఛైర్మన్ గౌతమ్ అదానీ, సాగర్ అదానీకి ఇ-సమన్లు జారీ చేసేందుకు కోర్టు అనుమతిని అమెరికా సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజీ కమిషన్ కోరిందన్న వార్తల నేపథ్యంలో అదానీ గ్రూపు కంపెనీల షేర్లకు అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేరు 9.38%, అదానీ పవర్ 8.84%, అదానీ పోర్ట్స్ 7.81%, అదానీ టోటల్ గ్యాస్ 7.55% నష్టపోయాయి. ఈ వార్తలకు తోడు అక్టోబరు- డిసెంబరు త్రైమాసికానికి నికర లాభంలో క్షీణతను ప్రకటించడంతో అదానీ గ్రీన్ ఎనర్జీ షేరు 13.20%, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ 10.57% పతనమయ్యాయి. అదానీ గ్రూపునకే చెందిన అంబుజా సిమెంట్స్ 5.98%, సంఘీ ఇండస్ట్రీస్ 5.96%, ఏసీసీ 2.76%, ఎన్‌డీటీవీ 5.31% చొప్పున డీలాపడ్డాయి. మదుపర్లకు వాటిల్లిన నష్టం రూ.1.40 లక్షల కోట్లుగా అంచనా వేస్తున్నారు.

బ్రిటిష్ వారి పాలనకు ముందు భారతదేశంలో సంప్రదాయ విద్యా విధానం అమల్లో ఉండేది. గురుకులాలు, దేవాలయాలు హిందువులకు, మదర్సాలు ముస్లింలకు విద్యా కేంద్రాలుగా ఉండేవి. వీటిలో మత విషయాలకే ఎక్కువ ప్రాముఖ్యత ఇచ్చేవారు. ఇవి రాజ కుటుంబీకుల పోషణలో ఉండేవి. ఆంగ్లేయుల పాలన ప్రారంభంలో విద్యపై ఎక్కువ దృష్టి సారించలేదు. తర్వాతి కాలంలో వారి అవసరాల నిమిత్తం విద్యాసంస్థలు, ఆంగ్ల విద్యాబోధనను ప్రవేశపెట్టారు. విశ్వవిద్యాలయాలు స్థాపించారు. ఆ కాలంలో రూపొందించిన ఆంగ్ల విద్యా విధానం నేటికీ కొనసాగుతోంది.


జోనాథన్ డంకన్


చార్లెస్ ఉడ్

ఉడ్స్ డిస్పాచ్ నివేదిక
భారత విద్యా 'మాగ్నాకార్టా'

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
భారతదేశ చరిత్ర

భారతదేశంలో ఆంగ్ల విద్యా విధానం

ఇంగ్లిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ భారతదేశంలో 1757 నుంచి 1813 వరకు విద్యను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. లాభార్జనే ధ్యేయంగా వ్యవహరించిన కంపెనీ విద్యపై ఎలాంటి ఖర్చు చేయలేదు. కొందరు బ్రిటిష్ అధికారులు యూరోపియన్, క్రైస్తవ మిషనరీల ఏర్పాటు తప్ప తొలిదశలో భారతదేశంలో విద్యపై ఆసక్తి చూపలేదు. విద్య ద్వారా ప్రజలు చైతన్యవంతులై తమ దోపిడీని ప్రశ్నిస్తారనే భయంతో విద్యను పూర్తి నిర్లక్ష్యంగా వదిలేశారు. ఈ కాలంలో తమ పరిపాలనా అవసరాల కోసం కేవలం మూడు విద్యా సంస్థలను మాత్రమే స్థాపించారు. అవి:

- **కలకత్తా మదర్సా:** 1781లో దీన్ని వారన్ హేస్టింగ్స్ స్థాపించారు. దీన్ని కలకత్తాలోని ముస్లింల కోసం నెలకొల్పారు.
- **వారణాసి సంస్కృత కళాశాల:** దీన్ని 1791లో జోనాథన్ డంకన్ స్థాపించారు.
- **ఫోర్ట్ విలియం కాలేజ్:** 1800లో లార్డ్ వెల్లస్లీ సివిల్ సర్వెంట్స్‌కు శిక్షణ ఇచ్చేందుకు స్థాపించారు.

❖ 1813లో చార్టర్ చట్టం భారతదేశంలో విద్య కోసం ఏడాదికి రూ.లక్ష కేటాయించాలని నిర్దేశించడంతో ఈస్ట్ ఇండియా కంపెనీ తప్పనిసరిగా విద్యా కార్యక్రమాలను చేపట్టాల్సి వచ్చింది. అయితే 1813 నుంచి 1835 వరకు బడ్జెట్‌లో ఏడాదికి రూ.లక్ష చొప్పున కేటాయింపులు జరిగినప్పటికీ వాటిని ఖర్చు చేయలేదు. దీంతో విద్య కోసం కేటాయించిన బడ్జెట్‌ను ఏ విద్యా విధానంపై ఖర్చు పెట్టాలనే అంశంపై రెండు భిన్న అభిప్రాయాలు బలంగా వినిపించాయి. అవి:

ఓరియంటలిస్ట్ వాదం: బడ్జెట్ కేటాయింపులను భారత విద్యా విధానంపై ఖర్చుచేసి భారతీయ భాషల్లో విద్యా బోధనను చేపట్టాలని వీరు డిమాండ్ చేశారు.

ఆంగ్లిసిస్ట్ వాదం: వీరు ఇంగ్లిష్ మాధ్యమంలో పాశ్చాత్య విద్యపై బడ్జెట్‌ను ఖర్చుచేయాలని వాదించారు.

◆ 1835లో ఈ వివాదాన్ని పరిష్కరించడానికి విలియం బెంటింక్ మెకాలే కమిటీని నియమించారు. ◆ మెకాలే నివేదిక ఆధారంగా 1835లో విలియం బెంటింక్ ఆంగ్ల విద్యను ప్రవేశపెట్టారు. ఆంగ్ల మాధ్యమంలో భారతీయ పాఠశాలల్లో సాహిత్యం, లెక్కలు, సైన్స్, తర్కం, తత్వం లాంటి పాశ్చాత్య విషయాలను బోధించాలని నిర్ణయించారు. ఈ ఏడాదే పర్షియన్ స్థానంలో ఇంగ్లిష్‌ను రాజభాష చేశారు. ◆ తన నివేదికలో మెకాలే పాశ్చాత్య శాస్త్రాలను సమర్థిస్తూ, తూర్పు దేశాల్లో ఉన్న సమస్త శాస్త్రీయ పరిజ్ఞానం లండన్‌లోని ఒక గ్రంథాలయంలోని కొన్ని పుస్తకాలకు సమానం కాదని పేర్కొన్నారు.

◆ ఆంగ్ల విద్యా విధానం ద్వారా ఆంగ్లేయులకు విధేయులైన భారతీయ మేధావులను సృష్టించవచ్చని తెలియజేశారు.

ఆంగ్ల విద్య - కమిటీలు

ఉడ్స్ డిస్పాచ్

ఈ కమిటీని 1854లో గవర్నర్ జనరల్ డల్హౌసీ నియమించారు. ఆనాటి బోర్డ్ ఆఫ్ కంట్రోల్ అధ్యక్షుడు చార్లెస్ ఉడ్ లండన్ నుంచి పంపిన నివేదిక ఇది.

సిఫార్సులు: ప్రాథమిక విద్య, మహిళా విద్య, వృత్తి విద్య, లౌకిక, శాస్త్రీయ విద్యను ప్రోత్సహించాలి.

- ఉన్నత విద్యను ఆంగ్ల భాషలో, ప్రాథమిక విద్యను మాతృభాషలో బోధించాలి.
- ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేలా వారికి గ్రాంట్స్-ఇన్-ఎయిడ్‌లను ఇవ్వాలి.
- భారతదేశంలో విశ్వవిద్యాలయాలను ఏర్పాటు చేయాలి.
- ఈ కమిటీ నివేదిక ఆధారంగా కింది చర్యలు తీసుకున్నారు. అవి:
  - 1855లో అన్ని రాష్ట్రాల్లోనూ విద్యాశాఖ ప్రారంభం.
  - 1857లో కలకత్తా, బొంబాయి, మద్రాసుల్లో మూడు విశ్వవిదాలయాల స్థాపన.
  - ఈ నివేదికను 'మాగ్నాకార్టా ఆఫ్ ఇండియన్ ఎడ్యుకేషన్' అని పిలుస్తారు.

హార్టోగ్ కమిటీ

1929లో లార్డ్ ఇర్విన్ ఈ కమిటీని నియమించారు. విద్యా ప్రమాణాలను పెంచడానికి ఈ కమిటీ కింది సిఫార్సులు చేసింది. అవి:

- ▼ నిర్బంధ విద్య చేపట్టకూడదు.
- ▼ ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలి.
- ▼ ఉన్నత విద్యాసంస్థల్లో ప్రవేశాలను నియంత్రించాలి.
- ▼ ప్రతిభ కనబర్చని విద్యార్థులను వృత్తి విద్య వైపు మళ్లించాలి.

సార్జంట్ ప్లాన్

1944లో లార్డ్ వేవెల్ ఈ కమిటీని నియమించగా, కింది సిఫార్సులు చేసింది.

- ▲ మూడేళ్ల వయసులో బాలబాలికలందరికీ పూర్వ ప్రాథమిక విద్యను అందించాలి.
- ▲ ఉపాధ్యాయ శిక్షణ కళాశాలలను ప్రారంభించాలి.
- ▲ వయోజన విద్యను ప్రోత్సహించాలి.

హంటర్ కమిషన్

ఉడ్స్ డిస్పాచ్ సూచించిన విధానాలు, వాటి అమలు తీరును పరిశీలించేందుకు 1882లో విలియం హంటర్ కమిషన్‌ను గవర్నర్ జనరల్ లార్డ్ రిప్పన్ నియమించారు.

సిఫార్సులు: ఈ కమిషన్ రెండు సిఫార్సులు చేసింది. ఉన్నత విద్యను ప్రైవేటీకరించడంతో పాటు ప్రాథమిక విద్యను స్థానిక సంస్థలకు అప్పగించడం.

థామస్ ర్యాలీ కమిషన్

1902లో లార్డ్ కర్జన్ ఈ కమిషన్‌ను నియమించారు. దీన్నే ఇండియన్ యూనివర్సిటీ కమిషన్ అని కూడా అంటారు. ఇది రెండు సిఫార్సులు చేసింది.

- ● ఉన్నత విద్యపై ఏడాదికి రూ.5 లక్షలు ఖర్చు చేయాలి.
- ● విశ్వవిద్యాలయాల్లో భోజన, వసతులతో కూడిన విద్యను అందించాలి.

డా.జాకీర్ హుస్సేన్ కమిటీ

ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ 1937లో ఈ కమిటీని నియమించింది. ఈ కమిటీ నివేదికను వార్ధా విద్యా ప్రణాళిక అంటారు. ఇందులో గాంధేయ విద్యా విధానాన్ని పొందుపర్చారు. ఇందులోని ముఖ్యాంశాలు:

- ■ గ్రామీణ పేదలకు వృత్తి విద్యను, పట్టణ ధనికులను సాధారణ విద్యను అందించాలి.
- ■ మాతృ భాషలో విద్యా బోధన కొనసాగించాలి. 2వ తరగతిలో హిందీని, 8వ తరగతిలో ఇంగ్లిష్‌ను ప్రవేశపెట్టాలి.
- ■ అనియత విద్యా విధానాన్ని (Non-formal education system) ప్రోత్సహించాలి.
- ■ తొలి ఏడేళ్ల విద్యను అందరికి ఉచితంగా, నిర్బంధంగా ఇవ్వాలి.


రచయిత
డాక్టర్ ఎం. రవి కుమార్
విషయ నిపుణులు

సాడ్లర్ కమిషన్

1917-19 మధ్య కాలంలో లార్డ్ చెమ్స్‌ఫర్డ్ ఈ కమిషన్‌ను నియమించగా, మూడు సిఫార్సులు చేసింది.

- ◗ విశ్వవిద్యాలయాలకు స్వయం ప్రతిపత్తి ఇవ్వాలి.
- ◗ 3 సంవత్సరాల డిగ్రీ కోర్సు ప్రవేశపెట్టాలి.
- ◗ ఉన్నత విద్యకు సంబంధించిన పరీక్షలను నిర్వహించడానికి ప్రత్యేక బోర్డులను ఏర్పాటు చేయాలి.

ఆంగ్లేయుల సామాజిక విధానం

ఆంగ్లేయులు తమ పాలనా కాలంలో భారతదేశంలోని సామాజిక దురాచారాలపై ఉక్కుపాదం మోపి, వాటిని రూపుమాపాలని ప్రయత్నించారు. ఉదారభావాలు కలిగిన ఆంగ్లేయులు, క్రైస్తవ సంఘాలు, భారతీయుల ఒత్తిడితో బ్రిటిష్ పాలకులు సామాజిక చట్టాలను చేపట్టారు. అవి.

- ✦ భారతదేశంలో పుట్టగానే ఆడశిశువులను చంపే దురాచారం అనాదిగా ఉండేది. 1802లో ఆడశిశు హత్యలను నిషేధించారు. 1830వ దశకంలో విలియం బెంటింక్, 1840వ దశకంలో హార్డింజ్-I శిశుహత్యలను అణిచివేశారు.
- ✦ 1829లో విలియం బెంటింక్ సతీ నిషేధ చట్టాన్ని తీసుకువచ్చారు. ఈ చట్టం రావడానికి రాజా రామ్మోహన్ రాయ్ తీవ్రంగా కృషి చేశారు.
- ✦ 1833లో బ్రిటిష్ పార్లమెంట్ ఆంగ్లేయుల సామ్రాజ్యంలో బానిస వ్యవస్థను నిషేధిస్తూ చట్టం చేసింది. ఈ చట్టాన్ని 1843లో ఆనాటి గవర్నర్ జనరల్ ఎల్లెన్ బరో అమలుచేసి భారతదేశంలో బానిస వ్యవస్థను అంతం చేశారు. ✦ 1846లో హార్డింజ్-I నరబలుల నిషేధ చట్టం తెచ్చారు.
- ✦ 1850లో డల్హౌసీ కుల వివక్ష నిర్మూలన చట్టం చేసి, అస్పృశ్యతను నేరంగా ప్రకటించారు.

900 Word of the Day

Feign

Telugu meaning: నటించు, అభినయించు

English meaning: The word feign (ఫెయిన్) is a verb that means to pretend to feel, show, or possess something that is not true.

Synonyms: Pretend, Simulate

Antonyms: Reveal, Express

Usage: 1. The employee tried to feign ignorance about the missing documents, but the investigation exposed the truth.

2. Politicians often feign concern for public welfare during elections to gain the trust of voters.

కరెంట్ అఫైర్స్



భారతీయ సంతతికి చెందిన అమెరికన్ వ్యోమగామి సునీతా విలియమ్స్ (60) పదవీ విరమణ చేసినట్లు అంతరిక్ష సంస్థ నాసా ప్రకటించింది. 2025 డిసెంబరు 27న ఆమె పదవీ విరమణ చేసినట్లు సంస్థ జనవరి 21న అధికారికంగా వెల్లడించింది. 27 సంవత్సరాలకు పైగా నాసా కోసం పనిచేసిన సునీత మూడుసార్లు అంతరిక్ష యాత్ర చేశారు. ఆమె తన సుదీర్ఘ వృత్తి జీవితంలో 608 రోజుల పాటు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో బసచేసి అత్యధిక కాలం అంతరిక్షయానం చేసిన వ్యోమగాముల జాబితాలో చేరారు.



మొజాంబిక్ మానవ హక్కుల కార్యకర్త, దక్షిణాఫ్రికా మాజీ అధ్యక్షుడు నెల్సన్ మండేలా రెండో భార్య గ్రాసా మచెల్... ఇందిరాగాంధీ శాంతి పురస్కారానికి ఎంపికయ్యారు. 2025 ఏడాదికి గానూ శాంతి, నిరాయుధీకరణ, అభివృద్ధి విభాగంలో మచెల్‌కు బహుమతిని ప్రదానం చేస్తున్నట్లు ఇందిరాగాంధీ మెమోరియల్ ట్రస్టు 2026, జనవరి 21న తెలిపింది.

రైల్వేలో మొదటిసారి విశాఖ రైల్వే స్టేషన్‌లో 'రోబో కాప్'ను విధుల్లోకి తీసుకున్నారు. దీన్ని 2026, జనవరి 22న ఆర్పీఎఫ్ ఐజీ అలోక్ బోహ్రా, డీఆర్ఎం లలిత్ బోహ్రా ఆవిష్కరించారు. ఈ రోబోకు రైల్వే పోలీసులు 'ఏఎస్సీ అర్జున్' అని పేరు పెట్టారు. ఏఐ, ఐవోటీ సాంకేతికత ఉన్న ఈ రోబో స్టేషన్‌లో నిత్యం పహారా కాస్తూ అనుమానితులను గుర్తిస్తుంది.


అసంఘటిత రంగ కార్మికులకు పెన్షన్ అందించే ఉద్దేశంతో తీసుకొచ్చిన అటల్ పెన్షన్ యోజన పథకాన్ని (ఏపీవై) మరో అయిదేళ్లపాటు కొనసాగించాలని కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. 2030-31 ఆర్థిక సంవత్సరం వరకు దీన్ని పొడిగించేందుకు 2026, జనవరి 21న ఆమోదం తెలిపింది. 2015 మే 9 ప్రారంభమైన ఈ పథకంలో 2026 జనవరి 19 నాటికి 8.66 కోట్ల మంది చందాదారులుగా చేరారు.

ఇజ్రాయెల్-హమాస్ కాల్పుల విరమణ ఒప్పందంలో కీలకమైన గాజా శాంతి మండలిని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 2026, జనవరి 22న లాంఛనంగా ప్రారంభించారు. ఛైర్మన్ హోదాలో ఆయన మండలి చార్టర్‌పై సంతకం చేశారు. ఐక్యరాజ్యసమితికి పోటీగా దీన్ని ట్రంప్ తెరపైకి తీసుకొస్తున్నారనే వార్తల నేపథ్యంలో దావోస్ వేదికగా జరిగిన ఈ కార్యక్రమానికి భారత్ సహా పలు దేశాలు దూరంగా ఉన్నాయి.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

అంతర్జాతీయ విద్యా దినోత్సవం

జనవరి 24
చరిత్రలో ఈనాడు



విద్య పొందడం అనేది మానవుల ప్రాథమిక హక్కు. ఇది ప్రజల్లో బాధ్యతను పెంపొందిస్తుంది. పేదరికాన్ని, అసమానతలను జయించడానికి చదువు మంచి సాధనం. సామాజిక మార్పు, స్థిరమైన అభివృద్ధికి చోదక శక్తిలా పనిచేస్తుంది. ప్రపంచవ్యాప్తంగా శాంతి, సౌభ్రాతృత్వాన్ని నెలకొల్పడంలో విద్య పోషించే కీలక పాత్రను గుర్తించే లక్ష్యంతో ఏటా **జనవరి 24న 'అంతర్జాతీయ విద్యా దినోత్సవం'**గా (International Day of Education) నిర్వహిస్తారు. అందరికీ నాణ్యమైన విద్య అందేలా ప్రోత్సహించడంతోపాటు మారుతున్న సాంకేతిక అవసరాలకు తగ్గట్లు నిరంతర అభ్యసన ఆవశ్యకతను తెలియజేయడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

విద్య ఆవశ్యకత

విద్యను ఆంగ్లంలో ఎడ్యుకేషన్ అంటారు. ఇది ఎడ్యుకేర్ (Educare), ఎడ్యుసెర్ (Educer) అనే లాటిన్ పదాల నుంచి వచ్చింది. సామాజిక, ఆర్థిక అంతరాలను అధిగమించి సామాన్యులకు అధికారాన్ని కల్పించడంలో విద్య ముఖ్య భూమిక పోషిస్తుంది. దీని వల్ల జ్ఞానం, విచక్షణ లాంటివి అలవడతాయి.

✦ సరైన విద్య, నైపుణ్యాలతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుంది.

చారిత్రక నేపథ్యం

ప్రపంచవ్యాప్తంగా శాంతి, సమానత్వం, అభివృద్ధిని ప్రోత్సహించడంలో విద్య ముఖ్య పాత్ర పోషిస్తుందని ఐక్యరాజ్యసమితి భావించింది. అందరికీ విద్య అనే సుస్థిరాభివృద్ధి లక్ష్య సాధనలో భాగంగా చదువు ఆవశ్యకతను చాటుతూ ఒక రోజును ఏర్పాటు చేయాలని సంకల్పించింది. దీనికి అనుగుణంగా ఏటా జనవరి 24న 'అంతర్జాతీయ విద్యా దినోత్సవం'గా జరుపుకోవాలని 2018, డిసెంబరు 3న ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ తీర్మానించింది. 2019 నుంచి ప్రతి సంవత్సరం దీన్ని నిర్వహిస్తున్నారు.


● **2026 నినాదం:** The power of youth in co-creating education

విద్య విషయంలో ప్రపంచ గణాంకాలు, భారతదేశంలో తీరుతెన్నులు, ఇంకా ఈ అంశంపై ఆర్ఆర్‌బీ గ్రూప్ డి, యూజీసీ నెట్ తదితర పోటీపరీక్షల్లో అడిగిన ప్రశ్నలు - జవాబుల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - ఇండియన్ పాలిటీ

కాగ్, యూపీఎస్సీ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయ, వ్యయాలను తనిఖీ చేసి, నివేదికలు సమర్పించేది కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్. దేశంలో అఖిల భారత సర్వీసులు, గ్రూప్-ఎ, గ్రూప్-బి, కేంద్ర సర్వీసులకు సంబంధించిన నియామకాలను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహిస్తుంటుంది. కాగ్, యూపీఎస్సీ నిర్మాణం, నియామక అర్హతలు, తొలగింపు, విధులు, అధికారాలు, తదితరాలపై పరీక్షార్థులు దృష్టి సారించాలి.



కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్)

కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ పదవి గురించి భారత రాజ్యాంగంలోని 148 - 151 ఆర్టికల్స్ వివరిస్తున్నాయి. కాగ్ అనేది రాజ్యాంగబద్ధమైన పదవి. దీన్ని మన దేశం బ్రిటిష్ వ్యవస్థ నుంచి స్వీకరించింది.

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్

దేశంలోని అత్యున్నత నియామక సంస్థ కేంద్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ). ఇది ఒక రాజ్యాంగబద్ధమైన, స్వయంప్రతిపత్తి గల సంస్థ. యూపీఎస్సీ దేశంలో మెరిట్‌ను పరిరక్షించే కాపలాదారుడు. భారత ప్రభుత్వ చట్టం 1919లో కేంద్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పాటును ప్రస్తావించింది.

కాగ్ అధికారాలు - విధులు; యూపీఎస్సీ ఛైర్మన్, సభ్యుల నియామకానికి కావాల్సిన అర్హతలు - పదవీకాలం, ఇతర అంశాలతో సహా పూర్తి సమాచారం 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో ఈ-బుక్ రూపంలో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

నోటిఫికేషన్స్

మల్టీ టాస్కింగ్ స్టాఫ్ పోస్టులు

ఝార్ఖండ్‌లోని సీఎస్ఐఆర్-నేషనల్ మెటలర్జికల్ ల్యాబొరేటరీ (ఎన్ఎంఎల్), జంషెడ్‌పూర్ తాత్కాలిక ప్రాతిపదికన మల్టీ టాస్కింగ్ స్టాఫ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 22. ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ 6 ఫిబ్రవరి 2026.

ప్రాజెక్ట్ ఇంజినీర్ పోస్టులు

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బెల్) పంచకుల యూనిట్ ప్రాజెక్ట్ ఇంజినీర్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 7. దరఖాస్తు ఫీజు రూ.400. అర్హులైన అభ్యర్థులు 2026 ఫిబ్రవరి 5లోగా దరఖాస్తు చేసుకోవాలి.

రిసెర్చ్ అసోసియేట్ పోస్టులు

హైదరాబాద్ హబ్సిగూడలోని సీఎస్ఐఆర్-సెంటర్ ఫర్ సెల్యులార్ & మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) తాత్కాలిక ప్రాతిపదికన ప్రాజెక్ట్ సీనియర్ రిసెర్చ్ ఫెలో, ప్రాజెక్ట్ అసోసియేట్-I, టెక్నీషియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 10. అర్హులైన అభ్యర్థులు 2026, జనవరి 29లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

దరఖాస్తు చేశారా..?

కింది ఉద్యోగాలకు నేడే (జనవరి 24) చివరి తేదీ

- ట్రిపుల్ఐటీ డీఎం కర్నూలులో ఫ్యాకల్టీ పోస్టులు. పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.
- ఐఐఐటీ డీఎం కర్నూలులో 16 నాన్-టీచింగ్ పోస్టులు. డిగ్రీ, బీఈ/బీటెక్, ఎంటెక్, ఎంఎస్సీ, ఎంసీఏ, డిప్లొమా, ఐటీఐలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Railway Exams
Mathematics
Geometry

1. The sides of a triangle are 13 cm, 14 cm and 15 cm. What will be the area (in cm^2) of the triangle formed by joining the midpoints of the sides of the given triangle?
A) 10.5 B) 21 C) 26.25 D) 42

2. If $\Delta XYZ \sim \Delta MNP$ and $\angle X = 40°$, $\angle Y = 55°$, then what is the value of $\angle P$?
A) 40° B) 55° C) 85° D) 65°

3. Two circles with centres O_1 and O_2 touch each other externally. AB is a direct common tangent touching the circles at A and B respectively. If the radii of the two circles are 10 cm and 6 cm, then what is the length of AB (in cm)?
A) 8 B) $\sqrt{260}$ C) 16 D) $\sqrt{240}$

4. The radii of two circles are 8 cm and 2 cm, and the distance between their centres is 10 cm. Find the length (in cm) of the direct common tangent between the two circles.
A) 6 B) 8 C) 10 D) 12

5. The areas of two similar triangles ABC and DEF are 25 cm^2 and 100 cm^2, respectively. If AB = 5 cm, then what is the length of DE?
A) 8 cm B) 10 cm
C) 20 cm D) 4 cm

6. In ΔPQR, $\angle P = 90°$ and $PM \perp QR$, where M lies on QR. If PQ = 15 cm and PR = 20 cm, then find the value of PM (in cm).
A) 10 B) 11 C) 12 D) 13

7. Two concentric circles have radii 13 cm and 5 cm. Find the length (in cm) of the chord of the larger circle which just touches the smaller circle.
A) 12 cm B) 20 cm
C) 24 cm D) 26 cm

8. In ΔXYZ, M and N are the midpoints of sides XY and XZ, respectively. Point T lies on segment MN such that MT : TN = 2 : 5. If MT = 8 cm, then find the length of YZ.
A) 42 cm B) 44 cm
C) 48 cm D) 56 cm

9. Two circles touch each other externally at point P. XY is a direct common tangent which touches the circles at X and Y, respectively. If lines PX and PY are joined, then what is the value of $\angle XPY$?
A) 60° B) 90° C) 45° D) 120°

10. The lengths of two parallel chords of a circle are 10 cm and 24 cm, lying on opposite sides of the centre. If the longer chord is 5 cm away from the centre, find the distance (in cm) between the two chords.
A) 12 B) 13 C) 17 D) 18

11. In ΔXYZ, M and N are the midpoints of sides XY and XZ, respectively. Point T lies on segment MN such that MT : TN = 2 : 5. If MT = 10 cm, then find the length of YZ.
A) 56 cm B) 60 cm
C) 64 cm D) 70 cm

12. The areas of two similar triangles ABC and DEF are 25 cm² and 100 cm², respectively. If AB = 5 cm, then what is the length of DE?
A) 8 cm B) 10 cm
C) 20 cm D) 25 cm

13. The lengths of the two sides adjacent to the right angle of a right-angled triangle are 5 cm and 12 cm. Find the length (in cm) of the hypotenuse.
A) 11 cm B) 12 cm
C) 13 cm D) 14 cm

14. Two triangles ΔABC and ΔDEF are similar. In ΔABC, $\angle A = 30°$ and $\angle B = 50°$. Also, AB = 6 cm, AC = 8 cm and the corresponding side DE = 9 cm. Find the value of $\angle F$ and DF, respectively.
A) 60°, 12 cm B) 50°, 10 cm
C) 100°, 12 cm D) 60°, 10 cm

15. A tangent PQ at point P of a circle with centre O and radius 5 cm meets a line through the centre O at point Q. If OQ = 13 cm, then find the length of PQ (in cm).
A) 10 B) 12 C) 8 D) 9

16. In a right-angled triangle, the hypotenuse is 25 cm and the sum of the other two sides is 35 cm. Find the difference between the other two sides.
A) 5 cm B) 7 cm C) 10 cm D) 15 cm

17. Two circles touch each other externally at point P. XY is a direct common tangent to the two circles, touching them at X and Y, respectively. If $\angle PXY = 35°$, then what is the measure of $\angle XPY$?
A) 35° B) 45° C) 55° D) 65°

18. Two circles, each of radius 8 cm, intersect each other such that each circle passes through the centre of the other. Find the length (in cm) of the common chord of the two circles.
A) 8 B) $8\sqrt{2}$
C) $8\sqrt{3}$ D) 16

Scan the QR code for Key

These model questions were prepared by subject experts

కరెంట్ అఫైర్స్

★ ఔట్ స్టాండింగ్ అచీవ్‌మెంట్ కేటగిరీలో ఇండియన్ ఆఫ్ ది ఇయర్-2025 అవార్డును సీఎన్ఎన్-న్యూస్ 18 ఎవరికి ప్రకటించింది?



జ: అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) ఛైర్మన్ జైషా

★ భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని 2025, నవంబరు 26న ఏ నగరంలోని యునెస్కో

మాదిరి ప్రశ్నలు

ప్రధాన కార్యాలయంలో భారత రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్ భీమ్‌రావ్ రామ్‌జీ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు? (యునెస్కోకు భారత రాయబారి, శాశ్వత ప్రతినిధి విశాల్ శర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.)

జ: ప్యారిస్

మరింత సమాచారం

★ యునైటెడ్ నేషన్స్ వరల్డ్ అర్బనైజేషన్ ప్రాస్పెక్ట్స్ 2025 నివేదిక ప్రకారం ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉన్న నగరంగా ఏది అవతరించింది? (టోక్యోను అధిగమించి ఇది ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉన్న నగరంగా అవతరించింది. ఈ నగర జనాభా సుమారు నలభై రెండు మిలియన్లు. నివేదిక ప్రకారం ఢాకా 37 మిలియన్ల జనాభాతో రెండో స్థానంలో ఉంటే టోక్యో 33 మిలియన్ల జనాభాతో మూడో స్థానంలో నిలిచింది.)

జ: జకార్తా

TENTH Biology — LIFE PROCESSES



Final Exams-2026 IMPORTANT Q & A

1. Define Photolysis.

A: Splitting of water molecule into H^+ and OH^- by the light activated chlorophyll molecule is known as Photolysis. This is also known as Hill's Reaction.

2. Name the enzyme presents in saliva that helps in the digestion of starch.

A: The enzyme presents in saliva that helps in the digestion of starch is amylase (Ptylain).

3. In which chamber of heart is oxygenated blood found?

A: Oxygenated blood is found in left auricle and left ventricle.

1 Mark

4. What makes red blood corpuscles red?

A: Haemoglobin is filled in red blood corpuscles to make it red.

5. What will happen if platelets were absent in the blood?

A: If platelets were absent in the blood, the process of blood clotting will be affected.

6. What is the main function of kidneys in human beings?

A: Kidneys excrete water and dissolve metabolic wastes. e.g.: Urea and other dissolved solids like uric acid, creatinine and inorganic salts.

7. In what part of nephron is water reabsorbed?

A: Water is reabsorbed in Proximal Convoluted Tubule and Loop of Henly.

8. Which is the major nitrogenous waste product in human beings? How is it removed from the body?

A: The major nitrogenous waste product in human beings is urea. Urea is removed from the body through urine.


9. What is osmoregulation?

A: Osmoregulation is the maintenance of optimum concentration of water and salts in the body fluids.

10. What is chime?

A: The slightly digested food which enters into the stomach is churned along with gastric Juices converting the food into a semi solid paste called chime.

More Imp Q & Ans



Writer: M.S.N. Murthy

గడిలో గడి చిక్కుల ముడి!




ఇంట్లో టైల్స్ వేసేటప్పుడు నిర్దిష్ట వైశాల్యంలో పట్టే చతురస్రాకార టైల్స్‌ను లెక్కగట్టాలంటే చతురస్రాల గణన గురించి తెలియాలి. ఒక సంక్లిష్ట రేఖాగణిత చిత్రం లేదా గ్రిడ్‌లో ఎన్ని చతురస్రాలు ఉన్నాయో కచ్చితంగా లెక్కించడాన్నే చతురస్రాల గణన అంటారు. ఇది సరళంగా కనిపించినప్పటికీ ఒక చతురస్రంలో మరో చతురస్రం, పక్క పక్కనే కలిపి ఏర్పడే ఇంకొన్ని చతురస్రాలతో క్లిష్టంగా ఉంటుంది. అన్నింటినీ వదలకుండా జాగ్రత్తగా లెక్కపెట్టడం సవాలుతో కూడుకున్న ప్రక్రియ. మరో రకంగా వివరించాలంటే చదరంగం బోర్డు మీద అరవై నాలుగు గడులు కనిపిస్తాయి. నిజానికి అందులో రెండు వందల నాలుగు చతురస్రాలు ఉంటాయి. అభ్యర్థుల్లో సూక్ష్మ పరిశీలనాశక్తిని పరీక్షించడానికి ఈ అధ్యాయం నుంచి ప్రశ్నలు అడుగుతుంటారు. గ్రిడ్‌లలో రకాలను గుర్తించడం, సంక్షిప్త పద్ధతుల ద్వారా చిత్రాలను గణించడం నేర్చుకుంటే సులభంగా సమాధానాలను కనుక్కోవచ్చు. రకరకాల నమూనాల ప్రశ్నలను ప్రాక్టీస్ చేయడం ద్వారా తక్కువ సమయంలో వేగంగా లెక్కించగలిగే సామర్థ్యం పెరుగుతుంది.

చతురస్రాల గణన

జ్యామితీయ పటాల గణనలో భాగంగా వచ్చే చతురస్రాల గణన అనేది కూడా ఒక ముఖ్యమైన అంశం. ఇచ్చిన జ్యామితీయ పటంలో ఉన్న చతురస్రాల సంఖ్యను లెక్కించే క్రమంలో కొన్ని ప్రామాణికమైన పద్ధతులను పాటించి లెక్కించాల్సి ఉంటుంది. తద్వారా సమాధానాన్ని సులభంగా గుర్తించవచ్చు. చతురస్రం అంటే నాలుగు భుజాల పొడవులు సమానంగా ఉంటాయి. కాబట్టి ఒకదానికి మరొకటి ఆనుకుని ఉన్న నాలుగు చతురస్రాల ద్వారా ఏర్పడే జ్యామితీయ పటం కూడా ఒక చతురస్రమే.


మాదిరి ప్రశ్నలు

1. కింది జ్యామితీయ పటంలో ఉన్న చతురస్రాలు ఎన్ని?



1) 9 2) 10
3) 12 4) 14


వివరణ:



చతురస్రాల సంఖ్య
$= 1^2 + 2^2 + 3^2$
$= 1 + 4 + 9 = 14$ జ: 4

గమనిక: అడ్డువరుసలు, నిలువు వరుసల సంఖ్య సమానంగా ఉన్నప్పుడు మాత్రమే పై విధానం పాటించాలి.

2. కింది జ్యామితీయ పటంలో ఉన్న చతురస్రాల సంఖ్య ఎంత?



1) 18 2) 20
3) 16 4) 22

వివరణ:

	1	2	3	4
1	1	2	3	1
2	1	2	3	2
3	1	2	3	3


చతురస్రాల సంఖ్య $= 3 \times 4 + 2 \times 3 + 1 \times 2$
$= 12 + 6 + 2 = 20$



లేదా
$= 1^2 + 2^2 + 3^2$
$= 1 + 4 + 9 = 14$
$= 1 + 2 + 3 = 6$
మొత్తం చతురస్రాలు $= 14 + 6 = 20$ జ: 2

జనరల్ స్టడీస్ రీజనింగ్

3. కింది జ్యామితీయ పటంలోని చతురస్రాల సంఖ్య ఎంత?




1) 58 2) 60
3) 64 4) 56

వివరణ:

1	2	3	4
			3
			2
			1
1	2	3	4
1	2	3	4
1	2	3	4


4×4 బ్లాకులు సమానంగా ఉన్నాయి కాబట్టి
$1^2 + 2^2 + 3^2 + 4^2$
$= 1 + 4 + 9 + 16 = 30$
మిగిలినవి $1 + 2 + 3 + 4 = 10$
$1 + 2 + 3 + 4 = 10$
$1 + 2 + 3 + 4 = 10$
మొత్తం చతురస్రాలు $= 30 + 10 + 10 + 10 = 60$ జ: 2

4. కింది జ్యామితీయ పటంలో ఉన్న చతురస్రాలు ఎన్ని?




1) 35 2) 40
3) 30 4) 32


వివరణ:



$= 1^2 + 2^2 + 3^2 + 4^2$
$= 1 + 4 + 9 + 16 = 30$
ABCD పటం నుంచి ఏర్పడే చతురస్రాలు = 5
మొత్తం చతురస్రాలు
$= 30 + 5 = 35$ జ: 1




5. కింది జ్యామితీయ పటంలో ఉన్న చతురస్రాలు ఎన్ని?




1) 16
2) 15
3) 17
4) 18

వివరణ:




పై పటంలో ఇమిడి ఉన్న చిత్రాలు




మొత్తం ఏర్పడే చతురస్రాలు
$= 6 + 6 + 5 = 17$ జ: 3

6. కింది జ్యామితీయ పటంలో ఏర్పడే చతురస్రాలు ఎన్ని?



1) 18 2) 16
3) 17 4) 20

వివరణ:





ఏర్పడే మొత్తం చతురస్రాలు $= 4n + 1$
$n = 4 \quad = 4(4) + 1$
$= 16 + 1 = 17$ జ: 3



రచయిత: గోలి ప్రశాంత్ రెడ్డి

అడవి బిడ్డలకు వారే అసలైన శత్రువులు!

భారతదేశంలో తరతరాలుగా అడవుల్లో స్వేచ్ఛగా జీవించిన గిరిజనులు బ్రిటిష్ పాలనలో తొలిసారిగా అస్తిత్వ సమస్య ఎదుర్కొన్నారు. అడవులను ప్రభుత్వ ఆస్తిగా ప్రకటించడంతో వారి జీవనం, సంప్రదాయాలు, సంస్కృతి ప్రమాదంలో పడ్డాయి. గిరిజన గూడేలు, గ్రామాల్లో బయటి వ్యక్తుల జోక్యం ఎక్కువైంది. వర్తకుల మోసాలతో ఆర్థికంగా దెబ్బతిన్నారు. దీంతో అప్పటి వరకు స్వయంప్రతిపత్తితో స్వర్ణయుగంగా సాగిన కాలాన్ని, తిరిగి సాధించుకోవడానికి తిరుగుబాట్లు చేయాల్సి వచ్చింది. ఆధునిక యుగంలో దేశవ్యాప్తంగా అడవి బిడ్డలు ఎదుర్కొన్న ఈ సంఘర్షణల గురించి పోటీ పరీక్షార్థులకు తెలియాలి. నాడు ప్రాంతాల వారీగా నివసించిన గిరిజన తెగలు, జీవన విధానం, ఆచార వ్యవహారాలు, ఆహార అలవాట్లు, వారికి ఉన్న ప్రత్యేక నైపుణ్యాలు, సాగు విధానాలు, పంట కాలాల నుంచి పలు చోట్ల జరిగిన తిరుగుబాట్లు, వాటి ప్రభావాలను అర్థం చేసుకోవాలి.

జనరల్ స్టడీస్ - భారతదేశ చరిత్ర

గిరిజనులు, దికూలు - ఒక స్వర్ణయుగ వీక్షణ

1. కింది వాటిలో గిరిజనుల జీవితాలకు సంబంధించి సరైంది?
   1) ఒక తెగకు చెందినవారు ఒకే బంధుత్వానికి చెందినవారుగా భావిస్తారు.
   2) కుల వ్యవస్థ సమాజాల్లో ఉండే స్పష్టమైన సామాజిక విభజనలు ఈ సమాజాల్లో లేవు.
   3) గిరిజన తెగల్లో సామాజిక, ఆర్థిక అసమానతలు కూడా కొంతవరకు ఉంటాయి.
   4) పైవన్నీ
2. విస్తాపన వ్యవసాయాన్ని కింది విధంగా కూడా పిలుస్తారు?
   1) ఝూమ్ సాగు 2) పోడు సాగు
   3) 1, 2 4) ఏదీకాదు
3. విస్తాపన వ్యవసాయాన్ని 'బెవార్' అని ఏ రాష్ట్రంలో పిలుస్తారు?
   1) రాజస్థాన్ 2) తమిళనాడు
   3) ఒడిశా 4) మధ్యప్రదేశ్
4. ఒడిశాలోని 'డొంగ్రియకంధా' మహిళలు ఏ ఆకులతో విస్తరాకులు తయారుచేసేవారు?

   1) సాల్ 2) మహువా
   3) కుసుమ 4) పండానస్
5. వేట, అటవీ ఉత్పత్తుల సేకరణ మీద ఆధారపడి జీవించేవారు?
   1) డోంగ్రియా 2) ఖోండులు
   3) బైగాలు 4) పైవారందరూ
6. 'బైగా' గిరిజన తెగకు సంబంధించి కింది వాటిలో సరైంది?

   1) వీరు మధ్య భారత దేశంలో నివసిస్తారు.
   2) కేవలం అటవీ ఉత్పత్తుల మీద మాత్రమే ఆధారపడి జీవిస్తారు.
   3) శ్రామికులుగా మారి ఇతరుల వద్ద పనిచేయడానికి ఇష్టపడరు.
   4) పైవన్నీ.
7. గిరిజనులు వడ్డీ వ్యాపారులు, వర్తకులను ఏ విధంగా భావించేవారు?
   1) దుష్ట స్థానికేతరులు 2) గిరిజన దేవుళ్లు
   3) నాగరికులు 4) ఉత్తమ మనుషులు
8. కింది వాటిని జతపరచండి.

పశువుల కాపరులు	ప్రాంతాలు
1) వాన్‌గుజ్జర్లు	ఎ) పంజాబ్
2) లంబాడీలు	బి) ఆంధ్రప్రదేశ్
3) గద్దీలు	సి) కులు (హిమాచల్ ప్రదేశ్)
4) బకర్వాలాలు	డి) కశ్మీర్

   1) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి
   2) 1-ఎ, 2-సి, 3-బి, 4-డి
   3) 1-డి, 2-సి, 3-బి, 4-ఎ
   4) 1-డి, 2-బి, 3-సి, 4-ఎ
9. కింది వారిలో స్థిర నివాసం ఉన్న గిరిజన తెగలు?
   1) ముండాలు 2) సంతాల్
   3) గోండులు 4) పైవారందరూ
10. స్థిరనివాసం/ స్థిరసాగు చేసే గిరిజనులకు సంబంధించి సరైంది?
    1) స్థిర జీవనం ఉన్న గిరిజనులను నాగరికులుగా బ్రిటిషర్లు భావించారు.
    2) బ్రిటిషర్ల కంటే ముందు వీరు భూమి మీద హక్కు పొందారు.
    3) భూమిని తమ మూలవాసులదిగా, దానికి వారు వారసులుగా భావించారు.
    4) పైవన్నీ
11. ముండా తెగ గిరిజనులు ఏ ప్రాంతంలో జీవించేవారు?

    1) ఛోటానాగ్‌పూర్ 2) హజారీబాగ్
    3) సంబల్‌పూర్ 4) అండమాన్-నికోబార్
12. బ్రిటిషర్లు గిరిజన ప్రాంతాలను తమ నియంత్రణలోకి తీసుకోవడంతో స్థానిక గిరిజన నాయకులు ఏ అధికారాన్ని కోల్పోయారు?
    1) భూమిపై హక్కు 2) కౌలు హక్కు
    3) పరిపాలనా అధికార హక్కు 4) 1, 2
13. 'నైషి' అనే గిరిజన తెగ ఏ రాష్ట్రంలో ఉండేది?

    1) ఆంధ్రప్రదేశ్ 2) అరుణాచల్ ప్రదేశ్
    3) పశ్చిమ బెంగాల్ 4) ఉత్తర్‌ప్రదేశ్
14. గిరిజనులకు స్థిర నివాసం, స్థిర సాగు ఉండాలని బ్రిటిషర్లు కోరుకోవడానికి ప్రధాన కారణం?
    1) గిరిజనులు అమాయకులని భావించడం.
    2) గిరిజనులు కష్టపడే స్వభావం కలిగినవారని భావించడం.
    3) స్థిర జీవనం వల్ల బ్రిటిషర్లకు క్రమబద్ధమైన రాబడితో పాటు, గిరిజనులను నియంత్రించే అవకాశం ఉంటుంది.
    4) స్థిరజీవనం ప్రయోజనకరమైంది.
15. 'బిల్లులు' అనే గిరిజన తెగ ఏ ప్రాంతంలో ఉంటుంది?

    1) ఆంధ్రప్రదేశ్ 2) గుజరాత్
    3) జమ్ము-కశ్మీర్ 4) కర్ణాటక
16. ఈశాన్య భారత్‌లోని ఝూమ్ సాగుదారులు స్థిరసాగు చేయలేకపోవడానికి కారణం ఏమిటి?
    1) స్థిర సాగుతో ఎక్కువ దిగుబడి రాలేదు.
    2) బ్రిటిషర్లు కేటాయించిన భూములు నీటి కొరత, పొడి నేల ఉన్న ప్రాంతాలు.
    3) స్థిర సాగులోని మెలకువలు వారికి తెలియలేదు.
    4) పైవన్నీ.
17. బ్రిటిష్ పాలన వల్ల గిరిజనులు అనేక బాధలకు గురయ్యారు. దీనికి కారణమేంటి?
    1) బ్రిటిషర్లు అడవులను ప్రభుత్వ ఆస్తిగా ప్రకటించారు.
    2) అడవులను రిజర్వ్ ఫారెస్టులుగా ప్రకటించారు.
    3) వేట, ఝూమ్ సాగుకు అనుమతి ఇవ్వలేదు.
    4) పైవన్నీ
18. బ్రిటిషర్లు అటవీ గ్రామాలను ఏర్పాటు చేసి గిరిజనుల్లో కొంత మందిని అడవుల్లో ఉండేందుకు అనుమతించారు. దీనికి కారణం?
    1) గిరిజనులు అంటే ఆంగ్లేయులకు అత్యంత ప్రేమ.
    2) గిరిజనుల అభ్యున్నతిని తమ బాధ్యతగా తీసుకోవడం.
    3) రైల్వే స్లీపర్లు అందించడం మొదలైన వాటికి కూలీల అవసరం ఉండటం.
    4) గిరిజనులు లేకపోతే అడవులు ఉండవు.
19. 1906లో జరిగిన సొంగ్రామ్ సంగ్మా తిరుగుబాటు ఏ ప్రాంతంలో జరిగింది?
    1) అస్సాం 2) అరుణాచల్ ప్రదేశ్
    3) జమ్ము-కశ్మీర్ 4) తెలంగాణ
20. ఝార్ఖండ్‌లోని హజారీబాగ్ ప్రాంతంలో నివసించే గిరిజన తెగ ఏది?

    సంతాల్ తెగ

    1) జారవాలు 2) ఇరులార్
    3) గోండు 4) సంతాల్
21. కింది వాటిలో హజారీబాగ్ ప్రాంతంలో పట్టుగూళ్ల పెంపకం చేసే గిరిజన తెగ?
    1) ముండా 2) నాగా
    3) హజాంగ్ 4) సంతాల్
22. గిరిజనులు విపణిని, వ్యాపారులను తమ ప్రధాన శత్రువులుగా భావించారు. దీనికి కారణమేంటి?
    1) గిరిజనులతో వ్యాపారులు ప్రత్యక్ష యుద్ధాలు చేసేవారు.
    2) గిరిజనుల్ని వ్యాపారులు మోసం చేసి తక్కువ ధరలకు వస్తువులు పొందేవారు.
    3) పరిపాలనలో వ్యాపారులు బ్రిటిషర్లకు సహకరించారు.
    4) వ్యాపార వర్గం అడవులను ఆక్రమించాలని ప్రయత్నించింది.
23. 'హజాంగ్' అనే గిరిజన తెగ ఏ ప్రాంతానికి చెందింది?
    1) ఉత్తర్‌ప్రదేశ్ 2) జమ్ము-కశ్మీర్
    3) మేఘాలయ 4) గుజరాత్
24. 'గొడారా' గిరిజన తెగ ఏ ప్రాంతంలో ఎక్కువ?
    1) రాజస్థాన్ 2) ఆంధ్రప్రదేశ్
    3) అరుణాచల్ ప్రదేశ్ 4) కేరళ
25. కింది ఏ రాష్ట్రం బొగ్గు గనులకు ప్రసిద్ధి?
    1) కేరళ 2) ఆంధ్రప్రదేశ్
    3) తెలంగాణ 4) ఝార్ఖండ్
26. బొగ్గు గనులకు ప్రసిద్ధి చెందిన ఝరియా, రాణీగంజ్‌కు సంబంధించి సరైంది?
    1) ఇవి ప్రస్తుతం ఝార్ఖండ్‌లో ఉన్నాయి.
    2) ఈ ప్రాంతాలు ఝార్ఖండ్ రాష్ట్రం ఏర్పడక ముందు బిహార్ కింద ఉండేవి.
    3) 1920 నాటికి ఈ గనుల్లో ఎక్కువగా గిరిజనులు పనిచేసేవారు.
    4) పైవన్నీ
27. కింది వాటిని జతపరచండి.

గిరిజన తిరుగుబాట్లు	సంవత్సరాలు
1) కోల్ తిరుగుబాటు	ఎ) 1831-32
2) సంతాల్ తిరుగుబాటు	బి) 1855
3) బస్తర్ తిరుగుబాటు	సి) 1910
4) వర్లీ తిరుగుబాటు	డి) 1940

    1) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి
    2) 1-ఎ, 2-బి, 3-డి, 4-సి
    3) 1-డి, 2-సి, 3-బి, 4-ఎ
    4) 1-డి, 2-బి, 3-సి, 4-ఎ
28. కింది వారిలో గిరిజనులు ఎవరి మీద తిరుగుబాటు చేశారు?
    1) బ్రిటిషర్లు 2) వర్తకులు
    3) వడ్డీ వ్యాపారులు 4) పైవారందరూ
29. 1920 నాటి లెక్కల ప్రకారం భారతదేశంలోని బొగ్గు గనుల్లో సంవత్సరానికి సుమారు ఎంత మంది కార్మికులు మరణించేవారు?
    1) 1000 2) 1500
    3) 2000 4) 1200



రచయిత: కాకులూరు వెంకటేశ్వర్లు

సమాధానాలు

1-4; 2-3; 3-4; 4-4; 5-4; 6-4; 7-1; 8-1; 9-4; 10-4; 11-1; 12-3; 13-2; 14-3; 15-2; 16-4; 17-4; 18-3; 19-1; 20-4; 21-4; 22-2; 23-3; 24-1; 25-4; 26-4; 27-1; 28-4; 29-3.